اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 4 సంచిక 12 | సంపుటి 5 సంచిక 1 జూలై & ఆగస్టు 2013 రూ.37/-



5 th year *First Special Issue*

అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందేవారు మార్గభ్రష్ఠులు తప్ప మరెవరు?

6 లక్షల మందితో సులైమాన్(అ)వారి అద్భుత ప్రయాణం

లూత్ జాతి నాశనం

ముహమ్మద్(స)వారి జనన సమయంలో సంభవించిన కొన్ని అద్భుత సంఘటనలు

قَالُوْٓا اَتَعْجَبِيْنَ مِنْ اَمْرِ اللّٰهِ رَحْمَتُ اللّٰهِ وَبَرَكٰتُهٗ عَلَيْكُمْ
اَهْلَ الْبَيْتِ اِنَّهٗ حَمِيْدٌ مَّجِيْدٌ

వారు అన్నారు:"అల్లాహ్ ఆదేశం విషయంలో మీరు ఆశ్చర్య పడుతున్నారా? ఓ (ఇబ్రాహీమ్) గృహస్థులారా? మీపై అల్లాహ్ కారుణ్యం మరియు ఆయన శుభాశీస్సులు ఉన్నాయి! నిశ్చయంగా ఆయనే సర్వ స్తోత్రాలకు అర్హుడు, మహోన్నత ఘనత గలవాడు (ఖుర్'ఆన్ 11:73)

**They said, "Do you marvel at ALLAH's command? ALLAH's mercy and His blessings are upon you, the people of the house, Surely, He is Praiseworthy, Glorious." (Qur'an 11:73)**

సృష్టికర్త

# الله

సర్వ సమర్థుడు

**అల్-ఖాదిరు**

## اَلْقَادِرُ

**ALL CAPABLE**

మహోన్నత ఘనత గలవాడు

**అల్-మజీదు**

## اَلْمَجِيْدُ

**MOST GLORIOUS**

# అల్లాహ్

**Say, "He is fully capable that He should send a punishment from above you or from beneath your feet, or to put you in confusion through divisions and make some of you taste troubles through some others." See how we bring forth variety of signs, so that they may understand. (Qur'an 6:65)**

ఇలా అను : "ఆయన మీ పైనుండి గానీ, లేదా మీ పాదాల క్రింది నుండి గానీ మీపై ఆపద అవతరింప జేయగల సామర్థ్యం కలిగి ఉన్నాడు. మరియు మిమ్మల్ని తెగలు తెగలుగా చేసి పరస్పర కలహాల రుచి చూపగలిగే (సామర్థ్యం) కలిగి ఉన్నాడు. చూడు! బహుశా వారు (సత్యాన్ని) గ్రహిస్తారేమోనని మేము ఏ విధంగా మా సూచనలను వివిధ రూపాలలో వివరిస్తున్నామో! (ఖుర్'ఆన్ 6:65)

قُلْ هُوَ الْقَادِرُ عَلٰٓى اَنْ يَّبْعَثَ عَلَيْكُمْ عَذَابًا مِّنْ فَوْقِكُمْ اَوْ مِنْ تَحْتِ اَرْجُلِكُمْ اَوْ يَلْبِسَكُمْ
شِيَعًا وَّيُذِيْقَ بَعْضَكُمْ بَاْسَ بَعْضٍ اُنْظُرْ كَيْفَ نُصَرِّفُ الْاٰيٰتِ لَعَلَّهُمْ يَفْقَهُوْنَ

**ముఖ్య గమనిక : శాంతిబాట లోగో రిజిష్టర్ చేయబడింది.** *శాంతిబాట పేరుకు దగ్గరగా ఉండే విధంగా శాంతిబాటను అనుకరిస్తూ, శాంతిబాటతో సంబంధం ఉందని ప్రజలు బావించే విధంగా ఎవ్వరైనా శాంతిబాట వ్యాసాలను గాని, మా సొసైటీచే ప్రచురించబడిన పుస్తకాలలోని విషయాలను గాని పబ్లిష్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.* ***మా దగ్గర నుండి వ్రాతపూర్వకంగా అనుమతి లేకుండా, వీటిలోని ఏదైనా భాగాన్ని ఎవ్వరైనా ప్రచురించడం లేదా జెరాక్స్ కాపీలు తీసి అమ్మడం చేస్తే ఇన్షా అల్లాహ్ వారిపైకూడా చట్టపరంగా ప్రొసీడ్ కావడం జరుగుతుంది.*** *మా వెబ్‌సైట్ నుండి శాంతిబాట సంచికలు ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని ఎవ్వరైనా చదువుకునే అవకాశాన్ని మాత్రమే కల్పించాముగాని, వీటిలోని విషయాలను* ***ప్రచురించు కోవడానికి ఎవరికీ ఎటువంటి హక్కులు ఇవ్వలేదు.*** *ఈ రాష్ట్రంలోనే కాదు, ఇండియాలోని ఏ రాష్ట్రంలోని ఏ పబ్లిషర్స్‌తోనూ మాకు ఎటువంటి సంబంధాలు లేవు. ఒకవేళ మా పాఠకులు అటువంటి ప్రచురణలను చూడటం జరిగితే, వెంటనే* ***మాకు తెలియజేయమని మనవి.*** *శాంతిబాటలో ప్రచురించబడుతున్న శీర్షికలను ఇన్షా అల్లాహ్ పుస్తకాలుగా* ***తెలుగు, English, ఉర్దూలో*** *విడుదల చేయడానికి ప్రయత్నిస్తాము.*


# శాంతిబాట

**మాసపత్రిక** రూ.37/-

సంపుటి 4(12) | సంపుటి 5(1) జూలై-ఆగస్టు, 2013

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

**www.saanthibaata.net**

**www.saanthibaata.com**

Email:velugubaata@gmail.com

**Cell : 9491103017**



**ఎడిటర్:**
ఎమ్‌డి. అతహరుల్లా

**ఎడ్వయిజరీ బోర్డ్:**
డా॥ సలీమ్ పాషా
డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు
ఎమ్‌డి. అఫ్ఫాన్ ఉమ్రీ

**Editor**
Md. Athaharullah

**Advisory Board**
Dr. Salim Pasha
Dr. Nagireddi Srinivasa Rao
Md. Affan Omri



**Printed by**
Md. Athaharullah

**Published by**
Md. Athaharullah

**Owned by**
Velugubaata Educational Society
(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**
Saanthibaata Publishing House,
19-1-447, Hanuman Statue Center
Samalkot - 533440

and

**Published at**
2-8-31, Kota Bazar, Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah

Phone : 9347046090,
Email: velugubaata@gmail.com
RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**
T. Srinivasa Rao
(Zakir)


## జూలై - ఆగస్టు' 2013 (షాబాన్ - షవ్వాల్ హి. 1434)


5 **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం:** ఖుర్'ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ అల్-బఖరా తఫ్సీర్ : 60 - 64 ఆయత్‌లు ...

12 **ముహమ్మద్(స) వారి జీవిత చరిత్ర** : బహిరంగ ప్రచారం ...

23 **ముస్లిమ్ మహిళ :** అత్తాకోడళ్ళ వ్యవహారం ...

30 **తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). నవముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం- **సుహైబ్ అర్-రూమీ**(రజి)

39 **బాలబాలికలకు ప్రత్యేకం :** అల్లాహ్ యొక్క ప్రవక్త లూత్(అ) ...

47 **ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్'ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని... (మార్చి, 2013 సంచికతో పూర్తయ్యాయి)

50 **స్త్రీలు అన్యాయానికి గురవుతున్నారు ... తక్షణ కర్తవ్యం?**

56 **రెండవ ఖలీఫా ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) వారి జీవిత చరిత్ర :** 2వ ఖలీఫాను నియమించడంలో అబూ బక్ర్ (రజి)వారు చేసిన సంప్రదింపులు ...


**సంవత్సర చందా :**

**రూ. 240/-**


(వివరాలకు పేజీ నెం. 38 చూడండి)



**Velugubaata**
**Educational Society**
D.No. 2-8-31, Kota Bazar
SAMALKOT - 533440
**East Godavari District**


మీ ఎడ్రస్ మారినా లేక ఫోన్ నంబర్ మారినా మీరు కాల్ చేయవలసిన నంబర్ : **9491103017**

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.*
**(ముహమ్మద్ అబ్దుల్ కరీమ్ )**

ప్రతీరోజూ మధ్యాహ్నం 3 గం. నుండి సాయంత్రం 5 గం. వరకు

లేదా పై నంబర్‌కి SMS ద్వారా తెలియజేయండి



**ప్రచురించిన విషయాలపై సద్విమర్శలు గాని, అభిప్రాయాలు గాని ఫోన్‌లో స్వీకరించబడవని మనవి చేస్తున్నాము. వాటిని మీ పూర్తి ఎడ్రస్‌తో సహా లెటర్‌లో వ్రాసి పంపగలరు.**

***We don't accept any funds from within India or from abroad except from our team members and close friends who have Taqwa and whose money is earned in Halaal way as instructed by Our Holy Prophet Muhammad(s). We don't ask financial help from anybody at any time, except from ALLAH. If anybody wants to help us, they can try to increase our subscribers by joining their friends and relatives or can buy a fixed number of copies every month.***

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# రోగం మరియు ఔషధం

ప్రవక్తలను దూషించే వారున్నారు. వారిపై దుష్ప్రచారం చేసేవారు మరియు చేయించే దుర్మార్గులు కూడా ఉన్నారు. **ప్రవక్తలంటే మానవులలో కెల్లా ఉత్తములు.** దయ కరుణ కలిగి అశ్లీలానికి దూరంగా ఉంటారు. ఈ సంచికలో లూత్(అ)వారి జీవితాన్ని క్లుప్తంగా వివరించడం జరిగింది. క్రూరమృగాలు సైతం అసహ్యించుకునే ఓ దుష్కార్యానికి ఓ జాతి పాల్పడుతుంటే, ఆ ప్రాంతానికి వెళ్ళి, దానిని నిర్మూలించడానికి 30 సంవత్సరాలు వారి మధ్యనే ఉండి వారికి హితబోధ చేశారు. అక్కడ ఆయనకు అండగా ఓ తెగగాని, బంధువర్గం గాని లేదు. ఆ జాతి హితబోధ స్వీకరించ లేదు. ఆయన కూడా తన కర్తవ్యాన్ని వదిలేయలేదు. చివరకు ఆ జాతిపై ఆకాశం నుండి ఘోరశిక్ష పడింది. ఆ జాతి మొత్తం ఒక్కసారిగా తుడుచుపెట్టుకు పోయింది. ఆ జాతికి ముందర వచ్చిన మరియు తరువాత వచ్చిన జాతులలో కూడా అల్లాహ్ ఆదేశాన్ని నిర్లక్ష్యం చేసినవి ఒకేసారిగా నాశనమయ్యాయి. ఈ నాశనమైన జాతులన్నీ, అవి ఉనికిలో ఉన్న సమయానికి ప్రపంచంలో ఆర్థికంగా చాలా ఉన్నతస్థాయిలో ఉండి విలాసాలు అనుభవించినవే! అటువంటి జాతుల గతి చివరకు ఏమైందో అల్లాహుతాలా ఖుర్'ఆన్‌లో వివరించారు. అంతేకాకుండా ఈ వాస్తవ ఉదాహరణల ద్వారా అల్లాహుతాలా ఖుర్'ఆన్‌లో మరో ముఖ్య విషయం కూడా స్పష్టపరిచారు. అదేమిటంటే శిక్ష పడటానికి ముందే, అక్కడి విశ్వాసులను (సన్మార్గులను) ఆ జాతి మధ్య నుండి వేరే చోటికి తరలించడం.

నూహ్ జాతి, సమూద్ జాతి, ఆద్ జాతి మొదలైన జాతులు సమూలంగా నాశనమయ్యాయి. ఆ వినాశనానికి ముందే ప్రవక్తతో పాటు, ఆయనను అనుసరించిన వారంతా సురక్షితమైన ప్రదేశానికి తరలించ బడ్డారు. రక్షించబడిన ఈ విశ్వాసులు పూర్వం ఏమి చేసేవారు? వారు తమ ప్రవక్తను అనుసరించేవారు. **అల్లాహ్ ఆదేశాన్ని పాటిస్తూ తోటివారికి మంచిని బోధించడం మరియు చెడునుండి నిరోధించడానికి తమ శాయశక్తులా కృషి చేశారు.** ఒక ప్రాంతంలో అల్లాహ్‌పై విశ్వాసం ఉన్న కుటుంబం ఒక్కటి ఉన్నా సరే లేదా ఒక్క విశ్వాసి మాత్రమే అక్కడ జీవిస్తున్నా సరే, ఆ ప్రాంతంపై పడవలసిన శిక్ష ఆపబడుతుంది. శిక్ష పడదు అంటే ఒకేసారి జాతి మొత్తాన్ని నిర్మూలించే శిక్ష పడదు అని. ఇహలోకంలోనూ మరియు పరలోకంలోనూ దుర్మార్గులకు అల్లాహ్ నిర్ణయం మేరకు శిక్ష ఉంటుంది. అది తప్పదు. శిక్ష నిర్ణయం జరిగిపోతే అక్కడి నుండి మంచివారు వేరే చోటికి చేర్చబడతారు.

ఓ ముఖ్య ఉల్లేఖనం ద్వారా స్పష్టమయ్యే విషయం ఏమిటంటే, ఒక వ్యక్తి ఒక పట్టణంలో ఎక్కువగా ప్రార్థనలోనే గడుపుతూ ఉన్నప్పటికీ, తన చుట్టుప్రక్కల ప్రజలకు మంచిని బోధించడం మరియు చెడును నిరోధించడం చేయకపోవడం వలన, ఆ పట్టణంపై శిక్ష పడే ముందుగా అతని ఇంటి నుండే ప్రారంభం అవుతుంది. కాబట్టి **ప్రతీ విశ్వాసిపై వ్యక్తిగత బాధ్యతలే కాకుండా తప్పనిసరైన సామాజిక బాధ్యత కూడా ఉంది.** "డబ్బులిస్తే ధర్మ ప్రచారం ఎవడో ఒకడు చేసేస్తాడులే, మనం ధర్మంగా ఉంటే చాలు" అని అనుకునేవారు, తాము అల్లాహ్ ఆదేశాన్ని అమలు చేయడం లేదని అర్థం చేసుకోవాలి. తన ధర్మం గురించి కనీస అవగాహన లేనివారెందరో మన సమాజంలో ఉన్నారు.

ఒక ప్రాంతంలో ఇండ్లు తగలబడుతుంటే, "అగ్నిమాపక దళం వారికి ఫోన్ చేశాం కదా! మన బాధ్యత తీరిపోయింది" అని ఊరుకుని, మనకు శక్తి మేర వాటిని ఆపడానికి ప్రయత్నించకపోతే అక్కడే ఉన్న మన ఇల్లు కూడా కాలి బూడిద అయిపోవచ్చు.

చెడుకు పాల్పడే ఏ జాతి అయినా ఆ చెడును వదలకపోతే సర్వనాశనం అయిపోతుంది. మద్యపానం చేయకూడదు. అది చెడుమాత్రమే కాదు ఎన్నో రుగ్మతలకు కూడా కారణం. కాబట్టి మద్యం త్రాగడం మానివెయ్యాలి. కాని నీరు త్రాగాలి. నీరు త్రాగడం మానివేసినా ఆరోగ్యం పాడవుతుంది. కాబట్టి చెడును నిరోధించాలి మరియు మంచిని నిలబెట్టాలి. **ఈ రెండింటిలో ఏది చేయడం మానివేసినా ప్రమాదమే!** ఇది ప్రతీ ముస్లిమ్‌పై ఉన్న తప్పనిసరి బాధ్యత. ఆ బాధ్యతను ఎవరు ఎక్కువగా నిర్వర్తిస్తే, వారి సాఫల్య స్థాయి కూడా అంతే ఎక్కువగా ఉంటుంది.

విద్వాంసులుగాని/నాయకులుగాని ఏ నిర్ణయం చేసినా అది అల్లాహ్ గ్రంథంతోనే చేయాలి మరియు ముహమ్మద్(స)వారి ఆదేశాల ప్రకారమే చేయాలి. ఆ విధంగా చేయని నాడు **ముస్లిముల మధ్య శత్రుత్వం పెరుగుతుంది.** ఈ హెచ్చరిక ముస్లిమ్ సమాజానికి 1400 సంవత్సరాల క్రితమే ముహమ్మద్(స)వారి ద్వారా అందింది.

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "ఓ ముహాజిరీన్ సమూహమా! ఐదు విషయాలు (గుర్తుపెట్టుకోండి). వాటిలో మీరు చిక్కుకోవద్దు మరియు ఈ విషయం నుండి అల్లాహ్ యొక్క శరణు వేడుకుంటున్నాను దేనిలో అయితే మీరు చిక్కుకుంటారో!

1. ఎప్పుడైనా ఏదైనా జాతిలో వ్యభిచారం బాగా వ్యాపిస్తే, వాళ్ళలో ప్లేగు వ్యాధి మరియు పూర్వపు ప్రజలలో రానటువంటి దారిద్ర్యం వ్యాపింప జేయబడుతుంది.
2. ఇదే విధంగా <u>తూనికలలో తగ్గింపులకు పాల్పడితే</u> వాళ్ళు <u>కరువు కాటకాలకు</u>, <u>పాలకుడి దౌర్జన్యానికి</u> మరియు <u>కాఠిన్య పరిస్థితులకు</u> లోనవుతారు.
3. మరియు తమ ఐశ్వర్యంపై జకాత్ ఇవ్వనప్పుడు, వారిపై ఆకాశం నుండి ఒక్క చుక్క వర్షం కూడా పడకుండా ఆపివేయబడుతుంది. పశువులే గనుక లేకపోనట్లయితే వర్షం కురవక పోయివుండేది.
4. **అల్లాహ్ మరియు అల్లాహ్ యొక్క సందేశహరుని ఒడంబడికను ఉల్లంఘిస్తే అల్లాహ్ వారిపై వారికి విరుద్ధంగా శత్రువులను నిలబెడతాడు. ఈ శత్రువులు వారి దగ్గర ఏదైతే ఉందో దానిని లాక్కుంటారు.**

**5. ఇదే విధంగా వారి (ముస్లిముల) నాయకులు అల్లాహ్ గ్రంథంతో నిర్ణయించకుండా ఉంటే, అల్లాహ్ వారి మధ్య పరస్పరం ద్వేషం కలుగజేస్తాడు.**

మరియు ఎప్పుడైతే ఖుర్'ఆన్ మరియు సున్నత్‌ను వదిలివేస్తారో మరియు అల్లాహ్ అవతరింపజేసినదానికి విరుద్ధంగా నిర్ణయం చేస్తారో, అల్లాహుతాలా ఒకొరికొకరిని శత్రువులుగా చేస్తారు. **(షర్హు తర్ఘీబ్ వ తర్హీబ్ లిల్ మున్‌జిర్ 7/28)**

**పై ఐదు విషయాలలో నేటి మన సమాజం చిక్కుకు పోయినప్పటికీ, ఆఖరి రెండు విషయాలకు సంబంధించి ప్రత్యక్ష అనుభవం చాలామందికి ఉంది. అమెరికా ఇరాఖ్‌పై యుద్ధం చేసింది. నేడు వారి సహజవనరులను దోచుకుంటుంది. ప్రస్తుతం దాని కన్ను సిరియా, ఇరాన్‌లపై ఉంది. నేడు మన ముస్లిమ్ సమాజం వివిధ జమాత్‌లుగా చీలిపోయి ఒకరిపై మరొకరు శతృత్వం పెంచుకున్నారు. ఆ శతృత్వానికి ధర్మం అనే ముసుగు తొడిగారు. నిజానికి ఈ చీలిక ధర్మం వలన రాలేదు. ధర్మాన్ని వదిలేయడం వలన మరియు అల్లాహ్ ఆదేశం ప్రకారం నిర్ణయాలు తీసుకోక పోవడం వలన జరిగింది.**

రోగానికి కారణం ఏమిటో తెలిసింది మరియు దానిని పూర్తిగా నయం చేయగల శక్తివంతమైన ఔషధం కూడా అందుబాటులోనే ఉంది. రోగి ఆ ఔషధాన్ని వేసుకోవడానికి ఇష్టపడటం లేదా? **లేక** రోగికి అటువంటి ఔషధం ఒకటి ఉందని తెలియదా?

ఇతర సమాజాల ద్వారా లాభం పొందేందుకో లేక స్వయంగా లాభం పొందేందుకో కొందరు ఈ రోగాన్ని సమాజంలో వ్యాపింపజేస్తున్నారు. ఆ రోగాన్ని నయం కాకుండా చేసేందుకు అహర్నిశలూ కష్టపడుతున్నారు. ఈ ఔషధం గురించి ముందుగా రోగులకు తెలియజేయాలి. బలవంతంగా కాకుండా, వారంతట వారే ఆ ఔషధాన్ని తీసుకుని తమ రోగాన్ని నయం చేసుకునేలా చేయాలి. కొన్ని సందర్భాలలో మాత్రం బలవంతం తప్పదు. ఎప్పుడంటే ఆ రోగం అతని నుండి పక్కవాడికి అంటుకుంటుంది అనే భయం కలిగినప్పుడు.

ఇక్కడ **రోగం** అంటే "పరస్పర శతృత్వం". **ఔషధం** అంటే **"అల్లాహ్ గ్రంథం మరియు సున్నత్ ప్రకారం నిర్ణయాలు తీసుకోవడం."**

ఇండియాలో హిందూ ముస్లిములు సామరస్యంగా బ్రతుకుతున్నప్పుడు, బ్రిటిష్ దొంగలు మన దేశంలో ప్రవేశించి ఆ సామరస్యాన్ని నాశనం చేసి ఇరు వర్గాలను బానిసలుగా చేసుకున్నారు. విభజించి పాలించారు మరియు ఇరువురి మధ్య వైరం పెంచారు. వారు తరిమి వేయబడటానికి ముందు మన మధ్య అగ్ని రగిలించి వెళ్ళిపోయారు. ప్రస్తుతం బయట నుండి అగ్ని రాజేస్తూనే ఉన్నారు. **మత దురభిమానం పట్ల వారికున్నంత మక్కువ మెరెవరికీ ఉండదేమో!** వారు రగిలించిన ఆ మంటలు చల్లారడం లేదు. మన పూర్వీకులను బానిసలుగా చేసుకున్న బ్రిటిష్ వారి పట్ల, వారి పట్టణాల పట్ల నేడు మన భారతీయులలో ఎందరికో ప్రీతి. కాని ఒకనాడు మనతో సామరస్యంతో కలిసి ఉన్నవారంటే నేడు అమితమైన ద్వేషం. **ఆ ద్వేషాన్ని పెంచి పోషించింది మన దేశ నాయకులే!** ఆ ద్వేషాన్ని మనస్సులో పెట్టుకుని, ఇస్లామ్‌పై నిందలు వేయడం ప్రారంభించారు. ఈ నిందలు వేసే బాధ్యతను మీడియా తీసుకుంది. ఇంకనూ రక్తంలో మిగిలిపోయి ఉన్న బానిసత్వ లక్షణాలు, మనవారిని పాశ్చాత్యులను ప్రశంసించడానికే ప్రోత్సహిస్తున్నాయి.

పాశ్చాత్యుల ఆటవిక న్యాయం మన మీడియాకు కనిపించదా? వారి విలాసవంతమైన జీవితాలే కనిపిస్తాయా? వారి మల్టీ నేషనల్ కంపెనీలు విసిరే యాడ్‌లే స్పష్టంగా కనిపిస్తాయి. ఇక నామమాత్రపు ఇస్లామిక్ దేశాలు కొన్ని ఉన్నాయి. అవి నిజానికి ఇస్లామ్ ధర్మం ప్రకారం పనిచేసేవి కావు. వాటిలోని మెజారిటీ ప్రజలు ముస్లిములు కాబట్టి, అవి ఇస్లామిక్ దేశాలుగా పిలవబడుతున్నాయి. ఆ దేశాలలో ఏ ఘోరం జరుగుతుందా అని ఎదురు చూస్తూ, దానికే విశేష ప్రాచుర్యాన్ని కలిగించడానికి మీడియా తహతహ లాడుతూనే ఉంటుంది. ఏ దేశంలోనైనా ఘోరాలు చేయడానికి మరియు చేయించడానికి అమెరికా ఎళ్ళవేళలా సిద్ధంగానే ఉంటుంది. **మీడియాను గుడ్డిగా నమ్మిన ప్రజలు ఇస్లామ్‌పై ద్వేషాన్ని పెంచుకున్నారు. మీడియా వార్తలను కాస్సేపు ప్రక్కన పెట్టి ప్రశాంతంగా ఆలోచిస్తే, ఆ వ్రాతలు ఎంత ఘోరమైనవో అర్థమౌతుంది.**

ఉదాహరణకు 'తీవ్రవాదాన్ని' తీసుకోండి. దీనిని ఇస్లామ్‌కి ముడిపెట్టారు. ఖుర్'ఆన్ అవతరించి 1400 సంవత్సరాలు దాటిపోయింది. ఇస్లామ్ నిజంగా తీవ్రవాదాన్ని పెంచి పోషించేదే అయితే, **కేవలం గత 20 సంవత్సరాల నుండి మాత్రమే ఎందుకు ఈ విషయాన్ని వింటున్నాము?** ఒక్క క్షణం నిజాయితీగా ఆలోచించండి. శతాబ్దాల కాలంగా ప్రపంచంలో ఎన్నో తీవ్రవాద దాడులు జరిగినా దేనిలోనూ ముస్లిముల ప్రమేయం లేనప్పుడు, హఠాత్తుగా ఇస్లామ్‌లో తీవ్రవాదం ఎలా వచ్చింది? ఖుర్'ఆన్‌లో ఒక్క అక్షరం కూడా మారలేదు. అవతరించిన దగ్గర నుండి ఖుర్'ఆన్‌ను కంఠస్థం చేస్తూ వస్తున్నారు. ఒక్క అక్షరం మారినా వెంటనే గుర్తించే వారున్నారు. **నేటి తరం కంటే ఎంతో ఎక్కువగా ఇస్లామ్‌ను ఆచరించిన ముందరి తరాలు తీవ్రవాదానికి ఎందుకు పాల్పడలేదు?** నిజమైన ప్రజాస్వామ్యాన్ని ఆనాటి ముస్లిములే ప్రపంచానికి పరిచయం చేసి, మత సామరస్యాన్ని పెంపొందించారు. **కాని నేటి ప్రజలు మీడియా వక్రీకరణలనే నమ్ముతున్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియడం లేదు.**

మన దేశంలో CBI (సిబిఐ)ని ప్రభుత్వం చేతిలోని కీలుబొమ్మగా అభివర్ణిస్తారు. ఇదే విధంగా అమెరికా చేతిలోని కీలుబొమ్మ **ఐక్యరాజ్యసమితి.** 'అల్-ఖైదా'ను స్థాపించి, దానికి ఆ పేరు పెట్టి, తన భూభాగంలో ప్రత్యేక శిక్షణ అమెరికాయే ఇచ్చింది. తన ట్విన్ టవర్స్ స్వయంగా కూల్చుకున్నది అమెరికాయే! **కాని బురదను ముస్లిములకు అంటించింది.** ఈ నిజం మీడియాకు నిజంగా తెలియదా? తెలుసు. **కాని నిజం చెప్పేస్తే ముస్లిములపై ద్వేషం ఎలా కలుగుతుంది?** ముస్లిములపై ద్వేషం పెంచే వ్రాతలు వ్రాసి దేశభక్తిని చాటుకున్నట్లు మీడియా భావిస్తుందా? పాకిస్తాన్‌ను దృష్టిలో పెట్టుకుని ఇండియన్ ముస్లిములను (అంటే ఇండియన్‌లను) టార్గెట్ చేయడం **కుసంస్కారం మాత్రమే కాదు, మూర్ఖత్వం కూడా.**

**పాకిస్తాన్‌పై శతృత్వానికి, ఇండియాలోని ముస్లిమ్‌లను ద్వేషించడానికి సంబంధం ఏమిటి?** తీవ్రవాద దాడి జరగగానే ముస్లిమ్ యువకులను అరెస్ట్ చేస్తారు, కాని ఆ దాడులు చేసిన వారు సాధ్వి అనుచరులు కావచ్చేమో లేక స్వామి అసీమానంద అనుచరులు చేసి ఉంటారేమోనని

అనుమానం వ్యక్తం చేస్తారా? **చేయరు. మీడియాలో కవరేజి కూడా చాలా విచిత్రంగా ఉంటుంది.** 'మలాలా' విషయం చూడండి. అంతర్జాతీయ స్థాయిలో కూడా విశేషంగా కవరేజి ఇచ్చారు. ఆ బాలిక ఫొటో యునెస్కో సమావేశంలో ప్రతీ ఒక్కరూ పట్టుకోవడం జరిగింది. కాని ఈ కవరేజి వెనుక ఉన్న ఆంతర్యం వేరు. **స్త్రీ చదువును ఇస్లామ్ ఎంతో ప్రోత్సహించింది.** ఇస్లామ్ చదువుకు వ్యతిరేకం కాదు కదా! ఢిల్లీలో సామూహిక మానభంగానికి గురై చనిపోయిన అమ్మాయి "నిర్భయ" కూడా విద్యార్థినే! ఎంతో కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవలసిన అమ్మాయి జీవితం నాశనమైనప్పటి విషయంలో స్పందన వేరుగా ఉంది. ఎంత కవరేజి ఇచ్చారని కాదు. ఏ ఆంతర్యంతో చేస్తున్నారో మరియు ఎటువంటి ప్రభావాన్ని సమాజంపై వేస్తున్నారో అది ముఖ్యం.

ఇండియాలోనే కాదు, పాకిస్తాన్, బంగ్లాదేశ్, సిరియా, ఇరాఖ్, ఈజిప్టు, బర్మా, ఆఫ్ఘనిస్తాన్ దేశాలలో కూడా ముస్లిములపై దౌర్జన్యం జరుగుతూనే ఉంది. **రక్తపాతం జరుగుతూనే ఉంది.** కారకులు ఎవరో ప్రపంచంలోని వివిధ దేశాల నాయకులకు స్పష్టంగా తెలుసు, ఏ విధంగా అయితే మన దేశంలోని ముస్లిమ్ నాయకులకు కారణాలు తెలుసో, ఆ విధంగా! సిరియాను ఆక్రమించడానికి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సులు దుర్మార్గపు ఎత్తుగడలు ప్రారంభించాయి. వారిని రష్యా హెచ్చరించింది. కాని ఆ దురాక్రమణను ఆపడానికి రష్యా శక్తి చాలదు. ఆర్థికంగా చితికిపోయి ఉంది.

**కనీసం మన దేశంలోనైనా పరిష్కారం కోసం ప్రయత్నిద్దాం, ఇన్షా అల్లాహ్!** ముస్లిమ్ సమాజంలో చీలికలకు కారణమై మరియు ఇతర జమాత్‌లపై విద్వేషాన్ని పెంచే విధంగా ప్రసంగించే ప్రసంగీకులను ముందుగా కట్టడి చేద్దాం. ప్రతీ విషయం శాంతిగ్రంథం ఖుర్‌ఆన్‌తో మరియు ప్రవక్త(స)వారి ఆచరణతో నిర్ణయించేలా ఒత్తిడి తీసుకువద్దాం. పేదవాడికి అందవలసిన సహాయాన్ని దళారులు దోచుకోకుండా ప్రయత్నిద్దాం!

ఈ దేశంలోనే కాదు, ఏ దేశంలోనైనా సరే ముస్లిములందరికీ ధార్మిక గ్రంథం ఒక్కటే - **ఖుర్'ఆన్**. అందరికీ సృష్టికర్త అల్లాహ్‌యే! మరియు అందరికీ ప్రవక్త ముహమ్మద్(స)వారే! ఆ విషయంలో ఎవరి మధ్య ఎటువంటి విబేధాలు లేవు. **మరి అందరి నిర్ణయం ఒక్కటే ఎందుకు కావడం లేదు?** ఎవరినో నిందించే ముందు, మనం స్వయంగా ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అల్లాహ్ ఆదేశాన్ని మరియు ముహమ్మద్(స)వారు బోధించిన వాటిని పట్టించు కోవడం లేదనే నిజాన్ని ఇప్పటికైనా తెలుసుకోగలగాలి.

## ఓ పావురం యొక్క గూడు మరియు దాని యొక్క గుడ్లు క్షేమంగా ఉండాలని ఆలోచించిన ముస్లిములు తీవ్రవాదులు కాగలరా?


అధునాతన ఆయుధాలు కలిగి రోమన్లచే పరిపాలించబడుతున్న ఈజిప్టు మహా సామ్రాజ్యాన్ని ముఖాముఖి ప్రత్యక్ష యుద్ధంలో ఓడించడానికి కేవలం 4వేల మంది సైన్యంతో అమ్ర్ బిన్ ఆస్(రజి)వారు ఎలా ధైర్యం చేయగలిగారు? **అల్లాహ్‌పై భరోసాతో.** ఈ యుద్ధకాలంలో సైనికుల విడిది కోసం వేసిన వీరి గుడారం, మరో చోటికి తరలించ వలసి వచ్చింది. కాని ఆ గుడారంపై ఓ పావురం యొక్క గూడు ఉంది. దానిలో గుడ్లు ఉన్నాయి. గుడారం తీస్తే వాటికి ప్రమాదమని తలచి ఆ టెంట్‌ను అలాగే వదిలి వెళ్ళారు. పక్షి గూడును అరబీలో 'ఫుస్తాత్' అంటారు. ఆ తరువాయి కాలంలో ఆ చోటనే ఈజిప్టు రాజధాని నిర్మాణం జరిగింది. దానికి పెట్టిన పేరు 'ఫుస్తాత్.' ఇప్పటికీ ఆ పట్టణం ఆ పేరుతోనే పిలవబడతుంది. **ఓ పావురం గూడుకి నష్టం కలుగుతుందని ముస్లిములను ఆలోచింపజేసిన ఇస్లామ్, బాంబులతో నివాసాలు కూల్చమని చెబుతుంది అని ఎలా ఊహించ గలిగారు? ఈ విషయాలు చారిత్రక వాస్తవాలు. ఈ విషయాలను ఇప్పటివరకూ ముస్లిమ్ సమాజమే తెలుసుకోలేక పోవడం దురదృష్టకరం.** అమెరికా వంటి మహాసామ్రాజ్యాలు దురాక్రమణకు పాల్పడుతుంటే, అమ్ర్ బిన్ ఆస్(రజి)వారి వలే ఎందుకు ఆపలేకపోతున్నారు? ధర్మానికి దూరం అవ్వడమే దానికి కారణం. విశ్వాస లోపమే దానికి కారణం.

ఇన్వెస్టిగేటివ్ జర్నలిజమ్ అంటే, తమకు అనుకూలంగా వ్రాసుకోవడం కాదు. రెండు సంవత్సరాలపాటు కేవలం ప్రచురించ బడిన న్యూస్ ఐటమ్స్‌తోనే టెర్రరిజానికి సంబంధించి రెండు సంవత్సరాల పాటు 'శాంతిబాట'లో సీరియల్ ప్రచురించాము. మీడియా ఆ మాత్రం కూడా చేయలేని పరిస్థితిలో ఉందా? ప్రతీ రోజూ ఏదో ఒక వ్యాసాన్ని ముస్లిమ్‌లకు సంబంధించి ప్రచురిస్తున్నారు. దాని ద్వారా పరోక్షంగా ముస్లిములపై ద్వేషాన్ని పెంచడమే గాని, ఇస్లామ్ గురించి వాస్తవాలు తెలుసుకోవడం లేదు. **ముస్లిములపై ఎంతో సానుభూతి చూపుతున్నట్లుగా వ్యాసం ఉంటుంది.** కాని దాని వెనుక నున్న సంకల్పం వేరు. ఇదే విధానం మన దేశంలోని ప్రముఖ న్యూస్ పేపర్లు, వార్తా పత్రికలు అనుసరిస్తూనే ఉన్నాయి.

**చాలామందికి సత్యం చేదుగానే ఉంటుంది.** జకాత్ రూపంలో వసూలవుతున్న వేలకోట్ల రూపాయల సొమ్ము పేదప్రజలది. కాని దానిని అల్లాహ్ ఆదేశించినట్లు, ముహమ్మద్(స)వారు ఆచరించినట్లు, సన్మార్గం పొందిన ఖలీఫాలు అనుసరించినట్లు పేదలకే పంచాలని నాలుగు సంవత్సరాలుగా వాస్తవాలను శాంతిబాట ద్వారా మనవి చేస్తూనే ఉన్నాము. అల్లాహ్ ఆదేశాన్ని బహిరంగంగానే (తఖ్వాలేని) విద్వాంసులు, నాయకులు మరియు దాయీలు తిరస్కరిస్తుంటే, **సామాన్య ప్రజానీకం నిమ్మకు నీరెత్తినట్లు మౌనంగా ఉంది.** ప్రపంచంలో పోలియోను గుర్తించారు. సమాజం నుండి ఆ పోలియో పూర్తిగా నిర్మూలించ బడేవరకూ విశేష ప్రచారాన్ని కల్పించి, దాని నిర్మూలనకై వేక్సిన్ వేస్తున్నారు. నేటి మన సమాజంలోని విద్వాంసులు, నాయకులు, దాయీలు చేసే **పాపం వలన మన సమాజం వ్యాధిబారిన పడిపోయింది.** ఆ రోగం గురించి మరియు దాని ఔషధం గురించి మీ తోటి వారికి చెప్పండి. మన సమాజం నుండి ఆ రోగం శాశ్వతంగా దూరం అయ్యేలా **మనమందరం అల్లాహ్ గ్రంథం మరియు సున్నత్‌ల ప్రకారమే నిర్ణయాలు జరిగేలా చేద్దాం, ఇన్షా అల్లాహ్.**

జరుగుతున్న ఈ ఘోరాల విషయంలో మౌనం వహించి **కష్టాలకు మాత్రం వేరేవాళ్ళని నిందించడం ఎంతవరకూ సబబు?** మంచిగా బ్రతికేవారికి కష్టాలు ఎదురౌతాయి. కాని స్థిరమైన విశ్వాసం ఆ కష్టాలను దూది పింజల్లా మార్చేస్తుంది.

**అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందేవారి కంటే మార్గభ్రష్టులు ఎవరు ఉంటారు?** - ***శాంతిబాట టీమ్***



# అరబీ భాషలో
# సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

31

## ఖుర్'ఆన్ తఫ్సీర్

البقرة

### 2. సూరహ్ అల్-బఖరా

( గత సంచిక తరువాయి )

**(60వ ఆయత్ నుండి 64వ ఆయత్ వరకు ...)**

**మరియు (ఓ ఇస్రాయీల్ సంతతివారలారా!) మేము పర్వతాన్ని ఎత్తి మీపై నిలిపి మీచేత చేయించిన గట్టి వాగ్దానాన్ని (జ్ఞప్తికి తెచ్చుకోండి) అప్పుడు మేము : "మీకు ప్రసాదిస్తున్న దానిని ధృడంగా పట్టుకోండి. అందులో ఉన్నదంతా జ్ఞాపకం ఉంచుకోండి. బహుశా మీరు భయ భక్తులు గలవారు కావచ్చు!" అని అన్నాము (ఖుర్'ఆన్ 2:63)**

అల్లాహ్ ఇస్రాయీల్ సంతానానికి గుర్తు చేస్తున్నారు వారు చేసిన ప్రతిజ్ఞలను, ఒప్పందాలను మరియు ఆయన వారి నుండి తీసుకున్న వాగ్దానాలను - అంటే ఆయనని మాత్రమే విశ్వసించడం ఏ భాగస్వామిని నిలబెట్టకుండా మరియు ఆయన సందేశహరులను అనుసరించడం.

అల్లాహ్ నుండి తౌరాత్ స్వీకరించి మూసా(అ)వారు తూర్ (సినాయ్) కొండ నుండి తిరిగి వచ్చారు. దానిని ఇస్రాయీల్ సంతానానికి పఠించి వినిపించారు. ఆ గ్రంథంలోని ఆదేశాలు కఠినంగా ఉన్నాయి. కాని వారి నడవడిక మరియు మనోవైఖరికి అటువంటి కఠినమైన క్రమశిక్షణ అవసరం.

మూసా(అ)వారు పఠించిన విషయాలను వారు విన్నారు. వాటిని స్వీకరించి అమలులో పెట్టడానికి బదులుగా, ఆ గ్రంథం తనదేనని అల్లాహ్‌యే స్వయంగా వారికి చెప్పేటంత వరకూ, ఆ ఆదేశాలను పాటించము అని అన్నారు. మూసా(అ)వారితో పాటు తూర్ కొండకు వచ్చి, తౌరాత్ ప్రామాణికతను అల్లాహ్ ధృవీకరించడాన్ని వినేందుకు వారిలో నుండి 70 మంది ఎన్నుకోబడ్డారు. అక్కడ ఏమి జరిగిందో, ఇదే శీర్షికలో శాంతిబాట ఫిబ్రవరి, 2013 సంచికలో చాలా వివరంగా చెప్పడం జరిగింది.

అక్కడి నుండి వారు తిరిగి తమవారి దగ్గరికి వచ్చారు. తమవారి ముందు 'తౌరాత్' అల్లాహ్ గ్రంథమేనని సాక్ష్యం ఇచ్చారు. కాని వాస్తవానికి, అల్లాహ్ తెలిపిన ఆదేశాలకు స్వయంగా వీరు కొంత జత చేసి చెప్పారు. అల్లాహ్ యొక్క ఆదేశాలను తాము ఆచరించ గలిగేటంత మేరకే ఆచరించవచ్చని అల్లాహ్ అనుమతి ఇచ్చారని మరియు వారు ఆచరించ లేకపోయిన విషయాలలో, వారిని అల్లాహ్ క్షమిస్తానని వాగ్దానం చేశారని ఓ ఘోర అబద్ధాన్ని వారు కల్పించారు.

ఎన్ని రకాలుగా వారిని శిక్షించినా వారి వైఖరి మాత్రం మారలేదు. వారు ఎల్లప్పుడూ అల్లాహ్‌కు వ్యతిరేకంగా సహజ ధిక్కార ప్రవృత్తినే ప్రదర్శించారు. నిస్సందేహంగా ఆ ఆదేశాలు కఠినమైనవే. అయితే ఇప్పుడు వాటి పట్ల నిర్లక్ష్యం వహించడానికి వారికి ఓ కొత్త సాకు (వంక) దొరికింది.

కాబట్టి ఇస్రాయీల్ సంతానం మరోమాట లేకుండా అల్లాహ్ ఆదేశాలను పాటించకుండా తిరస్కరించారు. అటువంటి కఠినమైన నిబంధనలను అమలులో పెట్టడం తమ సహనశక్తిని దాటిపోయిందని పదేపదే చెప్పారు.

ఈ నిర్లక్ష్యానికి (తృణీకరణ ధోరణికి) సమాధానంగా తూర్ కొండను ఎత్తి, ఒక హెచ్చరికగా వారి తలలపై వ్రేలాడదీయమని అల్లాహ్ తన దూతలను ఆదేశించారు. అల్లాహ్‌తో వారు చేసుకున్న ఒప్పందాన్ని నిర్వర్తించకపోతే, ఆ కొండ వారిపై పడుతుంది మరియు వారిని నలిపి వేస్తుంది. విధేయత చూపడం తప్ప ఇస్రాయీల్ సంతానానికి ఇక మరొక అవకాశం లేదు. ఈ సంఘటన గురించి ఖుర్'ఆన్‌లో మరోచోట అల్లాహుతాలా చెప్పారు :

**మరియు మేము పర్వతాన్ని పైకెత్తి వారిపై కప్పుగా ఉంచితే! వాస్తవానికి, వారు అది తమపై పడుతుందేమోనని భావించినప్పుడు మేము వారితో అన్నాము : "మేము మీకు ఇచ్చిన దానిని (గ్రంథాన్ని) ధృడంగా పట్టుకోండి మరియు అందులో ఉన్న దానిని జ్ఞాపకం ఉంచుకోండి. దానితో మీరు అల్లాహ్ పట్ల భీతిపరులు కావచ్చు."** (ఖుర్'ఆన్ 7:171)

ఇబ్నె అబ్బాస్(రజి), ముజాహిద్, 'అతా, 'ఇక్రిమాహ్, అల్-హసన్, అద్-దహ్హాక్, అర్-రబీ బిన్ అనస్ మరియు ఇతరులు చెప్పిన తఫ్సీర్‌ను బట్టి 63వ ఆయత్‌లో మరియు పై ఆయత్‌లో ప్రస్తావించబడిన పర్వతం **"అత్-తూర్"**. ఇబ్నె అబ్బాస్(రజి)వారి మరో ఉల్లేఖనం ద్వారా ఈ విషయం చాలా స్పష్టంగా అర్థమౌతుంది.

**పచ్చదనం పెరిగే ఏ పర్వతమైనా 'తూర్' పర్వతమే అవుతుంది.** పచ్చదనం లేని కొండను తూర్ అని పిలవరు. మరో హదీస్‌లో ఇబ్నె అబ్బాస్(రజి)వారు చెప్పారు : "వారు (యూదులు) విధేయత చూపడానికి తిరస్కరించినప్పుడు, అల్లాహ్ పర్వతాన్ని వారి తలలపైకి లేపారు వారు వినే విధంగా".

ఆయత్‌లో ప్రస్తావించబడిన **"మీకు ప్రసాదిస్తున్న దానిని ధృడంగా పట్టుకోండి"** అంటే అది **'తౌరాత్'** అని అల్-హసన్‌గారు వివరించారు.

మరియు అబూ అల్-'ఆలియహ్ మరియు అర్-రబీ చెప్పారు : "అందులో ఉన్నదంతా జ్ఞాపకం ఉంచుకోండి" అంటే, "తౌరాత్‌ను పఠించండి మరియు దానిని ఆచరణలో పెట్టండి."

ఇక్కడ పాఠకులకు ఒక సందేహం రావచ్చు. ఖుర్'ఆన్ గ్రంథంలో మరొకచోట చెప్పినదానిని బట్టి ఒక వ్యక్తిని **తన ధర్మాన్ని మార్చుకోమని బలవంతం చేయకూడదు.** కాని ప్రస్తుత విషయంలో బలం ఉపయోగించినట్లుగా అనిపిస్తుంది.

కాని వాస్తవానికి ఇస్రాయీల్ సంతానం తమ ధర్మాన్ని మార్చు కోవడానికి బలం ఉపయోగించ లేదని తెలుసుకోవాలి. ఎందుకంటే వారు అప్పటికే మూసా(అ)వారిని ప్రవక్తగా అంగీకరించారు. మరియు మనస్ఫూర్తిగా అల్లాహ్‌తో ఒప్పందం కూడా చేసుకున్నారు. వారికి ఒక గ్రంథాన్ని ఇస్తే దానినే అనుసరిస్తామని అన్నారు.

కాబట్టి వారు ఇప్పుడు తిరుగుబాటుదారులుగా నిలబడ్డారు మరియు వారు తమ నిర్లక్ష్య ధోరణిని కొనసాగిస్తున్నందుకు ఆ విధంగా తీవ్ర శిక్షతో హెచ్చరించడం జరిగింది. ఈ విషయాన్ని మనం సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఎవరైనా ఓ ప్రాంతంలో నివశిస్తున్నప్పుడు, వారు అక్కడి చట్టప్రకారమే వ్యవహరించ వలసి ఉంటుంది. ఒకవేళ ఆ చట్టాన్ని వారు అతిక్రమిస్తే, వారు శిక్షార్హులు అవుతారు.

నేటి ముస్లిమ్ సమాజం దీనికంటే భిన్నంగా ఏమీ లేదు. జకాత్ విషయంలో అల్లాహ్ ఆదేశాలని మరియు ముహమ్మద్(స)వారి బోధనలను ఏ విధంగా తిరస్కరిస్తున్నారో వివరించడం జరిగింది. వేల కోట్ల రూపాయలు అక్రమంగా తినివేస్తున్నారు. అంతేకాకుండా వారు వేదికలపై తౌహీద్‌లో ఉన్నట్లు ప్రసంగాలు చేస్తున్నారు.

**"లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్ రసూలుల్లాహ్"** అని ప్రకటించిన తరువాత ఖుర్'ఆన్‌లోని అల్లాహ్ ఆదేశాలను అంగీకరించి తప్పనిసరిగా పాటించాలి. మరియు ముహమ్మద్(స)వారి బోధనల ప్రకారం ఆచరణ ఉండేలా చేసుకోవాలి. కాని నేటి మన సమాజంలోని అత్యధికులు దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. అందువల్లనే నేడు ప్రపంచ వ్యాప్తంగా ముస్లిములు అవమానాలకు గురి అవుతున్నారు మరియు కొన్ని చోట్ల తీవ్రంగా అణచివేయబడుతున్నారు.

**"ఆ పిదప కూడా మీరు వెనుదిరిగి పోయారు. అయినప్పటికీ అల్లాహ్ యొక్క అనుగ్రహం మరియు ఆయన కరుణ మీపై లేకుంటే, మీరు నష్టానికి గురి అయిన వారిలో చేరేవారు."** (ఖుర్'ఆన్ 2:64)

వారు తమ వాగ్దానాన్ని భంగం చేసినప్పటికీ, ప్రవక్తలను మరియు సందేశహరులను వారి దగ్గరకు పంపడం ద్వారా అల్లాహ్ వారిపై అనుగ్రహం చూపారు. అల్లాహ్‌తో చేసుకున్న ఒప్పందానికి వ్యతిరేకంగా ఇస్రాయీల్ సంతానం ప్రవర్తించారు. ఆ పాపం ఎంత పెద్దది అంటే వినాశకరమైన శిక్ష వారిపై పడవలసింది. కాని అల్లాహ్ తన కారుణ్యంతో వారిని దాని నుండి తప్పించారు. అయితే అది ఇహలోక జీవితానికి సంబంధించినంత వరకూ మాత్రమే. పరలోకంలో తాము చేసిన ద్రోహానికి వారు మూల్యం చెల్లించుకోవాల్సి ఉంది.

**'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్'** యొక్క అర్థాన్ని చాలా వివరంగా మొదటి సంవత్సరంలోని ఒక సంచికలో చెప్పడం జరిగింది. అల్లాహ్ కారుణ్యం రెండు రకాలుగా ఉంటుంది. **ఒక కారుణ్యం** - అది విశ్వాసులపై మరియు అవిశ్వాసులపై ఒకే విధంగా ఉంటుంది. (రహ్మాన్). **మరొకటి ప్రత్యేక మైనది.** అది కేవలం విశ్వాసుల కొరకే. (రహీమ్) ఈ రెండవ కారుణ్యం ప్రత్యేకంగా పరలోకంలో సాఫల్యం మరియు అల్లాహ్‌కు సామీప్య రూపంలో స్పష్టం అవుతుంది.

ప్రామాణిక హదీస్‌లను బట్టి, **ముహమ్మద్(స)వారిని సకల లోకాలకు కారుణ్యంగా పంపిన తరువాత** నూహ్, ఆద్, సమూద్, లూత్ మొదలైన జాతులపై పడినటువంటి సమూల వినాశనం కలిగించే శిక్షలు ప్రజలపై పడలేదు. **అల్-హమ్‌దులిల్లాహ్!**

## 65వ ఆయత్ నుండి 71వ ఆయత్ వరకూ

**65.మరియు వాస్తవానికి మీకు తెలును మీలో ఎవరు ఉల్లంఘించారో సబ్త్ (విషయం)లో. కాబట్టి మేము చెప్పాము వారికి : "కోతులు అయిపోండి, అవమానంలో జీవించేవారుగా"**

| عَلِمْتُمُ | وَلَقَدْ |
|---|---|
| మీకు తెలుసు | మరియు వాస్తవానికి |

66. ఆ విధంగా మేము దానిని చేశాము భయాన్ని కలిగించేదిగా ముందున్న వారికి మరియు వారి వెనుకనున్న వారికి మరియు అల్లాహ్‌పట్ల భీతి గలవారికి ఓ హితబోధగా.

67. మరియు మూసా తన జాతివారితో (ఇలా) అన్నప్పుడు : నిశ్చయంగా అల్లాహ్ మిమ్మల్ని ఆదేశిస్తున్నాడు - "ఒక ఆవును జిబహ్ చేయండి అని". (వారు) అన్నారు : "నీవు మాతో పరిహాసం చేస్తున్నావా?" (మూసా) అన్నాడు : "నేను అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను అజ్ఞానులలో నేను (ఒకడిని) అయిపోకుండా."

68. (వారు) అన్నారు : "మా కొరకు నీ ప్రభువును ప్రార్థించు. అది ఏమిటో మాకు స్పష్టం చేయమని." (మూసా) అన్నాడు: "నిశ్చయంగా ఆయన చెబుతున్నారు నిస్సందేహంగా అది ఒక ఆవు, ముసలిది కాదు, చిన్నదానికి మధ్యవయస్సు గల దానికి మధ్యలో అది (ఉంటుంది)." కాబట్టి మీరు ఏదైతే ఆదేశించ బడ్డారో (అది) చేయండి.

69. (వారు) చెప్పారు : "మా కొరకు నీ ప్రభువును ప్రార్థించు. దాని రంగు ఏమిటో మాకు స్పష్టం చేయమని." (మూసా) చెప్పాడు: "నిశ్చయంగా ఆయన చెబుతున్నాడు, అది

| | | | | | |
|---|---|---|---|---|---|
| لَهُمْ | فَقُلْنَا | فِي السَّبْتِ | مِنْكُمْ | اعْتَدَوْا | الَّذِيْنَ |
| వారికి | కాబట్టి మేము చెప్పాము | సబ్త్ (విషయం) లో | మీలో | ఉల్లంఘించారు | ఎవరైతే |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| لِّمَا | نَكَالًا | فَجَعَلْنٰهَا | ۚ ٦٥ | خٰسِئِيْنَ | قِرَدَةً | كُوْنُوْا |
| వారి కొరకు | భయాన్ని కలిగించేదిగా | కాబట్టి దానిని చేశాము | 65 | అవమానంతో జీవించేవారు | కోతులు | అయిపోండి |

| | | | |
|---|---|---|---|
| لِّلْمُتَّقِيْنَ | وَمَوْعِظَةً | وَمَا خَلْفَهَا | بَيْنَ يَدَيْهَا |
| ముత్తఖీన్‌ల కొరకు | మరియు ఒక హితబోధ | మరియు వారి వెనుక నున్న వారు | ముందున్న వారు |

| | | | | | |
|---|---|---|---|---|---|
| يَأْمُرُكُمْ | اِنَّ اللّٰهَ | لِقَوْمِهٖٓ | قَالَ مُوْسٰى | وَاِذْ | ٦٦ |
| మీకు ఆజ్ఞాపిస్తున్నారు | నిశ్చయంగా అల్లాహ్ | తన జాతి వారికి | మూసా చెప్పారు | మరియు అప్పుడు | 66 |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| قَالَ | هُزُوًا ؕ | اَتَتَّخِذُنَا | قَالُوْٓا | بَقَرَةً ؕ | تَذْبَحُوْا | اَنْ |
| చెప్పాడు | పరిహాసం | నీవు మాతో చేస్తున్నావు | వారు అన్నారు | ఒక ఆవు(ను) | జిబహ్ చేయండి | అది |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| قَالُوْا | ٦٧ | الْجٰهِلِيْنَ | مِنَ | اَكُوْنَ | اَنْ | بِاللّٰهِ | اَعُوْذُ |
| వారు అన్నారు | 67 | అజ్ఞానులు | నుండి | నేను ఉన్నాను | అది | అల్లాహ్ తో | నేను రక్షణ కోరుతున్నాను |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| اِنَّهٗ | قَالَ | مَا هِيَ ؕ | لَّنَا | يُبَيِّنْ | رَبَّكَ | لَنَا | ادْعُ |
| నిశ్చయంగా ఆయన | (అతను) చెప్పాడు | అది / ఏమిటి (అది ఏమిటి) | మాకు | స్పష్టం చేయి | నీ ప్రభువు | మా కొరకు | ప్రార్థించు |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| بَيْنَ | عَوَانٌۢ | بِكْرٌ ؕ | وَّلَا | لَّا فَارِضٌ | بَقَرَةٌ | اِنَّهَا | يَقُوْلُ |
| మధ్య | మధ్య వయస్సు గలది | లేగ దూడ | మరియు కాదు | ముసలిది కాదు | ఒక ఆవు | నిస్సందేహంగా అది | చెబు తున్నారు |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| لَنَا | ادْعُ | قَالُوا | ٦٨ | تُؤْمَرُوْنَ | مَا | فَافْعَلُوْا | ذٰلِكَ ؕ |
| మీ కొరకు | ప్రార్థించు | వారు అన్నారు | 68 | ఆదేశించబడిన వారు | ఏది | కాబట్టి చేయండి | అది |

నిస్సందేహంగా ఓ ఆవు, మెరిసే పసుపురంగు కలది. దాని రంగు మనోహరంగా ఉంటుంది చూసేవారికి."

70. (వారు) అన్నారు : మా కొరకు నీ ప్రభువును ప్రార్థించు. స్పష్టం చేయమని. వాస్తవానికి ఆ ఆవులు మాకు ఒకే విధంగా ఉన్నాయి (సందేహం కలుగుతుంది). మరియు నిశ్చయంగా అల్లాహ్ కోరితే మేము మార్గదర్శకత్వం పొందుతాము"

71. (మూసా) చెప్పాడు : "నిశ్చయంగా ఆయన అంటున్నాడు : అది నిస్సందేహంగా ఓ ఆవు భూమి దున్నడానికి మరియు పొలానికి నీరు పెట్టడానికి (శిక్షణ పొందినది కాదు). సరియైనది. లోపం ఉండదు దానిలో." (వారు) అన్నారు : "ఇప్పుడు నీవు వచ్చావు సత్యంతో" కాబట్టి వారు దానిని జిబహ్ చేశారు మరియు వారు దాదాపు(దానిని) చేసి ఉండేవారు కాదు."

رَبَّكَ يُبَيِّنْ لَّنَا مَا لَوْنُهَا ۚ قَالَ اِنَّهٗ يَقُوْلُ

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| చెబు తున్నాడు | నిశ్చయంగా ఆయన | అతను చెప్పాడు | దాని రంగు | ఏమిటి | మాకు | స్పష్టం చేయి | నీ ప్రభువు |

اِنَّهَا بَقَرَةٌ صَفْرَآءُ ۙ فَاقِعٌ لَّوْنُهَا تَسُرُّ

| | | | | | |
|---|---|---|---|---|---|
| సుందరంగా | దాని యొక్క రంగు | మెరిసేది | పసుపు రంగు | ఓ ఆవు | నిస్సందేహంగా అది |

النّٰظِرِيْنَ ﴿٦٩﴾ قَالُوا ادْعُ لَنَا رَبَّكَ

| | | | | | |
|---|---|---|---|---|---|
| నీ ప్రభువును | మా కొరకు | ప్రార్థించు | వారు చెప్పారు | 69 | చూసేవారు (కి) |

يُبَيِّنْ لَّنَا مَا هِيَ ۙ اِنَّ الْبَقَرَ تَشٰبَهَ عَلَيْنَا ۚ

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| మాకు | ఒకే విధంగా | ఆ ఆవు | వాస్తవానికి | అది | ఏమిటి | మా కొరకు | స్పష్టం చేయి |

وَاِنَّآ اِنْ شَآءَ اللّٰهُ لَمُهْتَدُوْنَ ﴿٧٠﴾

| | | | |
|---|---|---|---|
| 70 | మార్గదర్శకత్వం పొందుతాము | అల్లాహ్ కోరితే | మరియు నిశ్చయంగా మేము |

قَالَ اِنَّهٗ يَقُوْلُ اِنَّهَا بَقَرَةٌ لَّا ذَلُوْلٌ تُثِيْرُ الْاَرْضَ

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| భూమి | దున్న డాన్ని | కాదు శిక్షణ పొందినది | ఒక ఆవు | నిశ్చయంగా అది | చెబు తున్నాడు | నిశ్చయంగా ఆయన | అతను చెప్పాడు |

وَلَا تَسْقِي الْحَرْثَ ۚ مُسَلَّمَةٌ لَّا شِيَةَ فِيْهَا ۚ قَالُوا الْـٰٔنَ

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ఇప్పుడు | వారు అన్నారు | దానిలో | లోపం | లేదు | సరియైనది | పొలం | నీరు పెట్టింది | మరియు కాదు |

جِئْتَ بِالْحَقِّ ۚ فَذَبَحُوْهَا وَمَا كَادُوْا

| | | | | |
|---|---|---|---|---|
| వారు దాదాపు | మరియు కాదు | కాబట్టి వారు దానిని జిబహ్ చేశారు | సత్యంతో | నీవు వచ్చావు |

يَفْعَلُوْنَ ﴿٧١﴾

| | |
|---|---|
| 71 | చేసేవారు |

## సూరహ్ అల్-బఖరా (65 నుండి 71 ఆయత్‌లలో వచ్చిన అరబీ) పదాల అర్థాలు

| | |
|---|---|
| 504. వాస్తవానికి | لَقَدْ |
| 505. ఉల్లంఘించిన వారు / హద్దులు మీరినవారు | اِعْتَدَوْا |
| 506. అస్-సబ్త్ (శనివారం) | اَلسَّبْتُ |
| 507. కోతులు | قِرَدَةٌ ( قِرْدٌ |
| 508. అవమానంలో జీవించేవారు, తృణీకరించబడినవారు | خَاسِئِيْنَ |
| 509. భయాన్ని కలిగించే ఒక హెచ్చరిక | نَكَالاً |
| 510. వారి ముందు / వారి సమక్షంలో | بَيْنَ يَدَيْ |
| 511. తరువాయి / వెనుకటి | خَلْف |
| 512. హితోపదేశం / మందలింపు | مَوْعِظَةٌ (و ع ظ) |
| 513. ఆదేశించుట | يَأْمُرُ (ا م ر) |
| 514. అది | أَنْ |
| 515. ఓ ఆవు | بَقَرَةٌ |
| 516. పరిహసించుట | هُزُوًا |
| 517. నేను శరణు వేడుకుంటున్నాను | أَعُوْذُ |
| 518. ప్రార్థించు | اُدْعُ |
| 519. స్పష్టంగా తెలుపు | يُبَيِّنْ |
| 520. అది ఎలా ఉంటుందో | مَاهِيَ |
| 521. చెబుతున్నాడు | يَقُوْلُ |
| 522. ముసలిది కాదు | لَا فَارِضٌ |
| 523. బాగా కోడెదూడ కాదు | بِكْرٌ |
| 524. మధ్యలో నున్నది | عَوَانٌ |
| 525. చేసేవారు | اِفْعَلُوْا |
| 526. ఏదైతే | مَا |
| 527. ఆదేశించబడ్డారు | تُؤْمَرُوْنَ (ا م ر) |
| 528. దాని రంగు | لَوْنُهَا |
| 529. పసుపు రంగు | صَفْرَآءُ |
| 530. మెరిసేది | فَاقِعٌ |
| 531. మనోహరంగా | تَسُرُّ (س ر ر) |
| 532. చూసేవారు | نَاظِرِيْنَ (ن ظ ر) |
| 533. ఒకేలా ఉండటం, సందేహంగా ఉండటం | تَشَابَهَ |
| 534. కోరిన | شَآءَ |
| 535. ఏ పనికీ ఉపయోగించ బడలేదు | ذَلُوْلٌ |
| 536. భూమిని దున్నుట | تُثِيْرُ الْأَرْضَ (ث و ر) |
| 537. నీరు పెట్టుట (పొలానికి) | تَسْقِيْ |
| 538. పొలం | حَرْثٌ |
| 539. లోపాలు లేనిది, సరియైనది | مُسَلَّمَةٌ |
| 540. మచ్చ లేనిది | لَا شِيَةَ |
| 541. ఇప్పుడు | أَلْئنَ |
| 542. నీవు వచ్చావు | جِئْتَ |
| 543. వారు దాదాపు చేయరు | مَا كَادُوْا |

### 65వ ఆయత్‌కు తఫ్సీర్ :

**"మరియు వాస్తవానికి మీకు తెలుసు"** అంటే 'ఓ యూదులారా! అల్లాహ్‌కు అవిధేయత చూపినందుకు మరియు వాగ్దానాన్ని భంగపరచి నందుకు మరియు సబ్త్ పవిత్రతను పాటించకుండా ఒప్పందాన్ని భంగ పరిచిన వారి పట్టణంపై అల్లాహ్ పంపిన శిక్షను జ్ఞాపకం చేసుకోండి.'

పై ఆయత్‌లో ప్రస్తావించబడిన పట్టణవాసుల గురించి ఖుర్'ఆన్‌లోని మరో ఆయత్‌లో (7:163లో) మరి కాస్త వివరంగా చెప్పబడింది. ఖుర్'ఆన్‌లోని ఒక వాక్యం గురించి మరో వాక్యం వివరిస్తుందనే విషయం మా పాఠకులకు సుపరిచితమే!

ఆ పట్టణవాసులలోని కొందరు మోసపూరిత మార్గాలను ఉపయోగించి సబ్త్‌ను గౌరవించడాన్ని వదిలేయడం ప్రారంభించారు. శనివారానికి ముందే వలలను, త్రాళ్ళను మరియు కృత్రిమ నీటిగుంటలు ఏర్పాటు చేసేవారు చేపలను పట్టడం కోసం.

ఎప్పటిలాగే శనివారం నాడు చేపలు బాగా ఎక్కువగా వచ్చినప్పుడు, అవి ఆ రోజంతా తాళ్ళలో మరియు వలలలో పట్టబడేవి. సబ్త్ పూర్తి అయిన తరువాత, ఆ రోజు రాత్రి యూదులు ఆ చేపలను సేకరించేవారు.

వారు ఆ విధంగా చేయడం వలన, అల్లాహ్ వారిని మానవ రూపం

నుండి కోతులుగా మార్చివేశారు. ఇతరులకు వారి చెడు చేష్టలు మరియు మోసం పైకి ధర్మ సమ్మతంగా కనిపించేవి. కాని వాస్తవానికి వారు పాపాత్ములు.

అందుకే వారి నేరానికి తగిన శిక్ష లభించింది. ఈ సంఘటన గురించి వివరంగా 7వ సూరహ్‌లో 163వ ఆయత్‌లో వివరించబడింది.

**"మరియు వారిని అడుగు : సముద్ర తీరం నందున్న ఆ నగర (వాసులను) గురించి. వారు సబ్త్ (శనివారం విషయంలో) ఉల్లంఘనకు పాల్పడేవారు! ఆ సబ్త్ రోజునే చేపలు వారి ముందుకు ఎగిరెగిరి నీటిపైకి వచ్చేవి. మరియు సబ్త్ లేని రోజు (చేపలు) వచ్చేవి కావు. వారి అవిధేయతకు కారణంగా మేము వారిని ఈ విధంగా పరీక్షకు గురి చేశాము.** (ఖుర్'ఆన్ 7:163)

పై ఆయత్ బట్టి తెలిసేది ఏమిటంటే వారు సముద్ర తీరాన నివశించేవారు. వారు అవిధేయతకు పాల్పడేవారు. వారికి సబ్త్ నియమం ఏర్పాటు చేయబడింది. అంటే శనివారం చేపలు పట్టకూడదు. కాని ఆ రోజే చేపలు నీటిపైకి ఎగిరెగిరి వచ్చేవి. అంటే వాటిని సులభంగా పట్టవచ్చు. కాని నియమం ప్రకారం వాటిని పట్టకూడదు. మిగతా రోజులలో ఆ విధంగా చేపలు వచ్చేవి కావు. **ఇది వారికి ఒక పరీక్ష. వారికేమో చేపలంటే చాలా ఇష్టం!**

ఈ సంఘటన దావూద్(అ)వారి కాలానికి సంబంధించినది. అల్లాహుతాలా శనివారాన్ని సబ్బత్‌గా నియమించారు. లేదా ఇది సలాత్ మరియు ఆరాధనల కొరకు ఇస్రాయీల్ సంతానానికి ప్రత్యేకంగా పవిత్ర దినంగా ఏర్పాటు చేయబడింది మరియు ఆ రోజు చేపలు పట్టడం నిషేధించబడింది.

శనివారం చేపలు పట్టడం కోసం ఇస్రాయీల్ సంతానం మొదట అన్ని రకాల తెలివైన సాకులను (నటనను) కనిపెట్టారు.

శనివారం చేపలు పట్టుకోకూడదు కాబట్టి ఎగిరెగిరి వచ్చే చేపలు తిరిగి సముద్రంలోకి పోకుండా చేయాలనుకున్నారు. చేప చివర భాగాన ఒక తాడు కట్టేవారు, రెండవ చివరను ఒడ్డున కట్టేవారు. అంటే చేప నీటిలోనే ఉంటుంది. కాని తాడుకి కట్టబడి ఉండటం వలన అది తప్పించుకు పోలేదు.

అంతేకాకుండా ఒడ్డున గోతులు తవ్వేవారు. వాటిలో పడి తప్పించుకు పోకుండా వలలు ఏర్పాటు చేసేవారు. ఇది బహిరంగంగానే నెమ్మదిగా ప్రారంభమైంది.

శనివారం నాడు చేపలు పట్టడం లేదు కాబట్టి బయటకు వీరు ధర్మాన్ని అనుసరిస్తున్నట్లే కనిపిస్తుంది. కాని వారి ఆంతర్యంలో మోసం ఉంది. అది అల్లాహ్‌కు తెలుసు. అయితే నిజంగా ధర్మాన్ని అనుసరించే వారికి వీరు చేస్తున్న మోసం ఏమిటో అర్థం అయింది. వారికి హితోపదేశం చేశారు. కాని వారు వినలేదు. అల్లాహ్ ఆదేశాన్ని ఉల్లంఘించే వారికి మరియు ధర్మాన్ని అనుసరించేవారికి మధ్య ఈ విషయంలో అభిప్రాయ బేధం పెరిగింది.

అంటే ఉల్లంఘించినవారంతా ఒకవైపు మరియు ధర్మ పరాయణులు రెండవ వైపు ఉన్నారు.

**ఆ పాపాత్ముల నుండి ధర్మ పరాయణులు పూర్తిగా విడిపోయారు. పట్టణంలోని వారంతా మరో భాగంలో నివశించడం ప్రారంభించారు.**

ఒక రోజు రెండవ వైపు నుండి ఎటువంటి ధ్వని బయటికి రావడం లేదని వీరికి అనిపించింది. ఆతృత పెరగడంతో వారు అక్కడికి వెళ్ళి చూసారు. అల్లాహ్ ఆదేశాన్ని ఉల్లంఘించిన వారంతా కోతులుగా మారిపోయి ఉన్నారు. అయితే ఖతాదా చెప్పారు, **చిన్నవారంతా కోతులు గానూ మరియు వయస్సులో బాగా పెద్దవారు పందులుగా మారారు అని.**

కోతులుగా మారిన ఆ పాపాత్ములు తమ బంధువులను మరియు స్నేహితులను గుర్తు పట్టగలిగారు మరియు వారిని సమీపించారు తీవ్ర పశ్చాత్తాపంతో ఏడుస్తూ మరియు వారి సానుభూతి సహకారాలను అర్థిస్తూ. అయితే అల్లాహ్ పంపిన శిక్షతో రూపాంతరం చెందిన వారంతా 3 రోజుల తరువాత చనిపోయారు.

**నేడు మనం చూస్తున్న కోతులు మరియు పందులు వారి సంతానమా? అని సందేహం కలుగుతుంది. కాని శిక్షకు గురైన వీరి కంటే ముందు నుండే అవి సృష్టిలో ఉనికిలో ఉన్నాయి.**

అల్లాహ్ పంపిన శిక్ష వలన వారు ఆ విధంగా మారిపోయారు. కాబట్టి అటువంటి శిక్ష పడిన వారు వేరొకరికి జన్మ నివ్వలేరు. అందువలన వారి వెనుక వారి సంతానం మిగిలి ఉండదు.

ఇదే విషయం సహీహ్ ముస్లిమ్‌లో గ్రంథస్థం చేయబడింది.

అబ్దుల్లాహ్(రజి)వారి ఉల్లేఖనం. ఉమ్మె హబీబహ్(రజి), రసూలుల్లాహ్(స)వారి సతీమణి చెప్పారు : "ఓ అల్లాహ్! నా భర్త రసూలుల్లాహ్(స)వారి నుండి మరియు నా తండ్రి అబూ సుఫ్యాన్(రజి) వారి నుండి మరియు నా సోదరుడు ము'అవియహ్(రజి) వారి నుండి మేలును పొందగలిగేలా చేయండి." రసూలుల్లాహ్(స)వారు అన్నారు: "నీవు అల్లాహ్ నుండి అడిగావు ఇప్పటికే నిర్ణయించబడిన జీవితకాలాల గురించి మరియు ఎంతకాలమనేది కేటాయించబడింది మరియు జీవనోపాధులలోని వాటా నిర్ణయించబడింది. అల్లాహ్ ఏదీ చేయరు, దాని కొరకు నిర్దేశించిన సమయానికి ముందుగా లేక ఆయన దేనినీ ఆలస్యం చేయరు దాని నిర్దేశించిన సమయం దాటి. మరియు నీవు అల్లాహ్‌ను నరకాగ్ని శిక్ష నుండి లేక సమాధి యొక్క శిక్ష నుండి రక్షించమని అడిగివుంటే అది నీకు ఉత్తమంగా ఉండేది మరియు (అది) ఎంచుకోదగినది."

అతడు (ఉల్లేఖకుడు) ఇంకా చెప్పారు : ప్రస్తావించబడింది కోతుల గురించి ఆయన(స) ముందు. మరియు (ఉల్లేఖకులలో ఒకరైన) మిస్'అర్ చెప్పారు : నేను అనుకుంటున్నాను (ఉల్లేఖకుడు) రూపాంతరం చెందిన పందుల గురించి కూడా (ప్రస్తావించాడని).

అప్పుడు ఆయన(స) చెప్పారు : **"నిశ్చయంగా అల్లాహ్ రూపాంతరానికి గురియైన జాతిని వృద్ధి చెందనీయరు లేక వారు సంతానాన్ని వదలి వెళ్ళరు. కోతులు మరియు పందులు అంతకు పూర్వం నుండే ఉనికిలో ఉన్నాయి." (సహీహ్ ముస్లిమ్, 6770, పుస్తకం 46. కితాబుల్ ఖద్ర్, అధ్యా.7, సంపుటి 7)**

66వ ఆయత్‌కు వివరణ :

**ఆ విధంగా మేము దానిని చేశాము భయాన్ని కలిగించేదిగా ముందున్న వారికి మరియు వారి వెనుకనున్న వారికి మరియు అల్లాహ్‌పట్ల భీతి గలవారికి ఓ హితబోధగా. (ఖుర్'ఆన్ 2:66)**

ముందన్నవారు అంటే ముందరి గ్రామ ప్రజలు మరియు వెనుక నున్నవారు అంటే ఆ గ్రామానికి వెనుకనున్న గ్రామ ప్రజలు. కాబట్టి ఆ గ్రామానికి చుట్టుపక్కల ఉండే ప్రజలు. కొందరు అనువాదకులు ఈ ఆయత్‌లో ముందున్నవారు అంటే వారి సమక్షంలో ఉన్నవారిగా మరియు వెనుకనున్నవారు అంటే భావితరాలవారిగా అనువదించడం జరిగింది.

ఇబ్నె అబ్బాస్(రజి)వారు ఈ ఆయత్‌పై ఇలా వ్యాఖ్యానించారు: "అంటే దాని అర్థం, **మేము ప్రజలను శిక్షించిన విధానంతో ఈ గ్రామాన్ని చుట్టుప్రక్కల గ్రామాల వారికి ఒక ఉదాహరణగా చేశాము."**

తఫ్సీర్ ఇబ్నె కసీర్‌లో పై వివరణతో పాటు, అబూహురైరా(రజి)వారి ఓ ఉల్లేఖనాన్ని కూడా వివరించారు. ఆ ఉల్లేఖనం ఇమామ్ అబూ అబ్దుల్లాహ్ బిన్ బత్తహ్ గారి ఇర్వా' అల్-ఘలీల్(5:375)లోనిదిగా చెప్పబడింది.

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: **"చేయకండి ఏదైతే యూదులు చేశారో, అల్లాహ్ నిషేధించినదానిని ఉల్లంఘిస్తూ, అత్యంత నీచమైన మోసపూరిత విధానాలకు పాల్పడడం ద్వారా"**

## అల్లాహ్ వాక్యాలను వక్రీకరించి మోసానికి పాల్పడటమనేది నేడు కూడా బహిరంగంగా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతుంది

సబ్త్ వారు పాల్పడిన మోసపూరిత విధానం వంటిదే నేడు మన సమాజంలో కూడా చూస్తున్నాము. శాంతిబాట పాఠకులకు అది స్పష్టంగా తెలుసు.

వారంలో ఒక్క రోజు మాత్రమే అమితంగా చేపలు వచ్చేవి. మిగతా 6 రోజులలో అవి తక్కువ వచ్చేవి. వారికేమో చేపలు అంటే బాగా ఇష్టం. నేటి మన సమాజంలో చాలామందికి ఐశ్వర్యం అంటే చాలా ఇష్టం.

నేటి ముస్లిముల విషయానికి వస్తే, వీరు దానాలు సంవత్సరం పొడవునా ఎంతో కొంత చేస్తున్నప్పటికీ, రమదాన్ నెలలో అమితంగా చేస్తారు. **నిజానికి అది విధిదానం - జకాత్.** రమదాన్ నెలలో వేల కోట్ల రూపాయల జకాత్ సొమ్ము సేకరించబడుతుంది. ఇది అల్లాహ్ ఆదేశం ప్రకారం పేదవారికి, అవసరంలో ఉన్నవారికి అందాలి. ఆ విధంగా జరిగితే సమాజంలో పేదరికం ఉండదు.

కాని ముస్లిములలో కష్టపడి పనిచేయని కొందరు పరాన్న జీవులకు మరియు అవినీతిపరులకు ఈ సొమ్ముపై కన్నుపడింది. మోసంతో దానిని పొందాలనుకున్నారు. **ఎందుకంటే వారికి దానిపై హక్కు లేదు.** మిగతా నెలలలో నఫిల్ దానాల ద్వారా లభించే సొమ్ము కూడా బాగానే ఉన్నప్పటికీ, రమదాన్ నెలలో అయితే కోట్లాది రూపాయలు దోచుకోవచ్చని పథకం పన్నారు.

ఆ విధంగా వీరంతా అల్లాహ్ నిర్దేశించిన 8 కేటగిరిలలో 'అల్లాహ్ మార్గంలో' అనే కేటగిరికి చెందినవారిగా స్వయంగా ప్రకటించేసుకుని, పేదప్రజల సొమ్మును విపరీతంగా తినివేయడం ప్రారంభించారు.

ఈ ఘోర అన్యాయానికి పాల్పడుతూ కూడా ప్రజల ముందు ధర్మం ప్రకారమే చేస్తున్నట్లు సమర్థించు కుంటున్నారు. వారు చేసే ప్రతీ పని అల్లాహ్ మార్గంలోకి వస్తుందని ప్రజలను మాయచేసి ఇంతకాలం నటించి నమ్మించారు ఏవిధంగా అయితే సబ్త్‌వారు నటించారో ఆ విధంగా.

ఖుర్'ఆన్, సున్నత్ మరియు సన్మార్గం పొందిన ఖలీఫాల ఆచరణల ద్వారా శాంతిబాట వాస్తవాలను ప్రజల ముందు ఉంచిన తరువాత, అల్లాహ్ ఆదేశం పట్ల వీరందరూ ఎంత అవిధేయత చూపుతున్నారో ప్రజలకు స్పష్టంగా తెలిసిపోయింది. ఆ అవినీతిపరులను కొందరు నిలదీశారు కూడా. ఈ నిలదీత వలన కనీసం కొద్దిమంది పేదలకైనా ఇప్పుడు జకాత్ సొమ్ము లభిస్తుంది. అల్-హమ్దులిల్లాహ్! వేల కోట్ల జకాత్ సొమ్ము నిజంగా పేదప్రజలకే అందితే సమాజంలో పేదరికం ఉండదు, ఇన్షా అల్లాహ్!

**ధర్మ సందేశ ప్రచారం మరియు మదరసాల ముసుగులో పేదలకు వీరు చేస్తున్న అన్యాయం అల్లాహ్ ఆదేశాన్ని పరిహసించడమే! కాబట్టి ఇటువంటి దాయిలు, నాయకులు మరియు ఆలిమ్‌లకు మనం ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.**

*65 నుండి 71వ ఆయత్ వరకూ మిగిలిన తఫ్సీర్ ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...*

### ఖుర్'ఆన్‌లోని సత్యాన్ని తెలపడం వరకే మన బాధ్యత

**"నిశ్చయంగా మేము మానవులందరి కొరకు, ఈ గ్రంథాన్ని, సత్యంతో నీపై అవతరింప జేశాము. కావున సన్మార్గంపై నడిచేవాడు, తన మేలు కొరకే అలా చేస్తాడు. మరియు నిశ్చయంగా, మార్గభ్రష్టుడైనవాడు తన కీడు కొరకే మార్గాన్ని తప్పిన వాడవుతాడు. మరియు నీవు వారి కొరకు బాధ్యుడవు కావు."** (ఖుర్'ఆన్ 39:41)

**కాబట్టి ప్రతీ రోజూ ఖుర్'ఆన్ చదువుతూ అల్లాహ్ చూపిన సన్మార్గాన్ని అనుసరించుదాం, ఇన్షా అల్లాహ్!**

జీవిత చరిత్ర

# ముహమ్మద్ محمد

సల్లల్లాహు అలైహి వసల్లమ్ (అల్లాహ్ నుండి ఆయనపై శుభాశీస్సులు మరియు శాంతి కలుగుగాక!)

## సకల లోకాలకు కారుణ్యం (రహమతల్లిల్ ఆలమీన్)

(క్రిందటి సంచిక తరువాయి ...)

19

### బహిరంగ ప్రచారం ...

బహిరంగంగా సందేశాన్ని వినిపించమని అల్లాహ్ ఆదేశించడం మరియు దానిని ముహమ్మద్(స)వారు ఎలా ప్రారంభించారో క్రిందటి సంచికలో వివరించాము. ''లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్ రసూలుల్లాహ్'' పఠించి ముస్లిమ్ అయిన ప్రతీ వ్యక్తిపై ధర్మ సందేశ ప్రచారం ఫర్జ్‌గా ఉంది. అంటే **ప్రతీ ముస్లిమ్ ఇస్లామ్ గురించి తోటి వారికి చెప్పాలి.** ఇతరులను అల్లాహ్ మార్గం వైపు ఆహ్వానించాలి.

అల్లాహ్ ఒక్కడే ఆరాధ్యుడని మరియు ముహమ్మద్(స)వారు ఆయన సందేశహరుడు అని విశ్వసించడం అంటే అల్లాహ్ యొక్క ఆదేశాలను పాటిస్తామని మరియు ముహమ్మద్(స)వారి బోధనలను అనుసరిస్తామని అంగీకరించి ఒప్పందం (అగ్రిమెంట్) చేసుకోవడం. ఆ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే శిక్షార్హులం అవుతాము.

ఏ విధంగా నమాజ్‌ను మనపై విధిగా స్వీకరించామో, అదే విధంగా ధర్మం గురించి ప్రచారం చేయడం కూడా ఈ ఒప్పందం ప్రకారం మనపై ఫర్జ్‌గా స్వీకరించాలి.

**ముహమ్మద్(స)వారు ఈ బహిరంగ ప్రచారాన్ని ఎలా చేపట్టారో ప్రతీ ముస్లిమ్ తప్పనిసరిగా తెలుసుకోవాలి. కాబట్టి ముఖ్య విషయాలను విశ్లేషించి ఈ వ్యాసంలో అందిస్తున్నాము.**

ముహమ్మద్(స)వారు ఏ అరబ్ జాతికైతే సందేశాన్ని ఇస్తున్నారో, వారి దగ్గర ఎటువంటి గ్రంథమూ లేదు. వాస్తవానికి వారి దగ్గర అరబీలో వ్రాయబడిన పుస్తకాలే లేవు. వారు వేల సంఖ్యలోని విషయాలు అన్నింటినీ లిఖించి భద్రపరచుకునే వారు కాదు. తమ మనస్సులలోనే ముద్రించుకునేవారు. వారి కంఠస్థం అంత స్థాయిలో ఉండేది.

**మరి వారి దగ్గర ఎటువంటి గ్రంథ ఆధారం లేకుండా ముహమ్మద్(స) వారు చెప్పే విషయాలు నిజమని విశ్వసిస్తారా? గ్రంథం వంటిది కాకుండా ఇతర ఆధారలేమైనా వారి దగ్గర ఉన్నాయా?**

వారి మధ్యనే ముహమ్మద్(స)వారు జన్మించారు. వారి మధ్యనే పెరిగారు. ఆ ఎడారి ప్రాంతంలో అత్యంత శుచి, శుభ్రత పాటించేది ఆయనే! ఏనాడూ అబద్ధం చెప్పలేదు. అంతేకాకుండా ఆ విషయం అందరికీ తెలుసు. అందుకే అందరూ ఆయనను 'అమీన్'(నిజాయితీ పరుడు), సాధిఖ్ (సత్య సంధుడు) అని పిలిచేవారు. అనాథలకు, అవసరంలో ఉన్నవారికి ఆయన సహాయం చేసేవారు. నిజాయితీకి ఆయన నిలువెత్తు నిదర్శనమని అక్కడి వారందరికీ తెలుసు.

కాబట్టి మక్కా వారితో 'తాను అల్లాహ్ యొక్క సందేశహరుడను' అని చెప్పినప్పుడు, ఆయన మాటలో నిజం ఉందని నిస్సందేహంగా వారంతా నమ్మవలసి ఉంది.

కాని ''విశ్వసించలేదు కదా! 'అసత్యవాది' అని అన్నారు కదా!'' అని ఎవరైనా అనవచ్చు. **అవి కేవలం వారి నోటిమాటలే గాని, వారి మనస్సు నుండి వచ్చినవి కావు.** ప్రవక్త(స) చెప్పిన విషయాలన్నీ పూర్తిగా సత్యమని వారికి బాగా తెలుసు.

**ఈ విషయానికి సంబంధించి ఎన్నో ఆధారాలున్నాయి.**

ముహమ్మద్(స)వారిని తిరస్కరించిన వారిలో అతి ముఖ్యుడు - అబూ జహ్లొ. ఇతడి గురించి ఇక్కడ ఉదాహరించడానికి గల కారణం ముహమ్మద్(స)వారిని అతడు కేవలం తిరస్కరించడమే కాదు, తీవ్రంగా దూషించేవాడు మరియు భౌతికంగా ఆయనకు హాని తలపెట్టేవాడు. **అంతటి దుర్మార్గాన్ని ప్రదర్శించిన ఆ వ్యక్తి ముహమ్మద్(స)వారి సందేశం పట్ల ఎలా స్పందించాడో తెలుసుకోవడం ఇక్కడ చాలా ముఖ్యం.**

ముఘీరహ్ బిన్ షో'బహ్(రజి) చెప్పారు, ''నేను ముహమ్మద్(స)వారి గురించి తెలుసుకున్న మొదటి రోజు అబూ జహ్లొతో మక్కా లోయలలోని ఒక లోయలో ఉన్నాను. మేము అక్కడ ఉండగా, **అల్లాహ్ యొక్క సందేశహరులు(స)** మమ్మల్ని కలిసారు మరియు అబూ జహ్లొతో అన్నారు. **"ఓ అబుల్ హకమ్! అల్లాహ్ వైపు రండి."** (అబూ జహ్లొ యొక్క అసలు పేరు అబుల్ హకమ్)

అబూ జహ్ల్ అన్నాడు, "ఓ ముహమ్మద్! నీవు మా దైవాలను శపిస్తున్నావా? అదేనా నీవు కోరేది, నిస్సందేహంగా నీవు (నీ సందేశాన్ని) అందించావని నేను సాక్ష్యమివ్వడానికి. అల్లాహ్ సాక్షి! **నీవు చెప్పేది సత్యమని నాకు తెలిసినప్పటికీ, నేను నిన్ను అనుసరించను!**"

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) అక్కడ నుండి వెళ్ళిపోయారు. మరియు అబూ జహ్ల్ నన్ను సమీపించి చెప్పాడు, **"అల్లాహ్ సాక్షి! నిస్సందేహంగా నాకు తెలుసు అతను నిజం చెబుతున్నాడని,** కాని (ప్రవక్త(స)వారి ఉపతెగ) బనూ ఖుసయ్యీ చెప్పింది : హిజాబహ్ (కాబాను వస్త్రంతో కప్పడం) మా (గౌరవం మరియు బాధ్యత) అని.

మరియు మేము చెప్పాము : 'ఔను'

వారు అన్నారు : అన్-నద్వహ్ మాతోనే ఉంది.

మరియు మేము చెప్పాము : 'ఔను'

వారు అన్నారు : అల్-లివా (యుద్ధ పతాకం) మాతోనే ఉంది.

మరియు మేము చెప్పాము : 'ఔను'

వారు అన్నారు : అస్-సిఖాయహ్ (యాత్రికులకు పానీయం తాగించడం) మాతోనే ఉంది.

మరియు మేము చెప్పాము : 'ఔను'.

తరువాత వారు (హజ్జ్ యాత్రికులకు) తినిపించారు. మరియు (మేము) తినిపించాము. 'మా మధ్యలో ప్రవక్త ఉన్నాడు' అని వారు అనేవరకూ. **లేదు అల్లాహ్ సాక్షి! నేను ఆ విధంగా చేయను.**" (బైహఖీ 2/207)

**జాహిల్ అంటే సత్యాన్ని స్పష్టంగా తెలుసుకుని కూడా తిరస్కరించే వాడు. అబూ జహ్ల్ అంటే జాహిల్ కి తండ్రి అని అర్థం. తెలిసి తిరస్కరించే వానికి బాబులాంటి వాడు అని. ఆ విధంగా అజ్ఞాన కాలంలో అబుల్ హకమ్‌గా సుపరిచితుడైన వ్యక్తి, సత్యసందేశాన్ని తిరస్కరించి అబూ జహ్ల్‌గా పిలువబడ్డాడు.**

ముహమ్మద్(స)వారిని అల్లాహ్ యొక్క సందేశహరుడని ఒప్పుకోవడంలో అతనికి ఎటువంటి సందేహం లేదు. కాని తన తెగ పట్ల అతనికి ఉన్న గౌరవం మరియు ముహమ్మద్(స)వారి తెగ పట్ల అసూయ అతనిని సత్యాన్ని బహిరంగంగా తిరస్కరించేలా చేసింది.

ముహమ్మద్(స)వారు అల్లాహ్ యొక్క ప్రవక్త అవుతారని మక్కా వాసులకు ముందుగానే తెలుసు. **ముహమ్మద్(స)వారి జననానికి సంబంధించి ఆసక్తికరమైన అద్భుత విషయాలెన్నో ఉన్నాయి.** ఈ శీర్షిక ప్రారంభంలో ముహమ్మద్(స)వారి జననం గురించి చెప్పినప్పుడు వాటిలోని కొన్ని విషయాలు వివరించడం జరిగింది.

ఇక్కడ సందర్భానికి సరిపోయే మరికొన్ని విషయాలు తెలియజేస్తున్నాము. అవి ఇస్లామీయ చరిత్రకారులు గ్రంథస్థం చేశారు. వాటిని ఇబ్నె కసీర్‌గారు తన పుస్తకంలో వివరించారు.

## ముహమ్మద్(స)వారి జననానికి ముందు మరియు తరువాత జరిగిన కొన్ని ముఖ్య సంఘటనలు

ఇబ్నె కసీర్ గారి పుస్తకంలో ఒక ఉల్లేఖనం ఉంది. దాని యొక్క సనద్ పెద్దది. చివరి ఉల్లేఖకులు ఇబ్నె అబ్బాస్(రజి)వారు.

"వహ్బ్‌గారి కుమార్తెయైన ఆమినా గారు చెప్పారు, **"నేను తనను (ముహమ్మద్(స)వారిని) గర్భం నందు కలిగి ఉన్నాను మరియు అతనిని ప్రసవించేంత వరకూ నాకు ఏ కష్టాన్ని కలిగించ లేదు** (ఈ విషయాన్ని పూర్తి వివరాలతో ఇదివరకే చెప్పడం జరిగింది.) **తాను నా (గర్భం) నుండి విడివడినప్పుడు తనతో పాటు కాంతి వెలువడింది, అది తూర్పు మరియు పడమర మధ్య నున్న అంతటిని ప్రకాశింప జేసింది. తరువాత తను నేలమీదికి వచ్చాడు, తన చేతులపై ఆనుకుని, మరియు గుప్పిటిలో మట్టిని తీసుకున్నాడు, దానిని గట్టిగా పట్టుకుని తన తలను ఆకాశంవైపు ఎత్తాడు."**

ఇదే విషయంపై ఇతర ఉల్లేఖనాలలోని పదాలు మరోలా ఉన్నాయి: "అతడు నేల పైన తన మోకాళ్లపై ఆనుకుని ఉన్నాడు. మరియు అక్కడ ఆయన నుండి కాంతి వెలువడింది, దానితో ప్రకాశించబడినవి: సిరియా కోటలు మరియు అక్కడి వాణిజ్య ప్రాంతాలు, బస్రాలోని ఒంటె మెడలు స్పష్టంగా కన్పించేటంతగా."

హాఫిజ్ బైహఖీగారు పెద్ద సనద్‌తో కూడిన ఉస్మాన్ బిన్ అబూ అల్-ఆస్ గారి ఉల్లేఖనాన్ని అందించారు :

"నా తల్లి చెప్పారు వహ్బ్‌గారి కుమార్తె ఆమినా 'అల్లాహ్ యొక్క సందేశహరుడిని' ప్రసవించడాన్ని జననం జరిగిన రాత్రి ప్రత్యక్షంగా చూసాను." ఆమె చెప్పారు, **నేను ఆ ఇంటిలో చూడగలిగినది అంతా కాంతే! నక్షత్రాలు ఆయనకు చాలా సమీపంగా అంటే అవి నాపై పడిపోతాయేమోనంతగా చూశాను!**"

(అవి మిక్కిలి కాంతివంతంగా ప్రకాశించిన నక్షత్రాలు కావచ్చు లేదా అలా కనిపించే మరేమైనా కావచ్చు. ఆ విషయం అల్లాహ్‌కే తెలుసు.)

న్యాయాధికారి ఇల్యాద్‌గారు గుర్తు చేసుకున్నారు, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) వారి తల్లిగారైన అష్షఫా వారి నుండి. ఆమె ముహమ్మద్(స)వారి ప్రసవ సమయంలో సహాయకారిగా ఉన్నారు. మరియు ఆమె చెప్పారు **ఆయన ఆమె చేతుల్లోకి చేరినప్పుడు ఆయన మొదట ఒక శబ్దం చేశారని. ఆమె ఓ కంఠస్వరాన్ని విన్నారు** (ఇలా) **చెబుతుండగా 'అల్లాహ్ కారుణ్యం మీపై అనుగ్రహించబడుగాక!'.** మరియు (ఆమె చెప్పారు) ఒక కాంతి ఆయన నుండి ప్రకాశించింది, దానితో బైజాన్‌టియమ్ వారి కోటలు చూడవచ్చు."

అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనాన్ని ఇబ్నె అబ్బాస్(రజి)వారి ద్వారా మరియు పెద్ద సనద్‌తో బైహఖీ గారు తెలియజేశారు :

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) ముందుగా ఖత్‌నా

చేయబడినట్లుగా మరియు బొడ్డుతాడు తెగిపోయి జన్మించారు. ఆయన తాతగారు అబ్దుల్ ముత్తలిబ్ గారు అది చూసి ఆశ్చర్యచకితులయ్యారు మరియు ఆయనపై ఉన్న అల్లాహ్ అనుగ్రహాన్ని తెలుసుకున్నారు. 'ఈ నా కుమారుడు తప్పక ప్రముఖుడు అవుతాడు. కాబట్టి అలా ఉన్నాడు.''

కొందరు విద్వాంసులు ఈ ఉల్లేఖనాన్ని **ముతవాతిర్**గా ప్రకటించారు. సాధారణ మాటలలో చెప్పాలంటే దీనికి సాక్ష్యులు అసంఖ్యాకం. లేదా అందరికీ బాగా తెలిసిన విషయం.

హాఫిజ్ ఇబ్నె 'అసాకిర్ గారు చెప్పారు (సుఫ్యాన్ బిన్ ముహమ్మద్ అల్-మసీహ్ నుండి, హుషైమ్ నుండి, యూనుస్ బిన్ 'ఉబైద్ నుండి అల్-హసన్ నుండి, అనస్(రజి)వారి నుండి)

> రసూలుల్లాహ్(స)వారు చెప్పారు, **"ఒక విధంగా అల్లాహ్ నన్ను గౌరవ పరిచారు ముందుగానే ఖతనా గావించబడి జన్మింప చేయడం ద్వారా, (తరువాత) ఎవరూ నా రహస్యాంగాలను చూడకుండా."**

ఈయనే మరో సుదీర్ఘ సనద్ ద్వారా మరో ఉల్లేఖనాన్ని తెలిపారు. అది ఇబ్నె ఉమర్(రజి)వారి ద్వారా అందింది. **"రసూలుల్లాహ్(స)వారు ఖతనా గావించబడి మరియు బొడ్డుతాడు విడివడి జన్మించారు."**

## పుట్టిన బిడ్డపై మట్టిపాత్రను బోర్లించడం

అబూ అల్-హకమ్ అల్-తనూఖీ ఉల్లేఖనాన్ని బైహఖీ(ర) వారు అందించారు:

ఖురైష్‌కు బిడ్డ పుట్టినప్పుడు వారు ఆ బిడ్డను కొందరు ఖురైష్ స్త్రీలకు అప్పగించేవారు తరువాయి రోజు ఉదయం వరకూ. వారు ఆ బిడ్డపై మట్టి పాత్రను బోర్లించేవారు. (ఆ మట్టి పాత్ర ఎలా ఉంటుందో వర్ణన లేదు) రసూలుల్లాహ్(స)వారు జన్మించినప్పుడు, అబ్దుల్-ముత్తలిబ్ గారు ఆ బిడ్డను కొందరు స్త్రీలకు అప్పగించారు మరియు వారు ఆ బిడ్డపై తలక్రిందులుగా మట్టిపాత్రను ఉంచారు. వారు ఉదయం బిడ్డ దగ్గరికి వచ్చినప్పుడు వారు కనుగొన్నారు, ఆ పాత్ర రెండు ముక్కలుగా చీలిపోయి ఆ బిడ్డకు దూరంగా పడిపోయి ఉంది. అక్కడ బిడ్డ కళ్ళు పూర్తిగా తెరచి ఆకాశం వైపు రెప్ప వాల్చకుండా చూస్తుండటాన్ని వారు గమనించారు. అబ్దుల్ ముత్తలిబ్‌గారు వచ్చినప్పుడు వారు ఆయనకు చెప్పారు, **'అప్పుడే పుట్టిన బిడ్డ ఇతనిలా ఉండటం మేమెన్నడూ చూడలేదు! పాత్ర రెండుగా చీలి అతని నుండి దూరంగా పడిపోవటాన్ని మరియు కళ్ళు తెరచి రెప్పలార్పకుండా ఆకాశం వంక చూడటాన్ని గమనించాము.'** ఆయన అన్నారు, "ఆ బిడ్డ పట్ల శ్రద్ధ తీసుకోండి, నేను అనుకుంటున్నాను అతడు ప్రముఖుడవుతాడు లేక అతడు మంచిని సాధిస్తాడు."

## ఊయలలోనుండి చంద్రునితో సైగలు

బైహఖీగారు అందజేసిన మరో ఉల్లేఖనం - అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్(రజి)వారి ఉల్లేఖనం.

"నేను అన్నాను, **'ఓ రసూలల్లాహ్(స)! మీ ప్రవక్త పదవి యొక్క ఒక సూచన నన్ను మీ ధర్మంలో చేరేలా పురికొల్పింది.** మీరు ఊయలలో చంద్రునితో గుసగుస లాడటం మరియు మీ చేతివేలితో దానికి సైగ చేయడం నేను చూసాను. మరియు అది కదిలేది మీరు సూచించే దిశగా.' ఆయన(స) సమాధాన మిచ్చారు, 'నేను దానితో మాట్లాడేవాడిని మరియు అది నాతో. మరియు అది నన్ను ఏడుపు నుండి మరలించేది. మరియు అది అల్లాహ్ అర్ష్ క్రింద సజ్దా చేసినప్పుడు దాని స్పందనలను నేను వినేవాడిని'.

అహమద్ బిన్ ఇబ్రాహీమ్ హుబలీ ఈ ఒక్క ఉల్లేఖనాన్నే అందజేశారు మరియు ఆయన గురించి తెలియదని బైహఖీగారు చెప్పారు.

## ముఖ్య విషయాలను, అద్భుత సంఘటనలను వ్రాసుకుని భద్రపరచ కోకుండా మదిలోనే ఉంచుకునే అరబ్బులు, పై విషయాలను ప్రత్యేకంగా ఎలా మరచిపోగలరు?

ఒకవేళ మరచిపోయినా, ముహమ్మద్(స)వారు తాను ప్రవక్తనని ప్రకటించు కున్నప్పుడు, ఆ విషయం నిజమేనని జ్ఞాపకం చేసుకుని ధృవీకరించ వలసి ఉంది.

## ఎందుకంటే ముహమ్మద్(స)వారు జన్మించిన రోజే ఆయన ప్రవక్త అని ప్రజల మధ్యలోనే ఒక యూదుడు ధృవీకరించాడు

ఆ విషయం మక్కా, మదీనా, యమన్, పర్షియా దేశాలలో చాలా మందికి తెలుసు. ముహమ్మద్(స)వారు జన్మించిన రోజున, ఆయనను ప్రత్యక్షంగా చూసిన యూదుడు ధృవీకరించాడు.

ముహమ్మద్ బిన్ ఇస్‌హాఖ్ గారు చెప్పారు హిషామ్ బిన్ ఉర్వా తన తండ్రి అథారిటీలో ఉల్లేఖనాలను అందజేశారు. అవి ఆయిషా(రజి)వారి నుండి వచ్చినవి. ఆయిషా(రజి)వారు ఒకసారి చెప్పారు :

"మక్కాలో ఒక యూదుడు నివశిస్తుండేవాడు మరియు అక్కడ వ్యాపారం చేసేవాడు. రసూలుల్లాహ్(స)వారు జన్మించిన రాత్రి, ఆ వ్యక్తి ఖురైష్‌ల సమావేశంలో ఈ పదాలతో వివరించాడు: **'ఓ ఖురైష్! మీ మధ్యలో ఈ రాత్రి జననం ఏదైనా జరిగిందా?'** వారు సమాధాన మిచ్చారు వారికి తెలియదని. తరువాత అతడు అరిచాడు, **"మంచిది, అల్లాహ్ గొప్పవాడు! అది మిమ్మల్ని తప్పుకుంటే, అదేమీ విషయం కాదు. చూడండి, మరియు గుర్తు పెట్టుకోండి నేను చెప్పేదేమిటో. ఈ రాత్రి ఒక ప్రవక్త జన్మించారు చివరి జాతి కొరకు. ఆయన భుజాల మధ్య ఒక గుర్తు ఉంటుంది. వెంట్రుకలు వరుస గీతలుగా, గుఱ్ఱపు జూలులా.** ఆయన రెండు రాత్రులు చనుబాలు త్రాగరు మరియు అది ఎందుకంటే ఒక ఫరిష్తా తన వేలిని ఆయన నోటిలో ఉంచుతాడు మరియు ఆయన చనుబాలు త్రాగడం నుండి నిరోధించబడతాడు."

దీనితో ఆ సమావేశం ముగిసింది అతడు వారికి చెప్పిన దానితో అందరూ ఆశ్చర్యానికి లోనయ్యారు. వారు తమ ఇండ్లకు చేరుకున్నప్పుడు ప్రతీ ఒక్కరూ తమ కుటుంబానికి చెప్పారు. మరియు వారు (ఇలా) స్పందించారు, **'అల్లాహ్ సాక్షి! ఒక బిడ్డ పుట్టాడు అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ గారికి. బాలుడు. 'ముహమ్మద్' అని పేరు పెట్టారు.'**

ప్రజలు తిరిగి సమావేశం అయ్యారు మరియు ఒకరినొకరు ప్రశ్నించు కున్నారు, "**నీవు విన్నావా యూదుడు ఏమి చెప్పాడో?** మరియు నీవు విన్నావా బాలుని జననం గురించి?' వారు తరువాత యూదుడు దగ్గరికి వడివడిగా వెళ్ళి వార్త తెలియజేశారు. అతడు వారిని తనతో రమ్మన్నాడు ఆ బాలుడిని చూడగలిగేటందుకు. వారందరూ బయలుదేరారు మరియు ఆమినా వారి దగ్గరికి అతనిని తీసుకు వెళ్ళారు.

"**మీ కుమారుడిని మా కోసం తీసుకు రండి**" అని అడిగారు.

ఆమె అలాగే చేసారు మరియు వారు ఆ బాలుని వీపుపై వస్త్రం తొలగించారు. అక్కడ వారు గుర్తు చూసారు. (అది చూసి) **యూదుడు కళ్ళు తిరిగి పడిపోయాడు.** అతడు తిరిగి స్పృహలోకి వచ్చాక విషయం ఏమిటని వారు అతనిని అడిగారు. అతడు సమాధానమిచ్చాడు, **'అల్లాహ్ సాక్షి! ప్రవక్త పదవి ఇస్రాయీల్ తెగను వదిలేసింది. మీరు దీనితో సంతోషిస్తారా, ఓ ఖురైష్? ఆయన మీకు గొప్ప అధికారాన్ని కలుగ జేస్తాడు ఆ వార్త తూర్పు నుండి పడమరకు వ్యాపిస్తుంది.' "**

(యూదులకు సంబంధించి చెప్పవలసిన విషయాలు ఇంకనూ ఉన్నాయి. కాని వాటిని ముహమ్మద్(స)వారు మదీనా చేరినప్పటి సంఘటనల సందర్భంలో వివరిస్తాము, ఇన్షా అల్లాహ్!)

**మక్కావాసులకు, గ్రంథప్రజలకే కాదు, యమన్ దేశ రాజుకి, పర్షియా దేశ రాజుకి కూడా ఈ విషయాలు తెలిసాయి. వాటిని క్లుప్తంగా ఇక్కడ చెప్పుకుందాం!**

(హాఫిజ్ అబూబక్ర్ ముహమ్మద్ బిన్ జాఫర్ బిన్ సహ్ల్ అల్-ఖరా'ఇతీ తన పుస్తకంలో ప్రస్తావించారు. అలీ బిన్ హర్బ్ తనకు తెలియజేశారు. అబూ అయ్యూబ్ య'అలా బిన్ ఇమ్రాన్ నుండి జరీర్ బిన్ అబ్దుల్లాహ్ అల్-బజాలీ నుండి, మఖ్జూమ్ బిన్ హానీ' అల్-మఖ్జూమీ నుండి **150 సంవత్సరాల వయస్సుకు చేరుకున్న అతని తండ్రిగారు ఇలా చెప్పారు:)**

"రసూలుల్లాహ్(స)వారు జన్మించిన రాత్రి కిస్రా (పర్షియా రాజు) యొక్క గుండ్రని కోట కంపించింది మరియు దానిపై నున్న 14 బాల్కనీలు పడిపోయాయి. మరియు 'పర్షియా అగ్ని' ఆరిపోయింది. (పర్షియా ప్రజలు అగ్నిని ఆరాధించేవారు. అగ్ని ఆరిపోకుండా ఎల్లప్పుడూ దానిని జ్వలింపజేస్తూనే ఉంటారు) అప్పటికి పూర్వం 1000 సంవత్సరాలుగా ఎన్నడూ అలా జరగలేదు మరియు సావ సరస్సు ఎండిపోయింది. అగ్ని పూజారి (కలలో) ఎడారి ఒంటెలు జాతి గుఱ్ఱాలను ముందుకు నడిపిస్తున్నాయి. టైగ్రిస్ నదిని దాటాయి మరియు వారి భూభాగంలోకి వ్యాపించడం చూసాడు. ఇది తీవ్రంగా కిస్రాను కలవర పెట్టింది. తరువాత ఉదయం ఆ పూజారి చెప్పినప్పుడు. అతడు(రాజు) ధైర్యాన్ని పులుముకుని మరియు పట్టించు కోనట్లు నటించాడు. కాని తరువాత దానిని తన గవర్నర్ల నుండి దాచకూడదని నిశ్చయించుకున్నాడు.

కాబట్టి అతడు వారిని పిలిపించాడు, తన కిరీటం పెట్టుకున్నాడు మరియు వారు అతని చుట్టూ సమావేశమైనప్పుడు అతను చెప్పాడు, 'మీకు తెలుసా నేనెందుకు మిమ్మల్ని రప్పించానో?' వారు సమాధాన మిచ్చారు రాజు గారు వారికి ఏదైనా చెప్పాలనుకుంటున్నారని. **సరిగ్గా అదే సమయంలో అగ్ని ఆరిపోయిందని సమాచారం అందింది.** ఆ వార్త రాజును మరింత కృంగదీసింది.

(రాజు) తరువాత వారికి చెప్పాడు అతడు (పూజారి కలలో) చూసిన దానిని మరియు ఏది తనను కలవర పెట్టిందో దానిని.

ఆస్థాన పూజారి వివరించాడు: 'క్రిందటి రాత్రి నేను కలలో చూసాను, దైవం ఈ రాజ్యాన్ని రక్షించుగాక!' తరువాత అతడు తన 'ఒంటెల కలను' జ్ఞాపకం చేసుకున్నాడు మరియు రాజు అతనిని అడిగాడు దానిని ఏ విధంగా అర్థం చేసుకుంటారని. **'అది అరబ్ భూభాగంలో జరిగిన ఏదో ఒక సంఘటనకు సంబంధించినదని. వారే (అంటే అరబ్బులే) దానిని తమ కంటే బాగా అర్థం చేసుకోగలరు'** అతడు సమాధాన మిచ్చాడు.

"అప్పుడు లేఖ వ్రాశారు, 'కిస్రా, రాజాధిరాజు, నుండి అల్-ను'మాన్ బిన్ అల్-మున్‌జిర్‌కు : సలాములు. నేను అడిగిన దానికి సమాధానం చెప్పగల జ్ఞానంగల ఓ వ్యక్తిని పంపండి.' అల్-ను'మాన్ గారు అబ్దుల్ మసీహ్ బిన్ అమ్ర్ బిన్ హయ్యాన్ బిన్ బుఖైలా అల్-ఘస్సానీ గారిని పంపారు. అతడు రాగానే కిస్రా అడిగాడు. 'నేనేమి అడగాలను కుంటున్నానో దాని గురించి నీకు జ్ఞానం ఉన్నదా? 'అబ్దుల్ మసీహ్ సమాధానమిచ్చాడు, 'రాజా! మీరు ఏది కోరుతున్నారో దానిని అడగండి. నాకు దాని గురించి జ్ఞానం ఉంటే (మంచిది). లేకపోతే నేను తెలియజేస్తాను దాని గురించి తెలిసిన వ్యక్తి గురించి."

కాబట్టి కిస్రా తనకు తెలియజేయబడిన విషయాన్ని అతనితో చెప్పాడు మరియు దానికి అబ్దుల్ మసీహ్ ఇలా సమాధానమిచ్చాడు: 'నా బంధువు, పేరు సతీహ్ సిరియా మెట్టభూభాగాలపై నివాసం ఉంటున్నాడు. అతనికి దీని గురించి జ్ఞానం ఉంది.' కిస్రా అతనితో చెప్పాడు ఆ వ్యక్తి దగ్గరికి వెళ్ళమని మరియు తాను ఏమి కోరుకుంటున్నాడో దానిని అడగమని మరియు ఆ వివరాలతో తిరిగి రమ్మని.

అబ్దుల్ మసీహ్ బయలు దేరారు కాని సతీహ్ ఆయన చేరే సమయానికి మరణశయ్యపై ఉన్నాడు. అబ్దుల్ మసీహ్ ఆయనకు సలామ్ చెప్పి అతనితో మాట్లాడాడు, కాని సతీహ్ సమాధానం ఇవ్వలేదు. కాబట్టి అబ్దుల్ మసీహ్ కొన్ని పద్యపంక్తులు పలికారు :

(వాటిని ఇక్కడ ఇవ్వడం లేదు)

సతీహ్ ఆ పద్య పంక్తుల్ని విని తలను పైకెత్తి మరియు చెప్పాడు,

"ఎందుకు, అబ్దుల్ మసీహ్, అలుపెరుగని వాహనంపై ఇక్కడికి వచ్చావు, నా మరణశయ్య దగ్గర చూస్తూ ఉన్నావు. నీవు సస్సానియన్ల రాజుచే పంపబడ్డావు. ఎందుకంటే అతని కోట కంపించింది, అగ్ని ఆరిపోయింది, పూజారి కలలో ఎడారి ఒంటెలు మేలుజాతి గుఱ్ఱాలను నడిపిస్తున్నాయి. అవి టైగ్రిస్ నదిని దాటి వారి భూభాగంలోకి వ్యాపించాయి."

"ఓ అబ్దుల్ మసీహ్! చాలా వివరాలు చెప్పివేయ బడినప్పుడు మరియు సార్వభౌమాధికారం తీసుకు వచ్చేవాడు కన్పించినప్పుడు, సమావ లోయను వరదలు ముంచెత్తినప్పుడు, సావ సరస్సు ఎండి పోయినప్పుడు, పర్షియా అగ్ని ఆరిపోయినప్పుడు, సిరియా సిరియాగానే ఉంది, సతీహ్ కొరకు ఇక లేదు. వారిలో వారి బాల్కనీల సంఖ్యకు (సమానమైన) రాజులు మరియు రాణులు పరిపాలిస్తారు. వారంతా అవుతారు, అవుతారు ..."

అలా చెబుతూ సతీహ్ అక్కడికక్కడే మరణించాడు. కాబట్టి అబ్దుల్ మసీహ్ తన వాహనాన్ని అధిరోహించాడు కొన్ని పద్య పంక్తులు పలుకుతూ.

అబ్దుల్ మసీహ్ కిస్రా దగ్గరకు వచ్చి చెప్పారు సతీహ్ ఏమి చెప్పాడో. కిస్రా అన్నాడు, "అంటే మాలోని 14మంది పాలిస్తారు, చాలా జరగగలవు!" కోటలో బాల్కనీలు 14 ఉన్నాయి. కాబట్టి 14మంది పాలిస్తారు. అంటే చాలా కాలంపాటు తమ అధికారం ఉటుంది కాబట్టి ఎన్నో జరిగే అవకాశం ఉంది అని రాజు ధీమా వ్యక్తం చేశాడు. కాని,

**"వారిలోని 10మంది రాజులు 4 సంవత్సరాల కాలమే పరిపాలించారు, మిగిలిన 4గురు ఉస్మాన్(రజి)వారి కాలం వరకూ పాలించారు."**

అల్-బైహఖీ గారు అబ్దుర్రహ్మాన్ బిన్ ముహమ్మద్ బిన్ ఇద్రీస్ నుండి అలీ బిన్ హర్బుల్ మూసిలీ నుండి ఇదే విధంగా ఉల్లేఖించారు.

ఆ రాజులలోని చివరివాడు - ఎవరి నుండి అయితే అధికారం బలవంతంగా తీసుకోబడుతుందో అతడు - యజ్దజర్ద్ బిన్ షహ్రియార్ బిన్ అబ్రవీజ్ బిన్ హుర్‌ముజ్ బిన్ అనూషిర్‌వాన్. ఆఖరున ప్రస్తావించ బడిన అనూషిర్‌వాన్ కాలంలోనే కోట కంపించింది. అతని పూర్వీకులు 3,164 సంవత్సరాలు రాజ్యాన్ని పరిపాలించారు.

'సతీహ్' అనే వ్యక్తి గురించి ఇబ్నె అసాకిర్ గారు వివరించారు. అతడు 30 తరాలు జీవించాడని. అతడు బహ్రెయిన్‌లో నివశించేవాడు. అబ్ద్ ఖైస్ తెగవారు అతనిని తమ తెగ అని చెబుతారు. అదే విధంగా అజ్ద్ తెగవారు కూడా చెబుతారు.

ఇబ్నె అబ్బాస్(రజి)వారు చెప్పినదానిని బట్టి, మానవజాతిలో ఎవరూ సతీహ్ వంటి వారు లేరు. అతడు మాంసపు ముద్దలా ఉంటాడు. ఎముకలు లేకుండా లేక ధృడమైన కండలేకుండా తల, కళ్ళు మరియు చేతులు తప్ప. అతనిని క్రింది నుండి మెడవరకు వస్త్రాన్ని మడిచినట్లు మడత పెట్టవచ్చు. అతనిలో కదిలేది అతని నాలుక.

ఇతరులు చెబుతారు అతనికి కోపం వచ్చినప్పుడు అతడు వేగంగా లోపలకి గాలి పీల్చుకుని కూర్చుంటాడు.

ఇబ్నె అబ్బాస్(రజి) సమగ్రంగా వివరించి చెప్పిన విషయం :

సతీహ్ మక్కా వెళ్ళినప్పుడు అతనిని ఓ నాయకుల సమూహం కలిసింది. వారిలో ఖుసయ్య్ కుమారులు అబ్ద్ షమ్స్ మరియు అబ్ద్ మనాఫ్ ఉన్నారు. వారు అతనిని చాలా విషయాలపై ప్రశ్నించారు మరియు అతడు వాటికి నిర్మొహమాటంగా స్పందించాడు.

వారు అతనిని అడిగారు చివరి కాలం ఎలా ఉంటుంది అని మరియు అతను చెప్పాడు, 'ఇది నా నుండి తీసుకోండి మరియు నాకు అల్లాహ్ ప్రేరణ కలిగించినట్లుగా. ఇప్పుడు మీ అరబ్బులు మీ దృష్టిలో మరియు విదేశీయుల దృష్టిలో బలహీన కాలంలో ఉన్నారు. మీకు జ్ఞానం లేదు, అర్థం చేసుకోవడం లేదు. మీ తరువాత అర్థం చేసుకో గలిగేవారు ఉదయిస్తారు. వారు అన్ని స్థాయిలలోని జ్ఞానాన్ని అన్వేషిస్తారు. మరియు వారు విగ్రహాలను ధ్వంసం చేస్తారు. విలువలేని వాటిని వెంటాడతారు. అరబ్బేతరులపై యుద్ధం చేస్తారు మరియు యుద్ధప్రాప్తి కోసం వెతుకుతూ వెళతారు. చివరికి ఏమి జరుగుతుందంటే మరియు శాశ్వతంగా సన్మార్గపు ప్రవక్త నిశ్చయంగా మిమ్మల్ని ఈ భూభాగం నుండి తీస్తాడు మరియు సత్యం వైపు నడిపిస్తాడు. ఆయన యఘూత్ మరియు అబద్ధాలను ఖండిస్తాడు, షైతాన్‌ను ఆరాధించకుండా పాపరహితంగా ఉంటాడు మరియు ఒక్క ప్రభువునే ఆరాధిస్తాడు. తరువాత అల్లాహ్ అతనిని తన దగ్గరకు తీసుకుంటాడు, అతనికి ప్రశంస నిచ్చి మరియు ఉత్తమ నివాసాన్ని ఇచ్చి ... తరువాత అస్సిద్దీఖ్ ఆయనను అనుసరిస్తాడు. ఆయన తీర్పు చెప్పేటప్పుడు సరిగ్గా చెబుతాడు మరియు హక్కులను నెలకొల్పడంలో తొందర ఉండదు, కలహమూ ఉండదు.

ఆయనను అల్-హనీఫ్ (రెండవ ఖలీఫా ఉమర్(రజి)) అనుసరిస్తాడు. వివేకవంతుడు మరియు అధికారం గల నాయకుడు. అతడు విశ్వాసానికి శ్రేష్ఠమైన సేనాధిపతి మరియు ఉత్తమ న్యాయ నిర్ణేత."

తరువాత అతడు ఉస్మాన్(రజి)వారి గురించి మరియు ఆయన హత్య గురించి ప్రస్తావించాడు మరియు వారి తరువాత వచ్చే ఉమయ్యద్ మరియు అబ్బాసిద్ పరిపాలనలను మరియు ఆ తరువాత వచ్చే అన్నిరకాల ఆందోళనలు మరియు యుద్ధాల గురించి ప్రస్తావించాడు.

పర్షియా రాజు కలను వివరించినట్లే, అంతకంటే ఎన్నో సంవత్సరాలకు పూర్వం యమన్ రాజు రబీ'అ బిన్ నస్ర్‌కు వచ్చిన కలను కూడా సతీహ్ వివరించారు. స్థలాభావం వలన ఇక్కడ పూర్తి వివరాలు ఇవ్వడం లేదు. క్లుప్తంగా తెలియజేస్తున్నాము.

ఆ రాజు తనకు వచ్చిన కల ఏమిటో చెప్పి, దానితో పాటు దాని అర్థాన్ని కూడా చెప్పమని అడిగాడు. రాబోవు ఎన్నో ఇబ్బందులు గురించి ప్రస్తావించి, సైఫ్ బిన్ జూయజన్‌కి అధికారం లభించేవరకూ వారి పరిపాలనలో సంభవించే మార్పుల గురించి తెలిపాడు. సైఫ్ పరిపాలన

కొనసాగుతుందా లేక ఆగిపోతుందా అని అడిగిన రాజు ప్రశ్నకు, సతీహ్ సమాధాన మిచ్చారు అతనితో పరిపాలన ముగిసి పోతుందని. రాజు అడిగాడు దానిని ఎవరు ముగిస్తారని. సతీహ్ ఇలా చెప్పారు :

ఒక స్వచ్ఛమైన ప్రవక్త. ఆయనకు సర్వశక్తివంతుడు (అల్లాహ్) నుండి వహీ అందుతుంది. ఆయన ఏ తెగలో జన్మిస్తారని అడిగిన ప్రశ్నకు, ఘాలిబ్ బిన్ ఫిహ్ర్ బిన్ మాలిక్ బిన్ అల్ నద్ర్ అని సమాధానమిచ్చారు. మరియు ఆ పరిపాలన తన ప్రజలలోనే ఉంటుంది చివరి కాలం వరకూ (ప్రళయం వరకూ).''

''చివరి వరకూ ఉంటుందా?'' రాజు అడిగాడు. ''ఔను, నిశ్చయంగా'' ఆ రోజు మొదటివారు మరియు చివరివారు సమావేశపరచబడతారు మరియు మంచివారు సంతోషిస్తారు చెడ్డవారు బాధపడుతుండగా. (అంటే తీర్పుదినం నాడు)''

''నీవు చెప్పేది నిజమేనా?''

''ఔను''

ఇతను జ్యోతిష్యుడు అని కొందరు చెబితే, కొందరు ఈయనను ఒక ప్రవక్త అని చెప్పడం జరిగింది. ముహమ్మద్(స)వారు ఈయన గురించి చెబుతూ, ఈయనొక ప్రవక్త అని మరియు ఈయన ప్రజలు ఈయనను దుర్వినియోగం చేసుకున్నారని తెలియజేసే ఉల్లేఖనాన్ని ప్రామాణికత విషయంలో ఇబ్నె కసీర్‌గారు సందేహించారు.

**సతీహ్‌ను విశేష జ్ఞానం కలిగిన వ్యక్తిగా ఇబ్నె కసీర్‌గారు అభిప్రాయ పడ్డారు.** ముహమ్మద్(స)వారు జన్మించిన నెలలోపే అతడు మరణించాడు. ఒకవేళ అతను జ్యోతిష్యుడే అని అనుకున్నా కూడా ముహమ్మద్(స)వారి జననం తరువాత జ్యోతిష్యులకు అందే సమాచారం ఆగిపోయింది. క్రింది సంఘటన ఆ విషయాన్ని తెలియజేస్తుంది.

ఒకరోజు ఉమర్(రజి)వారు కూర్చుని ఉండగా అందమైన ఓ వ్యక్తి నడిచి వెళ్తున్నాడు. ఉమర్(రజి) అన్నారు, ''నేను పొరపడుతున్నానా? లేక అజ్ఞానకాలపు రోజులలోని ధర్మాన్నే ఆ వ్యక్తి ఇంకా పాటిస్తున్నాడా? లేక అజ్ఞానకాలంలో ప్రజలకు జ్యోతిష్యం చెప్పినవాడు కావచ్చు! నా దగ్గరకు తీసుకురండి''.

ఆ మనిషి ఉమర్(రజి)వారి ముందుకు తీసుకురాబడ్డాడు. ఆ వ్యక్తిని ఉమర్(రజి) ప్రశ్నించినప్పుడు అజ్ఞానకాలంలో ఆయన జ్యోతిష్యుడుగా ఉండేవాడినని అంగీకరించాడు. ఉమర్(రజి) అడిగారు అతని జిన్ సహచరుడు అతనికి చెప్పిన వాటిలో బాగా వింతైన విషయాన్ని గురించి చెప్పమని అడిగారు. (జిన్ సహచరుడు భవిష్యత్తు గురించి ముందుగా చెప్పి జ్యోతిష్యుడికి సహాయ పడుతుండేవాడు).

ఆ మనిషి జ్ఞాపకం చేసుకున్నాడు. ఒకరోజు అతని జిన్ సహచరుడు భయపడిపోయిన స్థితిలో వచ్చాడు. అతను భయపడటానికి కారణాన్ని చెబుతూ, ఇక ఆకాశాల నుండి తాను రహస్యంగా సమాచారాన్ని వినలేనని తెలియజేశాడు.

ప్రవక్త(స)వారి జననంతో, ఆయన ఇంకనూ ప్రవక్త పదవి చేపట్టక ముందే ఇది జరిగింది. జిన్నులు ఆకాశాల నుండి రహస్యంగా సమాచారం విని జ్యోతిష్యులకి వినిపించేవారు. కాని, అల్లాహ్ యొక్క అనుమతితో మరియు కరుణతో ముహమ్మద్(స)వారిని సర్వమానవాళికి ప్రవక్తగా పంపడం ద్వారా అవన్నీ ముగిశాయి.

ఉమర్(రజి) ఆ మనిషి సత్యమే చెతున్నాడని అన్నారు.

అబిసీనియాలో నజాషీ చక్రవర్తి కూడా ముహమ్మద్(స)వారు జన్మించి నప్పుడు వారి దేశంలో జరిగిన మార్పులను ప్రత్యక్షంగా గమనించారు.

**కాబట్టి గ్రంథ ప్రజలకు తెలుసు. విగ్రహారాధకులకు తెలుసు, అగ్ని పూజారులకు తెలుసు. వందల సంవత్సరాల నుండి అందరూ ఎదురు చూసే ప్రవక్త ముహమ్మద్(స)వారేనని తెలిసినా, ఆయనను తిరస్కరించ డానికి గల కారణాలలో ముఖ్యమైనది అసూయ.**

## ఓ అద్భుతం

ముహమ్మద్(స)వారు సకల లోకాలకు కారుణ్యమని అల్లాహుతాలా ఖుర్'ఆన్‌లో తెలియజేశారు. అయితే ఇస్లామ్ ప్రారంభానికి ముందే ముహమ్మద్(స)వారు వారి మధ్యలో సంచరిస్తూ ఉండిన ఓ సజీవ అద్భుతం. **అన్ని ఉత్తమ గుణాలు ఒక వ్యక్తిలో ఒకేసారిగా ఉండటం ఆనాటి అరబ్ సమాజంలోనే కాదు, వారికి పరిచయం ఉన్న ఏ సమాజంలోనూ వారు చూడలేదు. అది అద్భుతమే కదా!**

ముహమ్మద్(స)వారిని మనం అనుసరించాలి మరియు అంతేకాకుండా ఇతరులను అల్లాహ్ వైపు పిలవడం మన బాధ్యత కాబట్టి మనలో ముందుగా పెంపొందించు కోవలసినది - **నిజాయితీ**. అబద్ధం ఆడకూడదు. మన శక్తిమేర అనాథలకు మరియు అవసరంలో ఉన్నవారికి సహాయం చేయాలి. మన మాటను తిరస్కరించిన ప్రతీ వ్యక్తి, మనం అందజేసిన సందేశం అసత్యం అని తిరస్కరించాడని భావించ నవసరం లేదు. మన చుట్టు పక్కల ఉండే సామాజిక పరిస్థితులు మరియు ఇతర వ్యక్తిగత విషయాలు కూడా ఆ తిరస్కారానికి కారణం కావచ్చు.

కాబట్టి సందేశాన్ని అందజేయడం వరకే మన బాధ్యత. ఈ విషయానికి సంబంధించి, **'మంచి లక్షణాలను అలవరచుకున్న తరువాతనే ధర్మ ప్రచారం చేయాలంటే, అది అందరికీ సాధ్యం కాదు'** అని కొందరు వ్యాఖ్యానిస్తుంటారు.

సందేశాన్ని అందజేసేవానికి చెడు లక్షణాలు ఉంటే, ఆ సందేశాన్ని అందుకునే వ్యక్తి వాటిని గమనించ గలిగినప్పుడు, ఎలా చెప్పగలరు?

**మనం సంస్కరించ బడలేదంటే మనం సన్మార్గంలో లేనట్లే.**

అటువంటప్పుడు ముందుగా మరియు స్వయంగా మనమే అల్లాహ్ మార్గం వైపు వెళ్ళవలసి ఉందని తెలుసుకోవాలి.

ఇబ్రాహీమ్ నఖా'ఈ గారు చెప్పారు, ''నేను ప్రజలకు సలహా ఇవ్వడానికి 3 ఆయత్‌ల వలన వెనుకాడుతున్నాను -

ఏమీ? మీరు ప్రజలను నీతిపరులుకమ్మని ఆజ్ఞాపిస్తున్నారు, కాని స్వయంగా మీరే దానిని అవలంభించడం మరచి పోతున్నారెందుకు? (ఖుర్'ఆన్ 2:44)

**ఓ విశ్వాసులారా! మీరు చేయని దానిని ఎందుకు పలుకుతున్నారు? మీరు చేయని దానిని పలకటం అల్లాహ్ దృష్టిలో అసహ్యాకరమైన విషయం. (ఖుర్'ఆన్ 61:2-3)**

"... నేను (షు'ఐబ్) మిమ్మల్ని నిషేధించిన దానికి వ్యతిరేకంగా చేయదలచుకోలేదు. నేను మాత్రం మిమ్మల్ని నా శక్తిమేరకు సంస్కరించ దలచుకున్నాను. నా కార్యసిద్ధి కేవలం అల్లాహ్‌పైననే ఆధారపడి ఉంది. నేను ఆయననే నమ్ముకున్నాను మరియు నేను ఆయన వైపునకే పశ్చాత్తాపంతో మరలుతాను." (ఖుర్'ఆన్ 11:88)

**కాబట్టి ధర్మాచరణ గురించి బోధించడమే కాదు, దానిని ఆచరించాలి.** ఆ విధంగా చేయని ఓ బోధకుడి పరిస్థితి ఏమయిందో చూడండి :

ఉసామా బిన్ జైద్(రజి)వారి ఉల్లేఖనంలోని భాగం :

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పగా విన్నాను : "ఒక వ్యక్తి పునరుత్థాన దినమున తీసుకురాబడి నరకాగ్నిలో విసిరివేయబడతాడు. అతని ప్రేవులు వెదజల్లబడతాయి. మరియు అతడు వాటి చుట్టూ తిరుగుతాడు గానుగ చుట్టూ గాడిద తిరిగినట్లు. నరకాగ్ని ప్రజలు అతని చుట్టూ చేరి అడుగుతారు, "ఓ ఫలానా! నీకు ఈ గతి పట్టిందేమిటి? నీవు మాకు మంచిని ఆదేశించి మరియు చెడును నిరోధించే వాడివి కదా". అతడు చెబుతాడు, **"ఔను, నిశ్చయంగా నేను మీకు మంచిని ఆదేశించే వాడిని మరియు నేను దానిని చేసేవాడిని కాదు మరియు నేను చెడును నిరోధించేవాడిని మరియు నేను దానిని చేసేవాడిని."** (సహీహ్ ముస్లిమ్, 7483, పుస్తకం 53, అధ్యా.7, సంపుటి 7)

## నిజాయితీగా ఉండాలని ఆదేశం

**అబ్దుల్లాహ్(రజి) ఉల్లేఖనం : "అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: మీరు నిజాయితీగా ఉండాలని ఆదేశిస్తున్నాను, నిజాయితీ ధర్మపరాయణతకు దారి తీస్తుంది మరియు ధర్మ పరాయణత స్వర్గానికి దారి తీస్తుంది. ఒక మనిషి నిజాన్ని చెప్పడం కొనసాగించవచ్చు మరియు నిజం పలకాలనే కృషి చేస్తుండవచ్చు, అల్లాహ్ దగ్గర అతడు నిజాయితీ పరుడని వ్రాయబడేవరకూ. మరియు అబద్ధాల విషయంలో జాగ్రత్తపడండి, అబద్ధాలు పలకడం దుర్మార్గానికి దారితీస్తుంది మరియు దుర్మార్గం నరకానికి దారి తీస్తుంది. ఒక మనిషి అబద్ధాలు చెప్పడం కొనసాగించవచ్చు మరియు అతని కృషి అబద్ధాలు చెప్పడానికే కావచ్చు అల్లాహ్ దగ్గర అతడు అబద్ధాలకోరు అని వ్రాయబడేవరకూ.**

(సహీహ్ ముస్లిమ్, హదీస్ నెం. 6639, పుస్తకం 45, అధ్యా. 29, సంపుటి 6)

**స్వర్గాన్ని పొందాలనుకునే ముస్లిమ్, నిజాయితీ పరుడు అయివుండాలి.**

నిజాయితీగా బ్రతకడం ఒక ముస్లిమ్‌కి అలవడవలసిన తొలిలక్షణం.

**ఈ లక్షణం అలవడటానికి ఎన్ని సంవత్సరాలు పడుతుంది?**

ఈ సందర్భంగా చంద్రుడు చీలినప్పటి సంగతి ఓసారి ఇక్కడ గుర్తు చేసుకుందాం: (పూర్తి వివరాలకై మాచే ప్రచురించబడి, మా వెబ్‌సైట్ **(www.saanthibaata.net)**లో అందుబాటులో ఉన్న 'ముహమ్మద్(స) వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న దుష్ప్రచారం' పుస్తకంలో చూడవచ్చు.

మనదేశంలోని కోడంగల్లూర్ యొక్క మలబార్ ప్రాంతానికి (ప్రస్తుతం ఇది కేరళలో ఉంది) **మహారాజు చెరుమన్ పెరుమాల్**. రాజుగారు తన మహారాణితో కలిసి మేడపై నిలుచుని ఉండగా, చంద్రుడు రెండుగా చీలిపోవడాన్ని చూశారు. ఈ సంఘటనపై తమ దేశంలోని విద్వాంసుల నుండి వివరణ కోరారు. ఆ సంఘటన అరేబియాలో ఉద్భవించే ప్రవక్త గురించి తెలిపే సంకేతంగా వారి నుండి తెలుసుకున్నారు.

తరువాత కొంత కాలానికి యమన్ నుండి అరబ్ వ్యాపార నౌక ఒకటి అక్కడికి చేరుకుంది.

చారిత్రక విషయాలను బట్టి, 2200 సంవత్సరాల క్రితం నుండి అరబ్బు వర్తకులకు మలబార్ (ఇప్పటి కేరళ ప్రాంతం)తో వ్యాపార సంబంధాలున్నాయి.

మొదట్లో వచ్చిన అరబ్ వ్యాపారులంటే మలబార్ ప్రజలు భయపడేవారు. అరబ్ నౌక తీరం చేరింది అని తెలిస్తే చాలు, అక్కడి పురుషులు, వారి స్త్రీలను దాచేసేవారు, వారి సంపదను పాతిపెట్టేవారు.

కాని చంద్ర ఖండన జరిగిన తరువాతి కాలంలో వచ్చిన అరబ్ వ్యాపారులు మాత్రం చాలా తేడాగా అక్కడివారికి కనిపించారు. ఈ అరబ్ వ్యాపారులు చాలా ధర్మపరాయణులుగా, నిరాడంబరులుగా ఉన్నారు.

**వీరు ప్రజలందరినీ గౌరవించడమే కాకుండా, స్త్రీల ఎదురుగా తమ చూపులను దించుకునేవారు. అన్ని వ్యాపార లావాదేవీలలో వారు చాలా నిజాయితీగానూ, మంచిగానూ మెలిగారు.**
**అంతటి గొప్ప మార్పును అరబ్బులలో చూసాక మలబార్ ప్రజలు ఆశ్చర్యపోయారు.**

ఈ విషయం ఎలాగైతేనేం మహారాజు దర్బార్‌కి చేరింది. మహారాజు పెరుమాల్ గారి సమక్షంలో వారు హాజరుపరచబడ్డారు. ఓ కొత్తప్రవక్త కొత్తధర్మాన్ని తీసుకువచ్చారని ఆ అరబ్బుల ద్వారా తెలుసుకుని మహారాజు ఆశ్చర్యచకితులయ్యారు. వారి యొక్క ఈ కొత్త జీవన విధానం గురించి మరియు ముహమ్మద్(స)వారి గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. **ఆయనే అల్లాహ్ యొక్క నిజమైన సందేశహరులని మీరెలా తెలుసుకున్నారు? మరియు ఆయన ఏమైనా అద్భుతాలు చేశారా?**

అని అడిగినప్పుడు, వారు చంద్రున్ని రెండుగా చీల్చడం గురించి చెప్పడం జరిగింది.

ఈ సత్యం గురించే ఎంతోకాలంగా పెరుమాల్ రాజుగారు అన్వేషిస్తున్నారు.

ఆయన వెంటనే తన ప్రధానమంత్రితో సహా ముహమ్మద్(స)వారిని దర్శించాలని నిర్ణయించుకున్నారు. ఆయన తన రాజ్యాన్ని భాగాలుగా చేసి తన కుమారులు, అల్లుళ్ల మధ్య పంచేశారు.

అరేబియా వ్యాపారులతో కలిసి నౌకలో మక్కాకు పయనమయ్యారు.

కొందరు చెప్పిన దానిని బట్టి **ఈ మహారాజు, అబూబకర్ సిద్దీఖ్(రజి) వారి సమక్షంలో ముహమ్మద్(స)వారి చేతుల మీదుగా ఇస్లామ్ స్వీకరించారు.**

ఆయన తన పేరును **'తాజుద్దీన్'**గా మార్చుకున్నారు.

> సంస్కారహీనంగా వ్యవహరించే కొందరు వ్యక్తులలో అకస్మాత్తుగా వచ్చిన ఓ అద్భుతమైన పరివర్తనను ముస్లిమేతరులు గమనించారు. **వేరే ధర్మానికి చెందిన రాజుగారు ఇస్లామ్ స్వీకరించారు.** అదే సమయంలో ముహమ్మద్(స)వారి సమక్షంలో ఆ అద్భుతాన్ని ప్రత్యక్షంగా చూసినవారు మాత్రం తిరస్కరించారు.

**ధర్మాన్ని అర్థం చేసుకుని తనను తాను సంస్కరించుకోవడం అత్యుత్తమ దావా అవుతుంది.**

**పరివర్తన ద్వారా చేసే దావా ప్రభావితం చేస్తుంది**

ముహమ్మద్(స)వారి వంటి మహోన్నత మానవతావాది, సద్గుణ సంపన్నుడు చెబితేనే వారు తిరస్కరించారు మరియు భూమిపై ఉండి అల్లాహ్ అనుగ్రహంతో చంద్రుడిని రెండుగా చీల్చి చూపించినా కూడా వారు తిరస్కరించారు.

**కాబట్టి మన సందేశాన్ని ఎవరైనా స్వీకరించక పోతే నిరుత్సాహ పడవలసిన అవసరం మనకు ఎంతమాత్రం లేదు.**

కొందరు తాతముత్తాతల ధర్మాన్ని వదలడానికి ఇష్టపడలేదు.

> "మరియు వారు (అవిశ్వాసులు), ఏదైనా అశ్లీలమైన పనిచేసినప్పుడు ఇలా అంటారు : **"మేము మా తండ్రితాతలను ఈ పద్ధతినే అవలంభిస్తూ ఉండగా చూశాము. మరియు అలా చేయమని అల్లాహ్‌యే మమ్మల్ని ఆదేశించాడు."** వారితో అను : "నిశ్చయంగా, అల్లాహ్ అశ్లీలమైన పనులు చేయమని ఎన్నడూ ఆదేశించడు. ఏమీ? మీకు తెలియని విషయాన్ని గురించి అల్లాహ్‌పై నిందలు వేస్తున్నారా?" (ఖుర్'ఆన్ 7:28)

నిజానికి వీరంతా ఇస్మా'ఈల్(అ)వారి సంతానమే! ఇస్మా'ఈల్(అ) వారు మరియు ఆయన తండ్రి ఇబ్రాహీమ్(అ)వారు ఏకైక ఆరాధ్యుడు అల్లాహ్‌నే ఆరాధించమని ప్రజలకు బోధించారు.

ఈ విగ్రహారాధన పక్క భూభాగాల నుండి మక్కా చేరింది. మొదట వీరంతా అల్లాహ్‌నే ఆరాధించేవారు. కాని తరువాత ఆయనతో పాటు కొన్ని విగ్రహాలను కూడా ఆరాధించేవారు.

**ఈ ఆరాధన మక్కా భూభాగానికి ఎలా చేరిందో ఇబ్నె కసీర్ గారు వివరించారు.**

మక్కాలో విగ్రహారాధనను ప్రారంభించినవాడు అమ్ర్ బిన్ లుహయ్య్ (అల్లాహ్ శపించుగాక!). ఇతడు మిక్కిలి ఐశ్వర్యం కలవాడు. అతడు 20 ఒంటెల కళ్ళు పెరిగివేశాడు. అంటే అతని దగ్గర 20వేల ఒంటెలు ఉన్నాయని అర్థం చేసుకోవాలి.

అప్పటి అరబ్బులలో అది ఆచారంగా ఉండేది. 1000 ఒంటెలు గలవాడు ఒక ఒంటె కళ్ళు తీసివేస్తాడు. ఆ విధంగా చేయడం ద్వారా వాటికి దిష్టి తగలకుండా ఉంటుందని వారు నమ్మేవారు.

హజ్జ్ సమయంలో అతడు దాదాపు 10 వేల పశువులను ఖుర్బానీ ఇచ్చేవాడు మరియు సంవత్సరానికి 10 వేలు పౌరోహిత్య బట్టలను ఇచ్చేవాడు. అరబ్బులకు తినిపించేవాడు, ఖర్జూరాలను వెన్న మరియు తేనెతో కలిపి వారి కొరకు ఆహారాన్ని సిద్ధం చేయించేవాడు మరియు బార్లీతో తయారైన మద్యాన్ని తాగడానికి ఇచ్చేవాడు.

అతని దయాగుణం వలన అతని మాటలు మరియు చేతలు అక్కడి వారికి చట్టం అయిపోయాయి. అతని పట్ల గౌరవమర్యాదలు పెరిగాయి.

అమ్ర్ బిన్ లుహయ్య్ ఒకసారి మక్కానుండి సిరియా వ్యాపార నిమిత్తం వెళ్ళాడు. మ'ఆబ్‌లోని బల్ఖా ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ ఆ కాలంలో 'ఇమ్‌లాఖ్ కుమారులైన 'అమాలీఖ్‌లు ఉండేవారు. వారు విగ్రహాలను ఆరాధించడాన్ని అమ్ర్ ప్రత్యక్షంగా చూశాడు. అలా ఎందుకు చేస్తున్నారని వారిని అడిగాడు. విగ్రహాలను వర్షం కోసం అడిగినప్పుడు వర్షం వస్తుందని లేక విజయం కోసం అడిగినప్పుడు విజయం లభించిందని వారు సమాధానం ఇచ్చారు.

అరబ్ భూభాగానికి తీసుకెళ్ళి ఆరాధించడానికి అమ్ర్ వారి నుండి ఒక విగ్రహాన్ని అడిగాడు. వారు హుబల్ అనే పేరుగల విగ్రహాన్ని ఒకటి అతనికి ఇచ్చారు.

దానిని అతడు ఓ అరుగుపై ఏర్పాటు చేసి ప్రజలతో దానిని ఆరాధించమని మరియు దానిని స్తుతించమని ఆదేశించాడు. వీరు వ్యాపారాల కోసం వేరే ప్రాంతానికి వెళ్ళేటప్పుడు ఓ రాయిని కూడా తీసుకు వెళ్ళేవారు ఆరాధించడానికి. క్రింది హదీస్ చూడండి.

సహీహ్ బుఖారీ హదీస్ గ్రంథంలో అబూ రజా' అల్-ఉతారిదీ వారి ఉల్లేఖనం ఉంది.

> "మేము రాళ్ళను పూజించేవాళ్ళము. మరియు మొదటి దానికంటే ఉత్తమంగా ఉండే రాయి మాకు దొరికినప్పుడు, మొదటి దానిని మేము విసిరేసి, తరువాత దానిని స్వీకరించేవాళ్ళము. కాని ఏ రాయి కూడా దొరకకపోతే, కొంత భూమిని (మట్టిని) సేకరించి ఓ గొఱ్ఱెను తీసుకొచ్చి దాని పాలను ఆ మన్నుపై పిండేవారము.

మరియు దాని చుట్టూ ప్రదక్షిణ చేసేవారము. రజబ్ నెల వచ్చినప్పుడు, మేము (సైనిక వ్యవహారాలను ఆపేసి), ఈ నెలను ఇనుమును తొలగించే దానిగా పిలుచుకునేవాళ్ళము. ఈటెల (బళ్ళాలు)కు మరియు బాణాలకు ఉండే ఇనుప భాగాలను తొలగించి రజబ్ నెలలో విసిరేసే వాళ్ళము. **(సహీహ్ బుఖారీ, 4376, పుస్తకం 64, అధ్యా. 71, సంపుటి 5)**

ఈ విధంగా ఇబ్రాహీమ్(అ) మరియు ఇస్మాఈల్(అ)వారి ధర్మంలో బిద్'అత్‌ను కల్పించారు. హజ్జ్ చేయడం, కాబా ప్రదక్షిణలు, ఖుర్బానీ ఇవ్వడం, అల్లాహ్‌ను స్తుతించడం చేసేవారు. కాని అదే సమయంలో బిద్'అత్‌లను ప్రారంభించేవారు.

కినానా మరియు ఖురైష్ తెగలు గట్టిగా పలికేవారు, **"లబ్బైక అల్లాహుమ్మ లబ్బైక'** (నీ సేవలో హాజరయ్యాను ఓ అల్లాహ్! నీ సేవలో హాజరయ్యాను) మరియు 'నీకు భాగస్వాములు (షరీక్) ఎవరూ లేరు ఒక్కరు తప్ప అతడు నీ వాడే. అతడిని నీవు ఆదేశిస్తావు. అతడు నిన్ను ఆదేశించడు.' అని పలికేవారు.ఆ విధంగా వారు షిర్క్‌కు పాల్పడ్డారు. పైన చెప్పిన విధంగా వారు దుర్మార్గానికి పాల్పడేవారు.

అల్-సుహైలీ మరియు ఇతరులు చెప్పారు ఈ ప్రార్థన మొదట చేసింది **అమ్ర్ బిన్ లుహయ్య్.** షైతాన్ అతని ముందు ఒక ముసలివాడుగా కనిపించి దానిని నేర్పించాడు. షైతాన్ చెప్పింది అమ్ర్ విని అలాగే పఠించాడు. ఆ విధంగా చెప్పడంలో అరబ్బులు అతనిని అనుసరించారు.

**మరియు అల్లాహ్‌ను వదిలి నీకు లాభం గానీ మరియు నష్టం గానీ కలిగించలేని దానిని నీవు ప్రార్థించకు. ఒకవేళ నీవు అలా చేస్తే! నిశ్చయంగా నీవు దుర్మార్గులలో చేరినవాడవవుతావు.** (ఖుర్'ఆన్ 12:106)

ఆ రోజులలో ఈ ఆరాధనలు ఎలా జరుగుతుండేవో సహీహ్ బుఖారీ లోని ఉల్లేఖనాలలో (4623, 4624) కొన్ని వివరణలు ఉన్నాయి.

స'ఈద్ బిన్ ముసయ్యబ్ ఉల్లేఖనం: అల్-బహీరహ్ అనేది ఒక ఒంటె దాని పాలు ఎవరూ పిండరు, దాని పాలు విగ్రహాల కొరకు ఉంచేవారు కనుక మరియు అల్-సా'ఇబహ్ అనేది ఒక ఒంటె అది దేనినీ మోయదు ఎందుకంటే అది వారి దేవతల కోసం పక్కనుంచ బడింది.

ఆయిషా(రజి) చెప్పారు : ప్రవక్త(స)వారు చెప్పారు, "నేను చూశాను అమ్ర్ ప్రేవులను ఈడుస్తూ నరకాగ్నిలో వేయడాన్ని. ఎందుకంటే అతడే జంతువులను (దేవతల కొరకు) వదిలేసే ఆచారాన్ని ప్రారంభించిన మొదటి వ్యక్తి. (సహీహ్ బుఖారీ)

అల్లాహ్ బహీరహ్‌ను గానీ, సా'ఇబహ్‌ను గానీ, వసీలహ్‌ను గానీ లేక హామ్‌ను గానీ నియమించ లేదు. కాని సత్య తిరస్కారులు అల్లాహ్‌పై అబద్ధాలు కల్పిస్తున్నారు. మరియు వారిలో చాలా మంది బుద్ధిహీనులే! (ఖుర్'ఆన్ 5:103)

మరియు మేము వారికి ఇచ్చిన జీవనోపాధి నుండి కొంత భాగాన్ని, తాము ఏ మాత్రం ఎరుగని తమ (బూటక దైవాల) కొరకు నిర్ణయించుకుంటారు వారు. అల్లాహ్ సాక్షి! మీరు కల్పిస్తున్న ఈ బూటక (కల్పిత) దైవాలను గురించి మీరు తప్పక ప్రశ్నించ బడతారు. (ఖుర్'ఆన్ 16:56)

అల్లాహ్‌పై అబద్ధాలు కల్పిస్తూ : "ఇది ధర్మ సమ్మతం, ఇది నిషిద్ధం!' అని మీ నోటికొచ్చినట్లు అబద్ధాలు పలకకండి. నిశ్చయంగా, అల్లాహ్‌పై అబద్ధాలు కల్పించేవారు ఎన్నడూ సాఫల్యం పొందరు. (ఖుర్'ఆన్ 16:116)

ఈ విధంగా విగ్రహారాధన పక్క భూభాగాల నుండి మక్కా చేరింది. వీరు అల్లాహ్‌ను ఆరాధించేవారు. మరియు తమ తెగ ప్రతిష్ఠ కోసం ఎంతకైనా తెగించేవారు. వేరే తెగవారి ఓ ఒంటె తమ తెగవారి పొలంలో మేసిన కారణంగా వివాదం మొదలై, అది ఒక యుద్ధంగా మారిపోయి 40 సంవత్సరాలు కొనసాగింది. ఇరువైపులా ఎందరో చనిపోవడానికి ఆ యుద్ధం కారణం అయింది.

ఇటువంటి వారికి సత్య సందేశాన్ని తెలిపి సన్మార్గంలోకి తీసుకు రావడమే కాకుండా వీరినందరినీ సమైక్యంగా ఉంచడం అంటే అది మామూలు విషయం కాదు. అంటే ఓ అద్భుతం జరగాలి. అదే జరిగింది.

అల్లాహుతాలా చిట్టచివరి ప్రవక్తను ఈ జాతి నుండి లేపడం వెనుక ఎంతో వివేకం ఉంది. కాబట్టి మక్కాలో ప్రవక్త(స)వారు అనుసరించిన విధానాన్ని అర్థం చేసుకోగలిగితే ఏ కాలంలోనైనా ఏ ప్రాంతంలోనైనా ఇస్లామ్ గురించి సులభంగా చెప్పగలుగుతాము.

## ప్రారంభంలో ఏమి బోధించారు?

**బిలాల్(రజి)వారు ఇస్లామ్ స్వీకరించే సమయానికి ఎన్ని ఖుర్'ఆన్ ఆయత్‌లు అవతరించి ఉంటాయి? ఆలోచించండి!**

ఖుర్'ఆన్‌లో ఉండే మొత్తం 6236 ఆయత్‌లలో కనీసం 36 ఆయత్‌లు కూడా అప్పటికి అవతరించ లేదు. కాని బిలాల్(రజి)వారు **'అహద్, అహద్'** (అల్లాహ్ ఒక్కడు, అల్లాహ్ ఒక్కడు) అని పలుకుతూ ఎన్నో ఘోర హింసలను భరించారు.

**దీనిని బట్టి కేవలం కొన్ని ఆయత్‌లు మాత్రమే తెలిసిన ఒక సగటు ముస్లిమ్ కూడా తన ధర్మం గురించి ఇతరులకు చెప్పగలడు మరియు తన ధర్మంపై స్థిరంగా ఉండగలడు అని స్పష్టంగా అర్థమౌతుంది.**

ప్రతీ రోజూ నమాజ్ చేసే ఓ సగటు ముస్లిమ్‌కి కనీసం క్రింది

సూరహ్‌లు కంఠస్థమే!

సూరహ్ ఫాతిహ్, ఆయతుల్ కుర్సీ, ఇఖ్లాస్, కౌసర్, ఫలఖ్, నాస్, (మొత్తం : 26 ఆయత్‌లు)

**ఈ 26 ఆయత్‌లను అర్థం చేసుకుని, ఆ విషయాలు తోటి వారికి మృదువుగా, వాదన లేకుండా ముహమ్మద్(స)వారి విధానంలో చెప్పగలిగితే అది మామూలు విషయమేమీ కాదు. వాటిలో గొప్ప అర్థం ఉంది.**

అంతేగాని డబ్బు కోసం ప్రసంగించే వారినెవరినో తీసుకువచ్చి ఇతరులకు వినిపించ వలసిన అవసరం ఎంతమాత్రం లేదు. అది మన తరీఖా కూడా కాదు. శాంతిబాట ప్రారంభంలో సూరహ్ ఫాతిహ్ యొక్క తఫ్సీర్ తెలిపాము. ఈ సూరహ్ సాధారణమైనది కాదు. ఇది చదవకుండా నమాజ్ కాదు. దానిని స్పష్టంగా అర్థం చేసుకోండి.

**షైతాన్ నాలుగు సార్లు ఏడ్చాడు**

1. అల్లాహ్‌చే శపించబడినప్పుడు
2. స్వర్గం నుండి వెలివేయబడినప్పుడు
3. ముహమ్మద్(స)వారు జన్మించినప్పుడు
4. **సూరహ్ ఫాతిహ్ అవతరించినప్పుడు**

## అల్లాహ్ అంటే ఏమిటో స్పష్టమైన అవగాహన ఉండాలి

ప్రారంభంలో ఇస్లామ్ స్వీకరించిన వారిలో అల్లాహ్ గురించి స్పష్టమైన అవగాహన కలిగేలా చేశారు ముహమ్మద్(స)వారు.

### మరి అల్లాహ్ గురించి ఖురైష్‌లకు అవగాహన లేదా?

కాబాను ధ్వంసం చేద్దామని అబ్రహా దండయాత్రకు వచ్చినప్పుడు ముహమ్మద్(స)వారి తాతగారైన అబ్దుల్ ముత్తలిబ్‌గారు, ఆ రాజుతో మాట్లాడి తన వారందరినీ తీసుకుని పర్వత మార్గాన్ని చేరుకుని అక్కడి నుండి వారి వినాశనాన్ని చూశారు. అబ్దుల్ ముత్తలిబ్‌గారి ధైర్యం మరియు అల్లాహ్‌పై ఆయన కున్న భరోసా గురించి ఇదే శీర్షికలో ముందరి వ్యాసాలలో స్పష్టంగా వివరించడం జరిగింది.

కాబా ద్వారానికి ఓ లోహపు రింగు ఉండేది. అబ్దుల్ ముత్తలిబ్ ఆ రింగును పట్టుకుని అబ్రహా మరియు అతని సైన్యంపై విజయాన్ని ఇవ్వమని అల్లాహ్‌ను వేడుకున్నారు.

కాబా ద్వారానికి ఉన్న ఆ రింగుకు వేలాడుతూ అబ్దుల్ ముత్తలిబ్ ఇలా అన్నారు :

**"ప్రస్తుతం ఎవరికైనా తన పశువులను మరియు సంపదను రక్షించుకోవడం కంటే ఏ విషయమూ ఎక్కువ ముఖ్యమైనది కాదు. ఓ నా ప్రభూ! నీ సంపదను నీవే రక్షించుకో. (రేపు)ఉదయించే వేళకి వారి శిలువ మరియు వారి యుక్తులు నీ యుక్తులపై విజయం సాధించలేవు."**

కాబా యొక్క ప్రాముఖ్యత, పవిత్రత మరియు ప్రాణాంతకమైన కష్టాలలో సైతం అల్లాహ్‌ను తప్ప వేరెవరి సహాయాన్ని కోరకపోవడాన్ని అబ్రహా ఉదంతం మరోసారి మనకు గుర్తు చేస్తుంది.

**అబ్రహా సైన్యం నాశనమవడం ద్వారా అల్లాహ్ యొక్క శక్తి సామర్థ్యాలను అరబ్బులు కళ్ళారా చూశారు.** అల్లాహ్ తలిస్తే పెద్ద పెద్ద ఏనుగులను సైతం చిన్న పక్షుల చేత అవి వదిలే సెనగ గింజంత సైజులో ఉండే చిన్న మట్టిరాళ్ళతో నాశనం చేయగలడనే విషయాన్ని అరబ్బులు కళ్ళారా చూశారు.

**కాబా మస్జిద్ యొక్క ఒక్కొక్కరాయిని విడి విడిగా రాలిపోయేలా చేస్తానని ప్రతిజ్ఞ చేసిన అబ్రహాకి మాత్రమే కాకుండా, వాడి సైన్యానికి కూడా వారిలోని ఒక్కొక్క అవయవం వారి శరీరాల నుండి రాలి పోయింది.**

అల్లాహ్ గృహాన్ని అల్లాహ్ కాపాడుకుంటారన్న అబ్దుల్ ముత్తలిబ్ నమ్మకం నిజం అని అక్కడివారు తెలుసుకున్నారు. ఆ నమ్మకమే ఖురైషీయుల స్థాయి గౌరవాలను పెంచింది. ఈ సంఘటన ప్రభావం ప్రజలపై బాగా పడింది. **అప్పుడే కాదు, ఎప్పుడైనా సరే అల్లాహ్‌పై విశ్వాసం సమాజంలో గౌరవ మర్యాదలను పెంచుతుంది.** ఆ సంఘటనా సమయానికి కాబా మస్జిద్‌లో అరబ్బులు దాదాపు 360 విగ్రహాల నుంచారు.

ఈ సంఘటన తరువాత దాదాపు 10 సంవత్సరాల వరకూ అరబ్బులు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించి, విగ్రహాలను పూజించ లేదు అంటే **ముష్రిక్కులు** కూడా కొన్ని సంవత్సరాలపాటు **ముస్లిముల** వలే జీవించారు. అటువంటి సమయంలో అంటే ఆ సంఘటన జరిగిన 50 రోజుల తరువాత ముహమ్మద్(స)వారు జన్మించారు.

ముష్రిక్‌లు కూడా విగ్రహ పూజ వదిలేసిన సమయంలోనే ఆయన జననం జరిగింది. ఆయన జన్మించిన సమయం నుండి 10 సంవత్సరాల వరకూ విగ్రహాలు పూజించబడలేదు. అంటే ఆయన చేత చిన్న తనంలో తల్లిగారుగాని, తాతగారుగాని మరెవరైనాగాని విగ్రహ పూజ చేయించ లేదనే విషయం కూడా స్పష్టంగా అర్థమౌతుంది.

సకల లోకాలకు కారుణ్యంగా పంపబడిన ముహమ్మద్(స)వారిని అటువంటి పనులకు అల్లాహ్ దూరంగా ఉంచారని ఇస్లామ్‌పై అవగాహన కలిగిన ముస్లిములకు బాగా తెలుసు. అయితే **అనుమాన పీడితులకి**, ఊహ తెలియని వయస్సులో కూడా ఆయన విగ్రహారాధన చేసే అవకాశం లేదని పై సంఘటన తెలియజేస్తుందని అనుకుంటున్నాము.

ఈ సంఘటన అరబ్ సమాజంలో ఖురైషీయుల గౌరవాన్ని పెంచింది. వారిపట్ల ప్రేమ మరియు మర్యాద కలుగజేసింది. పవిత్ర కాబా నిర్వాహకులుగా, అల్లాహ్ యొక్క మనుష్యులుగా వారికి అరబ్ సమాజంలో ఓ మంచి గుర్తింపు లభించింది.

అందువల్లనే ఖురైషీయులు ఎక్కడకు వెళ్ళినా గౌరవం మరియు రక్షణ ఉండేది. వారి వ్యాపార బిడారాలపై ఎటువంటి బందిపోటు దాడులు జరిగేవి కావు. చుట్టుపక్కల ప్రాంతాలతో వారు యదేచ్ఛగా వ్యాపారం చేసుకోగలిగేవారు.

అబ్దుల్ ముత్తలిబ్ గారు ఈ సంఘటనలో వ్యవహరించిన తీరు స్పష్టంగా తెలియజేసేది ఏమిటి? ఇది అల్లాహ్‌కు మరియు ఆయన శతృవులకు మధ్య యుద్ధమేనని, తనవారిని తీసుకుని కొండ శిఖరాలకు చేరుకుని, అల్లాహ్ ఆగ్రహం శతృవులపై ఏ విధంగా ఉంటుందో చూడాలని నిర్ణయించుకున్నారు. అల్లాహ్‌పై ఆయనకి ఎంత అచంచలమైన విశ్వాసముందో ఆయన మాటలే తెలియ జేస్తున్నాయి. కాబాను అల్లాహ్‌యే రక్షిస్తారని పూర్తి విశ్వాసంతోనే అబ్రహా పరివారంతో అబ్దుల్ ముత్తలిబ్‌గారు తలపడలేదు.

**కాబట్టి అల్లాహ్ గురించి అరబ్బులకు తెలుసు. అంతేకాదు, వారిని అల్లాహ్ మాత్రమే రక్షించగలరని, వారు పూజించే ఏ విగ్రహాలు కూడా వారిని రక్షించలేవనీ వారికి చాలా స్పష్టంగా తెలుసు. క్రింది మూడు ఆయత్‌లు ఆ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి.**

వారు నావలోకి ఎక్కినప్పుడు తమ భక్తిని కేవలం అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకించుకుని, ఆయననే ప్రార్థిస్తారు. కాని ఆయన వారిని రక్షించి నేలమీదకు తీసుకురాగానే ఆయనకు సాటి కల్పించ సాగుతారు. (ఖుర్ఆన్ 29:65)

మరియు ఒకవేళ సముద్రంలో మీకు ఆపద వస్తే ఆయన (అల్లాహ్) తప్ప, మీరు పిలిచే వారందరూ మిమ్మల్ని త్యజిస్తారు. కాని, ఆయన మమ్మల్ని రక్షించి, ఒడ్డుకు చేర్చినప్పుడు, మీరు ఆయన నుండి ముఖం త్రిప్పుకుంటారు. వాస్తవానికి మానవుడు ఎంత కృతఘ్నుడు. (ఖుర్ఆన్ 17:67)

మరియు వారిని సముద్రపు అల, మేఘంగా క్రమ్ముకున్నప్పుడు, వారు పరిపూర్ణ భక్తితో అల్లాహ్‌నే వేడుకుంటారు. కాని ఆయన వారిని రక్షించి ఒడ్డుకు చేర్చిన తరువాత వారిలో కొందరు (విశ్వాస-అవిశ్వాసాల) మధ్య ఆగిపోతారు. మరియు ఈ మా సూచనలను, కేవలం విశ్వాస ఘాతకులు, కృతఘ్నులైనవారు మాత్రమే తిరస్కరిస్తారు. (ఖుర్ఆన్ 31:32)

క్రింది ఆయత్ చూడండి :

**"... ఒకవేళ నీవు వారితో, 'ఆకాశాలనూ మరియు భూమినీ సృష్టించి, సూర్యచంద్రులను ఉపయుక్తంగా చేసింది ఎవరు?' అని అడిగితే, వారు తప్పక : "అల్లాహ్" అని అంటారు. అయినా వారు ఎందుకు మోసగింప బడు తున్నారు? ..."** (ఖుర్ఆన్ 29:61)

## మరి వారెందుకు విగ్రహారాధన చేస్తున్నారు?

వారికి అల్లాహ్ గురించి తెలుసు కాని పూర్తిగా తెలియలేదు. నేటి మన ముస్లిమ్ సమాజంలో కూడా అదే పరిస్థితి నెలకొని ఉంది. పూర్తి ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలు అందుబాటులోనే ఉన్నప్పటికీ **నేటి ముస్లిమ్ సమాజంలో కూడా అత్యధికులు అల్లాహ్‌ను తెలుసు కోవలసిన విధంగా తెలుసుకోలేక పోయారని చెప్పడంలో అతిశయోక్తి లేదు.** అన్ని జమాత్‌ల పరిస్థితి అదే విధంగా ఉంది. నేడు ఒకరికొకరు మీకు తెలియదంటే మీకు తెలియదని చెప్పుకోవడం జరుగుతుంది.

అల్లాహ్ పట్ల కనీస అవగాహన లేని వారు కూడా వేదికలపై తౌహీద్ గురించి ఉపన్యాసాలు ఇస్తున్నారు.

ఇస్లామ్ ధర్మంపై స్థిరంగా ఉండటానికి మరియు మంచి పరివర్తనకు అవసరమైన ముఖ్య పునాది అల్లాహ్ పట్ల అవగాహనే!

**(మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...)**

**గ్రంథంలేని విగ్రహారాధకులకు, గ్రంథం కలిగి ఉండి షిర్క్ చేసేవారికి, అగ్ని పూజారులకు అందరికీ ముహమ్మద్(స)వారు ప్రవక్త అని, ఆయన బహిరంగ ప్రచారాన్ని ప్రారంభించక ముందే తెలుసునని ఈ వ్యాసంలో పొందుపరచిన విషయాలు స్పష్టం చేస్తున్నాయి.**

**చాలామంది తెలిసి ఉండి కూడా తిరస్కరించారు. అయితే సత్యాన్ని స్వీకరించిన వారు కూడా ఉన్నారు. ఏ వ్యక్తినైనా సన్మార్గంలోకి తీసుకు వచ్చేది అల్లాహ్ మాత్రమే! మన బాధ్యత కేవలం సందేశాన్ని అందించడం మాత్రమే!**

**నిజాయితీగా ఉండాలి. పరివర్తన అనంతరం కేరళలో అరబ్బు వ్యాపారులు ఎలా ప్రవర్తించారో అలా ప్రవర్తన కలిగి, ఖుర్ఆన్ నుండి ఎంత అర్థం కాబడిందో ఆ జ్ఞానంతోనే ధర్మ ప్రచారం చేయాలి. జ్ఞానాన్ని ఇచ్చేది కేవలం అల్లాహ్ మాత్రమే!**

**మనలోని ప్రతీ ఒక్కరం మనపై విధిగా ఉన్న 'దావా'ను సులభంగా చేద్దాం. 'దావా' కొరకు ఏ మధ్యవర్తులూ (బిద్'అతీలు) మనకు అవసరం లేదు. 'దావా' వృత్తికాదు, వ్యాపారం అంతకంటే కాదు. అది మన అదృష్టం. సాఫల్యం పొందే విషయంలో మనకు లభించిన సహాయం. దావా చేస్తూ ఇహలోకంలో ఎవరి నుండి ప్రతిఫలం తీసుకోకూడదు.**

**ఇంతవరకూ తెలియకపోవడం వలన దావా పేరుతో దాయిలాకు, సమావేశాలకు వృథాగా ఖర్చు చేసినా, ఇక ముందైనా ఆ సొమ్మును ఎవరికి వారుగా అవసరంలో ఉన్నవారికి, అనాథలకు, వితంతువులకు స్వయంగా అందజేసి, అల్లాహ్ అనుగ్రహించిన సొమ్మును సద్వినియోగం చేసుకుని, పరలోకంలో మంచి ప్రతిఫలాన్ని పొందాలని అల్లాహ్‌ను వేడుకుంటున్నాము. (ఆమీన్!)**

**భార్యాభర్తల నుద్దేశించి ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలియజేస్తున్నారు :**

**వారు మీకు వస్త్రాలు, మీరు వారికి వస్త్రాలు** (2:187) | They are clothing for you and you are clothing for them | هُنَّ لِبَاسٌ لَّكُمْ وَأَنتُمْ لِبَاسٌ لَّهُنَّ

**7**

అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : (సహీహ్ ముస్లిమ్, 3649, పుస్తకం 17, అధ్యా.19, సంపుటి 4)

**"ఈ ప్రపంచం తాత్కాలిక సుఖం. ప్రపంచంలోని తాత్కాలిక సుఖాలన్నింటికంటే ఉత్తమమైనది ధర్మపరాయణురాలైన స్త్రీ (భార్య)"**

*వస్త్రాలు నగ్నత్వం నుండి కాపాడుతూ మనకు గౌరవాన్నిస్తాయి. అదే విధంగా భార్య గౌరవాన్ని భర్త మరియు భర్త గౌరవాన్ని భార్య కాపాడాలి. కుటుంబంలో భార్యాభర్తలకు వేర్వేరు బాధ్యతలున్నాయి. వారి మధ్య హెచ్చుతగ్గుల గురించి ఆలోచించ వలసిన అవసరం లేదు. ఇద్దరిలో ఎవరికీ ఎక్కువ తఖ్వా ఉంటుందో, ఎవరు తమ బాధ్యతను అల్లాహ్ ఆదేశించిన దాని ప్రకారం నిర్వర్తిస్తారో వారికే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ విలువ ఉంటుంది. కాబట్టి భార్యాభర్తలు ధర్మ పరాయణతలో, బాధ్యతలను నిర్వహించడంలో, ఒకరి గౌరవాన్ని మరొకరు కాపాడటంలో పోటీపడాలి. భార్యాభర్తల సంబంధంలో > (ఎక్కువ), < (తక్కువ), = (సమానం) వంటి గుర్తులు ఉండవలసిన అవసరం లేదు. కొన్ని విషయాలలో భర్త అధికుడైతే, మరికొన్ని విషయాలలో భార్య ఆధిక్యత వహిస్తుంది. సంతోషంగా బ్రతకవలసిన ఎన్నో కుటుంబాలు చీలిపోయి విడాకుల కోసం పరితపించడమో, మానసిక క్షోభకు గురికావడమో జరుగుతుంది. సలాత్ (నమాజ్) ఎలా చేయాలీ, సౌమ్ (ఉపవాసం) ఎలా ఉండాలీ, ఖుర్'ఆన్‌ను అరబీలో ఎలా చదవాలీ, ఈ విషయాలు తెలుసుకుంటే చాలు అని నేటి ముస్లిమ్ సమాజంలోని స్త్రీలు అనుకుంటున్నారు. వివాహం జరిగినప్పుడో లేక జరిగిన తరువాతైనా సరే ఒక ఇల్లాలిగా తాను నిర్వహించవలసిన బాధ్యతలేమిటో, వాటి గురించి అల్లాహ్ ఏమి ఆదేశించారో తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు. తల్లి తన కుమార్తెకు బంగారు నగలు, బట్టలు, ఇతర సామాన్లు ఇవ్వడం గురించి ప్రాధాన్యత ఇస్తుంది గాని, తన కూతురు ఇహలోకంలోనూ పరలోకంలోనూ సంతోషంగా బ్రతకడం కోసం అవసరమైన శిక్షణ ఇవ్వడం లేదు. ఓ మాతృమూర్తి తన కుమార్తె వివాహ సమయాన ఎటువంటి విషయాలు చెప్పి, భర్తతో పంపారో ఈ శీర్షిక తొలి వ్యాసంలో చదవండి. మహిళ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తే ఓ గొప్ప సమాజం మన ముందుంటుంది.*

*"మరియు ఆయన సూచనలలో: ఆయన మీ కొరకు మీ జాతి నుండియే - మీరు వారి వద్ద సౌఖ్యం పొందటానికి -* **మీ సహవాసులను (అజ్వాజ్)**లను *పుట్టించి, మీ మధ్య ప్రేమను మరియు కారుణ్యాన్ని కలిగించడం ..."* ***(ఖుర్'ఆన్ 30:21)***

ఏయే వయస్సులలో స్త్రీ, పురుషులు వివాహం చేసుకోవచ్చో, ఏయే వ్యక్తులతో వివాహం ధర్మ సమ్మతమో మరియు ఏ ఇద్దరి మధ్య వివాహం నిషిద్ధమో, మరియు **మానసిక సౌందర్యం యొక్క విలువ ఏమిటో** గత సంచికలలో చెప్పుకున్నాము. అంతేకాకుండా ఇతర ధర్మాల వారికి ముస్లిముల వివాహాలపై ఉన్న అపోహలను దూరం చేస్తూ, ఇస్లామీయ వివాహ వ్యవస్థలో ఉన్న వివేకాన్ని స్పష్టంగా ఉదాహరణ పూర్వకంగా వివరించడం జరిగింది.

ఈ విషయాలు ముస్లిమేతరులకే కాకుండా, ముస్లిములలో కూడా చాలా మందికి తెలియవు. కాబట్టి సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అంశాలను చర్చించడం జరిగింది. ఇవి ప్రతీ ముస్లిమ్ తెలుసు కోవలసిన విషయాలు. కాబట్టి కొత్తగా చేరిన పాఠకులు, గత సంచికల లోని వివరాలు చదవగలరని ఆశిస్తున్నాము.

గత రెండు సంచికలో వివాహం జరగడం మరియు వివాహం తరువాత ఇచ్చే విందు గురించి చెప్పుకున్నాము. ఆ క్రమంలో 'వధువు' తరఫువారు విందు ఇస్తే భోజనం చేయవచ్చా? లేక చేయకూడదా? మొదలైన విషయాలపై చర్చించడం జరిగింది. 'వధువు' తరఫువారు విందు ఏర్పాటు చేయవలసిన అవసరమైతే లేదు. కాని ఒకవేళ ఏర్పాటు చేయాలని తలిస్తే అది వారి ఇష్టం. హదీస్‌ల వెలుగులో ఈ విషయాలన్నీ చర్చించడం జరిగింది. వరుడు ఇచ్చే విందు (వలీమా) మరియు భార్యాభర్తల శారీరక కలయిక గురించి మరియు వారికి పరస్పరం ఒకరిపై మరొకరికి ఉన్న బాధ్యతలు మరియు హక్కుల గురించి చెప్పడం జరిగింది.

ఈ సంచికలో భార్య తన మెట్టినింటిలో ఉండే పరిస్థితులను బట్టి ఏ విధంగా వ్యవహరించాలో చెప్పవలసి ఉంది. అయితే కొందరు పాఠకులు పదేపదే అడుగుతున్న ఓ వ్యవహారం గురించి కొన్ని వివరాలు ముందుగా ఇక్కడ తెలియ జేస్తున్నాము.

## అత్తాకోడళ్ళ వ్యవహారం

ఇంతవరకూ ఈ శీర్షికలో ఇచ్చిన 6 వ్యాసాలను శ్రద్ధగా చదివితే ఈ వ్యవహారం విషయంలో సందేహాలు ఉత్పన్నం కావు. నేటి ముస్లిమ్ సమాజంలో ఒక స్త్రీ మరియు ఒక పురుషుడు వివాహబంధం ఏర్పరచుకోవాలని నిర్ణయం తీసుకోవడం ఒక్కటే ఇస్లామ్ ప్రకారంగా జరుగుతుంది. అక్కడి నుండి మిగతా వ్యవహారాలన్నీ తాము ఉండే ప్రాంతం లోని ఇతర ధర్మాల ఆచారాల ప్రకారమే చేస్తున్నారు.

**అంటే వివాహం అయినప్పటి నుండి వారి జీవితకాలం ముగిసే వరకూ మధ్యలో జరిగే ఎన్నో వ్యవహారాలు ఇతర ధర్మాల ఆచారాల ప్రకారమే జరుగుతున్నాయి.** వాటిలో చాలా విషయాలు ఇస్లామ్‌కి వ్యతిరేకమైనవే. **ఒక సగటు ముస్లిమ్‌ను దృష్టిలో పెట్టుకుని పై విధంగా చెప్పడం జరిగింది.** ఇస్లామ్‌ను అనుసరిస్తూ జీవించేవారున్నారు. అయితే వారు స్వల్ప సంఖ్యలో ఉన్నారు.

సమాజం బాగుండాలంటే కుటుంబ వ్యవస్థ బాగుండాలి. కుటుంబ వ్యవస్థ ఆరోగ్యవంతంగా ప్రశాంతంగా ఉండటానికి ఇస్లామ్ చెప్పిన ముఖ్య విషయాలకు నేటి 'ఖుత్బా' (ప్రసంగాల)లో చోటు దొరకడం లేదు. ప్రజలు కూడా తెలుసుకునే ప్రయత్నమూ చేయడం లేదు.

మంచి బట్టల కోసం, మంచి వస్తువుల కోసం, మంచి చదువుల కోసం ఎంత దూరమైనా వెళతారు. కుటుంబ వ్యవస్థ సవ్యంగా ఉండటానికి ఇస్లామ్ ఏమి చెప్పిందో తెలుసుకోవడానికి మాత్రం బద్ధకిస్తారు.

అల్లాహ్‌కు మనపై హక్కు ఉంది. మనం ఆయనను ఆరాధించాలి. ఒక వ్యక్తి తన ఆరాధనను సరియైన విధంగా నిర్వర్తించ లేకపోతే ఇన్షా అల్లాహ్, ఆ వ్యక్తిని అల్లాహ్ క్షమించవచ్చు. కాని ఇతరుల హక్కుల విషయంలో, అతడు ఆ హక్కులను నెరవేర్చకపోతే అతనిని అల్లాహ్ క్షమించరు. **ఏమిటా హక్కులు?**

అవి ఖుర్‌ఆన్‌లో వివరించబడ్డాయి మరియు ముహమ్మద్(స)వారు బోధించారు కూడా. మరి సాఫల్యం పొందాలంటే (శాశ్వత స్వర్గాన్ని పొందాలంటే) అవి ఏమిటో తెలుసుకుని తదనుగుణంగా వ్యవహరించాలి. ముందుగా ఒక ఉదాహరణను పరిశీలిద్దాము.

---

ఒక కాలేజ్ ఉంది. విద్యార్థుల విషయం పక్కన పెట్టండి. సిబ్బంది గురించి మాట్లాడుకుందాం. ఒక ప్యూన్, స్వీపర్, రికార్డ్ అసిస్టెంట్, టైపిస్ట్ కమ్ గుమస్తా, టీచర్లు మరియు ప్రిన్సిపాల్ - వీరు కాలేజ్ సిబ్బంది. వీరిలోని ప్రతీ ఒక్కరిపై కొన్ని బాధ్యతలు ఉంటాయి. అదే విధంగా వారికి లభించే కొన్ని హక్కులు ఉంటాయి. మరియు వారిపై ఇతర సిబ్బందికి హక్కులూ ఉంటాయి. వారి స్థాయి పెరిగేకొద్దీ జీతాలు పెరగడమే కాదు, బాధ్యతలు కూడా పెరుగుతాయి.

కాలేజ్‌కి కొన్ని నియమ నిబంధనలు ఉంటాయి. వాటిని అంగీకరించి సంతకం చేసిన తరువాత అక్కడ ఉద్యోగం మొదలవుతుంది. ఆ కాలేజ్ వ్యవస్థ బాగుండాలంటే, అందులో పనిచేసే సిబ్బంది అంతా తమ తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి. ఎవరు సరిగ్గా పనిచేయకపోయినా ఆ వ్యవస్థలో ఇబ్బందులు వస్తాయి.

20 సంవత్సరాలుగా అక్కడే పనిచేస్తున్న ఓ స్వీపర్‌కి, కొత్తగా టీచర్‌గా చేరిన యువకుడితో, తనకంటే సీనియార్టీ తక్కువ కాబట్టి తరగతి గదులను శుభ్రం చేయమని, టీచర్‌ని ఆదేశించే హక్కు లేదు.

ఎవరి హక్కులకైనా భంగం కలిగినప్పుడు, వారు పై అధికారికి ఫిర్యాదు చేస్తారు. నిబంధనల ప్రకారం శిక్ష ఉంటుంది. వారు ఏ స్థాయిలో పనిచేస్తున్నా సరే, కాలేజ్ క్షేమం కోరి ప్రతీ ఒక్కరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి.

---

ఒక వ్యవస్థలో ఉండే నియమాలు, హక్కులు, బాధ్యతల గురించి వివరించ డానికే పై ఉదాహరణ చెప్పడం జరిగింది. అయితే కుటుంబ వ్యవస్థ అదే విధంగా ఉంటుందని కాదు. వ్యవస్థను బట్టి నియమ నిబంధనలు మారుతూ ఉంటాయి.

కుటుంబ వ్యవస్థ బాగుండాలంటే, ఆ కుటుంబంలోని సభ్యులు అందరూ తమకు ఇస్లామ్ ఏర్పరచిన హక్కుల ప్రకారం నడుచుకోవాలి. **ఒకవేళ ఒకరి హక్కులు వేరొకరు పట్టించుకోకపోతే, ఇస్లామ్ ప్రకారం అది పాపకార్యం అవుతుంది.** కాబట్టి ప్రతీ ఒక్కరూ ఇస్లామీయ చట్టం గురించి తెలుసు కోవాలి. క్రింది హదీస్ ఇదివరకే ఇవ్వడం జరిగింది.

ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు : "మీలో ప్రతీ ఒక్కరూ ఓ కాపరి మరియు మీలో ప్రతీ ఒక్కరూ తన గుంపు గురించి అడగబడతారు. ప్రజల నాయకుడు ఓ కాపరి మరియు తన గుంపు కొరకు అడగబడతాడు. ఓ పురుషుడు తన కుటుంబానికి కాపరి మరియు తన వారి కొరకు అడగబడతాడు. **ఓ మహిళ**

**తన భర్త ఇంటికి మరియు సంతానానికి కాపరి మరియు ఆమె తన వారి కొరకు అడగబడుతుంది.** ఓ బానిస తన యజమాని ఐశ్వర్యానికి కాపరి మరియు దాని కొరకు అడగబడతాడు. <u>మీలో ప్రతీ ఒక్కరూ ఓ కాపరి మరియు మీలో ప్రతీ ఒక్కరూ తన గుంపు కొరకు అడగబడతారు.</u> **(సహీహ్ ముస్లిమ్, 4724, పుస్తకం 33, అధ్యా.5, సంపుటి 5)**

**ప్రతీ ఒక్కరూ మరొకరి గురించి అడగబడతారు, వారు దగ్గరి బంధువులైనా కాకపోయినా. అంటే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది.**

కాబట్టి కుటుంబంలోని ప్రతీ సభ్యుడూ మరొకరి బాగోగులను పట్టించు కోవాలి. **అత్తాకోడళ్ళు కూడా ఒకరి బాగోగులను మరొకరు పట్టించు కోవాలి.**

భార్యాభర్తల హక్కుల గురించి ఇదివరకే చెప్పుకున్నాము.

ఇహలోకంలో అయితే అవినీతి మార్గాల ద్వారా శిక్షలు తప్పించుకో గలుగుతారు. కాని అల్లాహ్ దగ్గర తీర్పుదినాన ఎవరికీ రవ్వంత అన్యాయం జరగదు. అవకాశం ఉంది కదాయని ఇక్కడ తప్పులు చేసినవారు అల్లాహ్ దగ్గర తప్పించుకోలేరు. ఆ తప్పు చేసినవారు **అత్తయినా లేక కోడలైనా శిక్షార్హులు అవుతారు.**

నేడు కోడలునుగాని లేదా అల్లుడునుగాని ఎన్నుకొనే విధానం ముస్లిమేతర విధానమే. కాబోయే అల్లుడు ధర్మాన్ని అనుసరిస్తున్నాడా? అని వాకబు చేయడం కంటే ఆర్థిక విషయాలపైనే దృష్టి పెడతారు. కోడలు ఎంత బంగారం తెస్తుంది? ఎంత ఐశ్వర్యం ఆమె ద్వారా లభిస్తుంది? ఉద్యోగం చేస్తున్న అమ్మాయి అయితే, జీతం ఎంత? అని అబ్బాయి తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు.

మెట్టినింటికి వెళ్ళాక ఎటువంటి హక్కులు లభిస్తాయో మరియు ఇతర సభ్యులకు తనపై ఎటువంటి హక్కులు ఉంటాయో, వాటి గురించి కుమార్తెకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. **(ఒకతల్లి తన కుమార్తెను అత్తవారింటికి పంపేటప్పుడు చెప్పిన 10 అమూల్య విషయాల గురించి ముందరి సంచికలలో మరొకసారి చూడండి)**

**అదే విధంగా కోడలు ఇంటికి వచ్చాక, ఆమె పట్ల ఎలా వ్యవహరించాలో, ఎలా గౌరవించాలో తల్లి కుమారుడికి చెప్పాలి.**

పొరుగింటి వ్యక్తి పస్తులుండగా కడుపు నిండా తినే వ్యక్తి మోమిన్ (విశ్వాసి) కాదన్నారు. తనకు ఇష్టమైనదానినే తన (తోటి) సోదరుని కోసం కూడా ఇష్టపడమన్నారు. తన కొరకు మేలైనది మరియు తన సోదరుని కొరకు మాత్రం అల్పమైనది ఇవ్వడం విశ్వాసి చేయలేడు.

**కోడలు మరియు అత్తగారు ఇద్దరూ విశ్వాసులే అయితే, ఒకరి బాగోగులు మరొకరు పట్టించుకుంటారు. కోడలు తనకు ఇష్టమైనది తినేటప్పుడు, దానినే తన అత్తగారు కూడా తినాలని కోరుకుంటుంది. అత్తగారు తాను తినేటప్పుడు కోడలిని పస్తులుంచ లేదు.**

**ఒక విశ్వాసి(మోమిన్)కి శత్రువు ఉంటే, ఆ శత్రువు రాత్రి వేళ కూడా ప్రశాంతంగా నిద్రపోగలడు. అత్తాకోడళ్ళు శత్రువులు కూడా కాదు కదా! వారిద్దరూ విశ్వాసులే అయితే ఒకరి వలన మరొకరు ప్రశాంతత ఎలా పోగొట్టుకోగలరు?**

భార్యాభర్తలు సంతోషంగా ఉండాలంటే, ఇద్దరిలో ఏ ఒక్కరో సంతోషంగా ఉంటే సరిపోదు. ఇద్దరూ సంతోషంగా ఉండాలి.

**వీరి అత్తమామలు అంటే ఇరువైపులా అత్తమామలు తమ బిడ్డ బాగుండాలని, బిడ్డ కుటుంబంలోని ప్రతీ విషయంలోనూ జోక్యం చేసుకుని వారి హక్కులను కాలరాస్తే, ఆ సంసారంలో సంతోషం పోతుంది.**

రెండు కుటుంబాలకు చెందిన ఓ స్త్రీ మరియు ఓ పురుషుడు భార్యాభర్తల బంధంలోకి వచ్చినప్పుడు వారు ఎడ్జెస్ట్ కావడానికి కొంత సమయం పడుతుంది. వారిద్దరికీ ఏకాంతం కలిగించడం వారి వారి తల్లిదండ్రుల బాధ్యత. ఒకవేళ భార్యగాని, భర్తగాని తన జీవిత భాగస్వామి గురించి తన తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసినప్పుడు, వారు ఇస్లామ్ ప్రకారంగా సర్ది చెప్పాలి. క్రింది ఖుర్ఆన్ ఆయత్ చూడండి.

**"... పలికితే న్యాయమే పలకండి. <u>అది మీ దగ్గరి బంధువుకు</u> (వ్యతిరేక మైనది) <u>అయినా సరే!</u> అల్లాహ్‌తో చేసిన ఒడంబడికను <u>పూర్తి చేయండి.</u> మీరు హితోపదేశం స్వీకరించాలని ఆయన మీకు ఈ విషయాలను ఆజ్ఞాపిస్తున్నాడు."** (ఖుర్ఆన్ 6:152)

## సాంప్రదాయ శత్రుత్వం

దురదృష్టవశాత్తూ నేటి సమాజంలో అత్తాకోడళ్ళ బంధం పిల్లి ఎలుకల మధ్య ఉండే సాంప్రదాయ శత్రుత్వంగా మారిపోయింది. వీరిద్దరిలో ఎవరు ఎప్పుడు పిల్లి అవుతారో, ఎవరు ఎప్పుడు ఎలుక అవుతారో అనేది ఆ కుటుంబ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

వాస్తవానికి ఇప్పుడు అత్తాకోడళ్ళు చేసే ఫిర్యాదులలో కొత్తగా తెలిసేవి ఏముంటాయి? అన్నీ పాతవే!

**దీనికి పరిష్కారం ఒక్కటే - <u>వారిద్దరూ అల్లాహ్‌కు భయపడ వలసిన విధంగా భయపడాలి.</u> ఇద్దరూ విశ్వాసులు కావాలి ఈ విషయం అత్తాకోడళ్ళు స్వయంగా తెలుసుకుని విశ్వాసులు కావాలి. లేదా ఇతర కుటుంబసభ్యులైనా వారిద్దరినీ ఇస్లామ్ వైపుకు తీసుకు రావడానికి ప్రయత్నించాలి.**

ఒక పురుషుడు వివాహం చేసుకునే ముందు తన బాధ్యతలు మరియు హక్కులు తెలుసుకోవాలి. అదే విధంగా స్త్రీ కూడా వివాహం చేసుకునే ముందు తన బాధ్యతలు మరియు హక్కులు తెలుసుకోవాలి.

**ప్రతీ ఒక్కరూ విడివిడిగా ఖుర్'ఆన్ చదువుతున్నప్పటికీ, కుటుంబ సభ్యులందరూ ఒకచోట కూర్చుని ప్రతీ రోజూ కాస్సేపు ఒకరు చదువుతుండగా మిగతావారు వింటూ ఉంటే, కొంతవరకైనా ఇన్షా అల్లాహ్ సమస్యలను పరిష్కరించ వచ్చనేది మా వ్యక్తిగత అభిప్రాయం.**

## స్త్రీ తన భర్త ఇంటిలోని పరిస్థితులకు అనుగుణంగా ఎలా వ్యవహరించాలి?

అల్లాహ్‌కు విధేయురాలైన స్త్రీ తన భర్త ఇస్లామ్ పరిధిని దాటనంత వరకూ అతనికి ఎల్లప్పుడూ విధేయత చూపుతుంది. అతడు పేదవాడైతే మరియు అతను తనకోసం ఖర్చు చేయని పరిస్థితిలో ఉంటే ఫిర్యాదు చేయదు. పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించి ఆ ఇంటిలో సంతోషాన్ని నింపగలదు, ఇన్షా అల్లాహ్!

స్త్రీ బాల్యం మరియు తల్లిదండ్రుల పట్ల ఆమె కున్న ప్రేమానురాగాలు మరియు ఆమె పట్ల తల్లిదండ్రులకు ఉన్న ప్రేమానురాగాలు, అల్లుడి ఎంపిక మరియు భర్త ఇంటిలో నెలకొని ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఆమె మెలగిన తీరు కొన్ని వాస్తవ ఉదాహరణల ద్వారా తెలుసుకుందాము.

ముందుగా మన ప్రియప్రవక్త ముహమ్మద్(స)వారికి మరియు విశ్వాసుల మాతృమూర్తి ఖదీజా(రజి)వారికి జన్మించిన ఫాతిమా(రజి)వారి గురించి క్లుప్తంగా తెలుసుకుందాము.

ముహమ్మద్(స)వారు ప్రవక్త బాధ్యతను స్వీకరించేటప్పటికి దాదాపు మూడు నాలుగేళ్ళ చిన్నారి - ఫాతిమా(రజి) వారు.

ఆమె తల్లిదండ్రులు అసాధారణ వ్యక్తులు. తండ్రి సర్వలోకాలకు కారుణ్యం మరియు అల్లాహ్‌కు ప్రియమైన వారు. తల్లి ఖదీజా(రజి)వారు భర్త కష్టసుఖాలలో తోడుగా ఉంటూ భర్త ప్రేమానురాగాలనే కాకుండా, గౌరవాన్ని కూడా పొందిన ఉత్తమ మహిళ. స్వర్గంలో ఎటువంటి అలజడి లేని మణులతో నిర్మించబడిన నివాసం ఆమెకు వాగ్దానం చేయబడింది.

ఖదీజా(రజి)వారు మరణించే సమయానికి ఆమె వయస్సు దాదాపు 65 సంవత్సరాలు. ముహమ్మద్(స)వారు ఆమెను తలచుకున్నప్పుడు బావోద్వేగానికి గురి అయ్యేవారు.

ఓ మానవోత్తమునికి మరియు ఓ ఉత్తమ మహిళకు జన్మించారు ఫాతిమా(రజి)వారు. ఈమె స్వర్గమహిళలకు నాయకత్వం వహిస్తారని పాఠకులకు తెలిసిన విషయమే!

**కాబట్టి మనం ఉదాహరణగా చెప్పుకోవడానికి ఇంతకంటే ఉత్తమ కుటుంబం ఎవరిది ఉంటుంది?**

ఫాతిమా(రజి)వారు ఆఖరి సంతానం. ఫాతిమా(రజి)వారికి ముగ్గురు అక్కయ్యలు.

అరబ్బుల ఆచారం ప్రకారం పుట్టిన బిడ్డకు పాలు త్రాగించడానికి 2 సంవత్సరాల పాటు సమీప గ్రామాలకు పంపించేవారు. కాని ఖదీజా(రజి)వారు ఫాతిమా(రజి)వారిని ఆ విధంగా పంపకుండా కుమార్తెను అల్లారుముద్దుగా పెంచుకున్నారు.

ఫాతిమా(రజి)వారికి తండ్రి అంటే ఎంతో ప్రేమ. ముహమ్మద్(స) వారు అల్లాహ్ సందేశహరునిగా ప్రకటించినప్పటి నుండి ఆయనకు మక్కావాసుల నుండి కష్టాలు మొదలయ్యాయి. బాల్యం నుండి తండ్రికి తోడుగా ఉండేవారు ఫాతిమా(రజి)వారు.

ఒకరోజు కాబాలో ముహమ్మద్(స)వారు సజ్దా చేస్తుండగా ఒక దుర్మార్గుడు ఒంటె ప్రేవుల్ని తీసుకువచ్చి ఆయనపై ఉంచాడు. ప్రవక్త(స)వారు అలా సజ్దాలోనే ఉండిపోయారు. చిన్నారి ఫాతిమా(రజి) వచ్చి ఆ అశుద్ధ పదార్థాన్ని తండ్రి వీపుపై నుండి తీసివేసి శుభ్రం చేశారు. ఆ తరువాత ఆమె(రజి), "ఓ అల్లాహ్! ఖురైష్‌ను పట్టుకో" అని మూడు సార్లు శపించారు.

ఫాతిమా(రజి)వారికి బాల్యం నుండే సహనం మరియు పట్టుదల ఉండేవి.

ఒకసారి ఫాతిమా(రజి)వారు వీధిలో వెడుతుండగా ఏ కారణం లేకుండానే అబూజహ్ల్, ఫాతిమా(రజి)వారిని చెంపపై గట్టిగా కొట్టాడు. అప్పుడు ఆమె ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్ళిపోలేదు. ఖురైష్‌ల నాయకుడు అబూ సుఫ్యాన్ దగ్గరకు వెళ్ళి అబూజహ్ల్ క్రూరమైన మరియు అనాగరిక ప్రవర్తన గురించి ఫిర్యాదు చేసారు. అబూ సుఫ్యాన్ ఆమెను తనతో అబూజహ్ల్ కూర్చున్న చోటికి తీసుకువెళ్ళి అతడు ఏ విధంగా అయితే కొట్టాడో అదే విధంగా చేయమని ఫాతిమా(రజి)వారికి చెప్పారు.

ఆ తరువాత చిన్నారి ఫాతిమా(రజి) ఇంటికి వచ్చి ముహమ్మద్(స) వారికి జరిగిన సంగతి వివరించారు. అబూ సుఫ్యాన్ చూపిన న్యాయానికి ఆయన(స) సంతోషించారు మరియు అతనిని ఇస్లామ్ స్వీకరించేలా చేయమని అల్లాహ్‌కు దు'ఆ చేసారు.

ఫాతిమా(రజి)వారు ఐశ్వర్యవంతురాలైన ఖదీజా(రజి)వారి కుమార్తె. అయితే బనీ హాషిమ్ వంశం వెలివేయబడినప్పుడు పెద్దలతో పాటు పిల్లలు కూడా దుర్భరపరిస్థితులకు లోనయ్యారు. ఆహార పానీయాలకై పిల్లలు పెద్దలు అల్లాడిపోయారు. అయినా సరే విశ్వాసులు సత్యాన్ని వదలలేదు.

ఆ మూడు సంవత్సరాల కష్టాలు ఫాతిమా(రజి)వారి ఆరోగ్యంపై ప్రభావం చూపాయి. వివాహం అనంతరం ఇంటి పనులు చేసేటప్పుడు అలసిపోయేవారు. ఖదీజా(రజి)వారి ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడింది. అల్లాహ్ అనుగ్రహంతో ఆ వెలి ముగిసింది.

మాతృమూర్తి ఖదీజా(రజి)వారు జబ్బుపడ్డారు. ఫాతిమా(రజి)వారికి ఎంతో ప్రియమైన మాతృమూర్తి ఈ లోకాన్ని వీడారు. ఆ తరువాత మదీనా వలస వెళ్ళడం జరిగింది.

ఫాతిమా(రజి)వారికి 18 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు, మదీనాలోని ప్రముఖ వ్యక్తులు ఆమెను వివాహం చేసుకుంటామని ప్రవక్త(స)వారి దగ్గర వివాహ ప్రతిపాదన చేసారు. ఆమె ముహమ్మద్(స) వారికి ప్రియ పుత్రిక మాత్రమే కాదు సహనం, పట్టుదల, అంకితభావం గల విశ్వాసురాలు. ఆమెను వివాహం చేసుకోవడానికి ఐశ్వర్యవంతులు సిద్ధంగా ఉన్నారు.

ఆయిషా(రజి)వారు ఒకసారి చెప్పారు : **నేనెన్నడూ ఎవరినీ చూడలేదు ఫాతిమా(రజి)వారి కంటే సత్యం పట్ల అంకిత భావం ఉన్నవారిని. యుద్ధ రంగంలో కూడా ముహాజిర్ మరియు అన్సార్ మహిళలతో పాటు గాయపడిన వారికి సపర్యలు చేశారు. ఉహుద్ యుద్ధంలో తండ్రికి గాయాలై రక్తం కారుతున్నప్పుడు, రక్తస్రావాన్ని ఆపి కట్టుకట్టారు.**

ముహమ్మద్(స)వారు ఏ ప్రయాణం నుండి అయినా మదీనాకు చేరుకోగానే, ముందుగా మస్జిద్‌కు వెళ్ళి రెండు రకాత్‌లు నమాజ్ చేసుకుని, ఫాతిమా(రజి)వారి దగ్గరికి వెళ్ళి, ఆ తరువాతనే భార్యల దగ్గరికి వెళ్ళేవారు.

ఫాతిమా(రజి)వారి గురించి ఆయిషా(రజి)వారు ఇలా చెప్పారు :

**"చూడటానికి ఆమె ముహమ్మద్(స)వారి వలే ఉండటం మాత్రమే కాకుండా, ఆమె మాట తీరు, కూర్చోవడం, నిలుచోవడం మరియు నడక - అన్ని హావభావాలు మరియు అభినయం తండ్రినే పోలి ఉండేవి. ఎప్పుడైనా తండ్రి ఆమె దగ్గరకు వచ్చినప్పుడు ఆయనకు ఎదురెళ్లి స్వాగతించి ఆయన(స) నుదుటిపై గౌరవ మర్యాదలతో ముద్దాడేవారు. అపురూప సాన్నిహిత్యం వారిది. ఎప్పుడైనా ఆమె తండ్రి దగ్గరకు వస్తే, ఆయన(స) నిలుచుని ఆమెకు ఎదురెళ్లి స్వాగతించే వారు. ఆమె ఎక్కడికి వెళ్ళినా తన వ్యక్తిత్వ పరిమళపు తేజస్సును అక్కడ వదిలి వెళ్ళినట్లుగా ఉండేది."**

ఫాతిమా(రజి) విచారంగా ఉంటే ముహమ్మద్(స)వారికి కూడా విచారం కలిగేది. మరియు ఆమె సంతోషంగా ఉండటం చూస్తే ఆయన(స)కూడా సంతోషంగా ఉండేవారు.

ఇటువంటి ప్రియపుత్రికకు ముహమ్మద్(స)వారు వివాహం చేయాలని నిర్ణయించినప్పుడు **ఎటువంటి వ్యక్తికి ఇచ్చి వివాహం చేస్తారు?** తన కుమార్తెను ప్రేమగా చూసుకునే వ్యక్తి మరియు ఆమెను ఎల్లప్పుడూ సంతోషంగా ఉంచే, తగిన వ్యక్తికే కదా ఇచ్చి వివాహం చేస్తారు!

ముహమ్మద్(స)వారు అల్లునిగా ఎన్నుకున్నది మరెవరినో కాదు, ఉత్తముడు మరియు ధర్మపరాయణుడైన అలీ(రజి)వారిని.

ఒకరోజు అలీ(రజి)వారు ప్రవక్త(స)వారి దగ్గరికి వచ్చారు. కాని ఆయన చాలా బిడియంతో ఉన్నారు, చెప్పాలనుకున్నది చెప్పలేని సంశయంలో ఉన్నట్లు ముహమ్మద్(స)వారు గ్రహించి అడిగారు. ఫాతిమా(రజి)వారిని వివాహం చేసుకోవాలని ప్రతిపాదించడం కోసమేనా అని అడిగితే, ఆయన ఔనని చెప్పారు.

ఫాతిమా(రజి)వారితో అలీ(రజి)వారు జ్ఞానం గలవారని, మంచి హృదయం గల ధైర్యశాలి అని చెప్పారు. తండ్రి నిర్ణయాన్ని ఆమె అంగీకరించారు.

తరువాత అలీ(రజి)వారిని మహ్ర్ కోసం కొంత సొమ్ము ఉందా అని ఆయన(స) అడిగారు. ఊయల (లో ఉన్నప్పటి) నుండి తన జీవితాన్ని ప్రవక్త(స)వారు చూశారని మరియు తన ఆర్థిక పరిస్థితి ఆయనకు బాగా తెలుసునని ఆయన సమాధానమిచ్చారు. అలీ(రజి)వారి దగ్గర ఒక కవచం తప్ప ఏదీ లేదు.

దాని గురించి ముహమ్మద్(స)వారు అడిగారు మరియు ఫాతిమా(రజి)వారికి అది మహ్ర్ అని అన్నారు. అలీ(రజి)వారు దానిని అమ్మడానికి తన బానిసకు ఇచ్చి బజారుకి పంపారు. మరియు ఆ కవచం అమ్మగా 400 దిర్హములు లభించాయి. ఆ సొమ్మును ఆయన మహ్ర్‌గా ఇచ్చారు.

వివాహం అనంతరం ముహమ్మద్(స)వారు తన కుమార్తెతో పంపిన కానుకలు :

> అలీ(రజి)వారు ఉల్లేఖించారు : **మృదువైన వస్త్రం** (velvet dress), **నీటితిత్తి** మరియు ఇజ్‌ఖర్‌తో నింపబడిన **దిండు**తో అల్లాహ్ యొక్క సందేశహరులు (స) ఫాతిమాను సాగనంపారు. (నసాయీ, సహీహ్, 3386, పుస్తకం 26, అధ్యా.74, సంపుటి 4)
>
> (ఇజ్‌ఖర్ సౌదీఅరేబియాలో లభించే సువాసన ఇచ్చే ఒకరకమైన గడ్డి)

ముహమ్మద్(స)వారు తనకు ఎంతో ప్రియమైన కుమార్తెను ఐశ్వర్యవంతునికి ఇచ్చి వివాహం చేయలేదు. **పేదవాడైన ఓ ఉత్తముడికి ఇచ్చి వివాహం జరిపారు.** ఆమె భర్త ఇంటిలో తిరుగలి తిప్పి పిండి చేసేవారు. ఇంటి పనులన్నీ స్వయంగా చేసేవారు. నౌకర్ల సహాయం లేదు. తొందరగా అలిసి పోయేవారు. కాని ఏనాడూ పేదరికం విషయంలో ఆమె ఫిర్యాదు చేయలేదు.

ఆమె మాతృమూర్తి ఒకనాడు మక్కాలో ఐశ్వర్యవంతురాలు. అనాథలకు, అవసరంలో ఉన్నవారికి సహాయపడుతూ ఐశ్వర్యాన్ని తల్లిదండ్రులు ఖర్చు చేశారు.

ఈ నవదంపతులు కూడా అటువంటివారే! తమకు మాత్రమే తినడానికి ఉన్నాసరే, ఆకలితో ఉన్నవారు అడిగితే వారికి ఇచ్చేసేవారు. ఫాతిమా(రజి)వారు చిన్నతనంలో ఐశ్వర్యంలో పుట్టినా సరే, **పరిస్థితులకు అనుగుణంగా పేదరికాన్ని అలవాటు చేసుకున్నారు.**

ఆనాడు మదీనాలో నివశించే ఎందరో విశ్వాసుల ఇండ్లలో ఆహార సమస్య ఉండేది. ముహమ్మద్(స)వారు ఎక్కువగా పస్తులు ఉండేవారు. ఆయన ఏనాడూ కడుపునిండా తిన్నది లేదు. క్రింది హదీస్ ఈ విషయాన్ని స్పష్టంగా మన కళ్ళ ముందుంచుతుంది.

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం.

ఒక వ్యక్తి ప్రవక్త(స)వారి వద్దకు (అతిథిగా) వచ్చాడు. కాబట్టి ఆయన(స) ఒక సందేశహరుడిని తన భార్యల దగ్గరకు పంపారు (ఆ వ్యక్తి తినడానికి ఏదైనా తీసుకు రావడానికి) కాని వారు చెప్పారు, **వారి దగ్గర ఏమీలేదు నీరు తప్ప**. తరువాత అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, ''ఎవరు ఇతనిని తీసుకువెళతారు లేక ఈయనకు ఆతిథ్యం ఇస్తారు?'' ఒక అన్సార్ వ్యక్తి చెప్పాడు, ''నేను'' కాబట్టి అతడు అతనిని తన భార్య వద్దకు తీసుకువెళ్ళాడు. ''దయతో రసూలుల్లాహ్(స)వారి అతిథికి ఆతిథ్యం ఇవ్వు.'' ఆమె చెప్పారు, ''మన దగ్గర ఏమీలేదు మన చిన్నారుల ఆహారం తప్ప.'' ఆయన చెప్పారు, ''ఆహారం సిద్ధం చెయ్యి. దీపం వెలిగించు మరియు పిల్లలను వారు ఆహారం కోసం అడిగితే నిద్రపుచ్చు.'' కాబట్టి ఆమె ఆహారం సిద్ధం చేసారు. దీపం వెలిగించారు మరియు ఆమె తన పిల్లలను నిద్రపుచ్చారు. మరియు పైకి లేచి దీపాన్ని సరిచేస్తున్నట్లు నటించారు కాని దానిని ఆపివేసారు. తరువాత వారిద్దరూ (భార్యాభర్తలిద్దరూ) తింటున్నట్లు నటించారు. కాని వాస్తవానికి వారు ఆకలితో పడుకున్నారు. ఉదయం ఆ అన్సారీ, రసూలుల్లాహ్(స)వారి వద్దకు వెళ్లాడు, ఆయన(స) అన్నారు, ''రాత్రి అల్లాహ్ మీ చేష్టకు నవ్వారు లేక మీ చేష్టకు ప్రసన్నుడయ్యారు) అప్పుడు అల్లాహ్ అవతరింప జేశారు : ''... మరియు తమకు అవసరమున్నప్పటికీ, వారికి తమ స్వంత (అవసరాల)మీద ప్రాధాన్యత నిస్తారు. మరియు ఎవరైతే ఆత్మ లోభం నుండి రక్షింప బడతారో! అలాంటి వారు, వారే! సాఫల్యం పొందేవారు.'' (ఖుర్'ఆన్ 59:9) **(సహీహ్ బుఖారీ, 3798, పుస్తకం 63, అధ్యా.10, సంపుటి 5)**

ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. **ఆయన(స) మదీనాకు వచ్చిన రోజు నుండి, ముహమ్మద్(స)వారి కుటుంబం ఎన్నడూ వరుసగా మూడు రోజులు గోధుమ రొట్టె తినలేదు, ఆయన(స) మరణించే వరకూ.**'' (సహీహ్ ముస్లిమ్, 7443, పుస్తకం 53, సంపుటి 7 ఇబ్నెమాజా, 3344, సంపుటి 4)

---

ఆయిషా(రజి)వారు చెప్పారు : **మేము, (అంటే) ముహమ్మద్(స) వారి కుటుంబం, ఒక నెలపాటు పొయ్యిలో అగ్ని రాజేయకుండా ఉండేవాళ్ళము. అది (ఆహారం) కేవలం ఖర్జూరాలు మరియు నీరు.**'' (సహీహ్ ముస్లిమ్, 7449, పుస్తకం 53, సంపుటి 7)

ముహమ్మద్(స)వారి ఆకలి గురించి ఆయన ప్రియపుత్రిక ఎలా మరచిపోగలరు? ఇబ్నె కసీర్గారి **అల్ బిదాయా వన్నిహాయాలో** ఓ సంఘటనను ఇక్కడ చెప్పుకుందాం.

ఓ స్త్రీ ఫాతిమా(రజి)వారికి రెండు రొట్టెలు మరియు కొంత వేపిన మాంసాన్ని పంపారు. ఆమె దానిని పెద్ద పళ్ళెంలో ఉంచి, దానిని వస్త్రంతో కప్పారు. తరువాత తన తండ్రికి కబురు పంపారు తన ఇంటికి వచ్చి భోజనం చేయమని. ఆయన(స) వచ్చాక, ఆమె వస్త్రాన్ని తీసారు మరియు ఆమె ఆశ్చర్యచకితులయ్యారు, పళ్ళెం పూర్తిగా రొట్టెలతో మరియు మాంసంతో నిండిపోయి ఉంది. ఆమె అర్థం చేసుకున్నారు ఆ సమృద్ధి అల్లాహ్ నుండి వచ్చిందని. ఆమె అల్లాహుతాలా ఘనతను కొనియాడారు. మరియు అల్లాహ్ను అర్థించారు తన ప్రవక్తను అనుగ్రహించమని. భోజనాన్ని బిస్మిల్లాహ్తో ఆయన(స)కు వడ్డించడం ప్రారంభించారు.

అంత ఎక్కువ పరిమాణాన్ని చూసినప్పుడు ముహమ్మద్(స) చిరునవ్వు నవ్వారు మరియు అడిగారు ఎవరు ఇదంతా పంపారని. ఆమె వెంటనే చెప్పారు, ఇది అల్లాహ్ నుండి వచ్చిందని మరియు నిశ్చయంగా అల్లాహ్ తాను కోరిన వారికి లెక్కలేనంత జీవనోపాధిని ప్రసాదిస్తాడని.

ఆయన(స) చిరునవ్వు నవ్వి, అల్లాహ్కు కృతజ్ఞత తెలియజేసు కున్నారు, మర్యమ్(అ)వారిలా పలికిన కుమార్తెను కలిగి ఉన్నందుకు. తరువాత ప్రవక్త(స)వారు తన కుమార్తె, అల్లుడు మరియు మనవళ్ళతో కలిసి కొంత తిన్నారు. ఇంకనూ చాలా ఆహారం ఉండిపోయింది. దానిని విశ్వాసుల మాతృమూర్తులకు పంపారు. వారు కూడా తిన్నారు మరియు తమ పొరుగువారికి పంచారు.

(ఫాతిమా(రజి)వారు ముహమ్మద్(స)వారి కుమార్తే కావచ్చు, కాని ఎవరైనా తన ప్రియ ప్రవక్తకు తినిపించాలని తాపత్రయ పడితే, అల్లాహ్ వారికి లెక్కలేనంత ఇస్తాడు. ఇప్పటికే ఇటువంటి ఎన్నో సంఘటనల గురించి చెప్పుకున్నాం.)

**భర్త పేదరికాన్ని ఆమె ఏనాడూ వేలెత్తి చూపలేదు.** అయితే ఇంటి పనులతో అలిసిపోయి, తిరగలి తిప్పడం వలన చేతులలో నొప్పి ఉండేది. ఆ విషయం అలీ(రజి)వారికి ఆమె చెప్పారు. ప్రవక్త(స)వారి దగ్గరకు కొందరు బానిసలు తీసుకురాబడ్డారని, ఆయన(స)కు చెప్పి, ఇంటి పనులలో సహాయం కొరకు ఒకరిని అడగమన్నారు.

అలీ(రజి)వారి ఉల్లేఖనం. ఫాతిమా(రజి) తిరగలి వలన తన చేతికి నొప్పి కలగడం గురించి చెప్పారు. కొందరు బానిసలు ప్రవక్త(స) వారి వద్దకు ఒక బానిస వచ్చింది. కాబట్టి ఆమె వెళ్ళారు, కాని ఆయన(స) కనిపించ లేదు. అయితే ఆమె(రజి) ఆయిషా(రజి)వారిని కలిసి చెప్పారు. ప్రవక్త(స)వారు వచ్చినప్పుడు ఆయిషా(రజి) తన దగ్గరకు ఫాతిమా(రజి) రావడం గురించి చెప్పారు.

ప్రవక్త(స)వారు మా దగ్గరికి వచ్చారు మరియు మేము పడుకుని ఉన్నాము. మేము లేవబోయాము. కాని ప్రవక్త(స)వారు చెప్పారు: ''మీరున్నచోటనే ఉండండి.'' తరువాత ఆయన మా మధ్య

కూర్చున్నారు, ఆయన పాదం యొక్క చల్లదనాన్ని నా ఛాతీ అనుభూతి పొందే వరకూ. తరువాత ఆయన(స) చెప్పారు : "నేను మీకు నేర్పించనా మీరు కోరిన దానికంటే ఉత్తమమైన దానిని?" మీరు పడుకునేటప్పుడు, అల్లాహ్ యొక్క గొప్పతనాన్ని (**అల్లాహు అక్బర్**) 34 సార్లు పఠించండి, ఆయన పవిత్రతను (**సుబహానల్లాహ్**) 33 సార్లు మరియు పొగడండి ఆయనను (**అల్‌హమ్‌దు లిల్లాహ్**) 33 సార్లు. అది ఒక నౌకరు కంటే మీకు ఉత్తమం." (సహీహ్ ముస్లిమ్, 6915, పుస్తకం 48, అధ్యా.19, సంపుటి 7)

ఇదే విషయానికి సంబంధించి అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం (6918, సహీహ్ ముస్లిమ్)లో ఇలా ఉంది : సుబహానల్లాహ్ 33 సార్లు, అల్-హమ్‌దులిల్లాహ్ 33 సార్లు, అల్లాహు అక్బర్ 34 సార్లు.

అప్పటి నుండి అలీ(రజి) తన జీవితంలో ఏ రాత్రి కూడా వీటిని పఠించడం మాన లేదని ఒక ఉల్లేఖనం (సహీహ్ ముస్లిమ్, 6917) ద్వారా తెలుస్తుంది.

ముహమ్మద్(స)వారు తన కుటుంబం కంటే ముందు పేదవారికే ప్రాధాన్యం ఇచ్చేవారు. స్వయంగా తన ప్రియపుత్రికకు ఒక నౌఖరును ఏర్పాటు చేయగలిగే ఆర్థిక స్థితిలో కూడా ఆయన(స) లేరు.

అయినప్పటికీ తన కుమార్తెకు ఉత్తమమైనదే (పడుకుబోయే ముందు) పఠించడానికి ఇచ్చారు. అది కేవలం కుమార్తెకు ఇచ్చిన కానుక మాత్రమే కాదు, ఆమె ద్వారా ఉమ్మత్ మొత్తానికి ఇచ్చిన కానుక.

అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు తన పెద్ద కుమార్తె అస్మా(రజి)వారిని జుబైర్(రజి)వారికి ఇచ్చి వివాహం జరిపించారు. రెండవ కుమార్తె ఆయిషా(రజి)వారిని ముహమ్మద్(స)వారికిచ్చి వివాహం చేసారు.

ముహమ్మద్(స)వారి ఆర్థిక స్థితి ఏమిటో అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారికి బాగా తెలుసు. అయినప్పటికీ తన ప్రియపుత్రికను సంతోషంగా ప్రవక్త(స) వారికి ఇచ్చారు. **ఆయిషా(రజి)వారు ఐశ్వర్యంలోనే పుట్టారు.** కాని ఆమె మెట్టినింట పేదరికమే! కాని ఆ పేదరికంలోనే భర్తతో అన్యోన్యంగా జీవించారు ఆమె.

> నేడు చాలామంది తండ్రులు తమ కుమార్తెలకు వివాహం చేయాలను కున్నప్పుడు, స్థితిమంతునికిగాని, గవర్నమెంట్ ఉద్యోగికి గాని, మంచి వ్యాపారస్థునికి గాని ఇచ్చి వివాహం చేయడానికే ఇష్టపడు తున్నారు. **అందులో ఎటువంటి దోషం లేదు.**

గవర్నమెంట్ ఉద్యోగి అయితే పెన్షన్ వస్తుంది. అతనికి ఏదైనా జరిగితే, కుమార్తెకు సెక్యూరిటీ సమస్య ఉండదని ముందు జాగ్రత్తతో ఆలోచన చేస్తారు. ఇహలోకంలో సంతోషంగాని, పరలోకంలో సాఫల్యం గాని పొందే విషయంలో **తన బిడ్డకు ధర్మపరాయణుడు తోడుగా ఉండాలని కోరుకోవడం చాలా అరుదుగా జరుగుతుంది.** ఎవరు ఎవరికి తోడుగా ఉండాలో ఖుర్ఆన్‌లో అల్లాహుతాలా స్పష్టంగా ఆదేశించారు.

క్రింది హదీస్ చూడండి :

> ఆయిషా(రజి)వారు చెప్పారు : **రసూలుల్లాహ్(స)వారు మరణించి నప్పుడు నా అరలో ఏమీలేదు ఒక ప్రాణి తినగలిగేది, ఒక గుప్పెడు బార్లీ తప్ప నా అరపై. నేను దాని నుండే తిన్నాను చాలా కాలంపాటు. అప్పుడు వాటిని లెక్కపెట్టాను మరియు అవి అయిపోయాయి.** (సహీహ్ ముస్లిమ్, 7451, పుస్తకం 53, సంపుటి 7)

ఆమె తన తండ్రిగారిని అడగవచ్చు. కాని చాలకాలంపాటు గుప్పెడు బార్లీతోనే గడిపారు. ఆయిషా(రజి)వారు అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారి ప్రియ పుత్రిక. ఆమె అంటే ఆయనకు చాలా ప్రేమ. **కాబట్టే ఆయన ఆమెకు మానవజాతిలోనే ఉత్తముడైన వ్యక్తిని భర్తగా అందించారు.** విశ్వాస స్త్రీలు ఎన్నడూ పేదరికాన్ని పట్టించుకోలేదు.

అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారి మరో కుమార్తె తన భర్త ఇంటిలో ఏ విధంగా సర్దుకుపోయారో ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో చెప్పుకుందాం.

**రమదాన్ నెలలో 'జకాత్'**

**ప్రత్యేక పుస్తకాలను ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ**

**భాషలలో సిద్ధం చేయడానికి ఎక్కువ సమయం**

**పట్టడం వలన మరియు సమైక్యాంధ్ర సమ్మె వలన**

**మరియు ఎక్కువ కాపీలు** RTC ANL

**ఏ.ఎన్.ఎల్‌లో పంపవలసి ఉండటంతో ఈ సంచిక**

**ముద్రణ ఆలస్యం అయింది.**

**ఆలస్యానికి చింతిస్తున్నాము.**

**ఈ నెల నుండి**

**'శాంతిబాట' సంవత్సర చందా**

**రూ. 240/- చేయడమైనది**

**ప్రొడక్షన్ కాస్ట్ విపరీతంగా పెరిగిపోవడంతో**

**కేవలం 40 రూ॥లు మాత్రమే**

**పెంచడం జరిగింది.**

# తిరిగి గూటికి

ఇస్లామ్ అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం వంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా మానవులు ఆచరించ వలసిన ధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో అల్లాహ్ ధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా 'ఇస్లామ్'లోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒకేసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా వారికి కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవన విధానంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి వారిలో కొందరికి మరికొంత సమయం పట్టవచ్చు. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకమైన అవస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్'ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది, ఇన్షా అల్లాహ్.

### నవ ముస్లిమ్? New Muslim?

*అబూబక్ర్ సిద్దీఖ్(రజి), ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి), ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి), అలీ బిన్ అబీ తాలిబ్(రజి) మొదలైన విశ్వాసులంతా ఇస్లామ్ స్వీకరించిన వారే! వీరిని నవముస్లిములుగా ఎవరూ పరిచయం చేయలేదు. నమాజ్ చేయడం నేర్చుకునే వరకో లేక మస్జిద్ అలవాటు అయ్యే కొన్ని రోజుల వరకో తోటి ముస్లిములకు తెలియడానికై 'నవముస్లిమ్' అనే పదాన్ని వారి కొరకు ఉపయోగించవచ్చు. కాని వారికి ఇస్లామ్ ధర్మం పై పూర్తి అవగాహన ఏర్పడి ఇస్లామ్ ప్రకారం వారి ఆచరణ ఉన్నప్పుడు, ఎన్ని సంవత్సరాలైనా సరే వారిని 'నవ ముస్లిములు'గా పరిగణించడం సరికాదు.*

### ఏ భాష అయినా ఒక్కటే! అంతా సమానమే!

ఖుర్'ఆన్ అరబీ భాషలో అవతరించింది. అరబీ భాష ముస్లిములకు అతి ముఖ్యమైన మరియు నేర్చుకోవలసిన భాష. 'ఉర్దూ' భాష భారతీయ భాషలలో ఒక భాష మాత్రమే. 'ఉర్దూ' అంటే మార్కెట్ అని అర్థం. ఇది అరబ్బులు మరియు భారతీయుల మధ్య వ్యాపార లావాదేవీల కొరకు తయారైన భాష. అరబీ భాష కాకుండా, ఇతర ఏ భాష అయినా ముస్లిములకు ఒక్కటే! ఇస్లామ్‌లో రంగు, తెగ, లేమి, కలిమి, భాష, ప్రాంతం మొ॥న వాటిని బట్టి ఎటువంటి ప్రాముఖ్యతా లేదు. అందరూ సమానమే! కేవలం ధర్మ పరాయణత మాత్రమే ముస్లిముల స్థాయిని నిర్దేశించే కొలమానం. తెలుగు మాట్లాడేవారి కొరకు ఒక మస్జిద్, వేరే భాష మాట్లాడేవారికి మరొక మస్జిద్ ఏర్పాటు చేయాలని చేసే ఏ ప్రయత్నమైనా సున్నత్‌కి వ్యతిరేకమైనదే! అందరినీ కలిపి ఉంచే ధర్మమే ఇస్లామ్ (శాంతి).

*శాంతిబాట మొదటి సంవత్సరంలో విదేశాలలో ఇస్లామ్ స్వీకరించిన ఏడుగురు సోదరీమణుల గురించి తెలియజేయడం జరిగింది. ద్వితీయ సంవత్సరం తొలి సంచికయైన ఆగష్టు'10 సంచికలో నవముస్లిములు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఓ సోదరుడు ఆవేదన వ్యక్తం చేస్తూ వ్రాసిన లేఖను అందించాము.* ***ఆ సమస్యలకు ఖుర్‌ఆన్ మరియు సున్నత్ విధానంలో పరిష్కార మార్గాన్ని ఇన్షా అల్లాహ్ తరువాయి సంచికలలో అందిస్తామని చెప్పడం జరిగింది.*** తరువాయి సంచికలలో కొన్నింటికి ఖుర్‌ఆన్ మరియు సున్నత్ వెలుగులో పరిష్కారం అందించాము. వాస్తవ సంఘటనల ద్వారా సమస్యల పరిష్కారాన్ని తెలియజేసే ఉద్దేశ్యంతో ముహమ్మద్(స)వారి అనుచరులైన **బిలాల్**(రజి), **అబూజర్**(రజి), **సల్మాన్ ఫార్సీ** (రజి), **అబూ ఉబైదా**(రజి), **సాద్ బిన్ అబీ వఖ్ఖాస్**(రజి), **అమ్ర్ బిన్ ఆస్**(రజి) మరియు **సుమయ్యా**(రజి), **ఖదీజా**(రజి), **ఉమ్మె అయ్‌మన్**(రజి), **ఉమ్మె సులైమ్**(రజి), **ఉమ్మె అమ్మారహ్**(రజి), **అస్మా** (రజి), **ఫాతిమా బిన్త్ అసద్**(రజి)వారి జీవితచరిత్రలను క్లుప్తంగా అందించడం జరిగింది. ఇవన్నీ చదివితే ఎవరికైనా తమ సమస్యలు, పైన వివరించిన విశ్వాస పురుషులు మరియు విశ్వాస స్త్రీ సమస్యల కంటే చాలా చిన్నవిగా కనిపిస్తాయి. సులువుగా తమ సమస్యలను పరిష్కరించుకో గలమనే మనో ధైర్యం వారిలో ఏర్పడుతుంది.

# సుహైబ్ అర్-రూమీ (రజి)

**• రోమ్ నుండి తొలి ఫలం • త్యాగానికి ఒక ఉదాహరణ • విలువిద్యలో మేటి ఆ విద్యను ప్రవక్త(స)వారి భద్రతకోసం ఉపయోగించారు • పేదలకు మరియు అవసరంలో ఉన్నవారి కోసం తన సంపదను ఖర్చు చేసిన విశ్వాసి**

*ఈ విశిష్ఠ దాసుని గురించి అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ఇలా చెప్పారు :*

**"మరియు మానవులలో ఒకడున్నాడు అతడు అల్లాహ్ ప్రసన్నత కొరకు తన ప్రాణాన్ని స్వయంగా అమ్ముకున్నాడు ..."**

(ఖుర్‌ఆన్ 2:207)

*ముహమ్మద్(స)వారు ఇలా అభినందించారు :* **"నీ బేరం లాభదాయకం అబూ యహ్యా. నీ బేరం లాభదాయకం అబూ యహ్యా"**

అప్పటి పర్షియన్ సామ్రాజ్యంలో భాగమైన 'అయ్లా' అనే ప్రాంతానికి (నేటి ఇరాఖ్ లోని బస్రా) గవర్నర్ సినాన్ బిన్ మాలిక్. 6వ శతాబ్దపు మధ్య కాలంలో ముహమ్మద్(స)వారు ప్రవక్తగా బాధ్యతలు చేపట్టడానికి దాదాపు 20 సంవత్సరాల ముందు జరిగిన ఓ సంఘటన గురించి ఇక్కడ చెప్పుకోవాలి.

యూఫ్రేట్స్ నదీ తీరంలో విలాసవంతమైన భవనం సినాన్ బిన్ మాలిక్ గారి నివాసం. ఆయనకు చాలా మంది సంతానం ఉన్నారు. వారిలో ఒకరు 5 సంవత్సరాల వయస్సు గల సుహైబ్(రజి)వారు. ఆయన తండ్రికి చాలా ప్రియమైన కుమారుడు. ఆ రోజుల్లో రెండు పెద్ద సామ్రాజ్యాలు ఉండేవి. ఒకటి పర్షియన్ సామ్రాజ్యం. రెండవది బైజాన్‌టియమ్ (రోమన్). ఈ రెండింటి మధ్య యుద్ధాలు జరుగు తుండేవి.

సుహైబ్(రజి) వారి మాతృమూర్తి పేరు సలామ్ బిన్ ఖయీద్. ఒకరోజు సుహైబ్‌గారి మాతృమూర్తి మరియు కొందరు కుటుంబ సభ్యులు అత్-తానీ అనే గ్రామానికి విహారం కొరకు వెళ్ళారు. సంతోషంగా గడుపుదామని అక్కడికి వెళ్ళిన వారికి ఊహించని ప్రమాదం ఎదురైంది.

ఆ రోజు అత్-తానీ గ్రామంపై రోమన్ల సైన్యం దాడిచేసింది. సుహైబ్ తెగవారు ఎంతోమంది చనిపోగా, ఆయన యుద్ధ ఖైదీగా రోమన్లకు చిక్కారు. ఆ విధంగా రోమన్లతో పాటు వారి దేశానికి తీసుకు పోబడ్డారు. అక్కడ బానిసగా అమ్మివేయబడ్డారు. పేరు ప్రతిష్టలు కలిగిన కుటుంబంలో పుట్టి యూఫ్రేట్స్ నదీ తీరాన సంతోషంగా ఆడుకునే బాలుడు, ఓ బానిసగా రోమన్ సామ్రాజ్యంలో జీవనం సాగించవలసి వచ్చింది. ఖరీదైన భవంతిలో అల్లారు ముద్దుగా పెరిగిన బాలునికి స్వేచ్ఛ పోయింది. భాష మారిపోయింది. తన మాతృభాషయైన అరబీ మరచిపోయేంతగా అక్కడి భాష ఆయనకు అలవాటైంది.

అరబీ భాషను జీవితంలో మరలా ధారళంగా మాట్లాడగలగటం గాని, దాని సహజ యాసను తిరిగి అందుకోవడం గాని చేయలేక పోయారు. ఆయన రోమన్ల భాషయైన గ్రీకులో మాట్లాడేవారు. అందుకే ఆయన పేరు చివర **'రూమీ'** అనే పదం తగిలించబడింది. చిన్నతనంలోనే తల్లి దండ్రులను కోల్పోయి అనాథ అయ్యారు. ఈ అనాథ బాలుడే పెరిగి పెద్దయ్యాక ఎందరో అనాథలకు, విధవరాళ్ళకు, అవసరంలో ఉన్నవారికి తన సంపదనంతా ఖర్చు పెట్టారు.

ఈ అనాథ బాలునికి అల్లాహుతాలా మంచి భవిష్యత్‌నే ఏర్పాటు చేశారు. అందువల్లనే కొన్ని సంవత్సరాల తరువాత ఆయన రోమన్ సామ్రాజ్యం నుండి మక్కా వైపుకు తీసుకురాబడ్డారు.

ఆ రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా బానిసత్వం ఉండేది. బానిసలను కూడా పశువులను విక్రయించినట్లు బజారులలో విక్రయించేవారు. ఆ బానిసల ధీనగాథలు వినలేము. అంతటి ఘోరమైన బానిస వ్యవస్థ యొక్క పునాదులను తీవ్రంగా కదిలించింది ఇస్లామ్.

బానిసలను ఉత్తమ స్థాయికి చేరుకునేలా చేసింది. సమాజం నుండి బానిసత్వం అంచెలంచెలుగా నిర్మూలించబడటం ఆరంభమైంది. ఈ అంశంపై శాంతిబాటలో చాలా వివరంగా ఇది వరకే చాలా విషయాలు తెలియజేయడం జరిగింది.

బైజాన్‌టైన్ సామ్రాజ్య ముఖ్యపట్టణం కాన్‌స్టంటినోపుల్. అక్కడ బానిసల బజార్లు ఉండేవి. అటువంటి ఓ బజారులో ఆయన అమ్మి వేయబడ్డారు. ఈయన వలే ఎన్నోవేల మంది రాచరికపు కోటలలో మరియు గృహాలలో వెట్టి చాకిరీ చేస్తూ జంతువుల కంటే హీనంగా పరిగణించబడేవారు.

సుహైబ్(రజి)వారి బాల్యం అంతా బానిసత్వంలోనే గడిచిపోయింది. బానిసగా మారి దాదాపు 20 సంవత్సరాలు బైజాన్‌టైన్ భూభాగంలోనే ఉన్నారు. సమాజాన్ని చదివారు. కనులారా జరుగుతున్న అన్యాయాలను, అవినీతిని గమనించేవారు.

ఆ సామ్రాజ్యంలో మాట్లాడే భాష - గ్రీక్. సుహైబ్ గారికి కూడా ఆ భాషే అలవాటైంది. తన మాతృభాషను మరచిపోయారుగాని, తన బాల్యాన్ని మరచిపోలేదు.

మక్కా అరబ్బులకు చుట్టు ప్రక్కల దేశాలతో వ్యాపార సంబంధాలు ఉండేవి. వేసవి కాలంలో సిరియా వెళ్ళి రోమన్ భూభాగంలో వ్యాపారం చేసేవారు మరియు  చలికాలంలో యమన్ వైపు వెళ్ళేవారు.

ఓ మక్కా వ్యాపారి బానిసలను అమ్మే బజారు నుండి 'సుహైబ్'వారిని కొన్నారు. ఇప్పుడు మక్కా వైపు ప్రయాణం మొదలైంది. ఎడారి ప్రయాణం. మరలా ఓ కొత్త వాతావరణానికి అలవాటు పడాలి. ఆ ఎడారి వేడి ఆనాడు ఆయనను బాధించి ఉండవచ్చేమో! కాని అల్లాహుతాలా ఆయనను నరకాగ్ని వేడి నుండి తప్పించారనే శుభవార్తను తరువాయి కాలంలో సకల లోకాలకు కారుణ్యమైన ముహమ్మద్(స) వారి నోట విన్నారు. శాశ్వత సుఖాన్ని అందుకో బోయే ముందు, ఇహలోకంలో అశాశ్వతమైన కొన్ని కష్టాలు మాత్రమే ఇవి.

మక్కాకు తీసుకు వచ్చిన తరువాత ఆ వ్యాపారి, సుహైబ్ వారిని మరొకరికి అమ్మివేసారు.

మక్కా నగరంలో ఉన్నత వ్యక్తిత్వం గల ఒకాయన 'సుహైబ్' వారిని కొన్నారు. ఆ యజమాని పేరు అబ్దుల్లాహ్ బిన్ జద్'అన్. కొన్నాళ్ళ తరువాత ఆయన సుహైబ్ వారికి స్వేచ్ఛనిచ్చినట్లు ప్రకటించారు.

అంతేకాదు అల్లాహుతాలా ఆయనపై ఎన్నో అనుగ్రహాలు కురిపించారు.

అబ్దుల్లాహ్ బిన్ జద్'అన్ కేవలం స్వేచ్ఛనిచ్చి వదిలేయలేదు. సుహైబ్(రజి)వారికి వ్యాపార మెళుకువలు నేర్పి, వ్యాపారం ప్రారంభించడానికి కొంత ధనం కూడా ఇచ్చారు. ఆయన వ్యాపారం ప్రారంభించారు. ఆయన వ్యాపారం వృద్ధి చెందింది. ఆయన చాలా శ్రమించారు. అల్లాహ్ ఆయనను ధనవంతుడిని చేసారు.

అయితే తబఖాత్ ఇబ్నె సాద్ ప్రకారం, ఆయన రోమన్ల నుండి తప్పించుకుని మక్కా చేరుకున్నారు. అక్కడ అబ్దుల్లాహ్ బిన్ జద్'ఆన్ గారి శరణు పొందారు (హలీఫ్‌గా). ఏది ప్రామాణికమో అల్లాహ్‌కే తెలియాలి. ఒకటి మాత్రం స్పష్టం - **రోమన్ల దగ్గర బానిసగా బ్రతికిన ఆయన మక్కాలో స్వేచ్ఛ పొందారు.**

సరిగ్గా అప్పుడే మక్కాలో సర్వమానవాళి సంస్కరణకై ఓ ఉద్యమం ప్రారంభమైంది. దాని ఫలితంగా మానవ చరిత్రలో మరపురాని, మరువలేని ఓ అద్భుతం జరుగుతుందని అరబ్బులెవరూ ఊహించ లేదు. ఉద్యమం ప్రారంభమైన అతి తక్కువ కాలంలో (అంటే 40 సంవత్సరాల లోపే) మిగతా ప్రపంచంచే చులకన గావించబడిన ఎడారివాసులైన అరబ్బులు ప్రపంచంలోని అధిక భూభాగానికి పరిపాలకులు అయ్యారు.

ఈ అద్భుత సంస్కరణ మొదలైన తొలి రోజులు అవి.

ఈ విషయం సుహైబ్(రజి)వారి చెవిని కూడా పడింది, ముహమ్మద్(స)వారు అల్లాహ్‌చే పంపబడిన సందేశహరులని, ప్రజలను అజ్ఞాన అంధకారాల నుండి జ్ఞానవెలుగులోకి తన బోధనల ద్వారా తీసుకు వస్తున్నారని. విగ్రహారాధనను మానుకొమ్మని మరియు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని ఆయన చేస్తున్న బోధనలను మక్కా నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. శిక్షిస్తామని హెచ్చరించారు. ఆ ధర్మాన్ని స్వీకరించిన కారణంగా ఎందరినో తీవ్ర హింసలకు గురిచేసారు. కాని ఇస్లామ్ స్వీకరించినవారు స్థిరత్వం కోల్పోకుండా సహనంతో ఆ హింసలన్నింటినీ భరించారు. ఇంతకు పూర్వమే వాటన్నింటిని శాంతిబాటలో అందించడం వలన ఇక్కడ వాటి వివరాలు మరలా ఇవ్వడం లేదు.

అల్లాహ్ అనుగ్రహం వలన సుహైబ్ వారి మనస్సులో ఆ బోధనల గురించి తెలుసుకోవాలనే తపన మొదలైంది.

ఈ ధర్మం మానవ హక్కుల పరంగా ధనవంతులను, ఉన్నత వంశస్థులను మరియు బానిసలను సమానం చేసింది. ఇది నాయకుల అహాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. అక్కడ నెలకొని ఉన్న పరిస్థితుల దృష్ట్యా, సుహైబ్(రజి) వారు నేరుగా ప్రవక్త(స)వారిని కలవలేరు. విశ్వాసం స్వీకరించిన ఓ వ్యక్తి ద్వారా ముహమ్మద్(స)వారు దార్ అన్-నద్వాలో రహస్యంగా బోధిస్తున్నారని తెలుసుకుని ఆయన అక్కడికి వెళ్ళారు.

ఆ ఇంటి ద్వారం దగ్గర మరొక యువకుడు కూడా ఉన్నారు. ఆయన పేరు 'అమ్మార్ బిన్ యాసిర్'. కాస్సేపు లోపలకు వెళ్ళడానికి తటపటాయించారు. చివరికి 'అమ్మార్' గారితో ఆయన ఉద్దేశం గురించి అడిగారు. ఆయన ముహమ్మద్(స)వారి బోధన వినాలనుకుంటున్నానని చెప్పారు. ఈయనకూ అదే కోరిక. ఇద్దరూ లోపలకి వెళ్ళారు. లోపల బానిసలే కాదు, ఉన్నత వంశానికి చెందినవారు కూడా ఉన్నారు. అంటే సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ముహమ్మద్(స)వారి బోధన పట్ల ఆకర్షితులయ్యారు.

ముహమ్మద్(స)వారి బోధన విని, సుహైబ్(రజి)వారు వెంటనే ఇస్లామ్ స్వీకరించారు. అమ్మార్(రజి) వారు కూడా ఇస్లామ్ స్వీకరించారు.

సుహైబ్(రజి) మక్కాలో జన్మించిన వ్యక్తి కాదు. ఇక్కడ ఆయనకు అండగా నిలవడానికి ఆయనకు అంటూ ఏ అరబ్ తెగ కూడా లేదు. కాబట్టి ఆ ఇంటి నుండి బయటకి వస్తుండగా ఖురైషులు చూస్తే ప్రమాదం. ఆయన సాయంత్రం వరకూ అక్కడే ఉండిపోయారు. చీకటి పడిన తరువాత అక్కడి నుండి బయలుదేరారు.

సుహైబ్(రజి) రహస్యంగా ఇస్లామ్ స్వీకరించిన విషయం మక్కా నాయకులకు తెలిసిన తరువాత వారి కౄరత్వానికి ఆయన కూడా గురికావలసి వచ్చింది. మక్కా అవిశ్వాసుల హింస పెరగడంతో ముహమ్మద్(స)వారి ఆదేశం మేరకు కొందరు అబిసీనియాకు వలస వెళ్లారు.

మదీనాకు హిజ్రత్ (వలస) చేయవలసి ఉంటుందని ముస్లిములతో ముహమ్మద్(స)వారు చెప్పిన రోజునే సుహైబ్(రజి)వారు నియ్యత్ చేసుకున్నారు, ప్రవక్త(స) వారితో కలిసి హిజ్రత్ చేయాలని. చాలా మంది మదీనాకు హిజ్రత్ చేశారు. సుహైబ్(రజి)వారు మక్కాలోనే ఉండి పోయారు.

ముహమ్మద్(స)వారు అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారితో మదీనాకు హిజ్రత్ చేశారని తెలిసిన తరువాత ప్రవక్త(స)వారు లేకుండా ఒక్కరోజు కూడా మక్కాలో ఉండటం ఆయనకు చాలా కష్టమై పోయింది.

అవిశ్వాస నాయకులు ముస్లిముల కదలికలను గమనిస్తూనే ఉన్నారు. సుహైబ్(రజి)వారిపై కూడా వారి నిఘా ఉంది. ముస్లిముల ఇండ్ల దగ్గర కాపలా ఉంది. ఒక చలిరాత్రి కడుపులో ఏదో సమస్య ఉన్నట్లుగా నటిస్తూ ఆయన కాలకృత్యానికి వెళుతున్నట్లు చాలాసార్లు లోపలకి మరియు బయటకు వెళ్ళడం చూసి, కాపలాదారులు లాత్ మరియు ఉజ్జా లే ఆయన సమస్యకు కారణమని చెప్పుకుని కాస్త విరామం తీసుకుని నిద్రపోయారు.

దానిని అవకాశంగా తీసుకుని ఆయన తన వాహనంపై మదీనాకు బయలుదేరారు. కాపలాదారులకు మెలకువ రాగానే సుహైబ్(రజి)గారు తప్పించుకున్నారని అర్థమైంది. గుఱ్ఱాలు సిద్ధం చేసుకుని ఆయనను పట్టుకోవడానికి బయలుదేరారు. వారు తనను సమీపించడం చూసి, సుహైబ్(రజి)వారు కొండపైకి అధిరోహించారు.

సుహైబ్(రజి)వారు తన వాహనాన్ని దిగారు. వారికి అభిముఖంగా నిలుచున్నారు. తన అమ్ముల పొది నుండి మొత్తం బాణాలను బయటకి లాగారు మరియు ఆ సమూహంతో అన్నారు :

**"ఓ ఖురైష్ లారా! మీ కందరికీ తెలుసు ఇక్కడ ఉన్న మీరందరి కంటే నేను విలువిద్యలో చాలా శ్రేష్ఠుడనని. నా బాణం ఎన్నడూ దాని లక్ష్యాన్ని తప్పదు. ఇప్పుడు, నేను అల్లాహ్‌పై ప్రమాణం చేస్తున్నాను మీరెవరూ నన్ను చేరుకోలేరు ఒక్క బాణం సైతం నా అమ్ముల పొదిలో ఉన్నంత వరకూ. ఇక బాణాల తరువాత నేను నా ఖడ్గాన్ని ఉపయోగిస్తాను నాకు చేతనైనంత వరకూ. ఆ తరువాతే మీరు చేయగలిగేది చేయగలరు..."**

**"నీవు మా భూభాగానికి వచ్చినపుడు నీ దగ్గర ఏదీ లేదు కాని ఇప్పుడు నీవు ఇక్కడ నుండి భారీ సంపద తీసుకెళుతున్నావు. నీ ప్రాణం మరియు ధనంతో తప్పించుకుని వెళ్ళనివ్వం"**

**"నేను నా ఐశ్వర్యాన్ని వదిలేస్తే మీరేం చేస్తారు? నా దారిన నన్ను పోనిస్తారా?"**

వారు అంగీకరించారు. మక్కాలో తన సంపద ఎక్కడ ఉందో. చెప్పి వెళ్లి దానిని తీసుకోమన్నారు.

ఆయన ప్రయాణ వేగం పెంచారు. **అల్లాహ్‌ను ప్రశాంతంగా ఆరాధించుకోవడానికి ఇక స్వేచ్ఛ దొరికింది. ముహమ్మద్(స)వారిని కలవబోతున్న ఆనందం ఆయనను తొందరపెట్టింది.** అంతేకాకుండా ఈ ఆలోచనే ఎక్కడైనా ఆయన అలిసిపోతే కొత్త శక్తిని ఇచ్చేది.

సుహైబ్(రజి) సురక్షితంగా మరియు గాయపడకుండా మదీనా చేరారు.

ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) మరియు సహాబాలు సుహైబ్ (రజి) వారిని మదీనా పొలిమేరలకు దగ్గరలో ఉన్న అల్-హర్రా (నల్లటి రాళ్ళతో ఉన్న చదునైన భూమి) దగ్గర కలిసారు. వారు ఆయనతో చెప్పారు: "**నీ లావాదేవీ నిశ్చయంగా విజయవంతమైంది.**"

ఆయన వారికి సమాధాన మిచ్చారు : "**మీకు కూడా, మీ లావాదేవీలు అల్లాహ్ ఎన్నటికీ విఫలం కాకుండా చేయుగాక! ఏమిటి విషయం?**"

ఉమర్(రజి)వారు ఆయనకి చెప్పారు, ఆయన గురించి అల్లాహుతాలా ఆయత్ (2:207) అవతరింప జేశారని.

**"మరియు మానవులలో ఒకడున్నాడు అతడు అల్లాహ్ ప్రసన్నత కొరకు తన ప్రాణాన్ని స్వయంగా అమ్ముకున్నాడు ..."** (ఖుర్ఆన్ 2:207)

అది వినగానే సంతోషంతో ఆయన ముఖం ప్రకాశించింది. ప్రవక్త(స) వారితో చెప్పారు, **"అల్లాహ్ సాక్షి! ఓ రసూలల్లాహ్(స)! నాకంటే ముందు ఎవరూ రాలేదు మరియు జిబ్రీల్(అ) మాత్రమే దీని గురించి మీకు తెలుపగలరు."**

జరిగినదంతా సుహైబ్(రజి)వారు వివరించి చెప్పారు. ముహమ్మద్(స) వారు ఇలా అన్నారు: **"నీ బేరం లాభదాయకం అబూ యహ్యా! నీ బేరం లాభదాయకం అబూ యహ్యా!"**

విశ్వాసం స్థిరంగా ఉంటే బంగారం, డబ్బు మాత్రమే కాదు, **మొత్తం ప్రపంచమే తృణప్రాయం అవుతుంది**. ఈయన సున్నిత మనస్కులు మాత్రమే కాదు, అప్పుడప్పుడు జోక్స్ కూడా వేస్తుండేవారు. ఉదాహరణగా ఒక సంఘటన ఇక్కడ చెప్పాల్సి ఉంది.

మదీనా చేరుకునేటప్పటికి ఈయన ఆకలిదప్పులతో ఉన్నారు. కొందరు సహాబాలు ఖర్జూరాలు తింటున్నారు. ఈయన కూడా తినడం ప్రారంభించారు. ఆయన తినే విధానం చూసి ఆయన చాలా ఆకలితో ఉన్నారని వారు గ్రహించారు. అయితే ఆయన కన్ను ఒకటి వాచి ఉంది. పైన కట్టు కట్టబడి ఉంది. దానర్థం అది నొప్పి కలిగిస్తుంది. అదే గనుక అయితే ఖర్జూరాలు తినడం ప్రమాదం.

ఉమర్(రజి)వారు అక్కడే ఉన్నారు. ఆయన అది చూసి ప్రవక్త(స)వారితో చెప్పారు, "ఓ రసూలల్లాహ్(స)! అతని కన్ను నొప్పి కలిగిస్తుంది. అయినప్పటికీ ఆయన ఖర్జూరాలు తీసుకుంటున్నారు ఆ విధంగా"

ప్రవక్త(స)వారు సుహైబ్(రజి)వారిని అడిగారు, "నీవెందుకు ఖర్జూరాలు తీసుకుంటున్నావు నీ కన్ను నొప్పి కలిగిస్తున్నప్పుడు?"

సుహైబ్(రజి) చెప్పారు, "ఓ రసూలల్లాహ్(స)! నేను నొప్పి కలిగించని వైపు నుండి తింటున్నాను."

ఆ సమాధానం విని ముహమ్మద్(స)వారు చిరునవ్వు నవ్వారు.

అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారితో సుహైబ్(రజి)వారు అన్నారు: **"మీరు ప్రవక్త(స)వారితో వచ్చేసారు, నన్ను అక్కడ వదిలేసి."** ప్రవక్త(స)వారితో కూడా చెప్పారు, "ఓ రసూలల్లాహ్(స)! నా తల్లిదండ్రులు మీకు అర్పింతు గాక! మీరు కూడా ఈ దీనుడిని మరచిపోయారు."

మదీనాలో కూడా ముస్లిములు ప్రశాంతంగా బ్రతక కూడదని అవిశ్వాసులు యుద్ధాలు చేసారు. వాటిలో తొలి యుద్ధం బద్ర్ ప్రాంతంలో జరిగింది. బద్ర్ యుద్ధం మొదలుకొని ప్రతీ యుద్ధంలోనూ సుహైబ్(రజి) ప్రవక్త(స)వారితో ఉన్నారు.

ఉహుద్ యుద్ధం సందర్భంగా ముహమ్మద్(స)వారు 50 మంది విలుకాండ్రను ఒక కొండపై తమ స్థానాలలో ఉండాలని ఆదేశించారు. అంటే ఈ విలుకాండ్రు ముస్లిమ్ సైన్యానికి వెనుక భాగాన ఉంటారు. కాబట్టి వెనుకవైపు నుండి అకస్మాత్తుగా శత్రువులు గనుక దాడిచేస్తే ఈ విలుకాండ్రు వారిని తమ బాణాలతో ఎదుర్కోవలిసి ఉంటుంది.

యుద్ధవ్యూహం పకడ్బందీగా ఉంది. అయితే ఓ పొరపాటు జరిగింది. దాని వలన తీవ్రనష్టమే జరిగింది.

శత్రు సైన్యాన్ని ముస్లిములు పారద్రోలుతున్నారు. ఈ విలుకాండ్రు అది చూశారు. వారిలో కొందరు తమ స్థానాలను వదిలి యుద్ధ ప్రాప్తి కోసం క్రిందికి దిగారు. ఎందుకంటే యుద్ధం ముగిసిపోయిందని వారు భావించారు. ఈ 50 మందిలో 8 మంది మాత్రమే ప్రవక్త(స)వారు ఆదేశించిన స్థానాలలో నిలబడి ఉన్నారు.

ఖురైషీలలో కొందరు గుర్రపు రౌతులు వీరు క్రిందికి దిగడాన్ని గమనించారు. అదే సరియైన అవకాశంగా భావించి వారు వెనుక వైపు నుండి ముస్లిములపై దాడి చేసారు. సుహైబ్(రజి)వారు తన స్థానాన్ని వీడలేదు.

ముహమ్మద్(స)వారికి బాణాలు తగలకుండా సుహైబ్(రజి) తన శరీరాన్ని అడ్డుపెట్టి యుద్ధం చేశారు.

ఆయనకు విలువిద్యలో మరియు ఖడ్గ విద్యలో మంచి ప్రావీణ్యం ఉంది. ధైర్య సాహసాలు గల యోధుడిగా ఆయన యుద్ధరంగాలలో నిరూపించుకున్నారు.

**శతృవు ఎవడైనా వాని తల నుండి పాదాల వరకూ కవచం ధరించినట్లు కనిపిస్తే, ఆయన అతడి కంటిని లక్ష్యంగా చేసుకుని చాలా ఖచ్చితంగా బాణం వదిలేవారు, ఆ శతృవు మరణాన్ని తప్పించు కోలేని విధంగా.**

ప్రవక్త(స)వారు తరచుగా ఆయన నిజాయితీ, పట్టుదల మరియు ధైర్యాన్ని మెచ్చుకునేవారు. సుహైబ్(రజి)వారిని ప్రవక్త(స)వారు చాలా ఎక్కువగా అభిమానించేవారు.

ఆ'ఇజ్ బిన్ అమ్ర్(రజి)వారి ఉల్లేఖనం: కొందరితో ఉన్న సల్మాన్ (ఫార్సీ-రజి), సుహైబ్(రజి) మరియు బిలాల్(రజి) దగ్గరకు అబూ సుఫ్యాన్ వచ్చారు (*అప్పటికి ఆయన ఇంకా ఇస్లామ్ స్వీకరించ లేదు. ఇస్లామ్‌కి శతృవుగానే ఉన్నారు.*) మరియు వారు అన్నారు: **"అల్లాహ్ సాక్షి! అల్లాహ్ యొక్క ఖడ్గాలు అల్లాహ్ యొక్క శతృవు మెడను చేరలేదు అవి చేరవలసి ఉంది."** (అది విని అక్కడే ఉన్న) అబూ బక్ర్(రజి)వారు అన్నారు : "మీరు ఇది చెబుతారా, ఖురైషీలలో పెద్దాయన మరియు నాయకునికి?" ఆయన(రజి) ప్రవక్త(స)వారి దగ్గరికి వెళ్ళి చెప్పారు మరియు ఆయన(స) చెప్పారు:

**"ఓ అబూ బక్ర్! బహుశా మీరు వారికి ఆగ్రహం కలిగించినట్లున్నారు. మరియు మీరు వారికి ఆగ్రహం కలిగించి నట్లయితే, మీరు మీ ప్రభువుకు ఆగ్రహం కలిగించినట్లే."**

అబూ బక్ర్(రజి)వారు (గాభరాగా) వారి దగ్గరికి వెళ్ళి అడిగారు : **"ఓ నా సోదరులారా! నేను మీకు కోపం కలిగించానా?"**
వారు అన్నారు : **"లేదు మిమ్మల్ని అల్లాహ్ క్షమించుగాక! ఓ సోదరా!"**

**(సహీహ్ ముస్లిమ్,6412 పుస్తకం 44.ఫజా'ఇల్ సహబహ్, అధ్యా.46,సం. 6)**

ఉమర్(రజి)వారు కూడా సుహైబ్(రజి)వారిని చాలా ఎక్కువగా

అభిమానించేవారు. ఎప్పుడైనా ఉమర్(రజి)వారిని కలవడానికి సుహైబ్(రజి)వారు వస్తే, ఆయన చాలా సాదరంగా స్వాగతించేవారు.

ఒకసారి అబూ సుఫ్యాన్(రజి), సుహైల్ బిన్ అమ్ర్(రజి) మరియు కొందరు ప్రముఖ అరబ్ నాయకులు ఉమర్(రజి)వారిని కలవడానికి వచ్చారు. బయట వేచి ఉన్నారు.

ఆ తరువాత సుహైబ్(రజి)వారు, బిలాల్(రజి)వారు మరియు అమ్మార్ బిన్ యాసిర్(రజి)వారు కూడా ఖలీఫాను కలవడానికి వచ్చారు. ఆ సమయంలో ఉమర్(రజి)వారు ఇంటిలో ఉన్నారు. వచ్చిన సందర్శకుల గురించి ఉమర్(రజి)వారికి తెలియజేయబడింది. అబూ సుఫ్యాన్(రజి) మరియు ఇతర నాయకులు ముందుగానే వచ్చి బయట వేచి ఉన్నారు కాని ఆయన సుహైబ్(రజి), బిలాల్(రజి) మరియు అమ్మార్(రజి)వారికి తొలి ప్రాధాన్యత నిచ్చారు.

అబూ సుఫ్యాన్(రజి) తనను తాను నిగ్రహించుకోలేక పోయారు. ఆయన తనతో ఉన్నవారి వైపు తిరిగి అన్నారు:

**"అల్-హమ్‌దు లిల్లాహ్! అరేబియాలో ఉన్నత వంశస్థులైన మనం తలుపు దగ్గర ఉండగా, బానిసలు ఖలీఫాగారిని చూడటానికి ప్రవేశపెట్టబడ్డారు."**

ఇంకనూ ఇలా అన్నారు: "**ఈ అవమానాన్ని సహించడం మన విధి**"

విశ్వాస బలంలో ఈయన కంటే ఎక్కువైన సుహైల్ బిన్ అమ్ర్(రజి)వారు ఆయనతో పాటు అక్కడ ఉన్నారు. అబూ సుఫ్యాన్(రజి) మాటలను ఆయన తిప్పికొట్టారు.

**"దీనికి ఎవరు నిందించబడాలి? ప్రవక్త(స)వారు మనందరినీ ఒకే స్వరంతో ఆహ్వానించారు. కాని మనం ఆయన పిలుపును ఖండించాము. మతిభ్రమించిన వ్యక్తి అసంబద్ధంగా మాట్లాడుతున్నారు అని తలచాము మరియు ఆయనను తీవ్రంగా నిరోధించాము. అయితే ఈ బానిసలు ముందుకు వచ్చారు మరియు (ఆ పిలుపుకు) అనుగుణంగా స్పందించారు. కాబట్టి ఇప్పుడు మనకంటే ముందు ఉన్నత స్థితికి వారికే హక్కు ఉంది, ఈ లోకంలో మరియు పరలోకంలో. మనకు ఫిర్యాదు చేసేందుకు ఏ కారణమూ లేదు."**

**ఇస్లామ్‌లో తొలి ప్రాధాన్యత తఖ్వా (అల్లాహ్ పట్ల భయం)కే ఉంది.** విశ్వాసి పుట్టుక, రంగు, వంశం, భాష మొదలైన వాటిని బట్టి ఆధిక్యత లభించదు. భాష గురించి చెప్పుకున్నాము కాబట్టి, ఇక్కడ ఒక సంఘటనను గుర్తు చేసుకుందాం.

ప్రవక్త(స)వారి కాలంలో ఒకసారి ఖైస్ బిన్ ముతాతియహ్ అనే మునాఫిక్ (కపట విశ్వాసి) ముస్లిమ్ సమాజంలో వివిధ స్థాయిలలో ఉన్న ప్రజల మధ్య తిరస్కారం మరియు అనుమానాలను నాటాలని ప్రయత్నించాడు.

సల్మాన్ ఫార్సీ(రజి), సుహైబ్(రజి), బిలాల్(రజి) మరియు కొందరు ముస్లిములు కూర్చున్న చోటికి ఖైస్ వచ్చాడు. (ఈ ముగ్గురిని దృష్టిలో పెట్టుకుని) ఇలా వ్యాఖ్యానించాడు:

**"ఔస్ మరియు ఖజ్‌రజ్ తెగలు ఈ వ్యక్తి (ముహమ్మద్-స)కు దన్నుగా నిలిచారు. మరి వీరు ఆయనకు ఏమి చేస్తున్నారు?".**

(అంటే ఆ ప్రాంతంలో పేరు ప్రతిష్టలు ఉన్న రెండు తెగల ప్రజలు ముహమ్మద్(స)వారికి అన్ని విధాలా సహాయపడుతున్నారు మరియు వీరు శరణార్థులుగా వేరే దేశాల నుండి వచ్చిన వారు, వీరికి ఏమి విలువుందనే విధంగా చులకన చేసి మాట్లాడాడు.)

ము'ఆజ్(రజి)వారికి అది వినగానే చాలా కోపం వచ్చింది.

ఆయన వెళ్ళి ప్రవక్త(స)వారికి ఖైస్ పలికిన మాటలు తెలియజేశారు. **ప్రవక్త(స) వారికి కూడా చాలా కోపం వచ్చింది.** ఆయన(స) మస్‌జిద్‌లో ప్రవేశించారు. అజాన్ ఇవ్వబడింది. ప్రజలకు ముఖ్య విషయం తెలపడానికి పిలుపు. ఆయన(స) లేచారు, అల్లాహ్ ఘనతను కొనియాడి చెప్పారు :

**"మీ ప్రభువు ఒక్కరు. మీ పూర్వీకుడు ఒక్కరు. మీ ధర్మం ఒక్కటి. శ్రద్ధ తీసుకోండి. అరబ్బీయం అనేది మీ తల్లి నుండిగాని మీ తండ్రి నుండి గాని ప్రధానం చేయబడదు. అది నాలుక ద్వారా (అంటే అరబీ భాష ద్వారా), కాబట్టి ఎవరైతే అరబీ మాట్లాడు తున్నారో, అతడు అరబ్."**

సుహైబ్(రజి)వారు తన సంపదనంతా దానాల కోసమే ఖర్చు పెట్టేవారు.

సహాయం అందించడం కొరకు అనాథల కోసం, పేదవారి కోసం వెతికేవారు. వారికి సహాయం అందించే వారు. విధవరాళ్ళకు సహాయం చేసేవారు. ఎండిన భూమిపై వర్షం పడినట్లుగా ఈయన చాలా దయ మరియు కరుణ గలవారు ఈయన తన సంపాదన అంతా అవసరంలో ఉన్నవారికి సహాయం చేస్తున్నారని తెలిసి ఉమర్(రజి)వారు ఆయనను ఒకసారి మందలించారు మరియు కొంత భాగం తన కోసం ఉంచుకోమని చెప్పారు.

హమ్‌జ బిన్ సుహైబ్ వారి ఉల్లేఖనం. సుహైబ్ అర్-రూమీ(రజి) వారికి అబూ యహ్యా అనే కున్యా ఉండేది (అంటే 'యహ్యా'కు తండ్రి అని అర్థం), తాను అరబ్బునని చెప్పుకునేవారు, ప్రజలకు చాలా ఎక్కువగా ఆహారం పెడుతుండేవారు. కాబట్టి ఉమర్(రజి) వారు ఆయనను అడిగారు, **"ఓ సుహైబ్! మీకెందుకు అబూ యహ్యా కున్యా ఇవ్వబడింది నీకు** (ఆ పేరుతో) **కుమారుడు లేనప్పుడు, నీవు అరబ్బునని చెబుతావు మరియు నీవు చాలా ఎక్కువగా ఆహారం పెడుతున్నావు అది నీ ఐశ్వర్యంలో చాల ఎక్కువ ఖర్చు."** కాబట్టి సుహైబ్(రజి) సమాధాన మిచ్చారు, "నిశ్చయంగా అల్లాహ్ యొక్క సందేశహరులు(స) (వారే

స్వయంగా) కున్యా పెట్టారు 'అబూ యహ్యా'అని. మరియు మా వంశావళి గురించి మీరు చెప్పినదానికి సంబంధించి, నేను **మౌసుల్** (అరబ్బు యొక్క ఒక తెగ) ప్రజల లోని **నమిర్ బిన్ ఖాసిత్**కు చెందిన వ్యక్తిని (అంటే నా వంశావళి అరబ్). కాని నేను బాలుడుగా ఉన్నప్పుడే బానిసగా పట్టుబడ్డాను మరియు దాని ఫలితంగా నేను నా కుటుంబాన్ని మరియు నా ప్రజలను వదిలేసాను. ఆహారం గురించి మీరు చెప్పిన దానికి సంబంధించి, నిస్సందేహంగా అల్లాహ్ యొక్క సందేశహరులు చెబుతుండేవారు మీలో ఉత్తముడు అతడే ఎవడైతే ఇతరులకు తినిపిస్తాడో మరియు సలామ్‌కు బదులిస్తాడో."

సుహైబ్(రజి)వారు జీవితంలో ఎన్నడూ నిరాశకు గురి కాలేదు. తన జీవితంలో ఎదురైన ఒడిదుడుకులను తన ప్రత్యేక హక్కుగానే ఉపయోగించుకున్నారు. ఆయన తన సమయాన్ని మరియు ఐశ్వర్యాన్ని ఇస్లామ్ కోసం మరియు ముస్లిముల కోసమే ఖర్చు పెట్టారు.

రెండవ ఖలీఫా ఉమర్(రజి)వారు ఫజ్ర్ నమాజ్ చేస్తున్న సమయంలో అబూ లులు అనే వాని కత్తిపోట్లకు గురైనప్పుడు, ఆయన(రజి) ఆరుగురు సహాబాలను పిలిపించారు. వారు: ఉస్మాన్(రజి), అలీ(రజి), తల్హా(రజి), జుబైర్(రజి), అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) మరియు సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి). వారిలో ఏ ఒక్కరినీ ఆయన ఖలీఫాగా నియమించ లేదు. వారిలో వారు సంప్రదించుకుని మరియు ప్రజలతో సంప్రదించి మూడురోజులలో ఖలీఫాను ఎన్నుకోమని వారికి ఆయన సూచించారు. మరియు ఆయన చెప్పారు :

**వల్ యుసల్లి బిన్నాస్ సుహైబ్**

(మరియు ప్రజలకు సలాత్ చేయించమనండి సుహైబ్‌ను).

ఆ విధంగా మూడవ ఖలీఫా ఎన్నిక అయ్యేవరకూ ముస్లిమ్ ఉమ్మత్‌కి సంబంధించి అత్యున్నత స్థానానికి సుహైబ్(రజి)వారు ప్రాతినిధ్యం వహించారు.

**వేరే దేశం నుండి చేతిలో చిల్లిగవ్వ లేకుండా శరణార్థిగా వచ్చిన ఓ బానిస స్వేచ్ఛ పొంది ఉన్నత వంశంలో పుట్టిన నాయకులపై ప్రాతినిధ్యం వహించారంటే, దానికి కారణమైన ఇస్లామ్ యొక్క ఔన్నత్యం ఏమిటో అర్థం చేసుకోవాలి.**

మూడవ ఖలీఫా ఉస్మాన్(రజి)కాలంలో సుహైబ్(రజి) కూఫాకు వెళ్ళారు. కొన్ని సంవత్సరాల తరువాత తిరిగి మదీనాకి వచ్చేశారు. ఆయనను వృద్ధాప్యంలో చూసుకోవడానికి బిడ్డలు లేరు. ఒక రాత్రి తీవ్రంగా జబ్బు పడ్డారు. ఆయన లోకాన్ని వీడారు, తన జ్ఞాపకాలను ఉమ్మత్‌కు వదిలేసి.

ఐశ్వర్యం కాదు, ఆయన త్యాగమే ఆయన కీర్తి ప్రతిష్టలు పెంచింది. స్వర్గ శుభవార్త నందించింది. ఖయామత్ వరకూ ఖుర్'ఆన్ తఫ్సీర్ చదివిన ప్రతీ ముస్లిమ్ సుహైబ్(రజి)వారి త్యాగాన్ని గుర్తు పెట్టుకుంటాడు. ఇది అల్లాహ్ తరపునుండి లభించిన అసాధారణమైన అనుగ్రహం. ఇస్లామీయ చరిత్రలో ఈయనకంటూ ఓ ప్రత్యేక స్థానం ఉంది.

రోమన్ల దగ్గర బానిసగా 20 సంవత్సరాలు గడిపిన ఈ విశ్వాసికి స్వేచ్ఛ విలువ మరియు ఐశ్వర్యం విలువ బాగా తెలుసు. ఏదైతే జీవితంలో కోల్పోయారో వాటిని అల్లాహుతాలా ఇచ్చారు. కాని అల్లాహ్ పట్ల ఆయన కున్న విధేయత మరియు ముహమ్మద్(స)వారిపై ఆయనకున్న ప్రేమ ఆ ఐశ్వర్యాన్ని తృణప్రాయంగా తీసి పారేసింది.

**అల్లాహ్ ప్రసన్నతకు మించిన ఐశ్వర్యం లేదని ఆయన ఆచరించి చూపారు.**

- నేడు ఇస్లామ్ స్వీకరించినవారు ఈ విశ్వాసి గడిపిన జీవితాన్ని విశ్లేషించి అర్థం చేసుకోగలిగితే, వారు ఎదుర్కొనే కష్టాలు చాలా అల్పంగా అనిపిస్తాయి.
- ఆయన తనకు ప్రావీణ్యం ఉన్న విద్యను ప్రవక్త(స)వారి భద్రత కోసం ఉపయోగించారు. నేడు కూడా ముహమ్మద్(స)వారి మహోన్నత శీలంపై ఎందరో దాడి చేస్తున్నారు. ఈ మహా యోధుడిని స్ఫూర్తిగా తీసుకుని మనం కూడా ఆ దాడిని ఎదుర్కోవాలంటే, కావలిసినవి ఆయుధాలు మరియు బాణాలు కాదు. కేవలం సున్నత్‌లు మాత్రమే. ప్రవక్త(స)వారు ఆచరించి బోధించిన ఒక్కొక్క సున్నత్‌ను మనం ఆచరిస్తూ ఉత్తమ వ్యక్తిత్వాన్ని అలవరచుకుంటే, మన ఒక్కొక్క మంచి ఆచరణ ఒక బలమైన ఆయుధం అవుతుంది.
- ఖైస్ అనే మునాఫిక్ ముస్లిమ్ సమాజంలోని వివిధ స్థాయిలకు చెందిన వారి మధ్య ఐక్యతను నాశనం చేయడానికి ప్రయత్నించాడు. ఈనాడు మన సమాజంలో మునాఫిక్‌ల (కపట విశ్వాసుల) సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. ధన వ్యామోహంతో కొందరైతే ఓ మతవర్గం వారితో చీకటి ఒప్పందాలు చేసుకుని, ఇస్లామ్‌పై నిందలు పడేలా చేస్తూ ముస్లిముల ఐక్యతను సర్వనాశనం చేస్తున్నారు. ఇస్లామ్ అంటే అవగాహన లేనివారు, సున్నత్‌కు వ్యతిరేకంగా ఇతర ధర్మాలతో వాదనలు పెట్టుకుంటూ అది ధర్మ సందేశ ప్రచారం అని చెప్పి ప్రజలను మోసగిస్తున్నారు. ముహమ్మద్(స)వారి **సున్నత్‌ని మనం కాపాడు కోవాలి.**
- **సల్మాన్ ఫార్సీ(రజి)వారు** కూడా పర్షియాలో విలాసవంతంగా, అపురూపంగా పెరిగి సత్యాన్వేషణలో ఎన్నో కష్టాలకు గురై, ఒకరి నుండి మరొకరికి బానిసగా అమ్ముడవుతూ చివరకు ముహమ్మద్(స)వారిని కలుసుకుని ఇస్లామ్ స్వీకరించారు. ఈయన ఫార్సీ.

  **బిలాల్(రజి)వారు** కూడా ఇస్లామ్‌కు పూర్వం బానిసే. ఆయన కూడా అరబ్ కాదు. ఆయనది ఆఫ్రికా.

*(శాంతిబాట సంచికలో ఈ విశ్వాసుల గురించి ఇది వరకే వివరించాము.)*

**సుహైబ్(రజి)వారు** కూడా రోమ్ దేశం నుండి బానిసగానే మక్కాలో ప్రవేశించారు. ఈయన రూమీ.

వాస్తవానికి ముస్లిమేతరుల దృష్టిలో వీరు సమాజంలో అణగారిన వర్గం. కాని వీరికి కోపం కలిగిస్తే, అల్లాహ్‌కు కోపం కలిగించినట్లేనని అంటే, **వీరిని ఇస్లామ్ ఎంత గొప్ప స్థానంలో ఉంచిందో అర్థం చేసుకోవాలి. సమానత్వాన్ని బోధించడమే కాకుండా ఆచరణలో పెట్టడం జరిగింది.**

మరి నేటి మన సమాజంలో అటువంటి పరిస్థితి లేకపోతే దానికి కారణం ఏమిటి? కారకులు ఎవరు?

- సుహైబ్(రజి)వారు పేదవారిని వెతికి మరీ సహాయం చేసేవారు. కాని నేడు విధిగా ఇవ్వవలసిన జకాత్‌ని అల్లాహ్ ఆదేశించినట్లు పేదవారికి అందించడానికి ఆ విధంగా వెతికి ఎంతమంది ఇస్తున్నారు?
- **తఖ్వాయే సమాజంలో ఒకరి స్థాయిని నిర్ణయించేది.** నేడు తఖ్వా ఉండవలసని స్థానంలో **ధన వ్యామోహం ఉంది.** తఖ్వా లేదంటే జ్ఞానం లేనట్లే. ఎందుకంటే అల్లాహ్ చెప్పినట్లు జ్ఞానం కలవాడు మాత్రమే అల్లాహ్‌కు భయపడతాడు.

**అల్లాహ్ ప్రసన్నత కొరకు ఐశ్వర్యాన్ని వదిలేసారు.**

కాని నేడు

**ఐశ్వర్యం కోసం అల్లాహ్ మార్గాన్ని వదిలేస్తున్నారు.**

**ప్రతీ సంచికలో ఒక సహాబీ గురించి తప్పనిసరిగా అందించాలని ఎందరో పాఠకులు కోరుతూనే ఉన్నారు.** వారి త్యాగాలు మరియు ఆచరణ ఎందరికో స్వాంతన నిస్తున్నాయి. అయితే కొందరికి అవి వారి సంస్కార హీనతను వేలెత్తి చూపుతున్నాయి. కాబట్టి వారు సహాబాలను ఈసడిస్తూ మాట్లాడుతున్నారు. వారి సంస్కార హీనతను చూసి జాలిపడటం తప్ప మనం చేయగలిగిందేమీ లేదు.

ముహమ్మద్(స)వారు సహాబాల గురించి ఏమి చెప్పారో చూడండి:

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు. **సహాబాలను** (నా అనుచరులను) **నిందించకండి. సహాబాలను నిందించకండి.** ఆయన సాక్షి ఎవరి చేతులలో నా ఆత్మ ఉందో! మీలో ఒకరు ఉహుద్ (పర్వతం)కు సమానమైన బంగారాన్ని (అల్లాహ్ మార్గంలో) ఖర్చు చేసినా, అది వారి (సహాబాల) యొక్క ముద్ద్ పరిమాణానికి సరిపోదు లేక దానిలో సగానికి సైతం (సరిపోదు). **(సహీహ్ ముస్లిమ్, 6487, పుస్తకం 44, అధ్యా. 54, సంపుటి 6)**

(ముద్ద్ అంటే దాదాపు 700 గ్రాములు. ఒక 'సా' పరిమాణంలో 4వ వంతు)

**వేల కోట్ల పరిశ్రమ**

మన దేశంలో 'జకాత్' వేల కోట్ల పరిశ్రమ అయిపోవడం మరియు దానిని 'దావత్' మరియు 'మదరసా విద్య' పేరుతో దారి మళ్ళించడంతో మునాఫిక్‌ల సంఖ్య రాష్ట్రంలో విపరీతంగా పెరిగి పోయింది.

'చాలా మందిని ధర్మం లోకి మార్చేసాము' అని చెబుతూ, వారి ఫొటోలు తీసి, వీడియోలు తీసి వాటిని చూపించి నేటి దాయీలు డబ్బు దండుకుని లగ్జరీ కార్లు, వివిధ ప్రాంతాలలో భవంతులు, ఐశ్వర్యం పెంచుకుంటున్నారు.

కొందరైతే ఇస్లామ్‌పై బురద చల్లడం కోసం మరియు ఇస్లామ్‌ను అవమానించాలని ఈ జకాత్ సొమ్మును మాత్రమే కాకుండా, ఒక మత ధర్మం వారి నుండి డబ్బు తీసుకుని, కొందరు మునాఫిక్‌లను తయారుచేసి వారిని మస్‌జిద్‌లకు పంపుతున్నారు.

వారు చేసే నమాజ్‌లలో అల్లాహ్ స్మరణకు బదులు, ముస్లిమేతర గ్రంథాలలోని వాక్యాలు కావాలని చదువుతున్నారు. కాని మస్‌జిద్‌లు అల్లాహ్ స్మరణకే కేటాయించబడ్డాయి. రెండు సంవత్సరాలుగా ఒక వ్యక్తి మస్‌జిద్‌కు వస్తున్నట్లు చెప్పాడు. ఖుర్ఆన్ ఇవ్వబోతే దానిని చదవవద్దని వారి బాస్ చెప్పాడని తెలిపాడు. అనుమానం వచ్చి ఆరా తీస్తే, అతడు ఏనాడూ ఖుర్ఆన్ చదవలేదు.

నమాజ్‌లలో చదివే చిన్న చిన్న సూరహ్‌లు కూడా రావు. అతని పూర్వ ధర్మ గ్రంథాలలోని వాక్యాలే చదువుకోమని వారి బాస్‌లు చెప్పారని తెలిపాడు. కాని **ఇటువంటి వారు కూడా నవముస్లిములుగా పరిగణించ బడుతున్నారు.**

ఈ మునాఫిక్ వర్గం యొక్క ముఖ్య స్థావరం తూర్పుగోదావరి జిల్లాలో స్థాపించబడింది. రాష్ట్రమంతా విస్తరించింది. వీరి యొక్క సెంటర్లు అన్ని జమాత్‌ల తరపున ఏర్పాటు చేశారు. వీరి గురించి అన్ని జమాత్ నాయకులకు తెలుసు. కాని **ఆ నాయకుల కళ్ళకు, చెవులకు, చేతులకు, నవనాడులకు ధనవ్యామోహం పొరలు కప్పేసింది.**

ఇటువంటి వారిని దృష్టిలో పెట్టుకుని, ప్రతీ ఒక్కరినీ అనుమానించడం సమంజసం కాదు.

ప్రజలకు తెలియకుండా సమాజంలో జరుగుతున్న ఘోరాల గురించి వివరించడానికి కారణం ముస్లిమ్ సమాజాన్ని అప్రమత్తం చేయాలని మాత్రమే.

**కొందరు అంటుంటారు : "రోజూ మస్‌జిద్‌కు వెళ్ళి నమాజ్‌లు చేస్తున్నాము. అయినా సరే మాకే ఎందుకు ఈ కష్టాలు వస్తున్నాయి?"**

అల్లాహ్ పట్ల భరోసా ఏమయిపోయింది అని తమలో తాము ఒక్కసారైనా ఆలోచన చేస్తే సమాధానం దొరుకుతుంది.

**సమాజం పట్ల ఉన్న ఉమ్మడి బాధ్యతను విస్మరించి, ఎవరిపైనో నిందలు వేయడం ఎందుకు?**

ప్రతీ ముస్లిమ్ తనపై నున్న బాధ్యత ఏమిటో ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలను చదివి తెలుసుకోవాలి.

నమాజ్ చేయడం ఒక్కటే ముస్లిమ్ యొక్క బాధ్యత అని అనుకునే ప్రతీ ఒక్కరూ తమకు ఇస్లామ్ పట్ల ఏమాత్రం అవగాహన లేదని తెలుసుకోవాలి.

**ఇస్లామ్ స్వీకరించిన తరువాత కష్టాలు మొదలు అయ్యాయని నిందించేవారు, తమ విశ్వాసం పట్ల మరియు తఖ్వా పట్ల అనుమాన పడాలి.**

**ఇస్లామ్ సంతోషమయ జీవన మార్గదర్శి.**

ఇస్లామ్ స్వీకరించేవారికి ఉండవలసిన ఏకైక లక్ష్యం

స్వర్గం

**అటువంటి లక్ష్యం ఉన్నవారు కష్టాలలో మరియు సుఖాలలో ఎల్లప్పుడూ సంతోషంగా జీవించగలుగుతారు.**

**ముస్లిమ్ అయిపోయనంత మాత్రాన స్వర్గం లేదు.**

**మోమిన్ (విశ్వాసి)కి మాత్రమే స్వర్గం ఉంది.**

**ముహమ్మద్(స)వారిని అందరికంటే మరియు అన్నిటికంటే ఎక్కువగా ప్రేమించకపోతే, అతడు మోమిన్ కాడు.**

## కష్టం తీరాలా? లేక స్వర్గం కావాలా?

## సహనాన్ని అల్లాహ్ ఇష్టపడతారు

అతా'బిన్ అబీ రబహ్ ఉల్లేఖనం : ఇబ్నె అబ్బాస్(రజి)వారు నాతో చెప్పారు : **'నేను నీకు చూపించనా స్వర్గవాసులలోని ఒక స్త్రీని?'**

నేను చెప్పాను : 'అలాగే (చూపండి)'

ఆయన చెప్పారు : ఈ నల్లటి స్త్రీ ప్రవక్త(స)వారి దగ్గరకు వచ్చి అడిగారు: **"నాకు మూర్ఛ రోగం (epilepsy) ఉంది మరియు (దాని కారణంగా) నా దుస్తులు తొలగిపోతున్నాయి. అల్లాహ్‌ను ప్రార్థించండి నా కొరకు."**

ఆయన(స) చెప్పారు :

**"నీవు కోరితే సహనం వహించు. మరియు స్వర్గం నీదవుతుంది. లేక నీవు కోరితే నేను అల్లాహ్‌ను ప్రార్థిస్తాను నీకు నయం కావాలని."**

ఆమె చెప్పారు :

**"నేను సహనవతిగా ఉంటాను."**

ఆమె అడిగారు :

**"కాని నా ఆచ్ఛాదన తొలగిపోతుంది. అల్లాహ్‌ను ప్రార్థించండి నేను అనాచ్ఛాదితం కాకుండా."**

కాబట్టి ఆయన(స) ఆమె కొరకు ప్రార్థించారు.

ఆలోచించగలిగే వారికి పై హదీస్‌లో బోధపడే అంశాలెన్నో ఉన్నాయి.

(సహీహ్ ముస్లిమ్ 6571, పుస్తకం 45, అధ్యా.14, సంపుటి 6)

**"నిశ్చయంగా ఎల్లప్పుడూ కష్టంతోపాటు సుఖం కూడా ఉంటుంది. నిశ్చయంగా ఎల్లప్పుడూ కష్టంతోపాటు సుఖం కూడా ఉంటుంది."**
ఖుర్'ఆన్(94:5,6) ***సహనం వహించండి. అల్లాహ్ వాగ్దానం సత్యమైనది.***

మీ బంధువులు మరియు స్నేహితులను శాంతిబాట చందా దారులుగా చేర్చి సత్యాన్ని వ్యాపింప చేయడంలో సహకరించమని కోరుతున్నాము.

**డి.టి.డి.సి. కొరియర్ ద్వారా కాపీని పొందగోరువారు సంవత్సర చందా రూ. 240/- కు అదనంగా మరో రూ. 100/- చెల్లిస్తే, మీకు కొరియర్ ద్వారా పంపిన వెంటనే కన్‌సైన్‌మెంట్ నంబర్ మీకు ఎస్.ఎమ్.ఎస్. చేస్తాము, ఇన్షా అల్లాహ్**

## కొత్తగా చేరిన పాఠకులకు మా విన్నపం

మాకు ఉన్న పోస్టల్ లైసెన్స్ ప్రకారం ప్రతీ నెల 15వ తారీఖున శాంతిబాట పోస్ట్ చేయవలసి ఉంది. ఒకొక్కసారి కొన్ని వ్యాసాల పరిశోధన కొరకు ఎక్కువ సమయం అవసరమౌతుంది. సాంకేతిక సమస్యల వలన కూడా పత్రిక ఆలస్యం కావచ్చు.

**సంవత్సర చందా వివరాలు :**

**రూ. 240/- పోస్టల్ మనియార్డర్ (M.O.) ద్వారా**

**క్రింది ఎడ్రస్‌కు పంపండి.**

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్, సామర్లకోట-533440
మనియార్డర్ చేయగానే 9491103017కి ఫోన్ చేసి తెలియజేయవలసిందిగా కోరుతున్నాము

**ఎక్కువ చందాలను పంపగోరువారు**
**క్రింది ఎకౌంట్‌లో డిపాజిట్ చేయవచ్చు.**
SBI A/c No. 10428633092
Waltair, Visakhapatnam-530003
Contact : Dr. N. Srinivasa Rao, Cell:9491103017
velugubaata@gmail.com
info@saanthibaata.net

**మొదటి సంవత్సరం సంచికలు**
(తొలి సంచిక ఆగష్టు 2009 మినహా)
**మరియు 2వ సంవత్సరం సంచికలు కావలసిన వారు**
**రూ. 365/- మనియార్డర్ చేయగలరు.**

**మీ కవర్‌పై ఉండే ఎడ్రస్ స్లిప్‌పై మీ ఫోన్ నంబర్ లేకపోయినా లేక మీ నంబర్ మారినా ఆ నంబర్‌ను వెంటనే మాకు తెలియజేయండి.**

20

# బాలబాలికలకు ప్రత్యేకం

**ప్రతీ స్త్రీ లేదా పురుషునికి తొలి బడి అమ్మ ఒడి. గొప్ప గొప్ప జ్ఞానులు, మేధావుల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంటుంది. తొలి గురువులు తల్లిదండ్రులే. ఆ తరువాతనే, పాఠశాలలో చేరిన దగ్గరనుండి, మిగిలిన గురువులు పరిచయమౌతారు. వీరందరిని మీరు గౌరవించాలి. అయితే వీరందరికీ జ్ఞానాన్ని ఇచ్చిన సృష్టికర్తే విశ్వమంతటికీ గురువు - ఆయనే 'అల్లాహ్'. ఏ గురువు చెప్పినా అర్థం కాకపోయినా లేక మరేదైనా చెప్పుకోలేని సమస్య మీకొస్తే డైరెక్టుగా అల్లాహ్‌నే అడగండి. ఆయన వింటాడు. మీకు జవాబు కూడా వస్తుంది. ఆరాధ్యుడిని అర్థం చేసుకుంటే మీరే టాప్ రేంకర్స్.**

## అల్లాహ్ యొక్క ప్రవక్త లూత్(అ)

గత కొన్ని సంచికల నుండి ఒక్కొక్కరిగా అల్లాహ్ పంపిన ప్రవక్తల జీవితచరిత్రను అందించడం ప్రారంభించాము.

**గమనిక :** ఈ వ్యాసం పిల్లలకు అర్థమయ్యే విధంగా ఉండాలని సులభతరం చేసి అందిస్తున్నాము.

(గత సంచిక తరువాయి భాగం)

**మరియు ఇస్మా'ఈల్, అల్-యస'అ, యూనుస్, లూత్ లకు కూడా. ప్రతీ ఒక్కరికీ సర్వలోకాలవాసులపై ఘనతను ప్రసాదించాము.** (ఖుర్'ఆన్ 6:86)

గత రెండు సంచికలలో ఇబ్రాహీమ్(అ) మరియు ఆయన కుమారుడు ఇస్మా'ఈల్(అ) వారి గురించి వివరించడం జరిగింది. ఈ ఇద్దరు ప్రవక్తల గురించి విడివిడిగా చెప్పడం కంటే, కలిపి చెబితేనే స్పష్టంగా అర్థమౌతుంది. ఇబ్రాహీమ్(అ)వారి రెండవ కుమారుడు ఇస్'హాక్(అ)వారి గురించి చెప్పేముందు అప్పటికే ప్రవక్తగా, ఒక జాతి ప్రజలకు అల్లాహ్ యొక్క సందేశాన్ని బోధిస్తున్న ప్రవక్త - లూత్(అ). ఆయన జీవితం గురించి క్లుప్తంగా ఈ వ్యాసంలో ప్రారంభిస్తున్నాము.

**ఇబ్రాహీమ్(అ) మరియు లూత్(అ) దగ్గరి బంధువులు.** ఇబ్రాహీమ్(అ)వారి యొక్క సోదరుని కుమారుడు లేదా సోదరి కుమారుడు లూత్(అ) అని కొన్ని వ్యాఖ్యానాల ద్వారా తెలుస్తుంది. తఫ్సీర్ ఇబ్నె కసీర్‌లో ఆయనను సోదరుని కుమారుడు (అంటే **లూత్ బిన్ హారాన్ బిన్ ఆజర్**) అని తెలిపారు.

ఇబ్రాహీమ్(అ)వారిని రాజు మంటలలో పడవేయించిన సంగతి ఓసారి జ్ఞాపకం చేసుకోండి.

"(ఇబ్రాహీమ్) జాతివారి జవాబు ఈ విధంగా అనడం తప్ప మరొకటి లేకపోయింది : **"ఇతనిని చంపండి లేదా కాల్చివేయండి."** **చివరకు అల్లాహ్ అతనిని అగ్ని నుండి రక్షించాడు. నిశ్చయంగా ఇందులో విశ్వసించేవారికి సూచనలున్నాయి.** (29:24)

(ఇబ్రాహీమ్(అ)వారు చివరిగా తన ప్రజలను ఇలా హెచ్చరించారు)

మరియు (ఇబ్రాహీమ్) ఇలా అన్నాడు : ***నిశ్చయంగా, మీరు ప్రాపంచిక జీవితంలో అల్లాహ్‌ను వదిలి, విగ్రహారాధనను మీ మధ్య ప్రేమకు సాధనంగా చేసుకున్నారు. కాని పునరుత్థాన దినమున మీకు పరస్పరం సంబంధమే లేదంటారు మరియు పరస్పరం శపించు కుంటారు మరియు మీ ఆశ్రయం నరకాగ్నియే మరియు మీకు సహాయపడేవారు ఎవ్వరూ ఉండరు.*** (29:25)

వారిలో స్పందన రాలేదు. కాని తన సోదరుని కుమారుడు లూత్(అ) విశ్వసించి ఆయనతో పాటు బయలు దేరారు. ఖుర్'ఆన్‌లో ఇలా ఉంది :

**అప్పుడు లూత్ అతనిని విశ్వసించాడు.** (ఇబ్రాహీమ్) ఇలా అన్నాడు : '<u>నేను నా ప్రభువు వైపునకు వలస పోతాను</u>. నిశ్చయంగా ఆయనే సర్వశక్తివంతుడు, మహా వివేకవంతుడు." (29:26)

అల్లాహ్ అనుగ్రహం వలన ఆ మంటలు ఇబ్రాహీమ్(అ)వారిని ఏమీ చేయకపోవడంతో భయపడి రాజు ఆయనను రాజ్యం విడిచి వెళ్ళిపొమ్మన్నాడు. ఆ తరువాత కొన్ని సంఘటనలు జరిగాయి. హాజర వారితో వివాహం జరగడం, ఇస్మా'ఈల్(అ) జన్మించడం జరిగాయి. **ఇబ్రాహీమ్(అ)వారు పాలస్తీన్‌కు వలస వెళ్ళిపోయారు.**

ఇబ్రాహీమ్(అ)వారికి పది, పదిహేను మైళ్ళ దూరంలో ఉన్న నగరంలో లూత్(అ)వారు అక్కడి ప్రజలను అల్లాహ్ ధర్మం వైపుకు ఆహ్వానించేవారు. లూత్(అ)వారు దాదాపు 30 సంవత్సరాల పాటు అక్కడి ప్రజలను అల్లాహ్ వైపు ఆహ్వానించారు.

ఆ నగరంలో లూత్(అ)వారిపై అదనంగా ఒక ప్రత్యేకమైన బాధ్యత కూడా ఉంది. అదేమిటంటే అక్కడి జాతివారు పాల్పడుతున్న ఒక నీచమైన పని నుండి వారిని సంస్కరించడం. ఏ ప్రవక్త యైనా ఒక జాతికి హితోపదేశం కోసం పంపబడినప్పుడు, అక్కడి ప్రజలను ఆ ప్రవక్త యొక్క జాతిగా ఖుర్'ఆన్‌లో పేర్కొనడం జరిగింది. కాబట్టి అక్కడి ప్రజలను **లూత్ జాతి ప్రజలు** అని లేదా **లూత్ సోదరులు** అని చెప్పడం జరిగింది.

ఈ లూత్ జాతి ప్రపంచంలో అంతకు ముందెన్నడూ ఎవరూ చేయని ఒక నీచమైన పని చేసేవారు. అయితే **ఆ నీచమైన పనే నేడు ప్రపంచంలో చాలా చోట్ల చట్టబద్ధం అయిపోయింది.** దానిని ప్రారంభించిన వారు లూత్ జాతి వారే. దాని పర్యవసానంగా వారిపై ఘోరశిక్ష పడింది.

ఆ జాతివారు వ్యవసాయం చేసేవారు. ఆనాటి కాలంలో ఈ జాతి ప్రపంచంలోని మిగతా జాతులలో కెల్లా ఆర్థికంగా బాగా అభివృద్ధి చెందిన జాతి. ఈ జాతి వారు ఈజిప్టు మరియు సిరియాలకు వెళ్ళే రహదారుల దగ్గరలో నివశించేవారు. వీరి నివాసప్రాంతాల మీదుగా వ్యాపార బిడారాలు వెళుతుండేవి. ప్రారంభంలో వ్యాపార బిడారాలు అక్కడ ఆగుతుండేవి. ప్రజలు వారికి ఆహారాన్ని మరియు సహకారాన్ని అందించే వారు. అయితే అతిథులు చాలా తరచుగా రావడం మరియు ఆతిథ్యం ఇచ్చి ఇచ్చి వారి హృదయాలు అలసిపోయి పిసినారి తనానికి అలవాటు అయిపోయారు.

**పిసినారితనం వారి ముఖ్య లక్షణం అయిపోయింది.** వారి పట్టణం రహదారిలో ఉండటంతో అటువైపు వెళ్ళే బాటసారులు ఆ పట్టణ ప్రజలు పండించిన వాటిలో కొన్నింటిని తినేవారు. **అసలే పిసినారులు వీరు.** కాబట్టి బాటసారులు తమ పంటను తినడాన్ని సహించలేక పోయేవారు.

షైతాన్ వారి పంటలను పాడుచేసి అవి బాటసారుల మీదకు నెట్టి వేసినట్లు కూడా చెప్పబడింది.

**మానవ సమాజాన్ని సర్వనాశనం చేయాలనే ఏకైక లక్ష్యంతో అహర్నిశలూ పనిచేసేది షైతానే కదా!** ఆ షైతాన్ ఒక రోజు ముసలివాడిలా వారి దగ్గరకు వచ్చి ఓ సలహా ఇచ్చాడు. అదేమిటంటే వారి పట్టణం లోనుండి వెళ్ళే బాటసారిని పట్టుకుని అతనిపై ఒక నీచమైన పనికి పాల్పడి, అతనిని దోచుకోవాలి. అలా చేస్తే బాటసారులెవరూ అటువైపు రాకుండా ఉంటారని మరియు వారి పంటకు నష్టం వాటిల్లదని చెప్పి వారిని షైతాన్ నమ్మించాడు.

షైతాన్ ఆ తరువాత రోజు ఓ అందమైన యువకుడిగా, బాటసారిగా వచ్చాడు. **ఈ శీర్షిక బాలబాలికలకు ప్రత్యేకం కనుక**, ఆ నీచ కార్యం ప్రారంభించడానికి సంబంధించి పూర్తి వివరాలను ఇక్కడ అందించడం మాకు సమంజసంగా అనిపించ లేదు. కాబట్టి వాటిని ఇక్కడ తెలపడం లేదు.

ఏ నీచకార్యంతో బాటసారులను నిరోధించాలని అక్కడి ప్రజలు అనుకున్నారో, అదే నీచకార్యంపై వారికి కూడా ఇష్టం కలిగింది.

ఆ నీచకార్యాన్ని వారు ఎంతగా ఇష్టపడ్డారంటే, వారు తమ స్త్రీలను వదిలేసి పురుషులతో సంబంధాలు పెట్టుకున్నారు. షైతాన్ ఆ తరువాత అందమైన యువతిగా స్త్రీల దగ్గరకు వెళ్ళాడు. వారి పురుషులకు వారి పట్ల ఆసక్తి లేదు కనుక, స్త్రీలు కూడా వారిలో వారు సంబంధాలు ఏర్పరచుకునేలా మాయమాటలు చెప్పాడు. వారు కూడా అలాగే చేశారు.

**క్రూరమృగాలు సైతం అసహ్యించుకునే ఓ నీచమైన కార్యాన్ని అక్కడి ప్రజలకు ఆ విధంగా షైతాన్ అలవాటు చేశాడు.**

**ప్రకృతి సహజమైనది ఏమిటో అందరికీ తెలుసు.** ఒక స్త్రీ మరియు ఒక పురుషునికి వివాహం జరగడం మరియు వారికి సంతానం కలగడం, ఆ విధంగా తల్లిదండ్రులు మరియు పిల్లలతో ఒక కుటుంబం తయారు అవుతుంది.

కాబట్టి ఒక స్త్రీ, పురుష జంట మధ్య వివాహబంధం ధర్మసమ్మతం అవుతుంది. **తొలి మానవ జంట** : ఆదమ్(అ) మరియు హవ్వా(అ). ఆ జంట నుండే మానవజాతి మొదలైంది. అప్పటి నుండి ఇప్పటివరకూ ఈ ప్రపంచంలో జన్మించిన మానవులంతా వీరి సంతానమే. ఈ విధంగా మన సృష్టికర్త అల్లాహ్ 'స్త్రీ మరియు పురుషుని' మధ్య వివాహబంధాన్ని ఏర్పాటు చేశారు. దానినే మానవులంతా అనుసరిస్తున్నారు.

అయితే ఈ సృష్టిధర్మానికి వ్యతిరేకంగా, షైతాన్ నేర్పిన దుష్టకార్యం ఏమిటంటే పురుషుడు పురుషునితో బంధం ఏర్పాటు చేసుకోవడం మరియు స్త్రీ, మరొక స్త్రీతో బంధం ఏర్పాటు చేసుకోవడం. **ఇటువంటి వారు నేడు హోమో సెక్సువల్స్‌గా పిలవబడుతున్నారు.**

**సినిమాలలో కూడా ఈ బంధాలను కామెడీ కోసం చూపిస్తున్నారు. పిల్లల దగ్గర నుండి పెద్దలవరకూ అది చూసి నవ్వుకుంటున్నారు. హోమోలు తమ బంధాలను కూడా చట్టబద్ధం చేయాలని చాలా దేశాలలో ప్రదర్శనలు జరిపారు. చాలాచోట్ల ఆ నీచ సంబంధం చట్టబద్ధం కూడా అయింది.**

ఈ బంధం గురించి విని నవ్వుకోవడం కాదు, ఇది విపరీతంగా భయపడ వలసిన విషయం. ఈ జుగుప్సాకరమైన అత్యంత నీచమైన పనికి బహిరంగంగా పాల్పడినందుకు లూత్ జాతి ప్రజలు ఘోరశిక్షకు లోనై కొన్ని క్షణాలలోనే సర్వనాశనం అయిపోయారు. అంతేకాకుండా ఈ కార్యానికి ఎవరు పాల్పడినా వారికి అటువంటి గతే పడుతుందని ముహమ్మద్(స)వారి బోధనల ద్వారా మనకు అర్థమవుతుంది.

ఇప్పటికి దాదాపు 2012 సంవత్సరాలకు పూర్వం ఇటలీ దేశంలోని పాంపే పట్టణం కూడా అదే విధంగా నాశనమైంది.

**ఇటువంటివి మన సమాజంలో లేకుండా మన శాయశక్తులా కృషి చేద్దాం. అల్లాహ్ యొక్క ఆగ్రహం నుండి తప్పించుకుందాం!**

ఖుర్'ఆన్ గ్రంథంలోని కొన్ని ఆయత్‌లు, వాటి తఫ్సీర్ మరియు కొన్ని హదీస్‌ల ద్వారా లూత్ జాతి గురించి మరియు వారిపై పడిన శిక్ష

గురించి ఈ వ్యాసంలో క్లుప్తంగా అందిస్తున్నాము.

ఖుర్'ఆన్‌లో కొన్ని సూరహ్‌లలో ఈ జాతి గురించి వివరాలు ఉన్నాయి. వాటన్నింటిని తీసుకుని, ఒక వరుసలో అమర్చి పిల్లలకు అర్థమయ్యే విధంగా ఇక్కడ అందిస్తున్నాము. ఈ వ్యాసం కోసం తీసుకున్న ఖుర్'ఆన్ ఆయత్‌లు : [26:160-164][7:80-81][26:165,166][29:28,29] [26:167][7:82][26:168,169][15:52-60][11:77][15:62-72] [11:80-81][51:73-77][7:83][26:170-173]

**సందేశహరులను లూత్ జాతి అసత్యవాదులని తిరస్కరించింది.**

**లూత్(అ)** : ఏమీ? మీకు అల్లాహ్ పట్ల భీతి (తఖ్వా)లేదా? నిశ్చయంగా నేను మీ వద్దకు పంపబడిన విశ్వసనీయుడనైన సందేశ హరుడను. కావున మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి. **నేను దాని కొరకు మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్ని అడగటం లేదు**. నా ప్రతిఫలం కేవలం సర్వలోకాల ప్రభువు వద్దనే ఉన్నది.

**ఏమీ? మీరు ఇంతకు పూర్వం ప్రపంచంలో ఎవ్వరూ చేయని అసహ్యకరమైన పనులు చేస్తారా?**

వాస్తవానికి, మీరు స్త్రీలను వదిలి కామంతో పురుషుల వద్దకు పోతున్నారు, వాస్తవంగా, మీరు మితిమీరి ప్రవర్తిస్తున్నారు.

(ప్రకృతికి విరుద్ధంగా) **సర్వలోకాలలో** మీరు పురుషుల వద్దకు పోతారేమిటీ? **మీ ప్రభువు, మీ కొరకు** సహవాసులు **(అజ్వాజ్)గా పుట్టించిన వారిని విడిచి పెడుతున్నారేమిటి?** అలా కాదు, మీరు హద్దులు మీరి ప్రవర్తించే జాతి వారు.

నిశ్చయంగా, **మీరు చాలా హేయమైన** పని **చేస్తున్నారు. మీకు పూర్వం, లోకంలో ఎవ్వడూ ఇలాంటి పని చేయలేదు.**

వాస్తవానికి మీరు (కామంతో) పురుషుల వద్దకు పోతున్నారు! మరియు దారి కొడుతున్నారు. (దోపిడీ చేస్తున్నారు) మరియు మీ సభలలో అసభ్యకరమైన పనులు చేస్తున్నారు!

**జాతి ప్రజలు** : ఓ లూత్! ఇక నీవు మానకోకపోతే నీవు దేశం నుండి బహిష్కరించబడినవారిలో చేరతావు.

వీరిని మీ నగరం నుండి వెళ్ళగొట్టండి. వాస్తవానికి వీరు తమను తాము మహా పవిత్రులనుకుంటున్నారు.

**లూత్(అ)** : **నిశ్చయంగా మీ ఈ చేష్టలను అసహ్యించుకునే వారిలో నేనూ ఉన్నాను. '*ఓ నా ప్రభూ! నన్ను మరియు నా కుటుంబం వారినీ వీరి చేష్టల నుండి కాపాడు.*'**

వీరు వెళ్ళగొడతామని చెబుతున్న ఆ నగరం పేరు **సదూమ్.** ఒక రోజు అల్లాహ్ యొక్క దూతలు (జిబ్రీల్(అ) మరియు మరో ముగ్గురు) ఇబ్రాహీమ్(అ)వారి వద్దకు మానవ రూపంలో వచ్చారు. వారు ఫరిష్తాలని ఇబ్రాహీమ్(అ)వారికి తెలియలేదు. ప్రవక్తలకు అగోచర జ్ఞానం ఉండదు.

**ఫరిష్తాలు** : నీకు శాంతి కలుగు గాక!

**ఇబ్రాహీమ్(అ)** : **నిశ్చయంగా, మాకు మీ వలన భయం కలుగుతున్నది.**

**ఫరిష్తాలు** : **నీవు భయపడకు! నిశ్చయంగా, మేము జ్ఞానవంతుడైన ఒక కుమారుని శుభవార్తను నీకు ఇస్తున్నాము.**

**ఇబ్రాహీమ్(అ)** : మీరు ఈ ముసలితనంలో నాకు (కుమారుడు కలుగుననే) శుభవార్తను ఇస్తున్నారా! మీరు ఎలాంటి శుభవార్తను ఇస్తున్నారు!

**ఫరిష్తాలు** : మేము నీకు సత్యమైన శుభవార్తను ఇచ్చాము. కనుక నీవు నిరాశ చెందకు.

**ఇబ్రాహీమ్(అ)** : **తన ప్రభువు కారుణ్యం పట్ల నిరాశ చెందేవారు మార్గ భ్రష్టులు తప్ప మరెవరు?**

ఓ అల్లాహ్ యొక్క దూతలారా! మరి మీరు వచ్చిన కారణం ఏమిటి?

ఫరిష్తాలు : **వాస్తవానికి మేము అపరాధులైన జాతివారివైపునకు పంప బడ్డాము.** 'లూత్' ఇంటి వారు తప్ప, నిశ్చయంగా వారందరినీ రక్షిస్తాము - అతని భార్య తప్ప!

**(ఆమెను గురించి అల్లాహ్ అన్నారు)** "నిశ్చయంగా ఆమె వెనుక ఉండిపోయే వారిలో చేరుతుందని మేము నిర్ణయించాము."

**ఈ సందర్భానికి సంబంధించి తఫ్సీర్ ఇబ్నె కసీర్‌లో స'ఈద్ బిన్ జుబైర్ గారి ఉల్లేఖనం ఉంది. దాని ప్రకారం :**

జిబ్రీల్(అ) మరియు ఇతర ఫరిష్తాలు ఇబ్రాహీమ్(అ)వారి వద్దకు వచ్చారు. వారు చెప్పారు : **వాస్తవానికి మేము అపరాధులైన జాతివారివైపునకు పంప బడ్డాము**

ఇబ్రాహీమ్(అ) : **మీరు ఒక పట్టణాన్ని నాశనం చేస్తారా, దానిలో 300 మంది విశ్వాసులు ఉంటే?**

ఫరిష్తాలు : **లేదు**

ఇబ్రాహీమ్(అ) : **మీరు ఒక పట్టణాన్ని నాశనం చేస్తారా, దానిలో 200 మంది విశ్వాసులు ఉంటే?**

ఫరిష్తాలు : **లేదు**

ఇబ్రాహీమ్(అ) : **మీరు ఒక పట్టణాన్ని నాశనం చేస్తారా, దానిలో 40 మంది విశ్వాసులు ఉంటే?**

ఫరిష్తాలు : **లేదు**

ఇబ్రాహీమ్(అ) : **30?**

ఫరిష్తాలు : **లేదు**

'ఐదు?' అని చెప్పేంతవరకూ కొనసాగింది.

ఇబ్రాహీమ్(అ) : **మీరేమి అంటారు పట్టణంలో ఒక ముస్లిమ్ ఉంటే, దానిని నాశనం చేస్తారా?**

ఫరిష్తాలు : **లేదు**

ఇబ్రాహీమ్(అ) :**వాస్తవానికి, అక్కడ లూత్ కూడా ఉన్నాడు కదా!**

ఫరిష్తాలు : **అక్కడెవరున్నారో మాకు బాగా తెలుసు. మేము అతనిని మరియు అతని కుటుంబం వారిని రక్షిస్తాము - అతని భార్య తప్ప - ఆమె వెనుక ఉండిపోయే వారిలో చేరిపోతుంది.**

ఖుర్'ఆన్‌లో అల్లాహుతాలా ఇలా తెలియజేస్తున్నారు:

**మరియు మా దూతలు లూత్ వద్దకు వచ్చినపుడు, వారి రాకకు అతను** (వారిని కాపాడలేనని) **చాలా చింతించాడు.**

**లూత్(అ)** : నిశ్చయంగా, మీరు పరాయి వారిగా కన్పిస్తున్నారు.

లూత్(అ)వారు దయ మరియు కరుణ గల వ్యక్తి. అతిథులను ఆదరించేవారు మరియు ప్రజల దుశ్చేష్టల నుండి వారికి ఆశ్రయం ఇచ్చేవారు.

ఫరిష్తాలు అందమైన యువకులుగా లూత్(అ)వారి వద్దకు వచ్చే సమయానికి లూత్(అ)వారు తన పొలంలో ఉన్నారు. అయితే ఆయన ఇంటిలో ఉన్నప్పుడు వచ్చారని కొందరు చెబుతారు. పై ఆయత్‌లో చెప్పినట్లు వారిని చూసినపుడు లూత్(అ)వారికి విచారం కలిగింది. ఆ పట్టణ ప్రజలు దుర్మార్గులు కనుక, ఆ యువకులకు వారు ఏదైనా కీడు చేయవచ్చు కాబట్టి ఆ యువకులను అక్కడ నుండి వెంటనే వెళ్ళిపొమ్మని ఆయన చెప్పవచ్చు. కాని ఒక ప్రవక్తగా అతిథులను పొమ్మని చెప్పలేరు. ఒకవేళ ఈయన ఆతిథ్యం ఇవ్వకపోతే మరొకరు ఇస్తారు మరియు తరువాత వారు వీరికి కీడు కలిగించవచ్చు. **"ఈ దినం చాలా ఆందోళనకరమైనది."**

తఫ్సీర్ ఇబ్నెకసీర్‌లో ఈ సంఘటనకు సంబంధించిన కొన్ని వివరాలు ఉన్నాయి. ఇబ్నె అబ్బాస్(రజి)వారు ఈ ఖుర్'ఆన్ ఆయత్ విషయమై ఇలా అన్నారు: **'చాలా కఠినమైన పరీక్ష ఆయనకు'**. ఎందుకంటే ఆయనకు తెలుసు వారిని కాపాడవలసి ఉందని మరియు అది ఆయనకు పెద్ద సమస్యలకు కారణం అవుతుందని.

ఖతాదా వివరించారు, ''ఆయన తన పొలంలో (పనిచేసు కుంటుండగా) వారు ఆయన దగ్గరకు వచ్చారు. తమకు ఆతిథ్యం ఇవ్వమని ఆయనకు వారు విజ్ఞప్తి చేశారు. ఆయన అంగీకరించారు. కాని వారిపట్ల ఆయనకు సిగ్గుగా ఉంది.

ఆయన వారికి ముందుగా నడుస్తున్నారు. వారిని ఒప్పించి వెనక్కి వెళ్ళిపోయేలా చేయడానికి తన ఇంటికి వెళ్ళేదారిలో వారితో ఆయన అన్నారు, **"అల్లాహ్ సాక్షి! ఈ పట్టణ ప్రజల కంటే చెడ్డవారు మరియు నీచమైనవారు భూమిమీద ఎవరైనా ఉంటారని నేను అనుకోను."** తరువాత ఆయన మరికొంత దూరం నడిచారు. తరువాత వారితో అదే విషయం చెప్పారు. (చెప్పడం) కొనసాగించారు, దానిని ఆయన నాలుగుసార్లు చెప్పేవరకూ.''

తరువాత ఖతాదా చెప్పారు, ''వారు (అంటే ఫరిష్తాలు అల్లాహ్‌చే) ఆదేశించబడ్డారు వారిని (అంటే ఆ పట్టణ ప్రజలను) నాశనం చేయవద్దని, **వారి గురించి ప్రవక్త సాక్ష్యమిచ్చేవరకూ.**

పై వివరాలు చదివిన తరువాత మనం మనస్సు పెట్టి ఆలోచిస్తే మరో కోణంలో కూడా పై విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. **ఫరిష్తాలు వచ్చింది అల్లాహ్ ఆదేశించిన శిక్షను అమలు చేయడానికే.** అమలు చేసేముందు అక్కడి ప్రజల దుర్మార్గం గురించి వారి ప్రవక్త సాక్ష్యమిచ్చిన తరువాతనే ఆ శిక్ష అమలు చేయమని ఆదేశించ బడ్డారు.

అర్థం చేసుకునేవారికి ఇందులో ఎన్నో విషయాలు బోధపడతాయి. **ప్రవక్తలకు అల్లాహుతాలా ఎంతో గౌరవాన్ని కలగజేశారు!**

## లూత్(అ)వారి భార్య గురించి :

సృష్టిధర్మంలో భార్యాభర్తలు తమ సృష్టికర్త అల్లాహ్‌కు విధేయత చూపుతారు. ఆ తరువాత తమ ప్రవక్తకు విధేయత చూపుతారు. అందరి కంటే ఎక్కువగా తమ ప్రాణం కంటే ఎక్కువగా తమ ప్రవక్తను ప్రేమిస్తారు.

భార్యాభర్తల మధ్య ప్రేమానుబంధం ఉండాలి. ఒకరిపై ఒకరికి పూర్తి నమ్మకం ఉండాలి. భార్య భర్తకు విధేయత చూపాలి మరియు భర్త భార్య యొక్క బాగోగులు చూసుకోవాలి.

**భర్తకు ఎవరు తోడుగా ఉన్నా లేకపోయినా, భార్య మాత్రం నైతికంగా తోడుగా ఉండాలి. అప్పుడు అది ఉత్తమ కుటుంబం అవుతుంది.**

అయితే ఇది ప్రతీ కుటుంబంలోనూ సాధ్యం కాకపోవచ్చు. భార్యాభర్తలు ఎన్నో పరీక్షలు ఎదుర్కోవలసి ఉంటుంది.

పైన చెప్పిన బంధానికి విలువివ్వని వారి గురించి ఖుర్'ఆన్‌లో ప్రస్తావించడం జరిగింది. క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌లు చూడండి.

సత్య తిరస్కారుల విషయంలో అల్లాహ్ **నూహ్ భార్య** మరియు **లూత్ భార్య**ల ఉదాహరణలను ఇచ్చారు. ఆ ఇద్దరు స్త్రీలు సత్పురుషులైన మా ఇద్దరు దాసుల బంధంలో ఉండిరి. కాని ఆ ఇద్దరు స్త్రీలు వారిద్దరి పట్ల **విశ్వాసఘాతానికి పాల్పడ్డారు.** కావున వారిద్దరు, ఆ ఇద్దరు స్త్రీల విషయంలో అల్లాహ్ ముందు (పరలోకంలో) ఏ విధంగానూ సహాయపడలేరు. మరియు (తీర్పు దినమున) : ''నరకాగ్నిలో ప్రవేశించే వారితో మీరిద్దరు స్త్రీలు కూడా ప్రవేశించండి!'' అని చెప్పబడుతుంది. (ఖుర్'ఆన్ 66:10)

అంటే తీర్పుదినం నాడు ఈ ఇద్దరు స్త్రీలు భర్త నుండి ఎటువంటి సహాయమూ పొందలేరు.

తరువాయి ఆయత్‌లో మరో స్త్రీ ఉదాహరణ ఇవ్వడం జరిగింది.

మరియు అల్లాహ్, విశ్వసించిన వారిలో ఫిర్'ఔన్ భార్యను ఉదాహరణగా పేర్కొన్నారు. ఆమె ఇలా చెప్పిన విషయం :

**"ఓ నా ప్రభూ! నా కొరకు నీ వద్ద స్వర్గంలో ఒక గృహాన్ని నిర్మించు! మరియు నన్ను, ఫిర్'ఔన్ మరియు అతని చేష్టల నుండి కాపాడు మరియు నన్ను ఈ దుర్మార్గ జాతివారి నుండి కాపాడు."** (ఖుర్'ఆన్ 66:11)

తన జాతి దుర్మార్గంగా వ్యవహరించేటప్పుడు, ఆ జాతికి చెందిన ఒక స్త్రీ తన జాతి నుండి కాపాడమని, సత్యతిరస్కారి అయిన భర్తనుండి కాపాడమని కోరితే, నూహ్(అ)వారి భార్య మరియు లూత్(అ)వారి భార్య అందుకు భిన్నంగా వ్యవహరించారు.

వీరిద్దరూ సత్య తిరస్కారులు. ముస్లిములు కాదు. లూత్(అ)వారు సదూమ్ ప్రాంతానికి వలస వచ్చారు. అక్కడి ప్రజలలో ఆయనకు బంధువులు లేరు. ఆ జాతిలో నుండే ఒక స్త్రీని వివాహం చేసుకున్నారు. ఆ జాతి నీతిబాహ్యమైన చేష్టలు చేస్తుంది. **ఆయన భార్య భర్తకు విధేయత చూపడానికి బదులు, తన జాతి బంధుత్వానికే విలువ ఇచ్చింది.** వారితో సన్నిహిత సంబంధాలను కొనసాగించిందామె.

తన ఇంటికి ఎవరైనా అతిథులు వస్తే, ఆమె ఆ విషయాన్ని రహస్యంగా తన జాతివారికి చేరవేసేది. **ఆ విధంగా ఆమె సత్య తిరస్కారం మరియు భర్త పట్ల నమ్మక ద్రోహానికి పాల్పడింది.**

అయితే ఆమె చెడు నడత కలిగిన స్త్రీ కాదు.

ఫరిష్తాలు అందమైన యువకులుగా లూత్(అ)వారి ఇంటికి వచ్చినప్పుడు, ఆ విషయం అక్కడి ప్రజలకు ఆమెయే తెలియజేసింది.

ఈ విషయానికి సంబంధించి కొన్ని వివరాలు ఉన్నాయి. వాటిని దిగువన అందిస్తున్నాము.

లూత్(అ)వారి భార్య ఆమె ఇంటి నుండి బయటకి వచ్చి ఒక రకమైన ధ్వని చేశారు. ప్రజలు ఆ ధ్వనిని విని అక్కడ గుమిగూడారు. ఆ ధ్వనినే **సూమక్** అంటారు. పగలు అయితే ఇంటి పైనుండి పొగ వదలడం మరియు రాత్రివేళ అయితే మంట వెలిగించడం ద్వారా ప్రజలకు సమాచారం అందించేదామె.

పై విషయాలను బట్టి స్పష్టమయ్యేది ఏమిటంటే తమ ఇంటికి వచ్చిన అతిథుల గురించి సమాచారాన్ని తన జాతివారికి చేరవేసింది మాత్రం ఆమెయే.

---

లూత్(అ)వారు తన భార్యకు అతిథులు వచ్చిన విషయాన్ని తెలిపారు. ఈ విషయాన్ని ఆమె తన జాతివారికి చేరవేయకుండా ఉంటే ఆమె గతంలో చేసిన తప్పులను క్షమిస్తానని కూడా చెప్పారు. దానికి ఆమె అంగీకరించింది.

అయితే ఆమె తన జాతి వారితో చేసుకున్న ఒప్పందం ప్రకారం, పగటి పూట అతిథి వస్తే తన ఇంటిపై నుండి పొగవదలడం మరియు రాత్రి వస్తే ఇంటిపై నుండి మంటను వెలిగించడం ద్వారా తన వారికి సమాచారాన్ని చేరవేయాలి. ఆమె వెంటనే ఇంటిపై నుండి మంట వెలిగించారు.

> అల్లాహుతాలా మనం ఉంటున్న ఈ ప్రపంచాన్ని తన నమూనాలో ఆయన యొక్క మహా శక్తి మరియు మహా వివేకాన్ని వ్యక్తపరిచేలా అసంఖ్యాకమైన వాటినెన్నింటినో కలిగి ఉన్న బహిరంగ ప్రదర్శనశాలగా తయారు చేశారు. ఆలోచించే వారు ఈ ప్రపంచం నుండి ఎన్నో గొప్ప పాఠాలు నేర్చుకోగలరు.
>
> ఇబ్రాహీమ్ వారు ఒక విగ్రహారాధకుని ఇంటిలో జన్మించబడేలా చేశారు.
>
> గౌరవనీయుడైన మరో ప్రవక్త లూత్(అ)వారి ఇంటిలో, అతని భార్య భర్తను వ్యతిరేకిస్తూ అవిశ్వాసులకు అనుబంధంగా పనిచేసింది. బరితెగించిన ఆ మూకకు తన ఇంటిలో అతిథులుగా ఎటువంటి వారు వచ్చారో చేరవేసేదామె. (ఖుర్తుబీ, మజ్హరి)

**మరియు నగరవాసులు ఉల్లాసంతో అక్కడికి వచ్చారు.**

లూత్(అ) : వాస్తవానికి వీరు నా అతిథులు. కావున నన్ను అవమానం పాలు చేయకండి. మరియు అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి మరియు నా గౌరవాన్ని పోగొట్టకండి.

లూత్ జాతి : **ప్రపంచంలోని** (ప్రతీ వ్యక్తిని) **వెనుకేసుకోకు అని మేము నిన్ను వారించలేదా?**

లూత్(అ) : మీరు (ఏమైనా) చేయాలనే ఉంటే, నా కుమార్తెలు (నా జాతి స్త్రీలు) ఉన్నారు.

కొందరు వ్యాఖ్యాతలు పై ఆయత్‌లో ప్రస్తావించ బడిన 'నా కుమార్తెలు' అంటే, ఆ జాతిలోని స్త్రీలు అని చెప్పడం జరిగింది. ఎందుకంటే **ఒక జాతి వారికి వారి ప్రవక్త తండ్రితో సమానం.** తన అతిథులను వదిలేస్తే, తన కుమార్తెలను వారిలో తగినవారికి ధర్మ సమ్మతంగా వివాహం చేస్తానని చెప్పారని కొందరు వ్యాఖ్యానించారు.

---

**లూత్(అ) : మిమ్మల్ని ఎదుర్కొనే బలం నాకుంటే లేక శరణు పొంద డానికి పటిష్ఠమైన అండ ఏదైనా ఉండి ఉంటే ఎంత బాగుండేది?**

---

తిర్మిజీ గ్రంథంలోని హదీస్ నెం. 3116లో ముహమ్మద్(స)వారు పై ఆయత్‌కి సంబంధించి చివరి భాగంలో ఇలా వివరించారు : "అల్లాహ్ లూత్(అ)వారిపై కారుణ్యం కురిపించుగాక! నిశ్చయంగా ఆయన బలమైన మద్దతుపై ఆధారపడ్డారు. ఎందుకంటే ఆయన అన్నారు: "మిమ్మల్ని ఎదుర్కొనే బలం నాకుంటే లేక శరణు పొంద డానికి పటిష్ఠమైన అండ ఏదైనా ఉండి ఉంటే ఎంత బాగుండేది? (ఖుర్'ఆన్ 11:80)" **కాబట్టి అల్లాహ్ ఏ ప్రవక్తనూ పంపలేదు ఆయన తరువాత, ఓ ఉన్నత వంశపు కుటుంబంలో తప్ప.**"
**(తిర్మిజీ, హసన్, 3116, పుస్తకం 44, అధ్యా.12, సంపుటి 5)**

ఉదాహరణకు ముహమ్మద్(స)వారిని ఖురైష్‌లు తిరస్కరించినప్పటికీ, ముహమ్మద్(స)వారి వంశం 'బనీహాషిమ్' మాత్రం ఆయన(స)కు అండగా నిలిచింది. మూడు సంవత్సరాల పాటు వెలివేసినా సరే, ఘోర కష్టాలను అనుభవించినప్పటికీ ఆయనకు అండగానే ఉన్నారు గాని ఆయనని వదల లేదు. అయితే అండదండలు ధర్మపరంగా కాదు. వంశపరంగా అందాయి. ఆ వంశంలో ముస్లిములతో పాటు విగ్రహారాధకులు కూడా ఉన్నారు.

పై ఆయత్‌లో ప్రస్తావించబడిన ఘటనపై ఇబ్నె అబ్బాస్(రజి) వారి వ్యాఖ్యానం ఇలా ఉంది: లూత్(అ)వారి ఇంటిని ప్రజలు చుట్టుముట్టినప్పుడు, ఆయన ప్రవేశద్వారాన్ని మూసివేశారు. వారితో సంభాషణ తలుపు వెనుక భాగం నుండి జరిగింది. అల్లాహ్ యొక్క దూతలు కూడా లోపలే ఉన్నారు. ఆ మూక గోడదూకి వస్తామని, దౌర్జన్యంగా చొరబడతామని తలుపు విరగ్గొట్టి వస్తామని బెదిరించారు.

అప్పుడు లూత్(అ)వారి నోట పై ఆయత్‌లో చెప్పిన మాటలు వచ్చాయి (ఖుర్ఆన్ 11:80).

**అయితే అల్లాహుతాలా తన ప్రియదాసునికి అండగా ఓ గొప్ప బలాన్నే పంపారు.** జిబ్రీల్(అ)వారిని అక్కడకు పంపారు. కాని తన దగ్గరకు వచ్చినవారు అల్లాహ్ యొక్క దూతలని ఆయనకు అప్పటికి తెలియదు.

ఫరిష్తాలు లూత్(అ)వారి ఆరాటాన్ని చూసి తమ గురించి వాస్తవాన్ని బహిర్గత పరిచారు. అంటే ఫరిష్తాలమని చెప్పారు. తలుపు తీయమని లూత్(అ)వారికి చెప్పారు.

**ఫరిష్తాలు** : ఓ లూత్! నిశ్చయంగా, మేము నీ ప్రభువు తరఫునుండి వచ్చిన దూతలము! వారు (ప్రజలు) ఏ మాత్రం నీ వద్దకు చేరలేరు.

వారికి శిక్షను ముందుగా రుచి చూపించారు. ద్వారం తెరిచాక జిబ్రీల్(అ)వారు తన రెక్కను వారి కళ్ళవైపు ఉంచారు. వారు గుడ్డివారుగా అయిపోయి గోడలను తడుముకుంటూ, ఉదయం అయిన తరువాత లూత్(అ)వారి సంతతిలో ఏ ఒక్కరినీ సజీవంగా వదలమని శపథం చేస్తూ వెళ్ళిపోయారు.

**ఫరిష్తాలు** : ..... కొంత రాత్రి మిగిలి ఉండగానే నీవు నీ ఇంటివారిని తీసుకుని బయలుదేరు - నీ భార్య తప్ప - మీలో ఎవ్వరూ వెనుకకు తిరిగి చూడకూడదు. నిశ్చయంగా, వారికి ఏ ఆపద సంభవించ నున్నదో అదే ఆమెకూ సంభవిస్తుంది. నిశ్చయంగా, వారి నిర్ణీతకాలం ఉదయపు సమయం. **ఏమీ? ఉదయం సమీపంలోనే ఉంది కదా?**

ఆ పిదప మేము అతనిని మరియు అతని ఇంటి వారిని - అతని భార్యను తప్ప - రక్షించాము. ఆమె వెనుక ఉండిపోయిన వారిలో చేరిపోయింది.

కొన్ని వ్యాఖ్యానాల ప్రకారం, ఆయన భార్య కుటుంబంతో కలిసి బయలుదేరడం జరిగింది. కాని ఆమె తన ప్రజలపై పడిన శిక్ష యొక్క భయంకర ధ్వని వినగానే వెనక్కి తిరిగి చూసింది మరియు వారి నాశనానికి బాధపడింది. ఆ క్షణంలో ఓ రాయి వచ్చింది మరియు అది ఇతరుల వలే ఆమెనూ ముగించింది. (ఖుర్తుబీ, మజ్హరి)

అప్పుడు మేము అందులో ఉన్న విశ్వాసులందరినీ బయటికి తీసాము(51:35) **మేము అందులో ఒక్క గృహం తప్ప, ఇతర విధేయ గృహాలను చూడలేదు** (51:36)

ఆ తరువాత మిగతా వారిని నిర్మూలించాము. ఆ పిదప సూర్యోదయ సమయాన ఒక భయంకరమైన అరుపు వారిని పట్టుకున్నది. తరువాత మేము ఆ నగరాన్ని తలక్రిందులుగా చేశాము మరియు వారిపై కాల్చిన మట్టి గులకరాళ్ళను కురిపించాము.

నీ ప్రభువు తరఫు నుండి గుర్తువేయబడిన రాళ్ళు మితిమీరి ప్రవర్తించేవారి కొరకు!" (51:34)

**చూడండి ఆ అపరాధుల ముగింపు ఎలా జరిగిందో!**

నిశ్చయంగా, ఇందులో దూరదృష్టి గలవారికి ఎన్నో సూచనలున్నాయి. మరియు వాస్తవానికి ఈ ప్రాంతం ఒక రహదారి పైననే ఉన్నది. (15:75-76)

**మరియు బాధాకరమైన శిక్షకు భయపడేవారి కొరకు మేము అక్కడ ఒక సూచనను వదిలిపెట్టాము. (51:37)**

ఈ జాతి ఏ విధంగా నాశనమైందో తెలుసుకోవాలని ముహమ్మద్(స)వారు అడిగిన ప్రశ్నకు జిబ్రీల్(అ)వారు క్లుప్తంగా వివరించినట్లు చెబుతున్న ఓ ఉల్లేఖనం ఉంది. (**గమనిక**: ఈ హదీస్ ప్రామాణికతపై మా దగ్గర సమాచారం లేదు. దీనిలోని ఏ విషయమూ ఖుర్ఆన్ మరియు ఇతర హదీస్‌లను ఖండించడం లేదు కనుక ఇక్కడ అందిస్తున్నాము)

లూత్(అ) జాతివారు ఫలానా పట్టణంలో నివశించేవారు. వారు కాలకృత్యం తీర్చుకున్న తరువాత తమ రహస్య అంగాలను కడుక్కునే వారు కాదు. వారు తప్పనిసరిగా చేయవలసిన గుస్ల్ కూడా చేసేవారు కాదు. వారి మధ్య లూత్(అ)వారు 30 సంవత్సరాలు ఉన్నారు. అక్కడ ఆయనకు ఏ బంధువూ లేకుండా (లేక) తన తోటి తెగవారెవరూ లేకుండా వేరే ప్రాంతవాసిగానే ఉన్నారు.

వారిని అల్లాహ్ వైపు పిలిచారు. ఆయనను విశ్వసించాలని, తనను అనుసరించాలని మరియు అశ్లీల చేష్టల నుండి తప్పుకోవాలని. ఆయన వారికి నచ్చజెప్పారు. తమ ప్రభువునే ఆరాధించాలని. కాని వారు అతని పిలుపును తిరస్కరించారు మరియు ఆయనకు విధేయత చూపకుండా తిరస్కరించారు.

పర్యవసానంగా అల్లాహ్ తన ఆగ్రహాన్ని వారిపై దింపాలని

అనుకున్నప్పుడు ఆయన మొదట తన సందేశహరులను పంపారు. ప్రజలను హెచ్చరించడానికి మరియు వారి వాదనలన్నింటినీ నిస్త్రాణం చేయడానికి.

ఆ ప్రజలు ఆర్థికంగా చాలా బాగా అభివృద్ధి చెందారు. కాని వారి పాపాలు పెరిగిపోయాయి. కాబట్టిలూత్(అ) పట్టణంలోని విశ్వాసు లందరినీ ఖాళీ చేయించమని అల్లాహ్ తన దూతలను ఆదేశించారు. కాని వారికి ఒకే ఒక్క ముస్లిమ్ కుటుంబం తప్ప, ఎవరూ దొరకలేదు.

అల్లాహ్ యొక్క దూతలు లూత్(అ)వారికి చెప్పారు, తనతో పాటు కుటుంబాన్ని రాత్రివేళ తీసుకువెళ్ళి పొమ్మని. సగం రాత్రి దాటాక లూత్(అ)వారు తన కుమార్తెలతో బయలుదేరారు.

అతని భార్య తన ప్రజల దగ్గరికి వేగంగా వెళ్ళింది లూత్(అ)వారి వలస గురించి తెలియజేయడానికి. తరువాయి రోజు సూర్యుడు ఉదయించగానే అల్లాహ్ ఆదేశించారు : "ఓ జిబ్రీల్! లూత్ జాతి యొక్క గతి ముగించబడింది. కాబట్టి నేలను తవ్వు 7వ పొర వరకూ మరియు మధ్య భాగాన్ని ఆకాశం వైపు లేపు, తరువాత అల్లాహుతాలా ఆదేశం కొరకు వేచి ఉండు. ఆ నగరాన్ని తలక్రిందులుగా చేయడానికి మరియు లూత్ ఇంటిని ఓ సూచనగా స్పష్టం కావడానికి ఆ పట్టణం పక్కగా వెళ్ళేవారికి సూచనగా దానిని వదలడానికి.

జిబ్రీల్(అ) చెప్పారు, "నేను అన్యాయపరుల వైపు వెళ్ళాను మరియు నా కుడిరెక్కతో ఆ నగరం యొక్క తూర్పుభాగాన్ని కొట్టాను మరియు నా ఎడమ రెక్కతో పడమర భాగాన్ని మరియు భూమిని తవ్వాను దాని 7వ పొర వరకూ. **లూత్(అ)వారి ఇంటిని మాత్రమే వదలడం జరిగింది. రాబోవు తరాలకు సూచనగా.** నేను ఆ నగరాన్ని చాలా ఎత్తుగా లేపాను (ఎంత ఎత్తుకు అంటే) ఆకాశవాసులకు కోడిపెట్టల ధ్వనులు మరియు కుక్కల అరుపులు వినబడేలా. ఎక్కడ ఉన్నది అక్కడే ఉంది, నీటి పాత్రలో ఉన్న నీరు సైతం (అలాగే ఉంది).

సూర్యుడు ఉదయించినప్పుడు నేను ఆదేశించ బడ్డాను ఆ పట్టణాన్ని దాని నివాసులపై పడవేయమని. నేను దానిని పడవేసాను వారిపై తలక్రిందులుగా. కాల్చిన మట్టి రాళ్ళు లూత్ జాతిపై వర్షంగా కురిసాయి. రాళ్ళలోని ప్రతీది గుర్తులు వేయబడింది లేక వ్రాయబడింది.

ఓ ముహమ్మద్(స)! అదే గతి నీ ప్రజలపై కూడా పడుతుంది (వారిలో ఎవరైనా) ఈ పాపానికి పాల్పడితే. లూత్(అ)వారి పట్టణం ఉన్నప్పటి ప్రాంతం గురించి ప్రవక్త(స)వారు అడిగారు.

జిబ్రీల్(అ) చెప్పారు **"అది సిరియాలో టైగ్రస్ నదికి సమీపంలో ఉంది."**

రసూలుల్లాహ్(స)వారు అడిగారు. **"ఆ ప్రజలు ఎక్కడ పడ్డారు, మీరు వారిని తలక్రిందులుగా చేసినప్పుడు?"** జిబ్రీల్(అ)వారు సమాధాన మిచ్చారు, "ఓ ప్రవక్తా! వారు సిరియా నుండి ఈజిప్టు (మధ్యలో) సముద్రంలో పడ్డారు. వారు సముద్రంలో ఇసుకదిబ్బలు ఐపోయారు."

విశ్వాసులను (మోమిన్లను) తప్పించి లూత్ జాతి వారిని ఏ విధంగా నాశనం చేశారో క్లుప్తంగా పై హదీస్ వివరిస్తుంది. ఈ శిక్ష గురించి ఖుర్'ఆన్‌లో ప్రస్తావించబడిన మరికొన్ని ఆయత్‌లు :

నిశ్చయంగా, మేము లూత్ ఇంటివారు తప్ప ఇతరుల మీదికి రాళ్ళు విసిరే 'తుఫాన్ గాలిని' పంపాము.

వారిని (లూత్ ఇంటి వారిని) మేము వేకువ జామున రక్షించాము. మా తరపునుండి అనుగ్రహంగా, ఈ విధంగా మేము కృతజ్ఞులకు ప్రతిఫలం ఇస్తాము.

మరియు వాస్తవానికి వారిని మా రాబోయే శిక్షను గురించి హెచ్చరించాడు. కాని వారు మా హెచ్చరికలను సందేహించి వాదనలకు దిగారు!

మరియు వాస్తవానికి వారు అతని అతిథులను అతని నుండి బలవంతంగా లాక్కోవాలని అనుకున్నారు. **కావున మేము వారి కళ్ళను పోగొట్టాము.** "ఇప్పుడు నా శిక్షను మరియు నా హెచ్చరికను చవి చూడండి"

మరియు వాస్తవానికి, ఉదయపు వేళ శాశ్వతమైన శిక్ష వారి మీద పడింది. ఇప్పుడు మీరు నా శిక్షను మరియు నా హెచ్చరికలను చవి చూడండి.

**మరియు వాస్తవానికి మేము ఈ ఖుర్'ఆన్ హితబోధ గ్రహించడానికి సులభం చేశాము. అయితే, హితబోధ స్వీకరించేవాడు ఎవడైనా ఉన్నాడా?**

పై ఆయత్‌లో అల్లాహుతాలా ప్రశ్నిస్తున్నారు. మనం ఇలా దు'ఆ చేసుకుందాం :

**"ఓ అల్లాహ్! మేము ఖుర్'ఆన్ నుండి హితబోధ గ్రహించేలా మమ్మల్ని అనుగ్రహించండి! ఎక్కువ సార్లు ఖుర్'ఆన్‌ను పఠించే అవకాశాన్ని మాకు కల్పించండి."**

**మరియు వాస్తవానికి, మీరిప్పుడు వారి ప్రాంతాల మీదుగా ఉదయపు వేళల్లో ప్రయాణిస్తూ ఉంటారు మరియు రాత్రులలో కూడా! అయినా మీరు అర్థం చేసుకోలేరా?** (ఖుర్'ఆన్ 37:137-138)

మరియు వాస్తవానికి, బుద్ధిమంతుల కొరకు మేము దీని ద్వారా ఒక స్పష్టమైన సూచనను వదిలిపెట్టాము.

**ఇన్షా అల్లాహ్! వచ్చే సంచికలో పురావస్తు శాఖ త్రవ్వకాల ద్వారా వెలుగు చూసిన విషయాలను తెలియజేస్తాం!**

## ఈ వ్యాసం ద్వారా గుర్తు పెట్టుకోవలసిన ముఖ్య విషయాలు:

- అశ్లీలమైనవి, ధర్మ సమ్మతం కానివి చేసేవారిపై అల్లాహ్ శిక్ష పడుతుంది. వారు ఎంత గొప్పస్థాయిలో ఉన్నా సరే. పాశ్చాత్య దేశాలు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందాయి. అశ్లీలం లోనూ హద్దులు మీరుతున్నాయి. అల్లాహ్ మనందరినీ వారి చేష్టల నుండి కాపాడు గాక! వారిని అనుకరించి నేటి మన యువత కూడా పాడవుతుంది.
- అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశపడకూడదు.
- పిసినారి తనం లూత్ జాతివారి లక్షణాలలో ఒక ముఖ్య లక్షణం.
- మన శరీరాన్ని మలమూత్ర మలినాల నుండి శుభ్రంగా ఉంచుకోవాలి.
- **షైతాన్ తప్పు దోవ పట్టిస్తాడు** : ఉదాహరణకు మీరు బాగా చదువుకుంటున్నారు. మంచి ర్యాంకులు వస్తున్నాయి. షైతాన్ మిమ్మల్ని పొగడ్తలతో ముంచెత్తుతాడు. మీలో అహంకారం పెరిగేలా చేస్తాడు. ప్రతీ ఇంటిలోకి నేడు టి.వి. ప్రవేశించింది. చదువు మీద మీకు ఉండే ధ్యాసను పూర్తిగా టి.వి.పైకి మళ్ళే విధంగా కృషి చేస్తాడు. సినిమాలలో వేసుకునే కురుచ దుస్తులపై మోజు కలిగించి, అర్ధనగ్నంగా తయారు చేయవచ్చు. అశ్లీలమైన పనులను ఇష్టపడేలా చేయవచ్చు.

  ఉత్తమ స్థాయికి చేరుకోవలసిన మీరు క్రిందికి దిగజారి పోయాలా చేయడానికి ఎంతో కష్టపడతాడు.

  కాబట్టి షైతాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.
- **మనం ఏ గొప్ప స్థాయిలో ఉన్నా సరే అది అల్లాహ్ అనుగ్రహమేనని మరచిపోకుండా, అల్లాహ్‌కు అన్ని వేళలా కృతజ్ఞులుగా ఉండాలి. అప్పుడు మనకు ఎల్లప్పుడూ విజయమే, ఇన్షా అల్లాహ్!**
- ఒక పట్టణంలో ఒక్క విశ్వాసి ఉన్నప్పటికీ శిక్ష పడదు. అయితే అతడు తన చుట్టూ ఉన్నవారికి మంచిని బోధించాలి మరియు చెడునుండి నిరోధించాలి. లేకపోతే ఆ శిక్ష ముందుగా అతనితోనే మొదలవుతుంది.
- సహాయం, రక్షణ అల్లాహుతాలాయే అందిస్తారు.
- భావితరాలు ఆలోచించడం కోసం ఎన్నో సూచనలు అల్లాహ్ మిగిలి ఉండేలా చేశారు.

## అహంకారం వద్దు

**మరియు మేము తీవ్రంగా వీచేగాలిని సులైమాన్‌కు (వశపరిచాము). అది, అతని ఆజ్ఞతో మేము శుభాలను ప్రసాదించిన భూమి మీద వీచేది. మరియు నిశ్చయంగా, మాకు ప్రతీ విషయం గురించి బాగా తెలుసు.** (ఖుర్ఆన్ 21:81)

సులైమాన్(అ)వారు కూర్చున్న ఓ ప్లాట్‌ఫామ్‌ని గాలి ఆయన ఆజ్ఞ మేరకు తీసుకువెళ్ళేది. ఇబ్నె కసీర్ గారు పై ఆయత్ గురించి చేసిన వ్యాఖ్యానంలో చాలా వివరంగా గాలి తీసుకెళ్లే ఆ ప్లాట్‌ఫామ్ గురించి వర్ణించారు. ఆ ప్లాట్‌ఫామ్ చెక్కతో తయారు చేయబడి అపారమైన పరిమాణంలో ఉండేది. ఆయనను మరియు ఆయన పరిపాలనా సిబ్బంది, సైన్యానికి వారి ఆయుధాలతో సహా వసతి కల్పించేది. మరియు ఆ గాలితో ఎక్కడకు తీసుకెళ్ళమని ఆజ్ఞాపిస్తే వారందరినీ అక్కడకు తీసుకు వెళ్ళేది. రెండు నెలల ప్రయాణాన్ని ఒక్క రోజులో పూర్తి చేసేది.

ఇబ్నె అబీ హాతిమ్, స'ఈద్ బిన్ జుబైర్(రజి)వారి నుండి ఉల్లేఖించారు. 6 లక్షల కుర్చీలు ఆ ప్లాట్‌ఫామ్‌పై ఉంచబడ్డాయి. వాటిపై విశ్వసించిన మానవులు సులైమాన్(అ)వారితో ముందు భాగాన కూర్చునేవారు మరియు వారి వెనుక భాగంలో విశ్వసించిన జిన్నులు కూర్చునేవారు. పక్షులు ఆ ప్లాట్‌ఫామ్‌పైన ఎగరడానికి ఆదేశించ బడేవి. మరియు అవి సూర్యుని వేడి నుండి రక్షించేవి.

తరువాత సులైమాన్(అ) వారి ఆజ్ఞతో గాలి ఆ ప్లాట్‌ఫామ్‌ని నిర్దేశించ బడిన గమ్యానికి తీసుకువెళ్ళేది. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఈ వాయు ప్రయాణంలో పూర్తిగా సులైమాన్(అ)వారు తన శిరస్సు క్రిందకు వంచి కూర్చుని ఎంతో అణుకువతో అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ప్రార్థించేవారు మరియు తన శిరస్సును తిప్పేవారు కాదు కుడివైపుకు గాని లేక ఎడమవైపుకు గాని.

చూశారా! సులైమాన్(అ)వారిని అల్లాహ్ ఎంత గొప్పగా అనుగ్రహించారో. సులైమాన్(అ)వారు మనవంటి సాధారణ వ్యక్తి కాదు. ఆయన ఎల్లప్పుడూ అల్లాహ్‌కు కృతజ్ఞుడిగా ఉండేవారు. ఆయన కృతజ్ఞతా భావానికి ప్రసన్నుడై అల్లాహుతాలా ఆయనకు గాలినే కాకుండా ఎన్నింటినో వశపరిచారు.

**ఆయన కుర్చీలో దర్జాగా కూర్చుని ప్రయాణం చేయలేదు. ఎటూ చూడకుండా శిరస్సు క్రిందకు వంచి గమ్యానికి చేరేవరకూ అంతటి గొప్ప అనుగ్రహాన్ని కురిపించిన అల్లాహ్‌కు కృతజ్ఞత తెలుపు కునేవారు.**

**మీలో ఎవరైనా ఓ మంచి ర్యాంక్ సాధించినా లేక ఇతరుల కంటే గొప్పదైనది ఏదైనా కలిగి ఉన్నా, అది కేవలం అల్లాహ్ అనుగ్రహం అనే నిజాన్ని తెలుసుకోవాలి. కాలర్ ఎగరేసి తిరగడం, అహంకారంతో మాట్లాడడం చేయకూడదు. అల్లాహ్ మనపై చూపే అనుగ్రహాలకు ఎల్లప్పుడూ ఆయనకు మనం కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉండాలి.**

# ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువుదాం - 33

فِعل ثلا ثي مَزِيد فِيه
[క్రియ యొక్క ఎనిమిదవ రూపం]

**اِفْعَلَّ**

فَعَلَ లో అదనంగా 'అలిఫ్' మరియు 'తష్దీద్' వచ్చినప్పుడు

الف یعنی ا اور تشدیدز یادہ ہو

| క్రియ యొక్క 9వ రూపం | اِفْعِلَال | مُفْعَلٌّ | اِفْعَلَّ | يَفْعَلُّ | اِفْعَلَّ |
|---|---|---|---|---|---|
| నలుపు అగుట<br>to become black<br>کالا ہونا | (ఇస్విదాద్)<br>اِسْوِدَاد | (ముస్వద్దిన్)<br>مُسْوَدٌّ | (ఇస్వద్ద)<br>اِسْوَدَّ | (యస్వద్దు)<br>يَسْوَدُّ | (ఇస్వద్ద)<br>اِسْوَدَّ |
| తెల్లగా అగుట<br>to become white<br>سفید ہونا | • తెలుపు కావడం<br>اِبْيِضَاض<br>(ఇబ్‌యిజాజ్) | • తెల్లగా అయినది<br>مُبْيَضٌّ<br>(ముబ్‌యజ్జిన్) | • తెలుపు చేయి<br>اِبْيَضَّ<br>(ఇబ్‌యజ్జ) | • తెల్లగా అవుతుంది<br>يَبْيَضُّ<br>(యబ్‌యజ్జు) | • తెల్లగా అయింది<br>اِبْيَضَّ<br>(ఇబ్‌యజ్జ) |

క్రియ యొక్క 10 వ రూపం

فَعَلَ లో అదనంగా 'అలిఫ్', 'సీన్' మరియు 'త' వచ్చినప్పుడు

الف یعنی ا، س اور ت یادہ ہو

| اِسْتَفْعَلَ | اِسْتِفْعَال | مُسْتَفْعِل | اِسْتَفْعِلْ | يَسْتَفْعِلُ | اِسْتَفْعَلَ |
|---|---|---|---|---|---|
| వేగంగా చేయుట<br>to hasten<br>جلدی کرنا | اِسْتِعْجَال<br>(ఇస్తి'జాల్) | (ముస్త'జిల్)<br>مُسْتَعْجِل | (ఇస్త'జిల్)<br>اِسْتَعْجِلْ | (యస్త'జిలు)<br>يَسْتَعْجِلُ | اِسْتَعْجَلَ<br>(ఇస్త'జల) |
| క్షమాపణ కోరుట<br>to ask forgiveness<br>مغفرت چاہنا | اِسْتِغْفَار<br>(ఇస్తిఘ్‌ఫార్) | مُسْتَغْفِر<br>(ముస్తఘ్‌ఫిర్) | اِسْتَغْفِرْ<br>(ఇస్తఘ్‌ఫిర్) | يَسْتَغْفِرُ<br>(యస్తఘ్‌ఫిరు) | اِسْتَغْفَرَ<br>(ఇస్తఘ్‌ఫర) |
| పొగరుగా వ్యవహరించుట<br>to act arrogantly<br>گھمنڈ کرنا | اِسْتِكْبَار<br>(ఇస్తిక్‌బార్) | مُسْتَكْبِر<br>(ముస్తక్‌బిర్) | (ఇస్తక్‌బిర్)<br>اِسْتَكْبِرْ | (యస్తక్‌బిరు)<br>يَسْتَكْبِرُ | (ఇస్తక్‌బర)<br>اِسْتَكْبَرَ |
| వెక్కిరించుట<br>to mock at<br>ٹھٹھا کرنا | اِسْتِهْزَاء<br>(ఇస్తిహ్‌జాఅ) | مُسْتَهْزِئ<br>(ముస్తహ్‌జీ) | اِسْتَهْزِئْ<br>(ఇస్తహ్‌జీ) | يَسْتَهْزِئُ<br>(యస్తహ్‌జి'ఉ) | اِسْتَهْزَأَ<br>(ఇస్తహ్‌జ'అ) |
| స్పందించుట<br>to respond<br>قبول کرنا | اِسْتِجَابَة<br>(ఇస్తిజాబహ్) | مُسْتَجِيب<br>(ముస్తజీబ్) | اِسْتَجِبْ<br>(ఇస్తజిబ్) | يَسْتَجِيب<br>(యస్తజీబు) | اِسْتَجَابَ<br>(ఇస్తజాబ) |
| చేయగలుగుట<br>to be able to<br>کر سکنا | اِسْتِطَاعَة<br>(ఇస్తితా'అహ్) | مُسْتَطِيع<br>(ముస్తతీ') | اِسْتَطِعْ<br>(ఇస్తతి') | يَسْتَطِيعُ<br>(యస్తతీ'ఉ) | اِسْتَطَاعَ<br>(ఇస్తతా'అ) |
| స్థిరంగా ఉంచుట<br>to be straight<br>ثابت قدم رہنا | اِسْتِقَامَة<br>(ఇస్తిఖామహ్) | مُسْتَقِيم<br>(ముస్తఖీమ్) | اِسْتَقِمْ<br>(ఇస్తఖిమ్) | يَسْتَقِيمُ<br>(యస్తఖీము) | اِسْتَقَامَ<br>(ఇస్తఖామ) |

**ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.**

***ఈ 33 నెలల్లో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 82.7***

ఈ నెల నేర్చుకున్న పదాలు 256 (అంటే ఈ పేజీలోని పదాలు ఖుర్'ఆన్‌లో 256 చోట్ల చూడవచ్చు)

*source: www.emuslim.com*

ఈ 33వ పాఠంలో ఇవ్వబడిన తొలి 2 పదాలు క్రియ యొక్క 9వ రూపానికి మరియు చివరి 7 పదాలు క్రియ యొక్క 10వ రూపానికి చెందినవి. క్రియ యొక్క మొదటి 8 రూపాల గురించి ఉదాహరణ పూర్వకంగా గత సంచికలలో వివరించడం జరిగింది. క్రియ యొక్క 9వ మరియు 10వ రూపం గురించి క్లుప్తంగా ఇక్కడ వివరిస్తున్నాము :

## క్రియ యొక్క 9వ రూపం

చివరి హల్లు రెట్టింపు అవుతుంది (అంటే చివరి అక్షరంపై ّ వస్తుంది) మరియు ప్రారంభంలో إ వస్తుంది. సాధారణంగా ఇది రంగులను లేక లోపాలను సూచిస్తుంది. మరియు "అయింది / మారింది" అనే అర్థాన్ని కలిగి ఉంటుంది.

ఉదాహరణకు 'అవజ عَوَجَ అంటే 'వంచుట' ఇ'వజ్జ اعْوَجَّ 'మెలిపెట్టబడి ఉండుట'.

**అబ్'యజ్** (أَبْيَضُ) = __తెలుపు__, **ఇబ్'యజ్జ** (ابْيَضَّ) = __**తెల్లగా అవడం**__ (మారడం)

అదే విధంగా **అస్'వద** (اسْوَد) = __నలుపు__, **ఇస్'వద్ద** (اِسْوَدَّ) = __**నల్లగా అవడం**__ (మారడం)

ఒక వ్యక్తి రోజూ ఎండలో పనిచేయడం వలన అతని ముఖం రంగు నల్లబడవచ్చు. అది భౌతిక మార్పు. అది కాకుండా వ్యక్తుల బావోద్వేగానికి కూడా ఈ పదాలు ఉపయోగించడం చూస్తుంటాము. 'నష్టం వచ్చిందని తెలియగానే ఫలానా వాడి ముఖం మాడిపోయింది' మొ॥న వ్యాఖ్యలు సాధారణంగా వింటూ ఉంటాము. ఇటువంటి సందర్భాలకు ఈ 9వ రూపానికి చెందిన క్రియా పదాలు ఉపయోగపడతాయి.

| | |
|---|---|
| **భూతకాలం (Past Tense)** | |
| اِسْوَدَّ = నల్లగా అయింది | اِبْيَضَّ = తెల్లగా అయింది |
| **వర్తమాన మరియు భవిష్యత్ కాలం (Present and Future Tense)** | |
| يَسْوَدُّ = నల్లగా అవుతుంది | يَبْيَضُّ = తెల్లగా అవుతుంది |
| اِسْوَدَّ = నలుపుగా చేయి | اِبْيَضَّ = తెల్లగా చేయి |
| مُسْوَدٌّ = నల్లగా మారినది | مُبْيَضٌّ = తెల్లగా మారినది |
| اِسْوِدَاد = నల్లగా చేయడం | اِبْيِضَاض = తెల్లగా చేయడం |
| | (వెల్ల వేయడం అంటే వైట్ వాష్) |

పాఠకులకు సులభంగా అర్థమయ్యేందుకు ఈ పదాలను కలిగిన ఖుర్'ఆన్ ఆయత్‌లను దిగువున అందిస్తున్నాము.

"ఆ దినమున (తీర్పు దినమున) కొందరి ముఖాలు (సంతోషంతో) __**తెల్లగా అవుతాయి**__. మరికొందరి ముఖాలు (దు:ఖంతో) __**నల్లగా అవుతాయి**__. ఇక ఎవరి ముఖాలు __**నల్లబడి ఉంటాయో**__ వారితో : "మీరు విశ్వసించిన తరువాత సత్యతిరస్కారులు అయ్యారు కదా? కాబట్టి మీరు సత్యాన్ని తిరస్కరించి నందుకు ఈ శిక్షను అనుభవించండి." (ఖుర్'ఆన్ 3:106)

పై ఆయత్‌లో మూడు పదాలు ఉన్నాయి. మరో మూడు పదాలు క్రింది మూడు ఆయత్‌లలో చూడవచ్చు.

"మరియు వారిలో ఎవడికైనా బాలిక (పుట్టిందనే శుభవార్త అందజేస్తే, అతని **ముఖం __నల్లగా మారుతుంది__**. మరియు అతడు తన క్రోధావేశాన్ని అణచుకోవడానికి ప్రయత్నిస్తాడు. (ఖుర్'ఆన్ 16:58)

"మరియు పునరుత్థాన దినమున, అల్లాహ్‌పై అబద్ధాలు పలికిన వారి ముఖాలను, __**నల్లగా మారి ఉండటా**__న్ని నీవు గమనిస్తావు. ఏమీ? ఈ గర్విష్టుల నివాసం నరకంలోనే ఉండదా?" (ఖుర్'ఆన్ 39:60)

"మరియు వారు, కరుణామయునికి అంటగట్టే (ఆడ సంతానమే గనక) వారిలో ఎవడికైనా కలిగిందనే వార్త అందజేయబడినప్పుడు, అతని **ముఖం __నల్లబడిపోతుంది__** మరియు అతడు దు:ఖంలో మునిగిపోతాడు." (ఖుర్'ఆన్ 43:17)

స్థలా భావం వలన ఇక్కడ అరబీలో ఆయత్‌లను ఇవ్వడం లేదు. మీ దగ్గరున్న ఖుర్'ఆన్‌లో ఈ పదాలను చూడవచ్చు.

## క్రియ యొక్క 10వ రూపం

మూల అక్షరాలకు ముందు 'ఇస్త' అనే ధ్వని వచ్చే విధంగా (اِسْت) అలిఫ్(ا), సీన్(س) మరియు తె(ت) అనే అక్షరాలు ప్రారంభంలో కలుపబడతాయి.

క్రియ యొక్క ఈ 10వ రూపం రెండు రకాల సాధారణ అర్థాలను ఉత్పన్నం చేస్తుంది.

1. దేనినైనా (అందమైనది మొ॥న)గా పరిగణించడం లేదా అనుకోవడం మరియు

2. దేని గురించి అయినా అడగడం.

**ఈ రూపానికి ఉదాహరణలు :**

య'దన్(يَأْذَن) - అనుమతినిచ్చుట  యస్'త'దిన్(يَسْتَأْذِن) = అనుమతి కొరకు అడుగుట

య'లమ్ - తెలుసుకొనుట  యస్'త'లిము (يَسْتَعْلِم)= సమాచారాన్ని అడుగుట

యహ్సున్(يَحْسُن)- అందంగా ఉండుట, యస్తహ్సిను يَسْتَحْسِن = అభినందించుట (అంటే అందంగా ఉందని పరిగణించడం వలన లేక అనుకోవడం వలన)

క్రియ యొక్క 2 రూపం (మజీద్ ఫీహి) చెప్పుకున్నప్పుడు రెండవ అక్షరంపైన తష్దీద్ అదనంగా రావడం వలన ఆ పదం యొక్క అర్థంలో తీవ్రత పెరుగుతుందని చెప్పుకున్నాం. (అది ఒకసారి గుర్తు చేసుకోండి).

.... అంటే వేగంగా ఇస్త'జల(اِسْتَعْجَلَ) అంటే <u>**వేగంగా చేశాడు**</u> / <u>**వేగంగా చేసింది**</u>.

'అల్లాహు అక్బర్' అని ప్రతీరోజు ఎన్నో సార్లు పలకడం అనేది ముస్లిమ్‌ల నిత్య జీవితంలో సర్వసాధారణ విషయం. అక్బర్ అంటే గొప్పవాడు. ఈ పదానికి మూలం మూడు అక్షరాలు క(ک) బ(ب) ర(ر). ఈ మూడు అక్షరాల నుండే కబీర్ అనే పదం కూడా ఉత్పన్నం అవుతుంది. **'గొప్పతనం'** వేరు మరియు **'అహంకారం'** (దురహంకారం) వేరు. ఒక వ్యక్తి గొప్పవాడు (లేదా ధనవంతుడు) అయినప్పుడు, అదంతా అల్లాహ్ అనుగ్రహమేనని తలచి అణుకువగా ఉంటే అది గొప్పతనం. అలా కాకుండా తన స్థాయిని చూసుకుని పొగరు కలిగినవాడిని **దురహంకారి** అంటారు. ఈ పదం కూడా ఆ మూడు అక్షరాల నుండే వస్తుంది.

ఈ మూడు అక్షరాల పదవ రూపం కోసం పట్టిక చూడండి.

ఉదాహరణకు ఇస్తక్‌బర అంటే అహంకారానికి పాల్పడ్డాడు. ఇది భూతకాలం (Past tense). వర్తమాన కాలం, భవిష్యత్ కాలం (Present and Future tense)కు సంబంధించి, అంటే **'దురహంకారం వహిస్తాడు'** అని చెప్పడానికి దీనికి ముందు **'అలిఫ్'** బదులు **'య'** తగిలించాలి. అప్పుడు అది <u>**'యస్తక్‌బిరు'**</u> అవుతుంది.

ఈ పదమే కాకుండా మరో నాలుగు పదాలను కలిగి ఉన్న కొన్ని ఖుర్'ఆన్ ఆయత్‌లను (తెలుగులో) దిగువున ఇస్తున్నాము. వీటిని బాగుగా అధ్యయనం చేస్తే, క్రియ యొక్క పదవ రూపం గురించి స్పష్టంగా అర్థమౌతుంది.

(2:34)(2:87)(4:173)(7:36)(7:75)(7:76)(7:133)(10:75)(14:21)(23:46)(25:21)(28:39)(29:39)(34:31)(34:32)(34:33)(38:74)(38:75)(39:59)(40:47)(40:48)(41:15)(41:38)(45:31)(46:10)(71:7)(74:23)

పై ఆయత్‌లలోని నాలుగింటికి తెలుగు అనువాదం:

- اِسْتَكْبَرَ **(ఇస్తక్‌బర)** : **దురహంకారం వహిస్తాడు** (Past tense)

మరియు మేము ఫరిష్తాలతో "మీరందరూ ఆదమ్ ముందు సజ్దా చేయండి" అని ఆదేశించినప్పుడు, ఒక్క ఇబ్లీస్ తప్ప, మిగతా వారంతా సజ్దా చేశారు. అతడు నిరాకరించాడు మరియు <u>**దురహంకారానికి గురి అయ్యాడు**</u> మరియు సత్యతిరస్కారులలోని వాడయ్యాడు. (ఖుర్'ఆన్ 2:34)

(యూదుల నుద్దేశించి) ... <u>**దురహంకారంతో ప్రవర్తించ లేదా**</u>? (ఖుర్'ఆన్ 2:87)

..... ఆయనను నిరాకరించి, <u>**గర్వం వహించినవారికి**</u> బాధాకరమైన శిక్ష విధిస్తాడు ... (ఖుర్'ఆన్ 4:173)

కాని ఎవరైతే మా సూచనలను నిరాకరించి వాటి యెడల <u>**దురహంకారం చూపారో**</u>, అలాంటివారు నరకాగ్ని వాసులవుతారు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు. (ఖుర్'ఆన్ 7:36)

- مُسْتَكْبِر **(ముస్తక్‌బిర్)** : అహంకారం వహించినవాడు **(అహంకారి)**

మీ ఆరాధ్య దైవం కేవలం (అల్లాహ్) ఒక్కడే! పరలోక జీవితాన్ని విశ్వసించని వారి హృదయాలు ఈ (సత్యాన్ని) తిరస్కరిస్తున్నాయి. మరియు వారు <u>**దురహంకారులు**</u>. (16:22)

<u>**దురహంకారులు**</u> దానిని గురించి వ్యర్థపు మాటలతో రాత్రులు గడుపుతూ ఉండేవారు. (23:67)

- اِسْتِكْبَار **ఇస్తిక్‌బార్** (క్రియా నామవాచకం) = **అహంకారం**

(ఇది) వారు భూమిలో మరింత <u>**దురహంకారం**</u>తో తిరుగుతూ, దుష్ట పన్నాగాలు పన్నినందుకు. (ఖుర్'ఆన్ 35:43)

- يَسْتَهْزِئُ **యస్తహ్‌జి'ఉ** (ఎగతాళి చేయడం)

మరియు వాస్తవానికి నీకు పూర్వం కూఆ చాలా మంది ప్రవక్తలు <u>**వెక్కిరించారు**</u>. కావున <u>**వెక్కిరించేవారు**</u> దేనిని గురించి <u>**వెక్కిరించే వారో**</u> అదే వారిని పట్టుకుంది. (ఖుర్'ఆన్ 6:10)

(పై ఆయత్‌లో మూడు కాలాల గురించి చెప్పడం జరిగింది.

- مُسْتَهْزِئ **ముస్తహ్‌జీ** వెక్కిరించేవాడు

మరియు విశ్వాసులను కలిసినప్పుడు, వారు: "మేము విశ్వసించాము." అని అంటారు. కానీ, తమ షైతానుల (దుష్ట నాయకుల) దగ్గర ఏకాంతంలో ఉన్నప్పుడు వారు : "వాస్తవానికి మేము మీతోనే ఉన్నాము కేవలం (వారిని) **వెక్కిరించేవారము**" అని అంటారు. (ఖుర్'ఆన్ 2:14)

నిశ్చయంగా **వెక్కిరించేవారికి** మేమే చాలు! (ఖుర్'ఆన్ 15:95)

- اِسْتَعْجَلَ **ఇస్త'జల**

ఆ తరువాత వారు ఒక దట్టమైన మేఘాన్ని వారి లోయల వైపునకు రావడం చూసినప్పుడు వారు అన్నారు : "ఈ మేఘం మాకు వర్షం ఇస్తుంది" (హూద్ అన్నాడు): "కాదు కాదు, మీరు దేనికి **తొందర చేశారో** (ఆ శిక్ష) ఇదే! ఇది ఒక తుఫాను గాలి. అందులో బాధాకరమైన శిక్ష ఉంది. (ఖుర్'ఆన్ 46:24)

*స్త్రీలు అన్యాయానికి గురవుతున్నారు ...*

# తక్షణ కర్తవ్యం?

ఇటీవల కాలంలో మనదేశంలో జరుగుతున్న సంఘటనలు తల్లిదండ్రులకు మరియు ప్రత్యేకంగా స్త్రీలకు భయాన్ని కలిగిస్తున్నాయి. చిన్నారుల నుండి వయస్సు పైబడిన వారి వరకూ ఎవరినీ వదలడం లేదు.

నిర్మానుష్యంగా ఉండే ప్రాంతానికి వృత్తిరీత్యా వెళ్ళిన ఓ పాత్రికేయురాలిపై ముంబయిలో గ్యాంగ్ రేప్ జరిగింది. వైజాగ్ సిటీలోనే రాత్రి 7.30 ప్రాంతంలో తన ఇంటి దగ్గరలో ఉండే షాపుకి ఏదో కొనడానికి వెళ్ళిన పాప, రెండవ రోజు విజయనగరం రైల్వే స్టేషన్లో అపస్మారక స్థితిలో పడి ఉంది.

దినపత్రికలలో ప్రచురించబడే సంఘటనలే చాలా ఉన్నాయి. వాస్తవంగా ఇంకెన్ని సంఘటనలు జరుగుతున్నాయో! ముంబయిలో ఒక సోదరి నిర్మానుష్య ప్రాంతంలో ఘోరంగా మానభంగం కావించబడిందని దినపత్రికల ద్వారా తెలిసిన తరువాత, చాలామంది అమ్మాయిలు వారికి కూడా అదే విధంగా ఆ ప్రదేశంలో జరిగినట్లు ఫిర్యాదు చేశారు.

ప్రస్తుతం ప్రజలు భయానక పరిస్థితులలో జీవనం సాగిస్తున్నారు.

- పాలకులు ప్రజలలో భయాందోళనలు పోగొట్టే విధంగా ఎందుకు సరియైన చర్యలు తీసుకోవడం లేదు?
- పాలకులు పట్టించుకోవడం లేదు కాబట్టి ఇటువంటి పరిస్థితిలో ప్రజల తక్షణ కర్తవ్యం ఏమిటి?

క్రింది ఆయత్ చూడండి :

ఇలా అను: "**ఆయన మీపై నుండి గానీ లేదా మీ పాదాల క్రింది నుండి గానీ, మీపై ఆపద అవతరింప జేయగల సామర్ధ్యం కలిగి ఉన్నాడు. మరియు మిమ్మల్ని తెగలు తెగలుగా చేసి, పరస్పర కలహాల రుచి చూపగలిగే (సామర్ధ్యం కూడా) కలిగి ఉన్నాడు.**" చూడు! బహుశా వారు (సత్యాన్ని) గ్రహిస్తారేమోనని, మేము ఏ విధంగా మా సూచనలను వివిధ రూపాలలో వివరిస్తున్నామో!" (ఖుర్'ఆన్ 6:65)

పైనుండి మరియు క్రింది నుండి ఆపదకు సంబంధించి ఎన్నో శిక్షలు గతించిన జాతులపై పడ్డాయి. నూహ్ జాతి, ఆద్ జాతి, సమూద్ జాతి, లూత్ జాతి, ఏనుగు ప్రజలు ఏ విధంగా శిక్షింపబడ్డారో ఖుర్'ఆన్లో వివరించ బడింది.

ఇబ్నె అబ్బాస్(రజి)వారు మరియు ముజాహిద్గారు పై ఆయత్ తఫ్సీర్ చెప్పారు : పై నుండి శిక్ష అంటే క్రూరమైన పాలకులు మరియు దయలేని అధికారులు ప్రజలను పరిపాలిస్తారని మరియు క్రింది నుండి శిక్ష అంటే ఒకరి అనుచరులు మరియు నౌకర్లు రాజద్రోహులుగా, సోమరిపోతులుగా మరియు దోపిడీదారులుగా మారిపోతారు.

బైహఖీలో షు'అబుల్-ఈమాన్లో 'కమా తకూనూన కజాలిక యువమ్మరు అలైకుమ్'. మీ ఆచరణలు మంచి లేక చెడు ఉన్నట్లే మీ నాయకులు మరియు అధికారులు మీపై ఏర్పాటు చేయబడతారు.

**అంటే మీరు మంచివారు మరియు అల్లాహ్కు విధేయులు అయితే మీ పాలకులు మరియు అధికారులు కూడా దయగలవారు మరియు న్యాయపరులు అవుతారు. ఒకవేళ చెడుకు పాల్పడుతూ ఉంటే దయలేని నాయకులు మరియు దౌర్జన్యపరులైన అధికారులే మీపై నియమించ బడతారు.**

అబీ ను'ఐమ్ గారి హిల్'యహ్లోని ఉల్లేఖనం.

ప్రవక్త(స)వారు చెప్పారు :

అల్లాహుతాలా చెప్పారు : "**నేను అల్లాహ్. ఆరాధ్యుడు ఎవడూ లేడు నేను తప్ప. నేను రాజులకు యజమానిని. మరియు నేను సార్వభౌమాధికారిని. రాజుల హృదయాలు నా చేతులలో ఉన్నాయి. నా దాసులు నాకు విధేయత చూపినప్పుడు వారి రాజులు మరియు అధికారుల హృదయాలలో నేను కారుణ్యం పోస్తాను మరియు నా దాసులు నాకు అవిధేయత చూపినప్పుడు, నేను వారి రాజుల (పాలకుల) హృదయాలను కఠినతరం చేస్తాను.**
**వారు అన్ని రకాల దుష్ట శిక్షలు వారు రుచి చూసేలా చేస్తారు. కాబట్టి పాలకుల మరియు అధికారుల గురించి చెడుగా మాట్లాడటంలో మీ శక్తిని వృథా చేసుకోకండి. అల్లాహ్ వైపు మరలండి మరియు మీ ఆచరణలు సరిచేసుకోండి, నేను మీ వ్యవహారాలను సరి చేసే విధంగా.**"

**అంటే పాలకులు మంచివారు కాకపోయినా, మనమంతా ఇస్లామ్ ప్రకారం నడుచుకుంటే, పాలకుల హృదయాలలో ప్రజల పట్ల కరుణ కలుగుతుంది, ఇన్షా అల్లాహ్!**

ముస్లిమ్ మహిళలు క్రింది అల్లాహ్ ఆదేశాన్ని పాటిస్తూ ఆయనకు విధేయత చూపుతున్నారా? లేక అవిధేయత చూపుతున్నారా? ఒకసారి మిమ్మల్ని మీరే స్వయంగా ప్రశ్నించుకోండి.

"... విశ్వసించిన స్త్రీలతో కూడా వారి చూపులను క్రిందికి పెట్టుకోమని మరియు వారి మర్మాంగాలను కాపాడుకోమని చెప్పు. మరియు వారి అలంకరణను ప్రదర్శించవద్దని చెప్పు - ప్రదర్శన మయ్యేది తప్ప. వారిని, **తమ తలమీది దుప్పటిని రొమ్ముల వరకు కప్పుకోమని చెప్పు**, వారు తమ అలంకారాన్ని తమ భర్తలకు, తమ తండ్రులకు, తమ భర్త తండ్రులకు, తమ కుమారులకు, తమ భర్తల కుమారులకు, తమ సోదరులకు, తమ సోదరుల కుమారులకు, తమ సోదరీమణుల కుమారులకు, తమ (తోటి)

స్త్రీలకు, తమ బానిస స్త్రీలకు, లేక కామ ఇచ్ఛలేని మగసేవకులకు, లేక స్త్రీల గుప్త అంగాలను గురించి తెలియని బాలురకు తప్ప, ఇతరుల ముందు **ప్రదర్శించ కూడదని** మరియు కనబడకుండా ఉన్న తమ అలంకారం తెలియబడేటట్లుగా, వారు తమ పాదాలను నేలపై కొడుతూ నడవకూడదని చెప్పు. మరియు ఓ విశ్వాసులారా! మీరందరూ కలిసి అల్లాహ్‌ను క్షమాపణకై వేడుకుంటే, మీరు సాఫల్యం పొందవచ్చు!'' (ఖుర్ఆన్ 24:31)

**సఫియా బిన్తె షైబహ్ (రజి) చెప్పారు :**

''మేము ఆయిషా(రజి)తో ఉన్నప్పుడు ఖురైషీ మహిళల గురించి మరియు వారి సుగుణాల గురించి చెప్పుకున్నాం. ఆయిషా(రజి) అన్నారు : 'ఖురైషీ మహిళలు మంచివారు. కాని అల్లాహ్ సాక్షి! అన్సార్ మహిళల కంటే అల్లాహ్ యొక్క గ్రంథాన్ని ఎక్కువ నిష్ఠగా మరియు ఉత్తమంగా అంటిపెట్టుకున్న మహిళలను నేనెప్పుడూ చూడలేదు. సూరహ్ నూర్ ''**.... తమ తల మీది దుప్పటిని రొమ్ముల వరకూ కప్పుకోమని చెప్పు ...**'' అవతరించినప్పుడు , వారి పురుషులు తమ మహిళలకు అల్లాహ్ అవతరింప జేసిన పదాలను వినిపించారు. ప్రతీ పురుషుడు తన భార్యకు, తన కూతురుకి, తన సోదరికి మరియు తన బంధువులలోని స్త్రీలకు వినిపించాడు. అల్లాహ్ ఏదైతే అవతరింప జేశాడో, దానిపై నుండే విశ్వాసంతో వారిలోని ప్రతీ స్త్రీ లేచి తన దుప్పటిని తీసుకుని తలపై నుండి చుట్టుకుంది. (దుప్పట్లు దళసరిగా ఉన్న కారణంగా) వారి తలలపై కాకులు ఉన్నాయా అనే విధంగా దుప్పట్లను చుట్టుకుని రసూలుల్లాహ్ వారి వెనుక వారు కనిపించారు. **(ఫత్‌హల్-బారీ 8/489, కితాబుత్తఫ్సీర్)**

మనల్ని పాలించే వారి విషయంలో వారిని నిందిస్తూ ఉండటం వలన ప్రయోజనం లేదు. వారి వలన కీడుకు బదులుగా మేలు పొందాలని కోరితే మనం అల్లాహ్‌కు విధేయత చూపాలి. వస్త్రధారణ విషయంలో స్త్రీలు ఏ విధంగా ఉండాలని అల్లాహ్ ఆదేశించారో పై ఖుర్ఆన్ ఆయత్ మరియు హదీస్ ద్వారా అర్థమవుతుంది. కాబట్టి స్త్రీలు అల్లాహ్‌కు విధేయత చూపాలి.

ఇక రెండవ విషయం - **'ప్రజల తక్షణ కర్తవ్యం'**.

## అణిచివేయబడేవానికి మరియు అణిచేవానికి ఇద్దరికీ సహాయం చెయ్యాలి

అణిచివేతకు గురయ్యేవానికి మరియు అణిచేవానికి కూడా సహాయం చేయమన్నారు మన ప్రియప్రవక్త ముహమ్మద్(స)వారు. అణిచివేతకు గురైన బాధితునికి సహాయం చేయడం అంటే అర్థమవుతుంది. కాని అణిచే వానికి సహాయం చేయడం అంటే ఏమిటో సహాబాలకు కూడా అర్థం కాలేదు. ముహమ్మద్(స)వారికి వివరించి చెప్పారు. **అణిచేవానికి సహాయం చేయడం అంటే, అతనిని ఆ చెడు పని చేయడం నుండి అతనిని నిరోధించడం.** దానివలన అతని పాపం తగ్గుతుంది. ఆ విధంగా అతనికి సహాయం చేసినవారము అవుతాము.

- **అణివేతకు గురవుతున్నవారు** : స్త్రీలు
  (బాలికల నుండి వయస్సు పైబడిన వారి వరకూ)
- **అణిచివేతకు పాల్పడేవారు** : పురుషులు
  (యువకుల నుండివయస్సు పైబడిన వారి వరకూ)

అణచివేతకు గురవుతున్న స్త్రీలను కాపాడుకోవాలి. ముందు జాగ్రత్తలు చెప్పి వారు ప్రమాదం బారిన పడకుండా సాధ్యమైనంత వరకూ మనం ప్రయత్నించాలి.

ఇటీవల ఓ ప్రముఖ దినపత్రికలో 'తస్లీమా నస్రీన్' స్టేట్‌మెంట్ ప్రచురించారు. పాఠకుల దృష్టిలో పడేవిధంగా పేజీలోని ముఖ్యమైన భాగంలోనే ఫొటోతో సహా ఆమె జన్మదినాన్ని పురస్కరించుకుని అచ్చు వేసారు. సాహిత్య విలువలు కనీసం సాధారణ స్థాయిలో కూడా లేకపోయినప్పటికీ, ఆమె ముస్లిములకు వ్యతిరేకంగా వ్రాస్తున్నారు అని తెలియగానే పాశ్చాత్యులు ఉత్తమ సాహిత్య పురస్కారాలతో ఆమెను గౌరవించారు. మన మీడియా కూడా పాశ్చాత్యులనే అనుకరిస్తుంది.

> **"ఒళ్ళు కనిపించేలా బట్టలు వేసుకుందని అత్యాచార బాధితురాలిని నిందించడమంటే, బులెట్ ప్రూఫ్ జాకెట్లు వేసుకోకుండా బయటకి వచ్చినందుకు ఉగ్రవాదుల పేలుళ్ళలో గాయపడిన వారిని తప్పు పట్టడమే." - తస్లీమా నస్రీన్**
>
> ఆమెను స్త్రీవాద రచయిత్రిగా సదరు దినపత్రిక పేర్కొంది

మనం బయటికి వెళ్ళేటప్పుడు ఇంటికి తాళం వేసుకుని వెళతాము. తాళం వేసి వెళ్ళకపోతే దానర్థం దొంగలను మన ఇంటికి ఆహ్వానించి నట్లు కాదు కదా! **'మేము తాళం వేయలేదు. వచ్చి మా ఇంటిని దోచుకోండి'** అని చెబుతున్నామా?

తాళం వేసినా, వేయకపోయినా దొంగ దోచుకోవచ్చు. దోచుకోక పోవచ్చు. మనకు సాధ్యమైనంత మేర మనం జాగ్రత్తలు తీసుకోవాలి. తలుపులు తెరచి ఉంచి బయటకి వెళ్లిన తరువాత దొంగతనం జరిగితే, విషయం తెలుసుకున్న పొరుగువారు సాధారణంగా ఏమంటారు? ఒక్కసారి ఆలోచించండి.

''తలుపులకు తాళాలు వేయకుండా బార్లా తెరచి వెళ్ళిపోతే, కుక్కలు పిల్లులు వెళతాయేమో, దొంగలు దోచుకుంటారేమోనని ఆలోచించ లేదా?'' అని అంటారు.

### అది నింద అవుతుందా? హితబోధ అవుతుందా?

> **ఎవరినైనా మానభంగం చేయడానికి, దోచుకోవడానికి, అన్యాయంగా చంపడానికి ఎవరికైనా ఎటువంటి హక్కు లేదు. అవి దుర్మార్గపు చేష్టలు.**

ఒంటిని కప్పుకోవడానికే బట్టలు. ఒళ్ళు కనిపించేలా బట్టలు వేసుకుంటే, ఆమెను ఆ విధంగా చూసే కుటుంబ సభ్యుల దృష్టిలో,

వివాహిత అయితే ఆమె పిల్లలు మరియు బయట వారి దృష్టిలో ఆమెకు ఎటువంటి గౌరవం ఉంటుంది?

**స్త్రీకి స్వేచ్ఛ కావలిసింది ధరించే బట్టల నుండేనా? అణిచివేత నుండి కాదా? ఐశ్వర్యం పెరిగేకొద్దీ స్త్రీ ధరించే దుస్తుల పరిమాణం తగ్గిపోతూ వస్తుంది. ఎందుకని?**

ఒకే దేశంలో ఒక్కొక్క ఆఫీస్‌లో ఒక్కొక్క డ్రెస్ కోడ్ ఉంటుంది. తమకు ఇష్టం వచ్చిన విధంగా డ్రెస్ చేసుకుని, డ్రెస్ కోడ్ ఉల్లంఘిస్తే సదరు టి.వి. సంస్థ ఆమెను యాంకరింగ్ చేయనిస్తుందా?

జర్మనీలో ఒక ఫైవ్ స్టార్ హొటల్‌లో బస చేయాలనుకునేవారు రిసెప్షన్‌లో ధరించిన బట్టలు విప్పి, అక్కడ ఇచ్చేసి నగ్నంగా లోపలికి వెళ్ళాలి. **ఇటువంటి జంతు లక్షణాలు ఒక్కొక్క చోట ఒకో విధంగా ఉంటాయి.**

శరీరాన్ని పూర్తిగా కప్పుకోమంటే కొందరు భరించలేక పోతున్నారు.

హెల్మెట్ పెట్టుకోక పోవడం వలన కొన్ని యాక్సిడెంట్‌లలో తలకు గాయాలై చాలామంది చనిపోతున్నారు. కాబట్టి హెల్మెట్ ధరించడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది.

ఆ సమయంలో హెల్మెట్ పెట్టుకుని ఉంటే అతడు బ్రతికి ఉండేవాడు అంటారు. అయితే హెల్మెట్ ధరిస్తే చనిపోరు అని గ్యారంటీ ఎవ్వరూ ఇవ్వలేరు. **అది ముందు జాగ్రత్త మాత్రమే.**

మన జాగ్రత్తలో మనం ఉండాలి. ప్రమాదాలు జరిగినప్పుడే ముందు జాగ్రత్తల గురించి మాట్లాడతారు. **అప్పుడైతే కాస్తయినా ఆలోచిస్తారని.** అంతేగాని అది నిందించడం కాదు.

అయితే తస్లీమా నస్రీన్ గారి స్టేట్‌మెంట్ వెనుక మరియు దానిని ప్రచురించిన మీడియా వారి ఆలోచన వెనుక ఉన్న అసలు భావం స్త్రీ వాదం గురించి కాదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వారు ఎవరిపై బురద జల్లాలని అనుకుంటున్నారో అది బహిరంగ రహస్యమే.

హిజాబ్ గురించి ఫ్రాన్స్‌లో మరలా గొడవ మొదలైంది. అందరూ తనను తిడుతున్నారని, ఓ వ్యసనపరుడు ప్రతీ ఒక్కరిని వ్యసనపరుడిగా మార్చెయ్యాలని ప్రయత్నిస్తున్నట్లుగా ఉంది ఫ్రెంచ్ వారి వ్యవహారం.

ఆ దేశాలలో ఒక స్త్రీ బరితెగించి అర్ధనగ్నంగా తిరగడానికి ఆమెకు హక్కు ఉన్నప్పుడు, మరొక స్త్రీ పూర్తిగా తన శరీరాన్ని కప్పుకోవడానికి ఆమెకు ఆ హక్కులేదని చెప్పి జరిమానా విధించడం **మానవ హక్కుల ఉల్లంఘన మాత్రమే కాదు అమానుషం కూడా**.

సెక్యూరిటీ కోసం అని చెప్పడం కూడా ఓ డ్రామా మాత్రమే. అదంతా మత దురభిమానం. స్త్రీలను అవమానించడమే!

**నేటి ఆధునిక సమాజాల పట్టుదల ఏమిటంటే మహిళలు తమ శరీరాలను పూర్తిగా కప్పుకోకుండా, దాదాపు నగ్నంగానూ మరియు అనైతికంగానూ జీవించాలి. పాశ్చాత్య దేశాలలోనే కాకుండా ముస్లిమ్ దేశాలలో కూడా హిజాబ్‌ను వ్యతిరేకించే వారున్నారు.**

గౌరవప్రదంగా ఉండే ముస్లిమ్ మహిళ యొక్క వస్త్రధారణకు వ్యతిరేకంగా ముస్లిమ్ దేశాలైన టర్కీ, ఆఫ్ఘనిస్తాన్, ఈజిప్టు మొదలైన దేశాలలో ఆ డ్రెస్‌కోడ్‌ను మార్చడానికి ఎంతోమంది ప్రయత్నించారు.

హిజాబ్ నుండి మరియు ముస్లిమ్ మహిళ కలిగి ఉండే మాన మర్యాదల నుండి ఆమెను బయటకు లాగాలని, మగవాళ్ళతో స్త్రీలు స్వేచ్ఛగా కలిసిపోయి తిరగాలని, స్త్రీలు తన శరీర భాగాలను బహిర్గతం చేసినా ఫర్వాలేదని ఎంతోమంది చెప్పారు.

కాని ఆ విధంగా ఎవరైతే ప్రచారం చేసారో, వారే ఆ తరువాయి కాలంలో తమ అభిప్రాయాలను మార్చుకున్నారు.

**తీసివేయవలసింది మనస్సుపైనున్న మత దురభిమానపు ముసుగు**

చాలాకాలం పాటు 'హిజాబ్'పై మరియు హిజాబ్‌ను ధరించినవారిపై వ్యతిరేకంగా పనిచేసిన సోదరి - **డా. నవాల్ అస్స'దావి.**

హిజాబ్‌ను తీసివేయమని చాలా తీవ్రంగా మహిళలకు పిలుపునిచ్చిన ఈ సోదరి ఆ తరువాత పాశ్చాత్య దేశాలలోని అశ్లీలతను, అసహ్యం పుట్టించే మహిళల నగ్నత్వాన్ని ఖండిస్తూ వెలిబుచ్చిన అభిప్రాయం :

*"లండన్ వీధుల్లో ... అమ్మకపు వస్తువుల వలే తమ శరీరాలను బహిర్గతం చేస్తూ దాదాపు నగ్నంగా ఉండే మహిళలను నేను చూశాను. బట్టలు అనేవి మనచుట్టూ ఉన్న వాతావరణం నుండి మనల్ని రక్షించడానికే గాని, రెచ్చగొట్టే సందేశాన్ని ఇవ్వడానికి కాదు.*
*స్త్రీ తనను తాను వ్యాపార వస్తువుగా కాకుండా, తనను ఓ మనిషిగా చూసుకుంటే, తనకు నగ్నత్వాన్ని ప్రదర్శించ వలసిన అవసరమే రాదని తెలుసుకుంటుంది".*

**ముసుగు తీయవలసింది శరీరంపై నుండి కాదు. మనస్సుపై నున్న ముసుగును తొలగించాలి.**

**- డా. నవాల్ అస్స'దావి**

ముఖ్యంగా చదువుకున్న స్త్రీ, పురుషులు తమ మనస్సులపై నున్న ముసుగులు తొలగించాలని ఆమె పిలుపునిచ్చారు.

తమ శరీరాలను కప్పుకోకుండా, మనస్సులను మాత్రమే కప్పుకునే చదువుకున్న స్త్రీల కంటే, చదువుకోకపోయినా సరే హిజాబ్‌ను ధరించి, వివేకమూ, విశాల హృదయాన్ని కలిగిన ముస్లిమ్ మహిళ ఎన్నో రెట్లు విలువ కలిగి ఉంటుందని ఆ సోదరి అభిప్రాయ పడ్డారు.

ఆమె ఇంకా ఇలా అంటున్నారు : ''**రాజకీయ, సామాజిక మరియు సాంస్కృతిక విద్యలేని** ఎంతోమంది మహిళా ప్రొఫెసర్లను, డాక్టర్లను, ఇంజినీర్లను నేను చూశాను''.

కొన్ని సంవత్సరాల క్రితం డెమాస్కస్ (సిరియా) యూనివర్శిటీలో చదువుతున్న ఓ ముస్లిమ్ యువతి హిజాబ్‌ను ధరించి ఉండగా చూచి, ఓ విలేఖరి ఇలా ప్రశ్నించడం జరిగింది : **'ఇంత మండు వేసవిలో చాలా వేడిగా లేదా?'** అని. ఆ ప్రశ్నకు స్పందించి ఆ సోదరి ఇలా జవాబిచ్చారు :

> **"భగభగమండే నరకాగ్ని దీనికంటే ఎక్కువ వేడిగా ఉంటుంది"**
> (ఖుర్ఆన్ 9:81)

**బురఖా / హిజాబ్ వలన ఉపయోగాలు**

- స్త్రీకి గౌరవ మర్యాదలు కలుగజేస్తుంది.
- ఇతర స్త్రీలను చూసినప్పుడు, అల్లాహ్ ఆదేశాన్ని పాటిస్తున్నాననే సంతోషం తనలో కలుగుతుంది.
- మగవారి చెడుచూపుల నుండి రక్షణ కలుగుతుంది.
- శరీరానికి రక్షణ నిస్తుంది.

> **"... మీరు వేడి నుండి కాపాడుకోవడానికి వస్త్రాలను మరియు యుద్ధం నుండి కాపాడుకోవడానికి కవచాలను ఇచ్చాడు. మీరు ఆయన (అల్లాహ్)కు విధేయులై ఉండాలని, ఈ విధంగా ఆయన మీపై తన అనుగ్రహాలను పూర్తి చేస్తున్నాడు"** (ఖుర్ఆన్ 16:81)

చలి ప్రాంతాలలో నివశించే స్త్రీలు, పురుషులు అందరూ శరీరాన్ని కప్పుకుంటారు. ఎడారివంటి వేడి ప్రాంతాలలో కూడా దుమ్ము ధూళి నుండి, ఎండ నుండి రక్షించుకోవడానికి బయట తిరిగే పురుషులు, స్త్రీలు కూడా శరీరాన్ని బట్టలతో కప్పుకుంటారు.

## మీడియా ద్వంద్వ వైఖరి

మన రాష్ట్రంలో వేసవికాలంలో ఇతర ధర్మాలకు చెందిన ఎందరో యువతులు కూడా తమ ముఖాన్ని పూర్తిగా కప్పుకుంటున్నారు. నిఖాబ్ కంటే ఎక్కువగా. స్కూటర్లపై ప్రయాణిస్తున్న వీరు చేతులకు మోచేతి వరకూ గ్లౌ లను తొడుక్కుంటున్నారు. తమ చర్మాన్ని వేడి నుండి కాపాడుకోవడానికి. ఇప్పుడు కొన్ని నగరాలలోనైతే అన్నికాలాలలోనూ ముఖాన్ని కప్పుకుంటున్నారు. (చూడండి పై ఆయత్ 16:81)

ఈ వేషధారణలో ఉండి స్కూటర్లు నడుపుతున్న అమ్మాయిల ఫొటోలను దినపత్రికలలో తరచుగా చూపిస్తున్నారు. ఈ వేషధారణను ప్రోత్సహిస్తున్నారు. చేతులకు తొడిగే వివిధ రకాల గ్లౌ ల గురించి, వాటి ఖరీదుల గురించిన వివరాలు తెలియజేస్తున్నారు.

**మరి ఇవే దినపత్రికలు <u>ముస్లిమ్ మహిళలు</u> తమ శరీరాన్ని కప్పుకుంటే ఎందుకు విమర్శిస్తున్నాయి?**

> మిగతా స్త్రీల వలే కేవలం చర్మ సౌందర్యాన్ని కాపాడుకోవడానికే కాకుండా,ఆత్మ సౌందర్యాన్ని కూడా కాపాడుకోవడానికి, పురుషులను రెచ్చగొట్టకుండా, వారు సన్మార్గం నుండి తప్పి పోకుండా ఉండే విధంగా ముస్లిమ్ మహిళ బురఖా ధరిస్తుంది. **కాబట్టి తీయవలసినది మానమర్యాదలను కాపాడే ముసుగును కాదు. మీ హృదయాలపైన ఉన్న మత దురభిమానపు ముసుగును తీసివేయండి.**

ఎండ నుండి రక్షణ కొరకు ఒక సోదరి చున్నీని ముఖానికి చుట్టుకుని స్కూటర్‌పై వెళుతున్నారు. ఆమె కళ్ళు తప్ప ముఖం కనిపించడం లేదు. ఆ సోదరి ముస్లిమ్ కాదు. ఈ ఫొటో ఓ దినపత్రికలో ప్రచురించబడింది.

అయితే ఫొటో పక్కన వ్రాసిన కామెంట్లు మాత్రం అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయి. **'టెర్రరిస్టులు కారు. ఆటంకవాదులు అంతకంటే కాదు'.** <u>ఇంతటి నీచమైన వర్ణన అవసరమా?</u> <u>ఒక స్త్రీ శరీరాన్ని కప్పుకుంటే ఇంత ఘోరమైన పదాలు వ్రాయాలా?</u>

ఫొటోలో కనిపిస్తున్న మహిళ సంగతి అటుంచండి. హెల్మెట్ పెట్టుకుంటే పూర్తి ముఖమే కనిపించదు కదా! టెర్రరిస్టులు వీధుల్లో తిరిగేటట్లయితే ఆ విధంగానే తిరుగుతారా? మరి హెల్మెట్ పెట్టుకుని ముఖం కనిపించకుండా ఉంచిన వారంతా కూడా తీవ్రవాదులే అవుతారా?

**ఆ ఫొటోకి మరియు 'టెర్రరిస్ట్, ఆటంకవాది' అనే పదాలకు ఏదైనా సంబంధముందా?** నిజంగా ఏ టెర్రరిస్టు అయినా ఊరిలో అడుగుపెడితే ఆ విధంగా ముఖం కనిపించకుండా అడుగుపెడతాడా? **రోజూ ఎంతోమంది ముస్లిమ్ మహిళలు హిజాబ్ వేసుకుని వెళ్తుంటారు. ఇది మన దేశంలో ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదే!** విలేఖరి ఆ పదాలు వాడటానికి కారణం, ప్రతీ ముస్లిమ్ ఓ టెర్రరిస్ట్ లేదా ఓ ఆటంకవాది అనే నీచమైన అభిప్రాయం తన మనస్సులో నాటుకుపోవడమే!

ఎక్కువమంది చదివే దినపత్రికలలో రిపోర్టర్లు ఈవిధంగా వ్రాస్తే, ముస్లిములపై పాఠకుల ఆలోచన ఏ విధంగా ఉంటుందో ఆలోచించాలి. మీడియా ద్వారా అపోహలకు గురై, ఆ అపోహలనే జీవితాంతం నిజమని నమ్మిన పాఠకుల సంఖ్యే ఎక్కువ. కాబట్టి తమపై నైతిక బాధ్యత కూడా ఉందని విలేకర్లు మరచిపోకూడదు. ఈ విషయంలో మీడియా వారికి కౌన్సిలింగ్ యొక్క అవసరముంది.

ఆ ఫొటోకు వివరణ ఇవ్వాలనుకుంటే, **"మీరు వారిని చూసి ముస్లిమ్ మహిళలు అని పొరబడి ఉంటారేమో! కాని వారు ముస్లిమ్ మహిళలు ధరించే హిజాబ్ మాదిరి చున్నీని చుట్టుకున్నారు"** అని వ్రాయవచ్చు.

**"టెర్రరిస్టులు కారు, ఆటంకవాదులు కాదు. సూర్యుడు తడాఖా చూపిస్తుంటే అల్లాడిపోతున్న బంగారుతల్లులు"** అని వ్రాసారు.

అదే ఓ ముస్లిమ్ స్త్రీ హిజాబ్ ధరించి వెళుతుంటే స్వేచ్ఛ పోగొట్టుకున్న స్త్రీ అంటారు లేదా మతఛాందసవాది అంటారు. అంతేగాని,

**ఈ ముస్లిమ్ సోదరి మర్యాద కాపాడుకోవడానికి శరీరాన్ని కప్పుకున్న బంగారుతల్లి అని అనగలుగుతారా?**

ఆ విధంగా అనరు. ఎందుకంటే ఆ స్థాయిలో సంస్కారం ఇంకా ఎదగలేదు. పాశ్చాత్యుల భావజాల బానిసత్వంలోనే ఇంకా కొట్టుమిట్టాడుతున్నారు.

ఇంతటి విషం విలేఖర్ల మనస్సులలోనే ఉంటే, సామాన్యుల గురించి ఇంకేమీ చెప్పాలి? **అందుకనే 'హిజాబ్' ధరించడం ముస్లిమ్ మహిళలకు సర్వసామాన్యం కావాలి.**

**వడదెబ్బ నుంచి రక్షించుకోండిలా ..** అని వివరిస్తూ ముఖానికి చున్నీ చుట్టుకున్న ఓ మహిళ ఫొటోను ఓ దినపత్రిక ప్రచురించింది. అయితే **'ముస్లిమ్ స్త్రీలు ధరించే విధంగా ధరించండి'** అని వ్రాస్తే ఎంత స్పష్టంగా ఉండేది! **కాని అలా వ్రాయగలరా?**

**వడదెబ్బ నుండి రక్షించుకోవడానికి వారు చెప్పిన జాగ్రత్తలలో రెండు:**

1. వీలైనంత వరకూ నూలు వస్త్రాలు __**వదులుగా ఉండేవాటిని**__ మాత్రమే ధరించాలి.
2. ఎండలో పనిచేసేవారు తలపాగా, టోపీ ధరించాలి.

ఇస్లామ్ ఈ విషయాలను ఏనాడో చెప్పింది. అల్లాహుతాలా తన దాసుల క్షేమానికై ఎన్నో రక్షణ ఏర్పాట్లు చేశారు. కాని నేటి ముస్లిమ్ మహిళలలో అత్యధికులు అల్లాహ్‌కు విధేయత చూపడం లేదు.

## స్త్రీలు వస్త్రధారణలో తీసుకోవలసిన జాగ్రత్తలు

- 6వ తరగతి లేదా 7వ తరగతి నుండి అయినా మీ పిల్లలకు హిజాబ్ అలవాటు చేయండి.

### • పురుషులు వేసుకునే బట్టలు స్త్రీలు ధరించరాదు

అబూహురైరా(రజి) ఉల్లేఖనం :

**"అల్లాహ్ యొక్క సందేశహరులు(స) స్త్రీలు వేసుకునే బట్టలను ధరించే పురుషులను మరియు పురుషుల బట్టలను ధరించే స్త్రీలను శపించారు"** (అబూదావూద్, సహీహ్, 4098, పుస్తకం 31, అధ్యా.28, సంపుటి 4)

### • పలుచని దుస్తులుగాని లేదా లోపలి భాగం కనిపించే విధంగా ట్రాన్స్‌పరెంట్ (పారదర్శక) దుస్తులు గాని ధరించ కూడదు.

అనార్కలి అని, అదేదో కలి అని దుస్తులు ధరిస్తున్నారు. __**విధేయులకి అవి నప్పవు**__. పలుచగా లేదా పారదర్శకంగా ఉండే బట్టలకు లోపల లైనింగ్ క్లాత్ వేసి కుట్టించడం అవసరం.

దిహ్యా బిన్ ఖలీఫా అల్ కల్బీ ఉల్లేఖనం :

"కొన్ని ఖబాతీ (పలుచని ఈజిప్టు నేత బట్టల) ముక్కలు అల్లాహ్ సందేశహరుల(స) దగ్గరకు తీసుకురాబడ్డాయి మరియు ఆయన(స) నాకు ఒక ముక్కనిచ్చి చెప్పారు : **'దీనిని రెండుగా కత్తిరించు మరియు వాటిలో ఒకదానితో కమీస్ తయారుచేసుకో మరియు మరొకటి నీ భార్యకివ్వు దానితో ఆమె కప్పుకోవడానికి'.** అతను తిరిగి వెళ్తున్నప్పుడు ఆయన(స) చెప్పారు : **'దాని (ఆ వస్త్రం)లో నుండి కనిపించకుండా ఉండేందుకు, దాని క్రింద మరో వస్త్రాన్ని ఉంచమని నీ భార్యకు చెప్పు"**

(అబూదావూద్, హసన్, 4116, పుస్తకం 31 అధ్యా. 36, సంపుటి 4)

### • వదులుగా ఉండే దుస్తులు ధరించాలి

బట్టలు వేసుకున్నప్పటికీ నగ్నంగా ఉన్నట్లు కనిపించే బట్టలు ధరించ రాదు. బిగుతు (టైట్)గా ఉండే టీ షర్ట్‌లు, టైట్ జీన్ ప్యాంట్‌లు, టైట్ చుడీదార్లు వేసుకుంటే స్త్రీ యొక్క శరీర సౌష్టవం స్పష్టంగా కనిపిస్తుంది. **అంటే శరీరంపై దుస్తులు ఉన్నప్పటికీ, బట్టలు ధరించని విధంగా ఉన్నారని వారు అర్థం చేసుకోవాలి.**

కొంతమంది బురఖాలు కూడా టైట్‌గా కుట్టిస్తున్నారు. కొందరు ఇంటి దగ్గర బురఖా వేసుకుని బయలుదేరి పార్కులలో తలపై హిజాబ్/నిఖాబ్‌ని తీసివేస్తున్నారు.

అబూహురైరా(రజి) ఉల్లేఖనం :

"అల్లాహ్ సందేశహరులు(స) చెప్పారు : 'నరకంలో రెండు రకాల మనుష్యులు ఉంటారు. వారిని నేను చూడలేదు. పశువుల తోకల వంటి కొరడాలతో ప్రజలను కొట్టే పురుషులు మరియు **బట్టలు వేసుకున్నా సరే నగ్నంగా ఉండే స్త్రీలు - 'ముమిలాత్ మా'ఇలాత్** (వలలో వేసుకోవడానికి ఆకర్షించే తీరులో నడవడం లేదా సన్మార్గం నుండి మరలిపోవడం మరియు ఇతరులను మార్గభ్రష్టత్వం వైపు తీసుకెళ్ళడం) **ఒంటె మూపురం వంటి ఒకవైపు ఒరిగిన తలలతో (ఉంటారు). వారు స్వర్గంలో ప్రవేశించలేరు, దాని పరిమళాన్ని వాసన కూడా చూడలేరు మరియు ఫలానా ఫలానా దూరం నుండి (చేరే) దాని పరిమళాన్ని కూడా గుర్తించలేరు."** (సహీహ్ ముస్లిమ్,5582, పుస్తకం 37, అధ్యా.34, సంపుటి 5)

వదులు (లూజు)గా ఉండేవి, కాస్త దళసరి బట్టలను వేసుకోవడం వలన, మహిళలకు కూడా సౌకర్యంగా ఉంటుంది. అటువంటి బట్టలు గౌరవాన్ని పొందేలా చేయడమే కాకుండా, పరాయి మగవాళ్ళలో సెక్స్ భావనను రేకెత్తించకుండా ఉంటాయి.

స్త్రీ పురుషుల మధ్య ప్రకృతి పరంగా ఉండే సహజ ఆకర్షణను మానవులెవరూ ఆపలేరు. కాని ఆ సహజ ఆకర్షణ వలన చెడు జరగకుండా నిరోధించు కోవచ్చు, ఇన్షా అల్లాహ్, అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు చెప్పినట్లుగా నడుచుకుని.

రోగం తగ్గడానికి డాక్టర్ మందులు ఇస్తే, అవి వేసుకోకుండా రోగంతో బాధపడుతూ అరచి గగ్గోలు పెడితే, ఆ తప్పు ఎవరిది?

నియమనిబంధనలు కేవలం స్త్రీలకు మాత్రమే పరిమితమా?

కాదు. పురుషులకూ ఉన్నాయి.

## మగవారి విషయం :

మానభంగం చేసేవాడు ఎవడైనా గాని **వాడూ ఓ తల్లికి కుమారుడే!** చిన్నతనం నుండి స్త్రీలను గౌరవించే విధంగా కుమారునికి తల్లి శిక్షణ ఇవ్వాలి. బిడ్డలకు ఇస్లామీయ సంస్కారం నేర్పాలి. ముందుగా ఇస్లామీయ సంస్కారాన్ని తల్లిదండ్రులు అలవరచుకోవాలి. చిన్నతనం నుండే మస్జిద్‌లకు పంపడం అలవాటు చేయాలి.

అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నారు :

> **"విశ్వసించిన పురుషులతో, వారి చూపులను క్రిందికి పెట్టుకోమని మరియు వారి మర్మాంగాలను కాపాడుకోమని చెప్పు. ఇది వారికి ఎంతో శ్రేష్ఠమైనది. నిశ్చయంగా అల్లాహ్, వారి చేష్టలను బాగా ఎరుగును."** (ఖుర్ఆన్ 24:30)

**ఒకవేళ అనుకోకుండా చూస్తే :**

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి)వారి ఉల్లేఖనం. "నేను రసూలుల్లాహ్ (స)వారిని అడిగాను **అనుకోకుండా చూడటాన్ని మరియు ఆయన(స) నన్ను ఆదేశించారు నా చూపును మరలించమని."** (సహీహ్ ముస్లిమ్, 5644, పుస్తకం 38, అధ్యా.10, సంపుటి 5)

ఒకరి ఇంటికి వెళ్ళినప్పుడు, లోపలికి వెళ్ళడానికి ఆ ఇంటివారిని అనుమతి అడగాలి. ముందుగా సలామ్ చెప్పాలి. సలామ్‌కి స్పందన వస్తే సరేసరి. లేకపోతే మూడుసార్లు సలామ్ చెప్పాలి. మూడుసార్లు చెప్పినా లోపలి నుండి జవాబు రాకపోతే, అక్కడ నుండి వెళ్ళిపోవాలి.

ఇంటి గుమ్మానికి పరదా ఉన్నా లేకపోయినా ద్వారానికి కుడివైపుగాని లేదా ఎడమవైపుగాని నిలుచుని సలామ్ చెప్పాలి.

అంతేకాదు ఒకరి ఇంటిలోకి తొంగి చూడకూడదు. ఏకాంతానికి ఇస్లామ్ అత్యంత ప్రాధాన్యత నిచ్చింది.

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. **అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు. ఒక వ్యక్తి అనుమతి లేకుండా మీవైపు లోపలికి చూస్తే మరియు మీరు అతనిపై రాతి బెడ్డ విసరండి మరియు అతని కన్ను పోయినాసరే మీపై ఎటువంటి నింద లేదు. (సహీహ్ ముస్లిమ్, 5643, పుస్తకం 38, అధ్యా.9, సం.5)**

## ముహమ్మద్(స)వారు పరస్త్రీల చేతులను తాకలేదు

తన చేతిపై ముహమ్మద్(స)వారు పురుషులచే ప్రమాణం (బైత్) చేయించుకున్నారు. కాని ప్రమాణం చేయడానికి ముందుకు వచ్చిన స్త్రీల చేతులను తాకలేదు. ప్రమాణాన్ని వారి నోటిమాట ద్వారా తీసుకున్నారు.

> **పరస్త్రీని ముట్టుకోవడం కంటే తలలో ఇనుప సూదిని గుచ్చుకోవడం ఉత్తమం** అని ముహమ్మద్(స)వారు బోధించారు.

కోరికతో ఓ పరాయి స్త్రీని ముట్టుకోవడం కంటే తలలో ఇనుప సూది గుచ్చుకోవడమే ఉత్తమం అనేది అర్థం చేసుకుంటే, మానభంగానికి మాత్రమే కాదు ఆ ఆలోచనకి సైతం అవకాశం ఉండదు.

ఎవడో ఓ దుర్మార్గుడు కొన్ని క్షణాల సుఖం కోసం చేసే మానభంగం, జీవితాంతం ఓ స్త్రీని మానసికంగా బాధ కలిగిస్తూనే ఉంటుంది. ఆ స్త్రీ రక్త సంబంధీకులు కూడా తీవ్ర ఆవేదనకు గురౌతారు. మానవ హక్కులు పేరు చెప్పి కఠిన శిక్షలు విధించకపోతే ఎందరో స్త్రీలు బలైపోతారు.

యాసిడ్ పోయడానికి, మానభంగం చేయడానికి కనీసం ఆలోచన మనస్సులో వచ్చినా సరే, తీవ్రంగా భయంతో వణికిపోయేలా బహిరంగ శిక్షలు అమలు పరచి విశేషంగా గ్రామస్థాయి నుండి పబ్లిసిటీ ఇవ్వాలి.

> **ప్రతీ స్త్రీ తన బిడ్డలకు సంస్కారం నేర్పకపోతే, వారివలన మరొకరి బిడ్డలకు హాని కలగడమే కాకుండా, సంస్కారవంతులైన తోటి స్నేహితులను కూడా వారి ద్వారా పాడుచేసినట్లు అవుతారు.**

**అణిచివేతకు గురవకుండా స్త్రీలను కాపాడుకోవాలి.**

మరియు అణిచివేసేవారిని చెడు చేయడం నుండి నిరోధించాలి. మనమంతా అల్లాహ్‌కు విధేయత చూపాలి. సందేశహరుడు(స)కి విధేయత చూపాలి. **ఇదే మన తక్షణ కర్తవ్యం.**

ఈ కర్తవ్యాన్ని సరియైన విధంగా నెరవేర్చగలిగిన నాడు ప్రతీ స్త్రీకి సమాజంలో గౌరవమర్యాదలు లభిస్తాయి.

మానభంగం చేశాడని నిరూపించబడిన తరువాత కూడా, తమ కుమారుడిని ఏదో విధంగా శిక్ష నుండి రక్షించు కోవడానికి తల్లిదండ్రులు ప్రయత్నం చేస్తారు. ఈ ప్రయత్నం కోసం పడే తాపత్రయం చిన్నతనం నుండీ తమ బిడ్డను చెడు నుండి రక్షించుకునే విషయంలో చేసి ఉటే పరిస్థితి వేరేగా ఉండేది.

కష్టాలు అనేవి రెండు రకాలుగా అంటే అవి అల్లాహ్‌కు **అ**విధేయత చూపడం వలన మరియు అల్లాహ్ పెట్టే పరీక్షల వలన వస్తాయి. అల్లాహ్ తన దాసులకు పెట్టే పరీక్షలలో, దాసులు ఆ పరీక్షలో విశ్వాసంతో సహనం వహిస్తే ఆయనే వారికి సహాయం చేస్తారు. మనల్ని ఆ కష్టాల నుండి దాటిస్తారు, ఇన్షా అల్లాహ్!

అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరుడు, ముహమ్మద్(స)వారికి మాటల ద్వారా, ఆచరణ ద్వారా మనస్ఫూర్తిగా విధేయత చూపితే ఇహలోకం సంతోషమయం అవడమే కాకుండా, పరలోకంలో శాశ్వత సుఖ సంతోషాలు లభిస్తాయి.

> **ధర్మంలో బలవంతం లేదు. ధర్మాన్ని అనుసరించడానికైనా లేక తిరస్కరించడానికైనా మనకు పూర్తి స్వేచ్ఛ ఉంది.**

మరి **తక్షణ కర్తవ్యం**గా ఏది ఎంచుకోవడమో ఓ నిర్ణయానికి రావాలి.

> **"ఓ ఆదమ్ సంతానమా!** వాస్తవానికి మేము మీ కొరకు వస్త్రాలను కల్పించాము. అవి మీ మర్మాంగాలను కప్పుతాయి. మరియు మీకు అలంకారమిస్తాయి. మరియు అల్లాహ్ పట్లభీతియే అన్నింటికంటే శ్రేష్ఠమైన వస్త్రం. ఇవి అల్లాహ్ వచనాలలో కొన్ని, బహుశా గుణపాఠం నేర్చుకుంటారేమోనని" **(ఖుర్ఆన్ 7:26)**

ప్రపంచ పాలకులు మరియు రాజకీయ నాయకులు తప్పనిసరిగా తెలుసుకోవలిసిన ముహమ్మద్(స)వారి ప్రియ అనుచరుని జీవితచరిత్ర

ప్రపంచానికి నిజమైన ప్రజాస్వామ్యాన్ని అందించిన ధర్మం - ఇస్లామ్

రెండవ ఖలీఫా

# ఉమర్ బిన్ ఖత్తాబ్

రజి అల్లాహుతాలా అన్హూ

14

- అతి నిరాడంబరుడు
- ప్రపంచంలోని అతి పెద్ద భూభాగానికి నాయకుడు
- అవినీతి అధికారులకు సింహస్వప్నం

ఓ దశాబ్దంపాటు నూటికి నూరు శాతం ప్రజాస్వామ్య పరిపాలన అందించిన ప్రజానాయకుడు

ఎటువంటి తిరుగుబాటులకు అవకాశం రానివ్వని ఉత్తమ పాలకుడు

ప్రజలకే కాకుండా మూగజీవాలకూ న్యాయం చేకూర్చిన అత్యంత దైవభీతిపరుడు

(ఏప్రిల్, 2013 సంచిక తరువాయి ...)

## 2వ ఖలీఫాను నియమించడంలో అబూ బక్ర్(రజి)వారు చేసిన సంప్రదింపులు

హిజ్రీ శకం 13 లో అబూ బక్ర్ సిద్దీఖ్(రజి) వ్యాధిగ్రస్తులయ్యారు. ఆయన ఆరోగ్య పరిస్థితి వేగంగా క్షీణించడం మొదలైంది. ఈ లోకాన్ని వీడే సమయం దగ్గరైందని అబూ బక్ర్(రజి)వారు గ్రహించి ప్రజలను రమ్మని ఆదేశించారు.

ప్రజలు ఆయన దగ్గర సమావేశమయ్యారు. ఆయన చెప్పారు: “నిస్సందేహంగా నేను తీవ్ర వ్యాధి బారిన పడ్డానని మీరు స్పష్టంగా చూడగలుగుతున్నారు. మరియు నేను ఖచ్చితంగా అనుభూతి చెందుతున్నాను, నా పరిస్థితి తీవ్రతను బట్టి, నేను త్వరలో మరణిస్తానని. కాబట్టి అల్లాహుతాలా మిమ్మల్ని విడిచిపెట్టారు మీరు నాతో చేసిన ప్రతిజ్ఞ నుండి మరియు మీతో నా ఒడంబడిక (మీ ఖలీఫాగా) ముగింపు కొచ్చింది.

అల్లాహుతాలా మీ వ్యవహారాలను మీకే మరిలించారు (అంటే మీ నుండి మీ నాయకుడిని ఎన్నుకోమని). కాబట్టి మీరు కోరిన వారిని మీపై నియమించుకోండి. వాస్తవానికి, మీరు గనుక నేను బ్రతికుండగనే మీ కొత్త నాయకుడిని ఎన్నుకుంటే, నేను వెళ్ళిన తరువాత మీ మధ్య విబేధం తగ్గవచ్చు.”

ఆయన ముహాజిర్లు మరియు అన్సారులతో సంప్రదించారు. సహాబాలలో ఒకరి పేరును ప్రతిపాదిస్తే, ఆ సహాబా తాను ఆ పదవికి సరిపోనని మరొకరి పేరు సూచించేవారు. సహాబాలలో ఉండే ఉత్తమ లక్షణమే అది. తన కంటే తన సోదరుడే ఎక్కువ అని భావించేవారు.

కాబట్టి ఖలీఫాగా ఒక వ్యక్తిని ఎన్నుకోవడం వారికి సాధ్యం కాలేదు. ఇక వారు చేసేదేమీ లేక అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారి దగ్గరకు వచ్చి చెప్పారు, **“ఓ రసూలుల్లాహ్ వారి ఖలీఫా! మీ అభిప్రాయమే మా అభిప్రాయం.”** అందరూ ఆ నిర్ణయాన్ని ఆయనకే వదిలేసారు.

“నాకు కొంత సమయం ఇవ్వండి, నేను చూస్తాను అల్లాహ్ దృష్టిలో ఏది ఉత్తమమో మరియు ఆయన ధర్మానికి మరియు ఆయన దాసులకు ఏది ఉత్తమమో” అని వారికి అబూబక్ర్(రజి) సమాధాన మిచ్చారు.

**సన్మార్గం పొందిన నలుగురు ఖలీఫాలకు ముహమ్మద్(స)వారు ఇచ్చిన శిక్షణ అమోఘమైనది. ముహమ్మద్(స)వారిని అనుసరించడంలో ఈ నలుగురూ మనకు ఆదర్శప్రాయులు. ముహమ్మద్(స) వారిని ఆదర్శంగా తీసుకుని ఏ విధంగా అనుసరించాలో వారు ఆచరించి మనకు స్పష్టంగా చూపారు.**

ముహమ్మద్(స)వారు ఏదైనా నిర్ణయం తీసుకునేటప్పుడు ముఖ్య అనుచరులతో ప్రత్యేకంగా సంప్రదింపులు జరిపేవారు. అదే విధంగా అబూబక్ర్ (రజి)వారు కూడా చేశారు. ఆయన అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)వారిని పిలిపించారు.

అబూబక్ర్(రజి) : **ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారి గురించి చెప్పండి.**

అబ్దుర్రహ్మాన్(రజి): **మీరు దేని గురించి అయితే నన్ను అడిగారో, ఆ విషయంలో నాకంటే మీకే ఎక్కువ జ్ఞానం ఉంది.**

అబూబక్ర్(రజి) : **అయినప్పటికీ**

అబ్దుర్రహ్మాన్(రజి): **అల్లాహ్ సాక్షి! మీరు ఆయన గురించి ఆలోచించిన దానికంటే మేలైనవాడు.**

అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారు తరువాత ఉస్మాన్(రజి) వారిని పిలిపించారు. ఆయన వచ్చారు.

అబూబక్ర్(రజి) : ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) గురించి చెప్పండి.

ఉస్మాన్(రజి) : మీకే బాగా తెలుసు ఆయన గురించి మాలోని ఎవరి కంటే కూడా.

అబూబక్ర్(రజి) : అయినప్పటికీ, ఓ అబూ అబ్దుల్లాహ్!

ఉస్మాన్(రజి) : ఓ అల్లాహ్! నాకు ఆయన గురించి ఏదైతే తెలుసో అది అతని రహస్యం. వ్యక్తిగత జీవితం బయటి జీవితం కంటే మేలైనది. **మరియు మాలో ఎవరూ లేరు ఆయనకు సమానమైనవారు.**

అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు ఉసైద్ బిన్ హుదైర్(రజి)వారిని పిలిపించారు. మరియు ఆయన వచ్చినప్పుడు, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) మరియు ఉస్మాన్(రజి) వారిని అడిగిన ప్రశ్నే అడిగారు.

ఉసైద్(రజి) చెప్పారు : "మీ తరువాత, మాలో ఉత్తముడు ఆయనే! సంతోషం వచ్చినప్పుడు ఆయన సంతోషంగా ఉంటారు, మరియు కోపం వచ్చినప్పుడు కోపంగా ఉంటారు. మరియు బయటకు ఆయన చూపే దానికంటే లోపల ఉన్నది మేలైనది. మరియు **ఈ బాధ్యతలను తీసుకోవడానికి. ఆయన కంటే ధృడమైనవారు గాని, ఉత్తములు గాని ఎవరూ లేరు.**"

ఇంకనూ ఎందరినో ఆయన ఇదే విధంగా సంప్రదించారు. దాదాపు అందరూ ఇదే విధంగా అభిప్రాయపడ్డారు. అబూ బక్ర్ సిద్దీఖ్ (రజి)వారి తరువాత ముస్లిములకు ఖలీఫాగా ఉమర్(రజి)వారే సమర్థులని వారి అభిప్రాయం. కాని ఒకరు మాత్రం వ్యతిరేకించారు. చెడు భావంతో మాత్రం కాదు. ఆయన పేరు తల్హా బిన్ ఉబైదుల్లాహ్(రజి). ఆయన ఉమర్(రజి)వారి కఠినత్వం గురించి భయపడ్డారు.

కఠినత్వం అంటే కఠిన హృదయుడు అని కాదు. అధర్మం పట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తారు. ఉమర్(రజి)వారి స్పందన ఎలా ఉండేదో క్రిందటి వ్యాసాలలో చదివారు కదా!

**తల్హా**(రజి) : మీ ప్రభువుకు మీరేమి చెబుతారు మాపై ఉమర్(రజి)వారిని ఎందుకు నియమించారని ఆయన అడిగినప్పుడు, అతని కఠిన వైఖరి గురించి బాగా తెలిసినప్పటికీ?

**అబూబక్ర్**(రజి) సమాధానమిచ్చారు: నేను కూర్చునేందుకు సాయం చెయ్యి ... (కూర్చున్న తరువాత) ... అల్లాహ్ సాక్షిగా నన్ను భయపెంచాలని ప్రయత్నిస్తున్నావా? నిశ్చయంగా, ఒకడు నిజంగా నష్టపోతాడు మీ వ్యవహారాలకు సంబంధించి (అంటే ముస్లిమ్ జాతి వ్యవహారాలకు సంబంధించి) చెడుగా మరియు అణిచే ధోరణిలో వ్యవహరిస్తే. (ఇక నీ ప్రశ్నకు సంబంధించి) నేను చెబుతాను, **ఓ అల్లాహ్! నేను నీ ప్రజలలోని ఉత్తముడినే వారిపై నియమించాను.**

ఉమర్(రజి)వారి కఠినత్వం గురించి అబూబక్ర్(రజి) ఇలా వివరించారు, "అది (ఆ కఠిన వైఖరి) ఎందుకంటే **నన్ను ఆయన మృదుస్వభావుడుగా చూశారు**, కాని తరువాత పాలనా బాధ్యతలు ఆయనపై పడినప్పుడు ఇప్పుడున్న దానిలో చాలా భాగం ఆయన వదిలేస్తారు."

అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారు మృదు స్వభావుడు కాబట్టి, ఆయన ముఖ్య అనుచరుడైన ఉమర్(రజి)వారు కూడా అలాగే ఉంటే ప్రజలు క్రమ శిక్షణ తప్పవచ్చని, కఠినంగా వ్యవహరిస్తున్నారనే భావాన్ని అబూ బక్ర్(రజి) వారు వ్యక్తం చేశారు.

**ఉమర్(రజి)వారి పరిపాలనా కాలంలో ఆయన యొక్క మృదు స్వభావాన్ని మరియు ధర్మ పరాయణతను చూసి ప్రజల కళ్ళు చెమర్చేవి.**

కొన్ని విషయాలలో పాలకుడు కఠినంగా ఉండకపోతే ఏమి జరుగుతుందో 3వ ఖలీఫాగారి కాలంలో ప్రజలకు అర్థమైంది. ఉమర్ (రజి)వారిని ఎన్నుకునే విషయంలో తల్హా బిన్ ఉబైదుల్లాహ్(రజి) చూపిన వ్యతిరేకత కేవలం ఆయన కఠిన వైఖరి దృష్టిలో పెట్టుకునే గాని మరో ఉద్దేశ్యంతో కాదు.

ఉమర్(రజి)వారి అంకిత భావం, నిజాయితీ, జ్ఞానం మరియు ధైర్యం సహాబాలందరికీ స్పష్టంగా తెలిసిన విషయమే! అబూ బక్ర్(రజి)వారు శాసనం వ్రాసారు. అది మదీనాలో ఉన్న ముస్లిములకు మరియు ఇతర ప్రాంతాలలో ఉన్న ముస్లిములు చదవడానికి. ఆ శాసనం ఇలా ఉంది:

"బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్. ఇది అబూ బక్ర్ బిన్ ఖుహాఫా ఆదేశం. దీనిని అతడు ఈ లోకాన్ని వీడుతూ మరియు పరలోకంలో ప్రవేశించ బడుతున్నట్లుగా వ్రాశాడు ... (ఈ) సమయం, దీనిలో (అంటే ఇటువంటి చివరి క్షణాలలో) ఒక సత్యతిరస్కారి విశ్వసించ డానికి వస్తాడు. ఒక దుర్మార్గుడు విశ్వాసాన్ని కలిగి ఉండటానికి వస్తాడు మరియు ఒక అసత్యవాది నిజం చెబుతాడు. నిశ్చయంగా, నేను మీపై ఉమర్ బిన్ ఖత్తాబ్‌ను నా తరువాత వచ్చేవానిగా (ఖలీఫాగా) నియమిస్తున్నాను. కాబట్టి ఆయన చెప్పింది వినండి మరియు ఆయనకు విధేయత చూపండి. ... అతడు న్యాయంగా వ్యవహరిస్తే, అప్పుడు అది ఏదైతే నేను అతని గురించి అనుకున్నానో అది మరియు ఏదైతే నేను అతని గురించి తెలుసుకున్నానో అది.

కాని ఆయన చెడ్డగా మారితే (అంటే అన్యాయంగా వ్యవహరిస్తే), అప్పుడు ప్రతీ ఒక్కరికీ ఉంటుంది ఏదైతే అతడు పొందాడో. మంచినే నేను కోరింది మరియు నాకు ఏదీ తెలియదు కనిపించని లోకం నుండి."

"... మరియు తమకు అన్యాయం జరిగినప్పుడే - ప్రతీకార చర్య తీసుకునేవారు తప్ప! అన్యాయం చేసేవారు తమ పర్యవసానం ఏమిటో త్వరలో తెలుసుకోగలరు." (ఖుర్'ఆన్ 26:227)

ముస్లిమ్ జాతి బాగుండాలంటే సరియైన నాయకుడు ఉండాలి. అబూ బక్ర్(రజి)వారికి ముహమ్మద్(స)వారి ద్వారా ఒక విషయం తెలుసు, సమీప భవిష్యత్తులో ముస్లిములు ఎదుర్కొనేది పేదరికం కాదని.

ఓ ఉల్లేఖనంలోని చివరి భాగం ఇలా ఉంది ::

"......... అల్లాహ్ సాక్షి! నేను మీ పేదరికం గురించి భయపడటం లేదు. కాని నేను భయపడుతున్నాను మీరు విలాసవంతమైన జీవితాన్ని గడుపుతారని ముందరి జాతులు గడిపినట్లు, అటుపై మీరు పరస్పరం దాని కొరకు పోటీ పడతారు, వారు దాని కొరకు పోటీ పడినట్లు మరియు అది మిమ్మల్ని నాశనం చేస్తుంది అది వారిని నాశనం చేసినట్లుగా. (సహీహ్ బుఖారీ, 3158, పుస్తకం 58, అధ్యా.1, సంపుటి 4)

ఇటువంటి పరిస్థితులను చక్కదిద్దడానికి సరియైన నాయకుడు ఉమర్(రజి)వారే. క్రింది ఉల్లేఖనం చూడండి.

ముహమ్మద్(స)వారు ఉమర్(రజి)వారితో ఇలా అన్నారు :

"... ఓ ఇబ్నె ఖత్తాబ్! ఆయన సాక్షి ఎవని చేతులలో నా ప్రాణం ఉందో! షైతాన్ ఎన్నడూ నీ దారిలో రాడు, కాని నీవు వెళ్ళే మార్గంలో కాకుండా ఇతర మార్గంలో వెళతాడు." (సహీహ్ బుఖారీ, 3683, పుస్తకం 62, అధ్యా.6, సంపుటి 5)

షైతాన్ పురికొల్పే వాటి నుండి రక్షింపబడి ప్రజలు స్థిరంగా ఉండటానికి నాయకుడిగా ఉమర్(రజి)వారు ఉండాలి. **ఇది అబూ బక్ర్(రజి)వారికి తెలిసిన పరిష్కారం.**

అబూ బక్ర్(రజి)వారి నిర్ణయం ఎంత సరియైనదో ఉమర్(రజి)వారి పరిపాలన గురించి తెలుసుకున్న వారికి బాగా స్పష్టమౌతుంది. **ఉమర్(రజి) పరిపాలించి నంత కాలం దేశంలో కష్టాలు మరియు ఉపద్రవాలు లేవు. ఇవన్నీ ఉమర్(రజి)వారి మరణం తరువాతే మొదలు అయ్యాయి.**

అబూ బక్ర్(రజి)వారి నిర్ణయం విశిష్టత గురించి అబ్దుల్లాహ్ బిన్ మస్'ఊద్(రజి) మాటలలో :

ఆంతర్యాన్ని గ్రహించేవారు మరియు యుక్తాయుక్త వివేచనం చేయ గలిగిన వారు ముగ్గురు :

- **మూసా(అ)వారి స్త్రీ సహచరి,** ఆమె అన్నారు :

  "నాన్నా! ఇతనిని పనికొరకు పెట్టుకోండి. నిశ్చయంగా ఇటువంటి బలవంతుడిని మరియు నమ్మదగిన వ్యక్తిని పనికొరకు పెట్టుకోవడం ఎంతో మేలైనది." (ఖుర్'ఆన్ 28:26)

- **యూసుఫ్(అ)వారి సహచరుడు,** ఇలా అన్నాడు :

  "ఇతని నివాసాన్ని ప్రశాంతంగా ఉంచు. బహుశా ఇతను మనకు లాభదాయకుడు కావచ్చు! లేదా మనం ఇతనిని కొడుకుగా చేసుకోవచ్చు." (ఖుర్'ఆన్ 12:21)

- **అబూ బక్ర్(రజి),** ఉమర్(రజి)వారిని తన తరువాయి (ఖలీఫాగా) నియమించినప్పుడు.

ముస్లిమ్ జాతిని తప్పుదారి పట్టించే ప్రచండమైన నీటిని మరియు కష్టాలు మరియు ఉపద్రవాల యొక్క ఘోషించే కెరటాల నుండి రక్షించే చొచ్చుకుపోలేని ఓ ఆనకట్ట వంటివారు ఉమర్(రజి)వారు.

ఖలీఫాగారు తన నిర్ణయాన్ని ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారికి తెలిపారు. ఆయన వెంటనే తిరస్కరించారు. **ఎందుకంటే నాయకత్వం అంటే విశ్వాసులకు చాలా భయం.** అది మామూలు బాధ్యత కాదు.

అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారు ఆయనను మాటలతోనే కాదు, ఖడ్గంతో కూడా హెచ్చరించారు. ఇక తప్పించుకునే అవకాశం లేక, ఉమర్(రజి) వారు అభ్యంతరం చెప్పకుండా ఆ పదవిని స్వీకరించారు.

అబూ బక్ర్(రజి)వారు ప్రజల ముందు నిలబడి ఇలా అన్నారు :

"మీపై నేను నియమించిన వ్యక్తి పట్ల మీరు సంతోషంగా ఉన్నారా? నిశ్చయంగా, ఈ నిర్ణయాన్ని తీసుకునే ముందు నేను చాలా శ్రద్ధగా ఆలోచించాను మరియు నేను నా బంధువును నియమించ లేదు, బదులుగా, నేను మీపై నియమించాను ఉమర్ బిన్ ఖత్తాబ్‌ని. కాబట్టి ఆయన చెప్పినది వినండి మరియు ఆయనకు విధేయత చూపండి."
వారు అన్నారు : "మేము వింటాము మరియు మేము విధేయత చూపుతాము."

అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారు అల్లాహ్‌కు దు'ఆ చేశారు:

"ఓ అల్లాహ్! నేను ఒకరిని నియమించాను, ఆ విధంగా చేయమని నన్ను మీ ప్రవక్త ఆదేశించ నప్పటికీ. ఆ నియామకం ద్వారా నేను కోరినదంతా ప్రజల స్థితిని మెరుగుపరచడానికే. వారిపై కష్టాలు మరియు ఉపద్రవాలు పడతాయని నేను భయపడ్డాను. వారికి ఏవి ఉత్తమ ప్రయోజనాలో అవి చేయడానికి అన్ని ప్రయత్నాలు చేసి ఈ నిర్ణయానికి వచ్చాను. అందుకే నేను వారిలోని ఉత్తముడిని వారిని పాలించడానికి నియమించాను. వారిలోని ఆ వ్యక్తి వారి వ్యవహారాలను ధర్మంగా మరియు సరియైనవిగా చేయడాన్ని ఎక్కువగా కోరినవాడు. మీకు వాస్తవం తెలుసు మీ విధి నుండి ఏది నాపై పడుతుందో, కాబట్టి నా స్థానంలో మరొకరిని నియమించండి, ఎందుకంటే వారు మీ దాసులు."

అబూ బక్ర్(రజి)వారు వ్రాసిన శాసనాన్ని చదివే బాధ్యతను ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) వారికి అప్పగించారు. అంతేకాకుండా ఉమర్(రజి)వారి తరపున ప్రజల నుండి విధేయతా ప్రతిజ్ఞను తీసుకునే బాధ్యతను కూడా ఉస్మాన్(రజి)వారిపై ఉంచారు.

ఇదంతా అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారి మరణానికి ముందే జరిగింది.

ఉస్మాన్(రజి)వారు ఆ శాసనాన్ని పట్టుకుని ప్రజలను అడిగారు :

**"మీరు విధేయతా ప్రతిజ్ఞ చేస్తారా, ఈ లేఖలో ప్రస్తావించబడిన వ్యక్తికి?"**

వారు అన్నారు : "**ఔను**"

వారంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరియు ఉమర్(రజి)వారిని నియమించడం పట్ల సంతోషించారు.

ఉమర్(రజి)వారి ఎన్నిక అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారి శాసనం వలన మాత్రమే కాదని, అక్కడి విద్వాంసులు మరియు వివేకంగల వారు కూడా అంగీకరించారని స్పష్టంగా అర్థమౌతుంది.

అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారు తన అధికారాన్ని మాత్రమే బదలాయించ లేదు, ఉమర్(రజి)వారికి అమూల్యమైన సలహా కూడా ఇచ్చారు.

**“ఓ ఉమర్! అల్లాహ్‌కు భయపడు, మరియు వెలుతురులో అల్లాహ్ ఆచరణలు ఉన్నాయి, ఆ ఆచరణలను అల్లాహ్ స్వీకరించరు అవి రాత్రివేళ చేయబడితే. మరియు రాత్రివేళ ఆయన ఆచరణలు ఉన్నాయి మరియు ఆయన వాటిని స్వీకరించరు వాటిని ఉదయం నెరవేర్చితే.**

**మరియు ఆయన నఫిల్(అదనపు) ఆచరణలను స్వీకరించరు, ఫర్జ్ (విధిగా ఉన్న) ఆచరణలు మొదట నెరవేర్చనంత వరకూ.**

**ఒక వ్యక్తి త్రాసు తీర్పుదినం నాడు బరువుగా ఉంటే, అది ఇహలోకపు నివాసంలో అతడు సత్యాన్ని అనుసరించి నందుకు, ఆ విధంగా చేయడం అతనికి భారం అయినప్పటికీ.**

**రేపటి విషయానికొస్తే, అది మాత్రమే సరియైనది కావాలి, దానిలో సత్యాన్ని ఉంచితే త్రాసు బరువుగా ఉండాలి.**

**మరియు ఒక వ్యక్తి త్రాసు తీర్పు దినం నాడు తేలికగా ఉంటుంది. అది ఎందుకంటే అతడు అసత్యాన్ని అనుసరించాడు. మరియు రేపటికి సంబంధించి కూడా, త్రాసు తేలికవడం సరియైనది కావాలి, అసత్యాన్ని దానిపై ఉంచితే.**

**నిస్సందేహంగా, అల్లాహ్ స్వర్గవాసుల గురించి ప్రస్తావించారు మరియు వారిని వారి ఉత్తమ ఆచరణలచే ఆయన ప్రస్తావించారు మరియు ఆయన ఉపేక్షించారు వారి చెడు ఆచరణలను. కాబట్టి నీవు వారిని గుర్తు చేసుకుంటే, అప్పుడు చెప్పు, “నిశ్చయంగా నేను భయపడు తున్నాను నేను వారిని అందుకోలేనేమో అని.’**

**వాస్తవానికి అల్లాహ్ ప్రస్తావించారు నరకవాసులను మరియు వారి చెడు ఆచరణలచే ఆయన వారిని ప్రస్తావించారు మరియు ఆయన వారి ఉత్తమ ఆచరణలను తిరస్కరించారు.**

**కాబట్టి నీవు వారిని జ్ఞాపకం చేసుకున్నట్లయితే, అప్పుడు చెప్పు, “నిశ్చయంగా, నేను ఆశిస్తున్నాను నేను వారిలో ఒకరిని కాకూడదని.” నీవు అవి (చెప్పినవి) చేయాలి ఆశాపరుడిగా మరియు భీతిపరుడిగా ఉండటానికి, ఒక స్థితిపై దానిలో నీవు అల్లాహ్ పట్ల తప్పుడు నమ్మకాలు ఉంచు కోకూడదు మరియు దానిలో నీవు ఆశను కోల్పోకూడదు అల్లాహ్ కారుణ్యం పట్ల.**

(అంటే నీవు అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందని వానిగా, అల్లాహ్ పట్ల తప్పుడు నమ్మకాలు ఉంచుకోకుండా ఆశాపరుడుగా మరియు భీతిపరుడుగా ఉండటానికి పైవన్నీ నీవు తప్పకుండా చేయాలి అని.)

సకల లోకాలకు కారుణ్యం ముహమ్మద్(స) మరియు ఆయన ఖలీఫా అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారు తమ ప్రియ సహచరుడు ఉమర్(రజి)వారికి అత్యున్నత శిక్షణ నిచ్చారు. **అల్లాహుతాలా ఉమర్(రజి)వారికి దీన్‌ను అర్థం చేసుకునే జ్ఞానాన్ని ఇచ్చి మరియు దీన్‌పై స్థిరంగా నిలబడేటట్లు చేసి ప్రపంచ మానవ చరిత్రలోనే ఓ గొప్ప పరిపాలకుడిగా తీర్చిదిద్దారు.**

అసలైన ప్రజాస్వామ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయించారు.

ప్రజలను అణిచేవాడి ఒక చెంప నేలపై ఉంటుంది. రెండవ చెంపపై నా పాదం ఉంటుంది. అదే పేదవాని విషయంలో నా చెంప ఒకటి నేలపై ఉంటుంది మరియు రెండవ చెంప పేదవాని కాలి క్రింద ఉంటుందని ప్రకటించి, దానిని ఆచరణలో చూపిన ఉమర్(రజి)వారు కఠినాత్ముడా? లేక మృదు స్వభావుడా?

టైగ్రిస్ నది ఒడ్డున ఒక కుక్క ఆకలితో చనిపోతే ఆ బాధ్యత తనదేనని ప్రకటించిన ఉమర్(రజి)వారు బాధ్యతాయుత పరిపాలకుడు అవునా? కాదా?

ధైర్య సాహసాలు, అత్యంత నిరాడంబరత, అణుకువ కలిగి దౌర్జన్య పరుల పట్ల సింహ స్వప్నం ఉమర్(రజి)వారు.

ఇస్లామ్‌ను నూటికి నూరు పాళ్ళు పరిపాలనలో చూపించి, అన్ని ధర్మాల వారిచే గౌరవాభిమానాలు పొందిన ఉమర్(రజి)వారి పరిపాలనే - అసలైన ప్రజాపాలన - ఉత్తమ పరిపాలన.

**ఏ కాలంలోనైనా, ఏ ప్రాంతంలోనైనా ప్రజలకు నచ్చే పాలన ఉమర్(రజి) పరిపాలన వంటి పరిపాలనే!**

అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారు రెండు సంవత్సరాలు మాత్రమే ఖలీఫాగా పాలించారు.

ముహమ్మద్(స)వారి తరువాత అబూ బక్ర్(రజి)వారు తొలి ఖలీఫా అవుతారని, ఆ తరువాత ఉమర్(రజి)వారు, ఆ తరువాత ఉస్మాన్(రజి) వారు మరియు అలీ(రజి)వారు అవుతారని ప్రవక్త(స)వారు ప్రత్యక్షంగా చెప్పకపోయినా, ఉల్లేఖనాల ద్వారా పరోక్షంగా ఈ విషయం మనకు స్పష్టం అవుతుంది.

**వచ్చే సంచికలో ఈ విషయానికి సంబంధించి కొంత చర్చించిన అనంతరం ఉమర్(రజి)వారి ఖిలాఫత్ గురించి చెప్పుకుందాం, ఇన్షా అల్లాహ్!**

**ఇంతవరకూ శాంతిబాటలో పూర్తి అయిన సీరియల్**

**టెర్రరిజం** **మాత్రమే**

**ఇతర సీరియల్స్**

- **జిన్నులు మరియు చేతబడి**
- **రాతియుగం**
- **హదీస్ విజ్ఞానం**

**పూర్తి కాలేదు. స్థలాభావం వలన ఈ సంచికలో వాటిని అందించ లేకపోయాము.**

- శాంతిబాట టీమ్

## పాఠకుల అభిప్రాయాలు

**గత సంచికలో సగం పేజీలు పూర్తిగా జకాత్ ప్రత్యేక వ్యాసం కోసమే కేటాయించ బడ్డాయి. తరువాత ఆ వ్యాసాన్ని రమదాన్ నెలలో 80 పేజీలలో ఒక ప్రత్యేక పుస్తకంగా ముద్రించాము. వాటిని వివిధ మస్‌జిద్‌లకు తీసుకు వెళ్ళిన మా సభ్యులపై కొందరు దోపిడీదారులు రంకెలు వేసారు. ఎన్నో అభిప్రాయాలు కూడా అందాయి. ముస్లిమ్ సమాజంలో జరుగుతున్న ఓ ఘోర అన్యాయాన్ని నిరోధించడానికి సంబంధించిన విషయం కాబట్టి ఈ శీర్షికలో వాటికి ఎక్కువ పేజీలు తప్పనిసరిగా కేటాయించ వలసి వచ్చింది.**

### నేటి మన సమాజంలోని మెజారిటీ ఆలిమ్‌లకు ధార్మిక విషయాలపై సరియైన అవగాహన కల్పించాలి

### వీరికి ఇస్లామ్ యొక్క 5 మూల స్తంభాలలో 3వ మూల స్తంభం గురించి కనీస అవగాహన కూడా లేదు

**వీరిలో చాలామంది తొలి ప్రశ్నకే సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు.**

జకాత్ అంటే ధనవంతులు పేదవారికి చెల్లించ వలసిన విధి దానం. లక్ష రూపాయలు ఉన్నవాడు ధనవంతుడే, కోటి రూపాయలు ఉన్నవాడూ ధనవంతుడే. ప్రజలు అడిగే తొలి ప్రశ్న : **ధనవంతుడు అంటే ఎవరు?** ఈ మొదటి ప్రశ్నకే సమాధానం చెప్పలేని స్థాయిలో నేటి ఆలిమ్‌లున్నారు. ప్రపంచంలోని అత్యున్నత యూనివర్సిటీలో ధార్మిక విద్యను అభ్యసించినవారు కూడా ఈ తొలి ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతే, వారిలో ఇల్మ్ (జ్ఞానం) ఉన్నట్లా? లేనట్లా?

> ఏదైనా తెలియనప్పుడు తెలియదు అని చెప్పాలి. ఆ తరువాత తెలుసుకుని చెప్పాలి. అహంకారానికి పోతే నష్టపోయేది వారే!
>
> **జ్ఞానం కలిగిన ఆలిమ్‌లు కూడా కొందరున్నారు. కాని జరుగుతున్న అన్యాయం గురించి వారు నోరు విప్పడం లేదు.**

పై ప్రశ్నకు సమాధానం శాంతిబాట స్పష్టంగా హదీస్‌ల ఆధారంగా చెప్పడం జరిగింది. **జవాబు:** 200 దిర్హములు గాని అంతకంటే ఎక్కువ ఐశ్వర్యం కలిగినవాడే - జకాత్ చెల్లించవలసిన ధనవంతుడు.

ప్రపంచంలోని ఎన్నో భాషలలో కేవలం ప్రామాణిక ఇస్లామీయ సమాచారాన్ని మాత్రమే అందించే వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తున్నట్లు కొందరు ప్రకటించారు. తమ వెబ్‌సైట్‌లో ఇంగ్లీష్‌లో కొంత సమాచారం కూడా ఇటీవల ఉంచారు. ఐశ్వర్యంపై జకాత్ ఇచ్చే విషయంలో వారి సమాధానం ఇలా ఉంది : **85 గ్రాముల బంగారం గాని లేదా 595 గ్రాముల వెండిగాని ఉంటే జకాత్ ఇవ్వాలి.** నేడు ఇండియన్ మార్కెట్లో,

| | |
|---|---|
| **85 గ్రాముల** బంగారం విలువ | = **రూ. 2.5 లక్షలు** (దాదాపుగా) |
| **595 గ్రాముల** వెండి విలువ | = **రూ. 30 వేలు** (దాదాపుగా) |

**ఈ రెండింటిలో దేనిని అనుసరించాలి?**

వీరిచ్చిన సలహా ప్రకారం లక్ష రూపాయలు కలిగిన ముస్లిమ్, **30 వేల రూపాయల కంటే ఎక్కువ కలిగి ఉన్నాడు** కాబట్టి జకాత్ చెల్లించాలా? లేక **రెండున్న లక్షల రూపాయల కంటే తక్కువ కలిగి ఉన్నాడు** కాబట్టి జకాత్ చెల్లించ నవసరం లేదా?

**ప్రజలకు అయోమయం కలిగించే ఇటువంటి సమాచారం ప్రామాణికం ఎలా అవుతుంది?** ఇటువంటి సమాచారంతో కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చుపెట్టి వెబ్‌సైట్లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఏమిటి? స్వప్రయోజనానికి కాకపోతే దేనికోసం ఇవన్నీ?

హదీస్ గ్రంథాలలో చాలా స్పష్టంగా **వెండి నిసాబ్** గురించి బలమైన ఉల్లేఖనాలున్నాయి. మేము 3 సంవత్సరాలుగా చెబుతూనే ఉన్నాము. బహుశా ఆనాడు 'వెండి' నిసాబ్ విలువకు సరిపోయే బంగారాన్ని చెప్పి ఉండవచ్చని, ఆ విషయాన్ని ఇక్కడ ఆధారాలతో సహా వివరిస్తున్నాము.

అబూదావూద్ హదీస్ గ్రంథంలో ఓ ఉల్లేఖనం ఉంది. (నెం. 1573, పుస్తకం 9, అధ్యా.5, సంపుటి 2) అయితే దానిని 'దయీఫ్' (బలహీనమైన ఉల్లేఖనం)గా వర్గీకరించారు. సహీహ్ హదీస్‌లనే స్వీకరించాలని చెప్పే కొందరు విద్వాంసులు కూడా, ప్రజలు నిలదీస్తుంటే సమాధానం చెప్పలేక ఎవరికీ తెలియదు కదాయని ఈ దయీఫ్ హదీస్‌నే వివరిస్తున్నారు.

అయితే ఆ హదీస్‌లో ఏముందో ముందుగా తెలుసుకుందాం:

**20 దీనార్లు ఉంటే ఒక దీనార్‌లోని సగభాగాన్ని జకాత్‌గా చెల్లించాలి**

**1 దీనార్** (బంగారు నాణెం) = **10 దిర్హములు** (వెండి నాణెములు)

కాబట్టి **20 దీనార్లు** = 20 x 10 = **200 దిర్హములు**.

వీటిపై జకాత్ 'ఒక దీనార్‌లో సగం' అంటే 5 దిర్హములు.

దీనిని బట్టి తెలిసేది ఏమిటంటే, **200 దిర్హములు కలవారు 5 దిర్హములు జకాత్‌గా చెల్లించాలి.**

క్రిందటి సంచికలో 11వ పేజీలో శాంతిబాటలో ప్రచురించిన ప్రామాణిక హదీస్‌లో చివరి హదీస్ చూడండి. 200 దిర్హములపై జకాత్‌గా 5 దిర్హములు చెల్లించాలనే విషయమే చెప్పబడింది.

బంగారం మరియు వెండి అనేవి **లోహాలు**. మరియు దీనార్, దిర్హములు అనేవి **నగదు**. ఈ బేధం నేటి ఆలిమ్‌లకు అర్థం కాలేదు. అంతేకాదు 1 దీనార్‌కి ఎన్ని దిర్హములో కూడా స్పష్టంగా చెప్పలేరు.

వీరికి సైన్స్ మరియు గణితంపై కనీసం కొంచెమైనా జ్ఞానం ఉండాలి. 1000 సంవత్సరాల క్రితం మదరసాలలో ఆల్‌జీబ్రా, ట్రిగొనోమెట్రీ, మెడిసిన్ వంటివి నేర్పేవారు. 1400 సంవత్సరాల క్రితం విశ్వాసుల మాతృమూర్తి ఆయిషా(రజి)వారు చాలా సులభంగా లెక్కలు కట్టేవారు.

మరి ఈనాటి విద్వాంసులలో **'విద్య' ఏమై పోయింది?** నేతి బీరకాయలో నెయ్యి లేనట్లుగా. మన దేశంలోని మెజారిటీ ఆలిమ్‌లలో

విద్య లేకుండా పోయింది. చదువుకున్న ప్రతీ విద్యార్థికి జ్ఞానం లభించదు. **కనీసం ఇప్పుడైనా తెలుసుకునే ప్రయత్నం చేయాలి.**

వారు ఎలాగూ ప్రయత్నం చేయడం లేదు కాబట్టి, శాంతిబాట పాఠకులైనా వారికి సత్యాన్ని బోధించాలి.

మన దేశంలో నగదు (currency) **కాగితపు నోట్లు.** నోటుపై రూ.500 అని ముద్రించి ఉంటే అది 500 రూపాయలకు సమానం. అంతేగాని ఆ నోటు ఎంత బరువుందో తెలుసుకోవలసిన అవసరం లేదు. ఒక కేజీ 100 రూపాయల నోట్లు విలువ ఒక కేజీ 500 రూపాయల నోట్లకు విలువకు సమానం కాదు.

**ముహమ్మద్(స)వారి కాలంలో చెప్పిన దీనార్ మరియు దిర్హములు బంగారం మరియు వెండితో తయారు చేయబడిన నగదు కనుక, వాటిని ఇతర దేశాలలో అక్కడి కాగితపు నగదుకి మార్చ వలసి వస్తే, అప్పుడు ఈ నాణేల నగదు విలువ కట్టాలి.**

ఉదాహరణకు, **1 దీనార్ = 4.25 గ్రాముల** బంగారం

**1 దిర్హమ్ = 2.975 గ్రాముల** వెండి

కాబట్టి ఆయా దేశాలలో అప్పటి బంగారం మరియు వెండి రేట్లను బట్టి 1 దీనార్ లేదా 1 దిర్హమ్ విలువను లెక్కగడతారు.

ఇస్లామ్ జకాత్ నిసాబ్‌ను దిర్హములలో చెప్పడం వలన, ఏ కాలంలో నైనా, ఏ ప్రాంతంలోనైనా మరియు ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా సందేహానికి అవకాశం లేదు. అల్లాహ్ నిర్ణయించిన నిసాబ్‌లో ఎంతో వివేకం ఉంది.

ప్రపంచ వ్యాప్తంగా బంగారం మరియు వెండి మధ్య ఎక్చేంజ్ రేట్ మారుతూ వస్తుంది. కాబట్టి 20 నేడు దీనార్ల విలువ 200 దిర్హముల విలువకు సమానం కావడం లేదు. **కాబట్టి మనం అనుసరించవలసినది బలమైన ఉల్లేఖనాల ప్రకారం వెండి నిసాబ్‌ని మాత్రమే!**

**ఈ ఎక్చేంజి రేట్ల గురించి గ్రంథాలలో ప్రస్తావన లేదా?**

స్పష్టంగా ఉంది. మాలిక్(ర)వారి ముఅత్తా చూడండి. దీనిలోని 17వ పుస్తకం జకాత్. ఆ పుస్తకం లోని 2వ బాబ్ (అధ్యాయం)లో హదీస్ నంబర్ 7 చూడండి. హదీస్ పెద్దది. దానిలో ఎక్చేంజి గురించి చెప్పిన భాగం దిగువన ఇస్తున్నాము.

**మాలిక్(ర)వారు చెప్పారు, ఓ వ్యక్తి గురించి అతడు 160 దిర్హములు కలిగి ఉన్నాడు. మరియు నగదు మార్పిడి** (exchange rate) **తన పట్టణంలో 1 దీనార్‌కి 8 దిర్హములుగా ఉంది. అతడు జకాత్ చెల్లించవలసిన అవసరం లేదు. జకాత్ 20 దీనార్లపై లేక 200 దిర్హములపైనే ఉంది.**

పై విషయాన్ని జాగ్రత్తగా విశ్లేషిస్తే స్పష్టంగా ఒక విషయం అర్థమౌతుంది.

ఒక వ్యక్తి కేవలం 160 దిర్హములు కలిగి ఉన్నాడు కాబట్టి వెండి నిసాబ్ (200 దిర్హములు) ప్రకారం అతడు జకాత్ చెల్లించనవసరం లేదు. ఎందుకంటే అతని దగ్గర ఇంకనూ 40 దిర్హములు తక్కువుగా ఉన్నాయి కాబట్టి. ఇందులో ఎటువంటి సందేహం లేదు.

ఒక ప్రాంతంలో ఒక దీనార్‌కి 10 దిర్హములు కాకుండా 8 దిర్హములు ఉన్నాయంటే దానర్థం అక్కడ వెండి రేటు ఇతర ప్రాంతాల కంటే ఎక్కువగా ఉంది. సరే, ఇప్పుడు దీనికి లెక్కగడదాం.

అతని పట్టణంలో **8 దిర్హములు = 1 దీనార్**

కాబట్టి **160 దిర్హములు = 20 దీనార్లు**

దీనిని బట్టి ఆ పట్టణంలో ఎవరైనా 160 దిర్హములు ఇస్తే, 20 దీనార్లు పొందవచ్చు. అప్పుడు **20 దీనార్లు ఉన్నాయి కాబట్టి జకాత్ ఇవ్వాలి.** కాని 160 దిర్హములు లెక్క ప్రకారం అయితే జకాత్ ఇవ్వనవసరం లేదు.

**మాలిక్(ర)వారు జకాత్ చెల్లించ నవసరం లేదని చెప్పారు. 200 దిర్హములు ఉంటేనే జకాత్ ఇవ్వమన్నారు.** దానినే మనం తీసుకుంటే, ఆ ఊరిలో 200 దిర్హములు ఇస్తే 25 దీనార్లు పొందవచ్చు. 5 బంగారు నాణేలు ఎక్కువగా వచ్చాయి. ఆనాటి ఎక్చేంజ్ రేట్ ఈనాడు లేదు.

కాబట్టి మనం అనుసరించవలసింది వెండి నిసాబ్‌ను మాత్రమే. **ఈ విషయంపై ఎన్నో బలమైన ఉల్లేఖనాలను మేము శాంతిబాటలో అందించాము.**

**శాంతిబాట వ్యాపార పత్రిక కాదు. పేరు ప్రతిష్ఠల కోసం నడప బడుతున్న పత్రిక అంతకంటే కాదు. శాంతిబాట టీమ్ హదీస్‌లను పరిశోధిస్తుంది. మరియు వాటిని అధ్యయనం చేసి సత్యాన్ని తెలుపుతుంది. అధ్యయనం చేయకుండా జ్ఞానం లభించదు.**

**ప్రామాణిక ఆధారాలుంటే సత్యాన్ని ఎవరైనా ఒప్పుకోవలసిందే! వారికి మరో అవకాశం లేనే లేదు. ఒక్కరు చెప్పారా? వందమంది చెప్పారా? అనేది ముఖ్యం కాదు. అది సత్యమా? కాదా? ప్రామాణిక ఆధారాలు ఉన్నాయా? లేవా? అనేది తెలుసుకోవడమే ముఖ్యం.**

## మన ఇండియాలో జకాత్ పేరుతో జరుగుతున్న దోపిడీ 15000 కోట్లు?!

**అంత సేకరించబడటం లేదట! చాలా తక్కువట!**

ఎవరికి దొరికినంత సొమ్ము వారు దోచుకుంటున్నారు. ఒకడు ఎంత దోచుకున్నాడో రెండవ వానికి తెలియదు. ఇతర ప్రాంతాల నుండి వచ్చి ఒక మస్జిద్‌లో ఎంత జకాత్ తీసుకుని వెళ్ళారో ఆ మస్జిద్ ఇమామ్ గారికి తెలియదు. ఆ మస్జిద్ ముతవల్లీకి తెలియదు. పట్టణంలో ఎంత సేకరించబడిందో ఆ పట్టణంలోని అమీర్‌కి తెలియదు. ఇక జిల్లా అమీర్‌కి ఏమి తెలుస్తుంది? రాష్ట్ర అమీర్‌కు ఏమి తెలుస్తుంది?

ఏ విధంగా సేకరించబడిన సొమ్ము లెక్కగడతారు?

ఈ రమదాన్ నెలలో మా పాఠక సోదరులు రాష్ట్రంలోని చాలా మస్జిద్‌లలో జకాత్ చెల్లింపులు గమనించారు. భారీ మొత్తంలోనే జకాత్ వసూలవుతుంది అని అర్థం చేసుకుని మాకు తెలియజేశారు. వాస్తవానికి జకాత్ సేకరణ **కేవలం 15000 కోట్లు కాదు, అంతకంటే చాలా ఎక్కువే!** కాని మేము చెప్పింది ఓ ప్రాథమిక అంచనా మాత్రమే.

**నిజాలు ప్రజలకు తెలిసిపోవడంతో మొత్తం 15000 కోట్లు కాదని ప్రజలను నమ్మించేందుకు నాయకులు ప్రస్తుతం కసరత్తులు చేస్తున్నారు.** మస్‌జిద్‌లలో జకాత్ సేకరణ మరియు వాటి పంపిణీ గురించి ఎటువంటి రిజిష్టర్లు మెయిన్‌టైన్ చేయడం లేదు. ఎవరైనా అడిగితే కాకి లెక్కలు చెబుతున్నారు.

**INN Live, హైదరాబాద్ వారి పరిశోధన**

## కేవలం ఒక్క హైదరాబాద్ సిటీలో ఈ సంవత్సరం వసూలయ్యే జకాత్ 1000 కోట్లు ?!

Indian News Network, Hyderabad వారు జూన్ 18, 2013 తేదీన వారి వెబ్‌సైట్‌లో జకాత్ స్కామ్‌ను 3 భాగాలుగా విభజించి వివరించారు.

1. **Organisations Turn Zakat into Multi Crore Industry - I**
(సంస్థలు జకాత్‌ను కోట్ల పరిశ్రమగా మారుస్తున్నాయి)
2. **Zakat Firms Waste Money Meant for Poor Muslims - II**
(జకాత్ సంస్థలు పేద ముస్లిముల కొరకు నిర్దేశించిన సొమ్మును వృథా చేస్తున్నాయి)
3. **How Zakat collectors turned millionaires-III**
(జకాత్ సేకరించేవారు ఎలా కోటీశ్వరులుగా మారారు?)

వీటి వివరాలు వారి వెబ్‌సైట్‌లో చూడగలరు :

**http://innlivenews.in/tag/zakat/#.UgPQ2tI6dVI**

(ఈ సంచిక ప్రచురించే సమయానికి వారి వెబ్‌సైట్‌లో పై వ్యాసాలు అందుబాటులోనే ఉన్నాయి.)

జకాత్ సేకరించే సంస్థలను INN Live వారు ప్రశ్నించడం జరిగింది. పబ్లిసిటీ కోసం, న్యూస్‌పేపర్ ఎడ్వర్‌టైజ్‌మెంట్స్ కోసం, బ్రోచర్లు ముద్రించడానికి, కార్పోరేట్ ఫిల్మ్‌ల తయారీకి ఎంత ఖర్చు చేస్తున్నారో వారిని వివరాలు అడిగారు. అంతేకాకుండా పబ్లిసిటీ కోసం జకాత్ సొమ్ము వాడవచ్చో లేదో మత పెద్దల నుండి క్లియరెన్స్ తీసుకున్నారా అని కూడా ప్రశ్నించారు. ప్రశ్నలకు సంస్థలు జవాబులు దాటవేసాయి. గత 8 సంవత్సరాలుగా అంటే 2005 నుండి ప్రతీ సంవత్సరం హైదరాబాద్‌కు NRIల నుండి 500 కోట్ల రూపాయల జకాత్ చేరుతుందని వివరించారు. ఈ సంవత్సరం జకాత్ 1000 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసారు.

14 సంవత్సరాల వయస్సుగల ముస్లిమ్ పిల్లలు బిజీ సిగ్నల్ పాయింట్స్ దగ్గర చిన్న చిన్న వస్తువులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటే, ఇటువంటి పేదవారికి అందవలసిన జకాత్ సొమ్ము ఎలా దోచుకుంటున్నారో, ఆ సంస్థల పేర్లు తెలపకుండా చాలా వివరాలు తెలియజేశారు. (ఇక్కడ ఆ వివరాలు ఇవ్వడం లేదు) ఇఫ్తార్ కోసం మరియు పేద పిల్లల పండుగ బట్టల కోసం ఎంత డబ్బు అందుతుందో కూడా ఆ వెబ్‌సైట్లో వివరాలున్నాయి. అన్నీ పెద్ద మొత్తాలే!

**INN Live ఈ జకాత్ స్కామ్ గురించి చేసిన పనికిగాను వారిని అభినందించాలి.** సత్యాన్ని బయటపెట్టి పేదవారికి అందవలసిన జకాత్‌లోని ఎక్కువ భాగం పేదవారికి అందేలా చేసే కృషిలో వీరికి అల్లాహుతాలా సహాయం చెయ్యాలని కోరుకుంటున్నాము. జకాత్ సొమ్ముతో ప్రాపర్టీలు కొనుక్కోవడం, స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడం, తమ పిల్లలను విదేశాలలో చదివించుకోవడం గురించి కూడా ఆ వెబ్‌సైట్లో వివరాలున్నాయి.

సేకరించిన సొమ్ములో 40 శాతాన్ని తమకు కఫ్ఫాఫ్‌గా తీసుకోవచ్చనే ఫత్వాలను చూపెడుతూ ఘోరంగా దోచేస్తున్న విషయాన్ని స్పష్టం చేసారు. అంటే గత ఎనిమిదేళ్ళుగా కేవలం హైదరాబాద్‌లో సేకరించిన సొమ్ములో ప్రతీ సంవత్సరం 200 కోట్ల రూపాయలు తీసేసుకుని, 300 కోట్ల రూపాయలు మాత్రమే పంచుతున్నారా? **ఎంత ఘోరం.** ఆ 300 కోట్లు అయినా పేదలకు అందుతున్నాయా?

**అంటే 100 రూపాయలు వసూలు చేసి, 40 రూపాయలు తమ కమీషన్‌గా తీసుకుంటారా? కేవలం ఒకే ఒక నగరంలో జకాత్ సేకరించిన వారికి 200 కోట్ల కమీషన్ ఇవ్వాలా?**

పూర్తి వివరాలకై వారి వెబ్‌సైట్లో చూడండి.

ఒక్క హైదరాబాద్ సిటీలోనే ఈ సంవత్సరం 1000 కోట్ల రూపాయలు సేకరించబడితే, రాష్ట్రం మొత్తం మీద ఎంత సేకరించబడి ఉంటుంది?

## శాంతిబాట టీమ్‌కు ఉన్న ఇల్మ్‌పై

శాంతిబాట ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ, దానిలోని పరిశోధనాంశాలతో బహిరంగ ప్రసంగాలు, ఖుత్బాలు ఇచ్చేవారు కూడా శాంతిబాట టీమ్ ఇల్మ్ గురించి ప్రశ్నించడం వారి కపట లక్షణాన్ని బయట పెడుతుంది.

**శాంతిబాట టీమ్‌లో ఎందురున్నారో, వారిలో ఎంతమంది <u>ఆలిమ్‌లో</u> మా టీమ్‌కి తప్ప మరెవరికీ తెలియదు.** వ్యాసాలపై చర్చలుగాని, మేకింగ్‌లో గాని టీమ్ సభ్యులే ఉంటారు. ముద్రించబడేవరకూ అంతా కాన్ఫిడెన్షియల్‌గానే జరుగుతుంది. వ్యాసాలు వ్రాసేవారు ఆలిమ్‌లా అని ప్రశ్నిస్తున్నారు! ఆలిమ్‌ల పర్యవేక్షణలోనే అంతా జరుగుతుంది.

**వ్రాసేవారికి వ్రాసే విషయాలపై జ్ఞానం ఉంది.** ఎందరో ముహద్దిస్‌ల ప్రామాణిక హదీస్ గ్రంథాలు, తఫ్సీర్ ఇబ్నె కసీర్ వంటి తఫ్సీర్ గ్రంథాలు, ప్రామాణిక ఇస్లామీయ చరిత్ర ఆధారంగా వ్యాసాలను ఆధారాలతో సహా అందించడం జరుగుతుంది. తఖ్వా ఉండి ధార్మిక జ్ఞానం కలిగినవారితో సంప్రదింపులు నిత్యం జరుగుతూ ఉంటాయి. పరిశోధనకే ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుంది.

**ఒకరికి జ్ఞానం ఉందో లేదో జ్ఞానం కలవాడికే స్పష్టంగా అర్థమౌతుంది.** <u>జ్ఞానం లేనివాడు మాత్రమే</u> **"మీకు జ్ఞానం ఉందా?"** అని అడుగుతాడు.

ఒకవేళ దోషం కనిపిస్తే, ఆ దోషాన్ని చూపడానికి బలమైన ఆధారాన్ని తీసుకువస్తాడు. అలా కాకుండా జ్ఞానం ఉందా? అని ప్రశ్నించాడు అంటే, ఆ ప్రశ్నించిన వ్యక్తి దగ్గర జ్ఞానం లేదని అర్థం చేసుకోవాలి.

సహాబాలు, తాబ'ఈన్లు, **అనాటి ఇమామ్‌లు - అహమద్(ర), బుఖారీ(ర) మొదలైన వారు జ్ఞానులు కాదా?** ఇబ్నె కసీర్ గారు జ్ఞాని కాదా? ఎందరో జ్ఞానులు ప్రామాణిక ఆధారాలతో తెలిపిన విషయాలను, అల్లాహ్ పట్ల భీతితో తెలుగులో అందిస్తున్నాము.

మా దగ్గర ఆధారాలున్నాయి. మేము తొలిసారిగా జకాత్ గురించి ప్రచురించినప్పటి నుండి ఇప్పటికి 1000 రోజులు దాటిపోయింది. ఈ రోజు వరకూ మా ఆధారాలను ఖండించే ఒక బలమైన ఆధారం కూడా వీరెవరూ తీసుకురాలేక పోయారు. ఈ వెయ్యి రోజులలో రోజుకి ఒక హదీస్ చొప్పున చదివినా కూడా వీరందరికీ ఈ పాటికే జకాత్ గురించి అర్థం అయివుండేది. పత్రికకు .... రిజిస్ట్రేషన్ ఉంది. పత్రికకు కొన్ని నియమ నిబంధనలు ఉంటాయి.

**టీమ్‌లో ఎందరు ఉన్నా సరే, పత్రిక తరపున ఒక్కరే మాట్లాడతారు.**

## తాగుబోతుకు జకాత్ ఇవ్వవచ్చా?

దేనికోసం ఇస్తారు? ఆ డబ్బుతో ఇస్లామ్ నిషేధించిన మద్యాన్ని త్రాగడానికా? **జకాత్ సాంఘిక సంక్షేమ వ్యవస్థ** అని చెప్పినప్పుడు ఇటువంటి ప్రశ్నలు ఎందుకు అడగాలనిపిస్తుంది? కాలక్షేపం కోసమా?

## అనాథ పిల్లల కోసమని చెబుతున్నారు ...

ఈ సంవత్సరం రమదాన్ నెలలో వైజాగ్‌లో ఉండే మా సభ్యుని ఇంటికి ఒక వ్యక్తి మదరసా చందా కోసం వచ్చాడు. ఆ మదరసా సామర్లకోటకు దగ్గర్లో ఉండే ఒక ఊరిలో ఉంది. 40 మంది అనాథ పిల్లలకు అక్కడ చదువు చెబుతున్నట్లు చెప్పడం జరిగింది. సామర్లకోటకు దగ్గరే కాబట్టి 'పదండి, నేనూ వస్తాను తల్లిదండ్రులు లేని ఆ అనాథ పిల్లలను చూడటానికి' అనగానే, "పిల్లలకు తల్లిదండ్రులు ఉన్నారు" అన్నాడు. **తల్లిదండ్రులు ఉంటే వారి పిల్లలు అనాథలు ఎలా అవుతారు?** కేవలం ఓ అరడజను లేదా డజను మంది పిల్లలను చూపించి లేదా ఫొటోలు చూపించి, లక్షలు కాజేస్తున్నారు. **నాయకులు ఎందుకు మాట్లాడటం లేదు?** వారికి ఇందులో కమీషన్ లభిస్తుందా?

## ఎక్కడ వసూలు చేసే జకాత్ ముందుగా అక్కడే పంచాలి

ఈ విషయం హదీస్ గ్రంథాలలో అత్యంత స్పష్టంగా ఉంది. కాని ఎక్కడెక్కడి నుండో జకాత్ కోసం వస్తున్నారు. **అంటే వీరు సున్నత్‌కి వ్యతిరేకం.** టి.వి.లలో ప్రకటనలు, ఇంటర్‌నెట్‌లో ఎన్నో వెబ్‌సైట్లు - వారికి జకాత్ డొనేట్ చేయమని ప్రకటనలు ఇస్తున్నారు.

**ఎక్కడ వసూలయ్యే జకాత్ ముందుగా అక్కడే పంచాలనే ప్రాథమిక విషయం వీరెవరికీ తెలియదా?** తెలుసు. తెలిసి ఇంత బహిరంగంగా సున్నత్‌ని తిరస్కరిస్తున్నారంటే, వారిని కట్టడి చేయకుండా ప్రజలు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమౌతుంది.

శాంతిబాటలో మేము ఆధారాలు చూపిన తరువాత, కావాలని పట్టుబట్టి వేరే ప్రాంతాల నుండి మదరసాల చందా కోసం వచ్చినవారిని మస్‌జిద్‌లో కూర్చోబెట్టి జకాత్‌ను వారికి అందేలా చేసారు కొందరు నాయకులు. అంటే ఈ చందాలు వసూలు చేసేవారు **తమ మదరసాలలో సున్నత్‌కి వ్యతిరేకమైనవే నేర్పుతున్నారా?** ఆ మస్‌జిద్‌ల పక్కన నివశించే పేదరికంతో బాధపడేవారికి జకాత్ అందనివ్వడం లేదు.

## శాంతిబాటలో ఎవరికి ఇవ్వవద్దని చెప్పారో వారందరికీ జకాత్ ఇవ్వమని చెప్పడం జరిగిందని మాకు సమాచారం అందింది.

డబ్బు కోసంవీరు ఏ స్థాయికి దిగజారి పోయారో చూడండి. వీరికి సత్యం అవసరం లేదు. **వీరికి అల్లాహ్ పట్ల భయం లేదు.** శాంతిబాటలో చెప్పినవి వ్యక్తిగత అభిప్రాయాలు కావు. జకాత్ వ్యాసంలో శాంతిబాట అందించిన ప్రతీ విషయానికి ప్రామాణిక ఆధారాలున్నాయి.

## మా పాఠకులలో చాలామంది నాయకులను నిలదీసారు

**సత్యాన్ని నిలబెట్టడానికి ముందుకు వచ్చిన వారికి అల్లాహ్ సహాయం చేయుగాక!** జకాత్ సేకరించేవారిని, వారి నాయకులను మా పాఠకులలో కొందరు నిలదీసారు. ఉమర్(రజి)వారు ఓ పొడుగాటి చొక్కాను ధరించినందుకే, ఆ చొక్కా గురించి వివరణ ఇవ్వాలని కోరారు. ఆయన అత్యంత నిరాడంబరంగా బ్రతుకుతూ, వైద్యం కోసం బైతుల్‌మాల్‌లోని కాస్త తేనె కోసం కూడా ప్రజల అనుమతి కోరిన మహా నాయకుడు. ప్రపంచంలోని సగభూభాగానికి నాయకుడైన ఉమర్(రజి)వారిని ఓ సామాన్య వ్యక్తి చిన్న విషయం పట్ల కూడా ప్రశ్నించ గలిగినప్పుడు, అటువంటి స్వేచ్ఛను మనకు ఇస్లామ్ కలిగించినప్పుడు, **అన్యాయం చేస్తున్న నేటి నాయకులను ప్రజలెందుకు నిలదీయడం లేదు? ప్రజలకు అల్లాహ్ పట్ల భయం లేదా?**

## ఒక శ్రేయోభిలాషి సలహా

"నేటి మదరసాలు గొప్ప స్థాయికి ఎలా చేరుకోగలవో శాంతిబాట టీమ్ వారు పూర్తి వివరాలతో చెబుతున్నారు. అదే విధంగా ప్రతీ ముస్లిమ్ ఖర్చు లేకుండా దావా ఎలా చేయవచ్చో ఖుర్'ఆన్ మరియు సున్నత్ వెలుగులో చెబుతున్నారు. ఆ విధంగా జరిగితే చాలా బాగుంటుంది. కాని మీరు దావాకి మరియు మదరసాలకు వ్యతిరేకమని బయట కొందరు చెడు ప్రచారం చేస్తున్నారు. కాబట్టి మీరు పెద్ద పెద్ద అక్షరాలతో పత్రికలో వారి మాటలను ఖండించండి"

దుష్ప్రచారం చేసేది దోపిడీదారులు మరియు పేద ప్రజల సొమ్మును దొంగిలించేవారు. దావా పేరుతో మరియు మదరసాల పేరుతో దోపిడీ చేస్తున్న వారి మాటలను మా పాఠకులు పట్టించుకోరు, ఇన్షా అల్లాహ్!

## ఏ పరిస్థితిలో 'అమీర్' (నాయకుని) మాట వినకూడదు? ఏ పరిస్థితిలో 'అమీర్'కి సహాయపడ కూడదు?

యహ్యా బిన్ హుసైన్ చెప్పారు : 'నేను నా బామ్మగారు చెప్పగా విన్నాను' (ఆమె చెప్పారు) 'నేను అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చివరి హజ్జ్‌లో చెప్పగా విన్నాను.'

**అబిసీనియా బానిసను మీపై నాయకుడిగా నియమించినా, అతడు అల్లాహ్ గ్రంథం ప్రకారం పరిపాలిస్తే, అతను చెప్పినది వినండి మరియు విధేయత చూపండి.** (నసాయీ, సహీహ్, 4197, పుస్తకం 39, అధ్యా. 26, సంపుటి 5)

(నాయకుడి పుట్టుక, వంశం ఏదైనా గాని అల్లాహ్ గ్రంథం ప్రకారం పరిపాలిస్తే అతనికి మనం విధేయత చూపాలి.)

ఇబ్నె ఉమర్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : **ముస్లిమ్ తప్పనిసరిగా నాయకుడు చెప్పింది వినాలి మరియు విధేయత చూపాలి** అది నచ్చినా నచ్చకపోయినా, అతడు అవిధేయతకు పాల్పడమని ఆదేశించనంత వరకూ. **అతడు అవిధేయతకు పాల్పడమని ఆదేశిస్తే అతని మాటలను వినవలసిన మరియు విధేయత చూపవలసిన అవసరం లేదు.** (నసాయీ,సహీహ్,4211, పుస్తకం 39, అధ్యా.34, సంపుటి 5)

అబ్దుర్రహ్మాన్(రజి)వారు, అలీ(రజి)వారి నుండి ఉల్లేఖించారు : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) సైన్యాన్ని పంపారు మరియు ఓ వ్యక్తిని వారిపై నాయకుడిగా నియమించారు. అతడు అగ్ని వెలిగించి చెప్పాడు : 'దీనిలో ప్రవేశించండి' అని. కొందరు దానిలో ప్రవేశించాలని అనుకున్నారు. మరియు ఇతరులు అన్నారు : **'మనం దీనికి దూరంగా పారిపోదాము.'** వారు దానిని రసూలుల్లాహ్ (స)వారి వద్ద ప్రస్తావించారు. మరియు ఆయన(స) దానిలో ప్రవేశించాలని అనుకున్న వారితో చెప్పారు, **"మీరు దానిలో ప్రవేశించి నట్లయితే మీరు అక్కడే ఉండేవారు పునరుత్థాన దినం వరకూ"** మరియు ఆయన(స) ఇతరులతో (పారిపోదామనుకున్న వారితో) మేలైన మాటలు చెప్పారు. అబూమూసా(రజి)వారు తన ఉల్లేఖనంలో ఇలా చెప్పారు :''**అల్లాహ్ పట్ల అవిధేయత లో విధేయత లేదు, విధేయత కేవలం మంచిలో మాత్రమే.** (నసాయీ, సహీహ్, 4210, పుస్తకం 39, అధ్యా. 34, సంపుటి 5) (తీర్పుదినం వరకూ అక్కడే ఉండటం అంటే సమాధిలో శిక్షించబడతారని)

కాబ్ బిన్ 'ఉజ్రా ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) మా దగ్గరకు వచ్చారు మరియు మేము 9 మంది ఉన్నాము. ఆయన(స) చెప్పారు : **నిస్సందేహంగా నా తరువాత నాయకులు వస్తారు, ఎవడైతే వారి అసత్యాలను విశ్వసించి మరియు వారి దుర్మార్గ చేష్టలకు సహాయపడతాడో అతడు నా వాడు కాదు మరియు నేను అతని వాడను కాదు. మరియు అతడు కౌసర్ దగ్గర నా దగ్గరకు రాడు.** ఎవడైతే వారి అసత్యాలను విశ్వసించడో మరియు వారి దుర్మార్గంలో సహాయం చెయ్యడో, అతడు నా వాడు. మరియు నేను అతని వాడను. మరియు అతడు నా దగ్గరకు వస్తాడు కౌసర్ దగ్గర. (నసాయీ, సహీహ్, 4212, పుస్తకం 39, అధ్యా.35, సంపుటి 5)

తారిఖ్ బిన్ షిహాబ్ వారి ఉల్లేఖనం. ఒక వ్యక్తి ప్రవక్త(స)వారిని అడిగాడు, ఆయన(స) తన కాలు రికాబు లో ఉన్నప్పుడు, **"ఎటువంటి జిహాద్ అనుగ్రహ యోగ్యమైంది?"** ఆయన(స) చెప్పారు : **"సత్యమైన పదం పలకడం దౌర్జన్యంగా పాలించే పాలకుడి (నాయకుడి) ముందు."** (నసాయీ, హసన్, 4214, పుస్తకం 39, అధ్యా.37, సంపుటి 5)

అమీర్‌ల మాటలు శాంతిబాట టీమ్ వినడం లేదని దుష్ప్రచారం చేస్తున్నారు. **బహిరంగంగానే ఖుర్'ఆన్ మరియు హదీస్‌లను వ్యతిరేకించే వారికి విధేయత ఎలా చూపుతాం?** ప్రజల సొమ్మును దోచుకునే వారికి, దోచి పెడుతున్నవారికి ఎలా విధేయత చూపుతాం? **ఖుర్'ఆన్ మరియు సున్నత్‌ని వ్యతిరేకించే వానికి సహాయం చేసి, మేము పాపాత్ములం కాదలచుకోలేదు.** పేద ప్రజలకు ద్రోహం చేసే నాయకుల ముందు సత్యాన్ని పలకడం ఎంతటి పుణ్యకార్యమో పై హదీస్ స్పష్టం చేస్తుంది.

**కాబట్టి పేదవారి పట్ల దౌర్జన్యం చేస్తున్న ఈ నాయకులను ముస్లిములు నిలదీసి, పేద ప్రజల సొమ్మును పేదవారికి అందేలా చేసి మీ బాధ్యతను నెరవేర్చండి.**

**ముఖ్య ప్రకటన**

మా సొసైటీల పేర్లు చెప్పి మేము ప్రచురించిన పుస్తకాలు చూపి, సభ్యులమని చెప్పుకుని ఎవరైనా మస్‌జిద్‌ల కోసం గాని, మదరసాల కోసం గాని లేక ఇతరత్రా విరాళాల కోసం వస్తే, వారు మా సభ్యులు కాదని తెలుసుకోండి. మేము విరాళాల కోసం ఎవరినీ కోరలేదు. ఇన్షా అల్లాహ్ ఎవరినుండి సహాయం కోరము అల్లాహ్ నుండి తప్ప - శాంతిబాట టీమ్

**మన రాష్ట్రంలోగాని ఇతరచోట్లగాని శాంతిబాటకు అనుబంధ సంస్థలు ఏమీ లేవు.**

**ఏ జమాత్‌కు ఇది అనుకూలం గాని లేదా వ్యతిరేకం గాని కాదు.**

**ఒకవేళ ఎవరైనా ఆ విధంగా ప్రచారం చేస్తే, అటువంటి ప్రచారానికి మాకూ ఎటువంటి సంబంధం లేదు. కేవలం ఖుర్'ఆన్ మరియు సున్నత్‌పైనే ఆధారపడి స్వచ్ఛందంగా కొందరు ముస్లిమ్ సోదరులు నడుపుతున్న పత్రిక ఇది మరియు ఇది ముస్లిమ్ ఉమ్మత్‌కి సంబంధించినది. సత్యాన్ని నిర్భయంగా ఏ ఒత్తిడి లేకుండా ప్రజలకు తెలియజేయాలని మేము ఎవరి దగ్గర నుండి ఆర్థిక సహకారాన్ని కోరలేదు. అరుదైన గ్రంథాల నుండి ఎంతో విలువైన ఇస్లామీయ సమాచారాన్ని ప్రామాణిక ఆధారాలతో శాంతిబాటలో అందిస్తున్నాము కేవలం అల్లాహ్‌పై నున్న భరోసాతో మాత్రమే.**


మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా velugubaata@gmail.com కు పంపండి.

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** Saanthibaata Publishing House, 19-1-447, Hanuman Statue Center, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650

# శాంతిబాట ప్రచురణ

జకాత్ (ఇంగ్లీష్ మరియు తెలుగు) పుస్తకాలు మా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. www.saanthibaata.net/zakat

జకాత్ (ఉర్దూ) ముద్రణలో ఉంది.




For some strong reasons, it is not permitted to post any of our pdf files (whether partial or full) in other websites. Instead a link may be provided.
For individual purpose only.
Not for sale.
Not for printing (for sale)







శాంతిబాటలో ప్రచురించబడిన వ్యాసాలు గాని, మా ఇతర ప్రచురణలు గాని ముద్రించు కోవడానికి లేదా జెరాక్స్ చేసి పంచడానికిగాని ఏ పబ్లిషర్స్‌కుగాని, వ్యక్తులకు గాని ఎటువంటి అనుమతి నివ్వలేదు. దీనికి భిన్నంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోబడతాయి.




**4 సంవత్సరాలుగా శాంతిబాటను ఆదరిస్తున్న మా చందాదారులకు కృతజ్ఞతలు**

సంవత్సర చందా
రూ. 240/-


మీ బంధువులు మరియు స్నేహితులచే శాంతిబాట చదివించండి

తోటివారికి అందించేందుకు వీలుగా శాంతిబాటలో ప్రచురితమైన 'జకాత్' వ్యాసాన్ని 80 పేజీలతో 1/8 డెమీ సైజులో ప్రత్యేక పుస్తకంగా విడుదల చేశాము. పుస్తకం కోసం ఆర్డర్లు ఆలస్యంగా అందాయి. అప్పటికే ముద్రణ పూర్తి కావడంతో పుస్తకాలు అందరికీ సరిపోలేదు. ఇన్షా అల్లాహ్ మరలా ముద్రిస్తాము. (వెల రూ. 25/-)

**క్రింది రెండు పరిశోధనాత్మక పుస్తకాలు స్టాకులో లేవు. కొన్ని మార్పులతో వీటి రెండవ ముద్రణ తెలుగు,ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో ముద్రించబడుతుంది ఇన్షా అల్లాహ్!**




శాంతిబాట ప్రారంభానికి ముందు ప్రచురించబడింది




శాంతిబాట పాఠకులకు తొలి సంవత్సరం ఉచితంగా అందజేయబడింది

**SAANTHIBAATA MONTHLY July & August, 2013** Samalkot-533440 (East Godavari Dist.)
**Registered with Registrar of News Papers for India RNI Reg. No. APTEL/2009/29650**
**Postal Concessional Registration No. AP/KD/140/2011-2013**

اِنَّمَا الصَّدَقٰتُ لِلۡفُقَرَآءِ وَالۡمَسٰكِيۡنِ وَالۡعٰمِلِيۡنَ عَلَيۡهَا
وَالۡمُؤَلَّفَةِ قُلُوۡبُهُمۡ وَفِى الرِّقَابِ وَالۡخٰرِمِيۡنَ وَفِىۡ سَبِيۡلِ اللّٰهِ
وَابۡنِ السَّبِيۡلِ فَرِيۡضَةً مِّنَ اللّٰهِ وَاللّٰهُ عَلِيۡمٌ حَكِيۡمٌ

وَالۡغٰرِ

క్రిందటి సంచికలో ఇదే చోట, ప్రక్క ఆయత్‌లోని
పదంలో غ కు బదులుగా خ అనే
అక్షరం పొరపాటున టైప్ చేయబడింది.
అసలు పదం : وَالۡغٰرِ
దయచేసి మీ సంచికలో అక్షరాన్ని సరి
చేసుకోమని కోరుతున్నాము

**"లండన్ వీధుల్లో ... అమ్మకపు వస్తువుల వలే తమ శరీరాలను బహిర్గతం చేస్తూ దాదాపు నగ్నంగా ఉండే మహిళలను నేను చూశాను. బట్టలు అనేవి మన చుట్టూ ఉన్న వాతావరణం నుండి మనల్ని రక్షించడానికే గాని, రెచ్చగొట్టే సందేశాన్ని ఇవ్వడానికి కాదు.**

**స్త్రీ తనను తాను వ్యాపార వస్తువుగా కాకుండా, తనను ఓ మనిషిగా చూసుకుంటే, తనకు నగ్నత్వాన్ని ప్రదర్శించ వలసిన అవసరమే రాదని తెలుసు కుంటుంది."**

**ముసుగు తీయవలసింది శరీరంపై నుండి కాదు.**
**మనస్సుపై నున్న ముసుగును తొలగించాలి.**

– డా. నవాల్ అస్స'దావి

లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్ రసూలుల్లాహ్ అని పలికిన ప్రతీ ముస్లిమ్ ఆ కలిమా ద్వారా అల్లాహ్‌తో ఒప్పందం చేసుకున్నాడని తెలుసుకోవాలి. అల్లాహ్‌తో చేసుకున్న ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించ కూడదు. ఉల్లంఘిస్తే శిక్షార్హుడు అవుతాడు. ఆ ఒప్పందం ఏమిటంటే, ఖుర్'ఆన్‌లోని అల్లాహ్ ఆదేశాలను పాటించాలి మరియు ముహమ్మద్(స)వారి బోధనల ప్రకారం నడుచుకోవాలి.

Visit
www.saanthibaata.net

23 దేశాలలోని తెలుగు పాఠకులచే వీక్షించబడుతున్న
తెలుగు ఇస్లామీయ వెబ్‌సైట్